

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



సోమవారం | 1-4-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 347 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం; తిథి: సప్తమి రా. 9.11 తదుపరి అష్టమి; నక్షత్రం: మూల రా. 11.13 తదుపరి పూర్వాషాఢ; వర్జ్యం: ఉ. 7.03-8.40, రా. 9.36-11.13; దుర్ముహూర్తం: మ. 12.44-1.33, మ. 3.10-3.59; అమృతఘడియలు: సా.4.45-6.22; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.14; సూర్యాస్తమయం: 6.25 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



జోరుకు బ్రేక్


మోహిత్ శర్మ (3/25)

- సన్‌రైజర్స్ తడ'బ్యాటు'
- 7 వికెట్లతో గుజరాత్ గెలుపు
- మోహిత్, మిల్లర్ విజృంభణ

అహ్మదాబాద్: గత మ్యాచ్‌లో భారీ హిట్టింగ్‌తో ప్రత్యర్థుల్లో వణుకు పుట్టించిన సన్‌రైజర్స్ హైదరాబాద్ అదే జోరును కొనసాగించ లేకపోయింది. బంతితో మోహిత్ శర్మ (3/25), బ్యాట్‌తో మిల్లర్ (27 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 44నాటౌట్) చెలరేగడంతో..ఆదివారం జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ 7 వికెట్లతో సన్‌రైజర్స్‌పై గెలిచింది. తొలుత హైదరాబాద్ 20 ఓవర్లలో 162/8 స్కోరు చేసింది. అబ్దుల్ సమద్ (29), అభిషేక్ శర్మ (29), క్లాసెన్ (24) పర్వాలేదనిపించారు. రషీద్, నూర్, ఒమర్జాయ్‌లకు తలో వికెట్ దక్కింది. లక్ష్యాన్ని గుజరాత్ 19.1 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. సాయి సుదర్శన్ (45), గిల్ (36) రాణించారు. మోహిత్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' దక్కింది.

సునాయాసంగా..: ఛేదనలో మిల్లర్ ఫటాఫట్ ఆటతో గుజరాత్ అలవోకగా నెగ్గింది. ఓపెనర్లు సాహా (25), గిల్ తొలి వికెట్‌కు 36 పరుగుల భాగస్వామ్యంతో టైటాన్స్‌కు చక్కని ఆరంభాన్నిచ్చారు. అయితే, 2 సిక్స్‌లతో జోరు చూసిన సాహాను షాబాజ్ బౌల్డ్ చేయడంతో.. పవర్‌ప్లే ముగిసేసరికి టైటాన్స్ 52/1తో మెరుగైన స్థితిలో నిలిచింది. ఆ తర్వాత గిల్, సుదర్శన్ స్కోరు బోర్డును నడిపించారు. 10వ ఓవర్‌లో గిల్‌ను మార్కండే అవుట్ చేయడంతో.. క్రీజులోకి వచ్చిన మిల్లర్ పవర్ బ్యాటింగ్‌తో హైదరాబాద్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. 16వ ఓవర్‌లో మార్కండే బౌలింగ్‌లో మిల్లర్ 4,4,6,6తో ఏకంగా 24 పరుగులు రాబట్టడంతో.. గుజరాత్ 138/2తో విజయానికి చేరువైంది. చివరి 24 బంతుల్లో 25 రన్స్ అవసరమవగా, సుదర్శన్‌ను కమిన్స్ క్యాచవుట్ చేశాడు. కానీ, మిల్లర్.. 5 బంతులు మిగిలుండగానే మ్యాచ్‌ను ముగించాడు.

కట్టడి చేసిన నూర్, రషీద్: గతమ్యాచ్‌లో ముంబైపై 277 పరుగుల భారీస్కోరు చేసి ఔరా అనిపించిన హైదరాబాద్ బ్యాటర్లు.. ఈసారి గుజరాత్ బౌలర్ల దెబ్బకు తడబడ్డారు. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు ఎంచుకొన్న సన్‌రైజర్స్.. ఓపెనర్లు హెడ్ (19), మయాంక్ అగర్వాల్ (16)లను స్వల్ప స్కోరుకే కోల్పోయింది. కానీ, వన్‌డౌన్‌లో వచ్చిన అభిషేక్ 2 సిక్స్‌లతో ఎదురుదాడి చేయడంతో.. పవర్‌ప్లేలో హైదరాబాద్ 56/1తో భారీ స్కోరు చేసేలా కనిపించింది. అయితే, మధ్య ఓవర్లలో రషీద్, నూర్ పరుగులను కట్టడి చేస్తూ రైజర్స్‌పై ఒత్తిడిపెంచారు. హెడ్‌ను నూర్ బౌల్డ్ చేయగా.. ధాటిగా ఆడే ప్రయత్నం చేస్తున్న అభిషేక్‌ను మోహిత్ క్యాచవుట్ చేశాడు. దీంతో 10 ఓవర్లకు సన్‌రైజర్స్ 74/3తో నిలిచింది. డేంజర్‌మన్ క్లాసెన్‌ను రషీద్ బోల్తా కొట్టించడంతో సన్‌రైజర్స్ ఇబ్బందుల్లో పడింది. సమద్ ఎదురుదాడి చేసినా.. మార్‌క్రమ్ (17)తోపాటు మిగిలిన వారు ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయారు.


మిల్లర్ (44నాటౌట్)

స్కోరుబోర్డు

సన్‌రైజర్స్: హెడ్ (బి) నూర్ 19, మయాంక్ అగర్వాల్ (సి) దర్శన్ (బి) అజ్మతుల్లా 16, అభిషేక్ (సి) గిల్ (బి) మోహిత్ 29, మార్‌క్రమ్ (సి) రషీద్ (బి) ఉమేష్ 17, క్లాసెన్ (బి) రషీద్ 24, షాబాజ్ (సి) తెవాటియా (బి) మోహిత్ 22, సమద్ (రనౌట్) 29, వాషింగ్టన్ (సి) రషీద్ (బి) మోహిత్ 0, కమిన్స్ (నాటౌట్) 2; **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 20 ఓవర్లలో 162/8; వికెట్ల పతనం:** 1-34, 2-58, 3-74, 4-108, 5-114, 6-159, 7-159, 8-162; **బౌలింగ్:** అజ్మతుల్లా 3-0-24-1, ఉమేశ్ 3-0-28-1, రషీద్ 4-0-33-1, నూర్ అహ్మద్ 4-0-32-1, మోహిత్ 4-0-25-3, దర్శన్ 2-0-18-0.

గుజరాత్: సాహా (సి) కమిన్స్ (బి) షాబాజ్ 25, గిల్ (సి) సమద్ (బి) మార్కండే 36, సుదర్శన్ (సి) అభిషేక్ (బి) కమిన్స్ 45, మిల్లర్ (నాటౌట్) 44, విజయ్ శంకర్ (నాటౌట్) 14; **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 19.1 ఓవర్లలో 168/3; వికెట్ల పతనం:** 1-36, 2-74, 3-138; **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-27-0, షాబాజ్ 2-0-20-1, ఉనాద్కట్ 3.1-0-33-0, వాషింగ్టన్ 3-0-27-0, మార్కండే 3-0-33-1, కమిన్స్ 4-0-28-1.

నేటి మ్యాచ్

ముంబై x రాజస్థాన్ రా.7.30 నుంచి

ఇప్పటికి వీరే..

పరుగులు: విరాట్ కోహ్లీ (బెంగళూరు) 181 పరుగులు



వికెట్లు: ముస్తాఫిజుర్ (చెన్నై) 7 వికెట్లు



పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
కోల్‌కతా	2	2	0	0	4	1.047
చెన్నై	3	2	1	0	4	0.976
రాజస్థాన్	2	2	0	0	4	0.800
గుజరాత్	3	2	1	0	4	-0.738
హైదరాబాద్	3	1	2	0	2	0.204
లఖ్‌నవూ	2	1	1	0	2	0.025
ఢిల్లీ	3	1	2	0	2	-0.016
పంజాబ్	3	1	2	0	2	-0.337
బెంగళూరు	3	1	2	0	2	-0.711
ముంబై	2	0	2	0	0	-0.925

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

లంక రికార్డు స్కోరు

- తొలి ఇన్నింగ్స్ 531 ఆలౌట్
- బంగ్లాదేశ్ 55/1 ● రెండో టెస్ట్

చట్టోగ్రామ్: కమిందు మెండిస్ (92 నాటౌట్), ధనంజయ డిసిల్వా (70) అర్ధ శతకాలతో రాణించిన వేళ.. బంగ్లాదేశ్‌తో రెండో టెస్ట్‌లో శ్రీలంక పటిష్ఠ స్థితిలో నిలిచింది. ఓవర్‌నైట్ స్కోరు 314/4తో ఆటకు రెండో రోజైన ఆదివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన లంక 531 పరుగుల భారీ స్కోరు చేసింది. ఒక్క బ్యాటర్ కూడా సెంచరీ నమోదు చేయకుండా అత్యధిక పరుగులు చేసిన జట్టుగా శ్రీలంక సరికొత్త రికార్డు సృష్టించింది. ఈ క్రమంలో 1976లో న్యూజిలాండ్‌తో కాన్పూర్ టెస్ట్‌లో ఒక్క శతకం కూడా లేకుండా తొలి ఇన్నింగ్స్‌లో భారత్ సాధించిన 524/9 స్కోరును లంక అధిగమించింది. షకీబల్ 3, హసన్ మహ్మూద్ 2 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ బరిలోకి దిగిన బంగ్లా రెండో రోజు ఆట ఆఖరుకు 55/1 స్కోరు చేసింది. జాకిర్ హుస్సేన్ (28 బ్యాటింగ్), తైజుల్ ఇస్లాం (0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. లంక స్కోరుకు బంగ్లా 476 పరుగులు వెనుకంజలో ఉంది.

చెన్నైకి ఝలక్

- ఢిల్లీ క్యాపిటల్స్ బోణీ
- వార్నర్, పంత్ అర్ధసెంచరీలు
- ధోనీ మెరుపులు వృథా


పంత్ (51)

విశాఖపట్నం: రెండు వరుస విజయాలతో ఊపు మీదున్న పటిష్ఠ చెన్నై సూపర్ కింగ్స్‌కు ఢిల్లీ క్యాపిటల్స్ బ్రేక్ వేసింది. తమ హోమ్ గ్రౌండ్‌లో పేసర్లు ముకేశ్ కుమార్ (3/21), ఖలీల్ అహ్మద్ (2/21) విశేషంగా రాణించడంతో 20 పరుగులతో గెలిచిన ఢిల్లీ తాజా సీజన్‌లో ఎట్టకేలకు బోణీ చేసింది. అటు ప్రేక్షకుల కేరింతల మధ్య ఏడాది తర్వాత బరిలోకి దిగిన ఎంఎస్ ధోనీ (16 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 37 నాటౌట్) తన పవర్‌హిట్టింగ్‌తో ఆకట్టుకున్నా ఫలితం లేకపోయింది. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా ఢిల్లీ 20 ఓవర్లలో 5 వికెట్లకు 191 పరుగులు చేసింది. వార్నర్ (35 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 52), పంత్ (32 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 51), పృథ్వీ షా (27 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 43) సత్తా చాటారు. పథిరనకు 3 వికెట్లు దక్కాయి. ఛేదనలో చెన్నై 20 ఓవర్లలో 6 వికెట్లకు 171 రన్స్ చేసి ఓడింది. రహానె (30 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 45), విచెల్ (26 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సర్లతో 34) రాణించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా ఖలీల్ నిలిచాడు.

పేసర్ల జోరు: భారీ ఛేదనలో చెన్నైని ఢిల్లీ పేసర్లు హడలెత్తించారు. వారి ధాటికి తొలి 23 బంతుల దాకా ఒక్క ఫోర్ కూడా రాలేదు. అటు ఫీల్డింగ్‌లోనూ అదరగొట్టారు. ఇక ఖలీల్ తన వరుస ఓవర్లలో ఓపెనర్లు రుతురాజ్ (1), రచిన్ (12 బంతుల్లో 2)లను పెవిలియన్ చేర్చాడు. అప్పటికి జట్టు స్కోరు 18 బంతుల్లో 7/2. ఈ దశలో రహానె-మిచెల్ జోడీ ఆదుకునే ప్రయత్నం చేసింది. ఇషాంత్ ఓవర్‌లో రహానె రెండు ఫోర్లు, నోకియా ఓవర్‌లో ఓ సిక్సర్‌తో జట్టు పవర్‌ప్లేలో 32 పరుగులు చేసింది. పదో ఓవర్‌లో చెరో సిక్సర్‌తో 17 రన్స్ సమకూరాయి. ఈ దశలో మిచెల్‌ను అక్షర్ రిటర్న్ క్యాచ్‌తో అవుట్ చేయడంతో మూడో వికెట్‌కు 68 పరుగుల కీలక భాగస్వామ్యం ముగిసింది. ఇక 14వ ఓవర్‌లో పేసర్ ముకేశ్ ఝలక్ ఇస్తూ రహానె, రిజ్వీ (0)ల వికెట్లను తీశాడు. అప్పటికి చెన్నై విజయానికి 38 బంతుల్లో 89 రన్స్ కావాలి. ఇక శివమ్ దూబే (18) నిష్క్రమణ తర్వాత అభిమానులు ఆశగా ఎదురుచూస్తున్న ధోనీ క్రీజులోకి రావడంతో విశాఖ స్టేడియం హోరెత్తింది. వీరిని సంతృప్తి పరుస్తూ ధోనీ ఆఖరి ఓవర్‌లో 4,6,4,6తో 20 రన్స్ రాబట్టి జట్టు ఓటమి అంతరాన్ని గణనీయంగా తగ్గించాడు. జడేజా (21 నాటౌట్)తో కలిసి ఏడో వికెట్‌కు అజేయంగా 51 పరుగులు అందించాడు.

వార్నర్, పంత్ అర్ధసెంచరీలు: టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఓపెనర్లు వార్నర్, పృథ్వీ షా శుభారంభాన్ని అందించారు. అయితే మధ్య ఓవర్లలో కాస్త నెమ్మదించినా.. చివర్లో కెప్టెన్ పంత్ బ్యాట్ ఝుళిపిస్తూ ఫామ్‌ను చాటుకున్నాడు. ఆరంభ ఐదో ఓవర్‌లో వార్నర్ 6,4,4.. తర్వాతి ఓవర్‌లో షా 4,4,4 బాదడంతో ఈ 12 బంతుల్లోనే జట్టు 38 రన్స్ రాబట్టింది. అటు పవర్‌ప్లేను జట్టు 62 పరుగులతో ముగించింది. తర్వాత కూడా వార్నర్ జోరు పెంచుతూ 32 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. కానీ పదో ఓవర్ నుంచి ఢిల్లీ ఇన్నింగ్స్ నెమ్మదించింది. ఇక, వార్నర్ రివర్స్ స్కూప్‌నకు ప్రయత్నించగా.. థర్డ్‌మ్యాన్‌లో పథిరన డైవ్ చేస్తూ గాల్లోనే బంతిని అందుకున్న తీరు అబ్బురపరిచింది. వార్నర్ అవుట్‌తో తొలి వికెట్‌కు 93 పరుగుల కీలక భాగస్వామ్యం ముగిసింది. వెంటనే జడేజా ఓవర్‌లో ధోనీ మెరుపు క్యాచ్‌తో షా వెనుదిరిగాడు. 15వ ఓవర్‌లో పేసర్ పథిరన 150 కి.మీ వేగంతో రెండు కళ్లు చెదిరే యార్కర్లతో మార్ష్ (18), స్టబ్స్ (0)ను క్లీన్ బౌల్డ్ చేయడం మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచింది. ఈ దశలో పరుగులు తగ్గిపోయాయి. అయితే, 18వ ఓవర్‌లో 4,6.. 19వ ఓవర్‌లో 6,4,4 బాదిన పంత్ 31 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. కానీ ఆ వెంటనే పథిరనకు పంత్ చిక్కాడు. అయితే చివరి 3 ఓవర్లలో ఢిల్లీ 43 రన్స్ సాధించడంతో స్కోరు 190 దాటింది.

1 టీ20 క్రికెట్‌లో ఎక్కువ (110) సార్లు 50+ స్కోర్లు సాధించిన బ్యాటర్‌గా గేల్‌ను సమం చేసిన వార్నర్.

2 పొట్టి ఫార్మాట్‌లో వికెట్ల వెనకాల 300 మంది బ్యాటర్లను అవుట్ చేసిన తొలి కీపర్‌గా ధోనీ.


ధోనీ (16 బంతుల్లో 37 నాటౌట్)

స్కోరుబోర్డు

ఢిల్లీ: పృథ్వీ షా (సి) ధోనీ (బి) జడేజా 43, వార్నర్ (సి) పథిరన (బి) ముస్తాఫిజుర్ 52, పంత్ (సి) రుతురాజ్ (బి) పథిరన 51, మార్ష్ (బి) పథిరన 18, స్టబ్స్ (బి) పథిరన 0, అక్షర్ (నాటౌట్) 7, అభిషేక్ పొరెల్ (నాటౌట్) 9, **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 20 ఓవర్లలో 191/5; వికెట్ల పతనం:** 1-93, 2-103, 3-134, 4-134, 5-178; **బౌలింగ్:** దీపక్ చాహర్ 4-0-42-0, తుషార్ దేశ్‌పాండే 4-0-24-0, ముస్తాఫిజుర్ 4-0-47-1, జడేజా 4-0-43-1, పథిరన 4-0-31-3.

చెన్నై: రుతురాజ్ (సి) పంత్ (బి) ఖలీల్ 1, రచిన్ రవీంద్ర (సి) స్టబ్స్ (బి) ఖలీల్ 2, రహానే (సి) వార్నర్ (బి) ముకేశ్ 45, మిచెల్ (సి అండ్ బి) అక్షర్ 34, శివమ్ దూబే (సి) స్టబ్స్ (బి) ముకేశ్ 18, సమీర్ రిజ్వీ (సి) ఖలీల్ (బి) ముకేశ్ 0, జడేజా (నాటౌట్) 21, ధోనీ (నాటౌట్) 37, **ఎక్స్‌ట్రాలు: 13; మొత్తం: 20 ఓవర్లలో 171/6; వికెట్ల పతనం:** 1-3, 2-7, 3-75, 4-102, 5-102, 6-120; **బౌలింగ్:** ఖలీల్ అహ్మద్ 4-1-21-2, ఇషాంత్ 3-0-23-0, నోకియా 4-0-43-0, అక్షర్ 3-0-20-1, రసిఖ్ 2-0-25-0, మార్ష్ 1-0-14-0, ముకేశ్ కుమార్ 3-0-21-3.

బింద్య, వైష్ణవిలకు పతకాలు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఖేలో ఇండియా సౌత్ జోన్ మహిళల సైక్లింగ్ లీగ్‌లో తెలంగాణ రైడర్లు శివ బింద్య రజతం, వైష్ణవి కాంస్య పతకాలు కొల్లగొట్టారు. ఆదివారం జరిగిన ఈ పోటీల్లో సబ్ జూనియర్ 15 కి.మి విభాగంలో శివ బింద్య ద్వితీయ, వైష్ణవి తృతీయ స్థానంలో నిలిచారు. కేరళకు చెందిన ప్రియమణి చాంపియన్‌గా నిలిచి స్వర్ణ పతకం అందుకుంది.

పాక్ వన్డే, టీ20 కెప్టెన్‌గా బాబర్

కరాచీ: పాకిస్థాన్ జట్టు పరిమిత ఓవర్ల కెప్టెన్‌గా తిరిగి బాబర్ ఆజమ్ ఎంపికయ్యాడు. గతేడాది వరకు అతను అన్ని ఫార్మాట్ల కెప్టెన్‌గా ఉన్నప్పటికీ, వన్డే వరల్డ్‌కప్‌లో జట్టు వైఫల్యంతో కెప్టెన్సీ నుంచి వైదొలిగాడు. దీంతో టెస్టులకు షాన్ మసూద్, టీ20లకు షహీన్ షా అఫ్రీదిని కెప్టెన్లుగా నియమించారు. వన్డేలపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అయితే షహీన్ కెప్టెన్సీలో న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌లో పాక్ ఓడడంతో పీసీబీ మళ్లీ నాయకత్వ మార్పు చేసింది.

వరల్డ్ జూనియర్ టెన్నిస్ రన్నరప్ భారత్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): మలేసియాలో జరిగిన వరల్డ్ జూనియర్ టెన్నిస్ టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత్ రన్నరప్‌గా నిలిచింది. ఈ జట్టులో హైదరాబాద్ కుర్రాడు హృతిక్ కటకం ఉండడం విశేషం. ఫైనల్లో భారత జట్టు 0-2తో జపాన్ చేతిలో పరాజయం పాలైంది.

బిజినెస్

నేటి నుంచి కొత్త ఈవీ విధానం షురూ

న్యూఢిల్లీ: దేశంలో విద్యుత్ వాహనాల ప్రోత్సాహానికి ప్రభుత్వం రూ.500 కోట్లతో నాలుగు నెలల కాలానికి ప్రకటించిన విధానం అమలు సోమవారం నుంచి ప్రారంభమవుతుంది. ఏప్రిల్ 1 నుంచి జూలై 31 వరకు ఈ విధానం అమలులో ఉంటుంది. ప్రస్తుతం అమలులో ఉన్న ఫేమ్-2 విధానం గడువు ఆదివారంతో ముగిసింది. ఫేమ్ 2 కింద అర్హులైన వారు మార్చి 31 వరకు లేదా ఈ పథకం కింద నిధులు అందుబాటులో ఉన్నంతవరకు మాత్రమే సబ్సిడీలు అందుకోగలుగుతారు. దేశంలో విద్యుత్ వాహనాలను మరింతగా ప్రోత్సహించేందుకు విద్యుత్ మొబిలిటీ ప్రోత్సాహక పథకం 2024 (ఈఎంపీఎస్ 2024) ప్రకటించారు. దీని కింద టూ వీలర్‌కు రూ.10,000, చిన్న త్రీ వీలర్‌కు రూ.25,000, పెద్ద త్రీ వీలర్‌కు రూ.50,000 సబ్సిడీ ఇస్తారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

1వ తేదీ



హైదరాబాద్	380
చిత్తూరు	458
గోదావరి	403
విజయవాడ	403
విశాఖపట్నం	415
వరంగల్	382

డజను గుడ్లు రూ.60

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	127
వరంగల్	127
కరీంనగర్	127
మహబూబ్‌నగర్	127
కర్నూలు	127
విశాఖపట్నం	117
గోదావరి	126
విజయవాడ	126
గుంటూరు	127
ఒంగోలు	127
చిత్తూరు	122

ముగిసిన 66 కంపెనీల ఐపీఓ షేర్ల లాకిన్ పీరియడ్

న్యూఢిల్లీ: దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మరింత దిద్దుబాటుకు లోనయ్యే ప్రమాదం కనిపిస్తోంది. దాదాపు 66 కంపెనీలకు చెందిన పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)ల్లో ఇన్వెస్ట్ చేసిన యాంకర్ ఇన్వెస్టర్ల పెట్టుబడుల లాకిన్ పీరియడ్ వచ్చే నాలుగు నెలల్లో ముగుస్తోంది. దీంతో పెద్దగా లాభసాటి గాని కంపెనీల షేర్లను యాంకర్ ఇన్వెస్టర్లు వదిలించుకునే అవకాశం కనిపిస్తోంది. అదే జరిగితే మార్కెట్లో ఈ కంపెనీల షేర్ల అమ్మకాలు పెరిగి, వాటి ధరలు పెద్దఎత్తున దిద్దుబాటుకు లోనయ్యే అవకాశం ఉందని అంచనా. దాదాపు రూ.1.5 లక్షల కోట్ల విలువైన షేర్లు ఈ నాలుగు నెలల కాలంలో మార్కెట్లోకి వచ్చే అవకాశం ఉంది.

పనితీరే గీటు రాయి: ఇందులో గ్లోబల్ సర్ఫేసెస్, సాయి సిల్క్స్, జేఎస్‌డబ్ల్యూ ఇన్‌ఫ్రా, ప్లాటినమ్ ఇండస్ట్రీస్, ఎగ్జికామ్ టెక్నాలజీస్ షేర్ల లాకిన్ పీరియడ్ సోమవారం ముగుస్తోంది. ఐపీఓల తర్వాత మంచి పనితీరు కనబరిచిన కంపెనీల షేర్లకు పెద్దగా ఢోకా ఉండకపోవచ్చు. అయితే లిస్టింగ్ తర్వాత బోల్తా పడిన కంపెనీల షేర్లలో మాత్రం పెద్ద కుదుపు తప్పదని మార్కెట్ వర్గాల అంచనా.

ఇన్ఫోసిస్‌కు 6,329 కోట్ల ఐటీ రిఫండ్

న్యూఢిల్లీ: ఆదాయ పన్ను (ఐటీ) శాఖ నుంచి ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్‌కు పెద్ద బొనాంజా లభించనుంది. వివిధ ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి రూ.6,329 కోట్ల రిఫండ్ అందనుంది. ఇన్ఫోసిస్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఈ విషయం తెలిపింది. ఈ రిఫండ్‌తో పాటు వివిధ ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి రూ.2,763 కోట్లు పన్నుగా చెల్లించాలని కూడా ఐటీ శాఖ నుంచి డిమాండ్ నోటీసులు అందినట్టు కంపెనీ తెలిపింది.

వచ్చే మూడేళ్లలో రిటైల్, ఎనర్జీలపై రిలయన్స్ ఫోకస్



హైడ్రోకార్బన్, టెలికాంపై కూడా.. గడచిన పదేళ్లలో 10 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు

గోల్డ్‌మన్ శాక్స్ వెల్లడి

న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) వ్యాపార విస్తరణ కొనసాగుతోంది. ఇందు కోసం గత పదేళ్లలో 12,500 కోట్ల డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టిందని ప్రముఖ అంతర్జాతీయ కన్సల్టెన్సీ సంస్థ గోల్డ్‌మన్ శాక్స్ వెల్లడించింది. ప్రస్తుత డాలర్-రూపాయి మారకం రేటు ప్రకారం ఇది దాదాపు రూ.10.40 లక్షల కోట్లకు సమానం. ఇందులో 3,000 కోట్ల డాలర్లు హైడ్రోకార్బన్స్ (ఆయిల్ టు కెమికల్స్) రంగం ఉత్పత్తి సామర్థ్య విస్తరణకు, మరో 6,000 కోట్ల డాలర్లకుపైగా పెట్టుబడులను 4జీ/5జీ సేవల విస్తరణ కోసం వినియోగించింది. ఇందులో 4జీ సేవల విస్తరణ పెట్టుబడులు 2019లోనే పూర్తికాగా, 5జీ సేవల విస్తరణ పెట్టుబడులు 2023-24 ఆర్థిక సంవత్సరంలో పూర్తయ్యాయి.

ఇక రిటైల్, ఇంధన రంగాలపై దృష్టి: ఇప్పటి వరకు హైడ్రోకార్బన్, టెలికాం రంగాలపై దృష్టి పెట్టిన ఆర్ఐఎల్ వచ్చే మూడేళ్లలో రిటైల్, నూతన ఇంధన వనరులపై దృష్టి పెట్టనుంది. ఇందులో భాగంగా తన రిటైల్ స్టోర్లను పెద్దఎత్తున విస్తరిస్తోంది. సాంప్రదాయేతర ఇంధన రంగంలోకీ పెద్ద ఎత్తున విస్తరిస్తోంది. సోలార్ మాడ్యూల్స్, ఇతర ప్రత్యామ్నాయ ఇంధన ప్రాజెక్టులపై వచ్చే మూడేళ్లలో 1,000 కోట్ల డాలర్లు (దాదాపు రూ.83,000 కోట్లు) ఇన్వెస్ట్ చేయనుంది. ఇందులో సంప్రదాయేతర ఇంధన ప్రాజెక్టులు రెండేళ్లలో, రిటైల్ స్టోర్లు ఆరు నుంచి ఏడాది కాలంలో లాభాల బాట పట్టే అవకాశం ఉందని గోల్డ్‌మన్ శాక్స్ అంచనా. హైడ్రోకార్బన్స్, టెలికాంతో పోలిస్తే వీటిలో పెట్టుబడులూ పెద్దగా అవసరం ఉండదు.

టెలికాంలో ఇక లాభాలు: ప్రస్తుతం ఆర్ఐఎల్ లాభాల్లో అత్యధిక భాగం చమురు, గ్యాస్ ఉత్పత్తి, రిఫైనింగ్, పెట్రో కెమికల్స్ ద్వారా సమకూరుతోంది. ఈ ఆర్థిక సంవత్సరం నుంచి టెలికాం రంగం కూడా పెద్ద ఎత్తున లాభాలు సమకూరుస్తుందని గోల్డ్‌మన్ శాక్స్ అంచనా వేస్తోంది.

ఐఓసీతో పానాసోనిక్ జాయింట్ వెంచర్

న్యూఢిల్లీ: సిలిండ్రికల్ లిథియం అయాన్ బ్యాటరీల తయారీ కోసం దేశంలోని అతిపెద్ద ఆయిల్ మార్కెటింగ్ కంపెనీ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ)తో జపాన్‌కు చెందిన ఎలక్ట్రానిక్ దిగ్గజం పానాసోనిక్ గ్రూప్ జాయింట్ వెంచర్ ఏర్పాటు చేసింది. ఈ మేరకు ఉభయ సంస్థల మధ్య ఒప్పందంపై సంతకాలు జరిగాయి. జాయింట్ వెంచర్ స్వరూప స్వభావాలు ఖరారు చేసేందుకు చర్చలు కూడా ప్రారంభించింది.

బీఓఐ వడ్డీ రేట్ల పెంపు

న్యూఢిల్లీ: బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) వివిధ రకాల రుణాలపై వడ్డీ రేటును 0.10 శాతం మేరకు పెంచింది. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి కొత్త వడ్డీ రేట్లు అమల్లోకి వస్తాయి. ఈ నిర్ణయంతో రెపో అనుసంధానిత వడ్డీ రేటు 9.35 శాతానికి పెరుగుతుంది.ఇండియన్ బ్యాంక్ కూడా వడ్డీ రేటును ఈ నెల 3 నుంచి 0.05 శాతం మేరకు పెంచుతున్నట్టు ప్రకటించింది.

ఎంఎస్ఎంఈలకు ఇక సమయానికి చెల్లింపులు

న్యూఢిల్లీ: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా కంపెనీల (ఎంఎస్ఎంఈ) ఆర్థిక పరిస్థితి కొంత మేరకు మెరుగుపడే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ సంస్థల నుంచి సరుకులు, సేవలు పొందిన పెద్ద కంపెనీలు అందుకు సంబంధించిన చెల్లింపులు ఒప్పందం ప్రకారం 45 రోజుల్లో పూర్తి చేయాలి. ఈ నిబంధన సోమవారం (2024 ఏప్రిల్ 1) నుంచే అమల్లోకి రానుంది. ఒకవేళ ఏ పెద్ద కంపెనీ అయినా ఈ బకాయిలను 45 రోజుల కంటే ఆలస్యంగా చెల్లిస్తే, ఆ మొత్తానికి ఆదాయ పన్ను మినహాయింపు లభించదు. ఎగుమతి ఆధారిత సంస్థలతో పాటు అనేక కంపెనీలు ఈ నిబంధన అమలు ఏడాది పాటు వాయిదా వేయమని కోరినా ప్రభుత్వం వెనక్కి తగ్గలేదు.

ఈ పాలసీలోనూ అదే ధోరణి

» వడ్డీ రేట్లు తగ్గవ్... 5న తొలి ద్వైమాసిక సమీక్ష

ముంబై: భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ నాయకత్వంలోని ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) నూతన ఆర్థిక సంవత్సరపు (2024-25) తొలి ద్వైమాసిక పరపతి విధానంపై చర్చించేందుకు బుధవారం నుంచి మూడు రోజుల పాటు సమావేశం కాబోతోంది. ద్రవ్యోల్బణాన్ని ప్రభుత్వం నిర్దేశించిన 4 శాతం పరిధిలో కట్టడి చేయడం లక్ష్యంగా ఈ సారి కూడా కీలక రెపో రేటు విషయంలో యథాతథ స్థితిని కొనసాగించవచ్చంటున్నారు. ఒకపక్క ప్రపంచంలోని పెద్ద ఆర్థిక వ్యవస్థలైన అమెరికా, బ్రిటన్ దేశాల కేంద్ర బ్యాంకులు అందించే సంకేతాలు పరిగణనలోకి తీసుకుంటూనే వేచి ఉండే ధోరణి అనుసరించే ఆస్కారం ఉంది. గత ఏడాది ఫిబ్రవరిలో ఆర్‌బీఐ రెపో రేటును 0.25 శాతం పెంచి 6.5 శాతానికి చేర్చిన అనంతరం ఆరు వరుస సమీక్షల్లో యథాతథ స్థితిని కొనసాగిస్తూ వస్తోంది.

టెక్ వ్యూ: 22,500 వద్ద గట్టి నిరోధం


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం 22,000 స్థాయి నుంచి రికవరీ సాధించి 22,500 వరకు వెళ్లినా చివరి ట్రేడింగ్ రోజున ఆకస్మికంగా 200 పాయింట్ల మేరకు ఇంట్రాడే కరెక్షన్ సాధించింది. 22,500 వద్ద గట్టి నిరోధం ఎదురవుతోందనేందుకు ఇది సంకేతం. స్వల్పకాలిక ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలి. అలాగే గత వారంలో పటిష్ఠంగానే క్లోజయినా మార్చి 7, 11 తేదీల్లో 22,500 వద్ద మేజర్ టాప్ ఏర్పడింది. ఇక్కడి నుంచే 800 పాయింట్ల మేరకు బలమైన కరెక్షన్ కూడా సాధించింది. గత వారం రెండో ప్రయత్నంలో కూడా ఇదే తరహా ఆకస్మిక రియాక్షన్ ఏర్పడడం కూడా గట్టి నిరోధాన్ని సూచిస్తోంది. మార్కెట్ గరిష్ఠ స్థాయిల్లో మరింత కన్సాలిడేట్ కావలసి ఉంది. గత రెండు నెలలుగా నిఫ్టీ సైడ్‌వేస్ ధోరణిలో ఉంది. గత వారం మిడ్‌క్యాప్ 100, స్మాల్‌క్యాప్ 100 సూచీలు కూడా స్వల్ప లాభాలతో ముగిశాయి. వచ్చే శుక్రవారం ఆర్‌బీఐ ద్రవ్య విధానం ప్రభావం మార్కెట్‌పై ఉండవచ్చు.

బుల్లిష్ స్థాయిలు : నిఫ్టీ రికవరీ బాట పడితే మరింత అప్‌ట్రెండ్ కోసం మైనర్ నిరోధం 22,440 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన స్వల్పకాలిక నిరోధం 22,550. ఇదే కొద్ది కాలం క్రితం ఏర్పడిన చారిత్రక గరిష్ఠ స్థాయి.

బేరిష్ స్థాయిలు: మద్దతు స్థాయి 22,150 కన్నా దిగజారితే మరింత బలహీనతను ఎదుర్కొంటుంది. దిగువన మద్దతు స్థాయి 21,950. మూడు వారాల క్రితం ఏర్పడిన ప్రధాన కనిష్ఠ స్థాయి ఇది. ఇక్కడి నుంచే రికవరీ ఏర్పడింది. తక్షణ అప్‌ట్రెండ్ ఆశలు నిలబెట్టుకోవాలంటే ఇక్కడ తప్పనిసరిగా నిలదొక్కుకోవాలి. ఇక్కడ కూడా విఫలమైతే స్వల్పకాలిక బలహీనత ఏర్పడుతుంది.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారం 260 పాయింట్ల లాభంతో 47,120 వద్ద క్లోజైంది. పాజిటివ్ ట్రెండ్‌లో ట్రేడయితే ప్రధాన నిరోధం 47,400 వద్ద నిలదొక్కుకోవాలి. ప్రధాన మద్దతు స్థాయిలు 46,800, 46,500. రెండో మద్దతు స్థాయిలో కూడా విఫలమైతే స్వల్పకాలిక బలహీనత ముప్పును ఎదుర్కొంటుంది.

పాటర్న్: ఎగువన 22,550 వద్ద "డబుల్ టాప్ పాటర్న్" ఏర్పడింది. సానుకూలత కోసం ఈ స్థాయిని బ్రేక్ చేయాలి. నెలవారీ చార్టుల ప్రకారం నిఫ్టీ ఓవర్ బాట్ స్థితిలో ఉంది. మధ్యకాలిక ధోరణి ప్రకారం కన్సాలిడేషన్ లేదా కరెక్షన్ ఉండవచ్చు. అయితే 50 డీఎంఏ వద్ద నిఫ్టీ రికవరీ సాధించింది.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళవారం స్వల్పకాలిక రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	22,430, 22,500
మద్దతు	22,300, 22,240

www.sundartrends.in

బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగాల్లో బుల్లిష్‌నెస్!

కొత్త ఆర్థిక సంవత్సరం (2024-25) తొలి వారంలో దేశీయ స్టాక్ మార్కెట్లు మెరుగ్గా ట్రేడయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు వస్తే పాజిటివ్ సెంటిమెంట్ మరింత పెరుగుతుంది. ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన సమీక్షలో వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగే అవకాశం ఉండటంతో మదుపరులు అప్రమత్తంగా ఉండటం మంచిది. గత వారం చివరి సెషన్‌లో నిఫ్టీ భారీగా పెరిగినప్పటికీ చివరలో లాభాల స్వీకరణకు దిగటమే ఇందుకు నిదర్శనం. అయితే నిఫ్టీ 22,500 స్థాయిని అధిగమిస్తే మార్కెట్లో బుల్లిష్‌నెస్ వస్తుంది. ఈ వారం బ్యాంకింగ్, ఫైనాన్స్, ఫార్మా రంగ షేర్లు జోరును ప్రదర్శించే వీలుంది. అలాగే ఎఫ్ఎంసీజీ, ఐటీ రంగ షేర్లలోనూ కొనుగోళ్లు ఉండే అవకాశాలున్నాయి.

స్టాక్ రికమండేషన్స్

అపోలో హాస్పిటల్స్ : సుదీర్ఘకాలంగా అప్‌ట్రెండ్‌లో సాగుతున్న ఈ కౌంటర్‌లో స్వల్ప దిద్దుబాటు జరిగింది. జీవితకాల గరిష్ఠ స్థాయిల్లో గట్టి నిరోధం ఎదురైంది. అయితే రూ.6,000 స్థాయిల్లో ఈ షేరుకు మద్దతు లభించింది. గత గురువారం ఈ షేరు రూ.6,356 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లోకి రూ.6,400 స్థాయిల్లో ప్రవేశించి రూ.6,650/6,700 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.6,370 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

హీరో మోటోకార్ప్: ఈ షేరు సుదీర్ఘకాలంగా అప్‌ట్రెండ్‌ను కనబరుస్తూ వస్తోంది. ప్రస్తుతం ఈ షేరు 52 వారాల గరిష్ఠ స్థాయిలో ఉంది. ఏడాది కాలంలో 100 శాతం పెరిగిన ఈ షేరు రానున్న రోజుల్లో మరింత పెరుగుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. గత గురువారం ఈ షేరు రూ.4,722 వద్ద క్లోజైంది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లోకి రూ.4,700 స్థాయిల్లో ఎంటరై రూ.4,880/4,940 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.4,660 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

గ్రాసిమ్: ప్రస్తుతం ఈ షేరు అత్యంత పటిష్ఠంగా కనిపిస్తోంది. రిస్క్, రివార్డ్‌పరంగా ఈ షేరు బాగుంది. అప్పర్ బొలింజర్ బ్యాండ్ బ్రేక్ చేసింది. గత గురువారం ఈ షేరు రూ.2,287 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లోకి రూ.2,280/2,250 స్థాయిల్లో ప్రవేశించి రూ.2,500 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,220 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

బజాజ్ ఫిన్‌సర్వ్: ఈ గ్రూప్ నుంచి బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ పబ్లిక్ ఇష్యూకి వస్తుందన్న వార్తలతో ఈ షేరుకు డిమాండ్ పెరిగింది. రెండు వారాల నుంచి ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్ క్రమంగా పెరుగుతోంది గత గురువారం ఈ షేరు 3.87 శాతం లాభంతో రూ.1,643 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లోకి రూ.1,600/1,620 స్థాయిల్లో ఎంటరై రూ.1,750/1,800 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. రూ.1,575 స్థాయిని స్టాప్ లాస్‌గా పెట్టుకోవాలి.

భారతి ఎయిర్‌టెల్: ఈ టెలికాం దిగ్గజం ఎలాంటి ఒడుదొడుకులకు లోనవకుండా అప్‌ట్రెండ్‌లో కొనసాగుతోంది. చిన్న దిద్దుబాటు తర్వాత సరికొత్త జీవితకాల గరిష్ఠ స్థాయిల వద్ద ట్రేడవుతోంది. టెలికాం రంగంలో సానుకూలతలు, భారతి హెక్సాకామ్ పబ్లిక్ ఇష్యూకి వస్తుండటం సానుకూల పరిణామాలు. గత గురువారం ఈ షేరు రూ.1,236 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లోకి రూ.1,200/1,220 స్థాయిల్లో ఎంటరై రూ.1,550 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,170 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 1-4-2024 | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**

వచ్చేది మనమే!

3 పార్టీల కూటమి విజయం ఖాయం: పవన్



పిఠాపురం ఆత్మీయ సమావేశంలో పవన్

- బాబును జైలులో పెట్టినప్పుడు బాధేసింది
- ఆయన్ను కలిసి వచ్చాక పొత్తును ప్రకటించా
- నేను చెప్పినట్లే బీజేపీ కూడా కలిసొచ్చింది
- ఆ పార్టీ కోసం ఎంపీ సీట్లు తగ్గించుకున్నా
- నేను తపనపడినట్లే నేతలూ పోరాడాలి
- వైసీపీ మాఫియా, దోపిడీని అరికడితే అన్ని పథకాలకూ నిధులు వస్తాయి
- పింఛన్లు అందరికీ అందేలా చూడండి
- 3 పార్టీల నేతలకు జనసేనాని పిలుపు

9

పెన్షన్లతో ఓట్లాట

ఎన్నికల కమిషన్ ఆదేశాలకు రాజకీయ రంగు

- పంపిణీ ఆలస్యమవుతుందంటున్న సర్కారు
- వలంటీర్లను తప్పించడం వల్లేనని దుష్ప్రచారం
- అవ్వాతాతలను ఇబ్బందిపెట్టి, అందుకు టీడీపీయే కారణమని నిందలు వేసేందుకు కుట్ర
- కావాలనే ఆలస్యం చేసేందుకు ప్రయత్నం
- ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందాలని వ్యూహం



సచివాలయాల వద్దే పెన్షన్ల పంపిణీ

- గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు బాధ్యతలు
- ఈసీ ఆదేశాల మేరకు సెర్ప్ మార్గదర్శకాలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

వైసీపీ సర్కారు పెన్షన్‌తో ఓట్లాట ఆడుకుంటోంది. వలంటీర్ల ద్వారా పెన్షన్లు పంపిణీ చేయరాదన్న కేంద్ర ఎన్నికల కమిషన్ నిర్ణయానికి రాజకీయ రంగు పులుముతోంది. టీడీపీ ఫిర్యాదు చేయడం వల్లే ఎన్నికల కమిషన్ ఈ నిర్ణయం తీసుకుందని, ఈ నెల నుంచి అవ్వాతాతలకు పెన్షన్ ఇచ్చేందుకు 10 రోజులు పడుతుందంటూ ప్రభుత్వమే దుష్ప్రచారానికి శ్రీకారం చుట్టింది. ఒకటిన్నర లక్షల మంది ఉద్యోగులు గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్నారు. ఈ ఉద్యోగులందరికీ బాధ్యతలు అప్పజెబితే రెండు మూడు రోజుల్లో పెన్షన్ పంపిణీ పూర్తి చేసే అవకాశముంది. అయితే సర్కార్ కావాలనే పెన్షన్ పంపిణీకి 10 రోజులు పడుతుందంటూ ఈ ప్రక్రియను సాగదీసే కుట్ర చేస్తోందనే విమర్శలు వస్తున్నాయి. గతంలో ప్రభుత్వానికి ఎన్ని ఆర్థిక కష్టాలు వచ్చినా సామాజిక పింఛన్ల పంపిణీ కోసం ఒకటో తేదీన ఠంచనుగా నిధులు అందజేసేది. అవసరమైతే ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు కూడా పక్కనపెట్టి, ఖజానా నుంచి డబ్బు దారి మళ్లించి మరీ పెన్షన్లు కచ్చితంగా ఇచ్చేది. అయితే ఎన్నికల సమయంలో రాజకీయం చేస్తోంది. పెన్షనర్ల ఓట్లను అధికార పార్టీకి వేయించుకునేందుకు ప్రచార వ్యూహం పన్నింది. వలంటీర్లను

మిగతా 10వ పేజీలో...

- సామాజిక పెన్షన్ల పంపిణీ బాధ్యతల నుంచి వలంటీర్లను తప్పించాలన్నది కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం. ఇందులో టీడీపీకి ఎలాంటి సంబంధమూ లేదు. అయితే ఎన్నికల వేళ 'పెన్షన్'పై వైసీపీ రాజకీయం చేస్తోంది. టీడీపీపై దుష్ప్రచారం చేసి, లబ్ధి పొందాలని చూస్తోంది. ఇందుకు అధికారాన్ని కూడా ఉపయోగిస్తోంది.
- ఈసీ ఆదేశాల మేరకు పెన్షన్ల పంపిణీ బాధ్యతను గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ప్రభుత్వం అప్పగించింది. ఆ ఉద్యోగులు రాష్ట్రంలో ఒకటిన్నర లక్షల మంది ఉన్నారు. వారి ద్వారా పంపిణీ చేసినా రెండు, మూడు రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి చేయవచ్చు. అయితే పదిరోజులు పడుతుందని సర్కారే చెబుతోంది. పంపిణీ ప్రక్రియను కావాలనే ఆలస్యం చేసి, అవ్వాతాతలకు పెన్షన్ అందకుండా టీడీపీ అడ్డుపడుతోందని దుష్ప్రచారం చేసేందుకు వైసీపీ కుట్ర పన్నుతోందనే విమర్శలు వస్తున్నాయి.

పింఛన్లు ఇవ్వడం చేతకాక టీడీపీపై దుష్ప్రచారమా?

- వైసీపీవి దిగజారుడు రాజకీయాలు: టీడీపీ ఫైర్
- నేటి నుంచి పంపిణీ చేయకపోతే ఉద్యమిస్తామని హెచ్చరిక
- పింఛన్ల పంపిణీకి ప్రత్యామ్నాయం చూడాలి
- 5 రోజుల్లో లబ్ధిదారులకు డోర్ టు డోర్ పంపిణీ చేయాలి
- సీఎస్, సీఈవోకు టీడీపీ అధినేత చంద్రబాబు లేఖలు

10



ప్రకాశం జిల్లా మార్కాపురంలో టీడీపీ సభకు హాజరైన జనం.. ప్రసంగిస్తున్న చంద్రబాబు

జగన్ చేసింది అప్పులే

> తెలుగు ప్రజలు నేడు రాతియుగంలో ఉన్నారు. వారిని స్వర్ణయుగంలోకి తెచ్చేందుకు కూటమి అధికారంలోకి రావాలి. కులం, మతం, ప్రాంతం అని చూడకుండా సమర్థులు, పాలనాదక్షులను ఎన్నుకోవాలి.
>
> \- చంద్రబాబు

- సీఎం నిర్వాకంతో ఖజానా ఖాళీ: బాబు
- అప్పు తీసుకోకపోతే పూటైనా గడవదు
- 13 లక్షల కోట్ల అప్పు ఎవరు తీర్చాలి?
- పింఛన్లు ఇవ్వడానికి డబ్బుల్లేక టీడీపీపై నెపం మోపే యత్నం
- ఈ సీఎం రాజకీయాలకు అర్హుడు కాదు
- ఈ ఎన్నికలు ఏకపక్షం కావాలి!
- ప్రజాగళంలో టీడీపీ అధినేత పిలుపు

కూటమిదే విజయం.. వైసీపీ చిత్తుగా ఓడడం ఖాయం

మే 13న శని విరగడవుతుంది: చంద్రబాబు

బాపట్ల/కర్నూలు/ఒంగోలు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ నిర్వాకంతో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయి ఖజానా ఖాళీ అయిందని టీడీపీ అధినేత చంద్రబాబు విమర్శించారు. అప్పు చేయకపోతే పూటగడవని స్థితికి ప్రభుత్వం చేరుకుందన్నారు. ప్రస్తుతం పింఛన్లు ఇవ్వడానికి కూడా డబ్బులేక.. ఆ నెపం టీడీపీపై మోపే ప్రయత్నం చేస్తున్నాడని ధ్వజమెత్తారు. ప్రజాగళం యాత్రలో

మిగతా 9వ పేజీలో...

చదువుల పేరిట చక్కబెట్టేద్దాం!

వలంటీర్ల వ్యూహం ఆగడంతో వైసీపీ సర్కారు కొత్త పన్నాగం

- చదువుల పేరిట ఇంటింటి ప్రచారం
- జేఎల్స్, పీజీటీలతో విద్యా పథకాలపై తల్లిదండ్రులకు ప్రత్యేక అవగాహన
- ప్రభుత్వ కాలేజీల్లో స్పాట్ అడ్మిషన్ల పేరిట వినూత్న కార్యక్రమాలు
- నేటి నుంచి ప్రచారానికి శ్రీకారం
- అమ్మఒడి, గోరుముద్ద, నాడు-నేడు తదితర పథకాల ప్రచారమే లక్ష్యం
- ఇంటర్ విద్యా శాఖ చిత్రమైన ఆదేశాలు
- తెర వెనుక చక్రం తిప్పిన ప్రవీణ్ ప్రకాశ్

కాదేదీ ప్రచారానికనర్హం అన్నట్టు వైసీపీ ప్రభుత్వం అన్ని అడ్డదారులూ తొక్కుతోంది. సార్వత్రిక ఎన్నికల సమరం ప్రారంభమై ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చేసినా ప్రజలను మభ్యపెట్టేందుకు కుయుక్తులు పన్నుతూనే ఉంది. వలంటీర్లతో పథకాలు పంపిణీ చేయొద్దని ఈసీ ఆదేశించడంతో వైసీపీ గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్లయింది. మరి 'అధికారికం'గా పథకాలు ఎలా ప్రచారం చేసుకోవాలి? అని తర్జనభర్జన పడుతున్న ప్రభుత్వానికి చదువుల తల్లి గుర్తుకొచ్చింది. విద్యా రంగాన్ని మాత్రం ఎందుకు వదిలేయాలనుకున్న జగన్ సర్కారు విద్యా పథకాల ప్రచారం కోసం అకస్మాత్తుగా ఇంటర్మీడియట్ అడ్మిషన్లపై పడింది. విద్యారంగంలో ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ ప్రచారం చేసేందుకు సిద్ధమైంది.

10

మే మొదటి వారంలో టెన్త్ ఫలితాలు

నేటి నుంచి మూల్యాంకనం 10

కీలక నిర్ణయాలన్నీ తొలి 100 రోజుల్లోనే

దేశ ప్రగతి కోసం వచ్చే ఐదేళ్లకు రోడ్‌మ్యాప్ సిద్ధం: మోదీ



ఆడ్వాణీకి 'భారతరత్న' ప్రదానం చేస్తున్న రాష్ట్రపతి ముర్ము

- ప్రజలు ఇప్పటి వరకు ట్రైలరే చూశారు
- దేశంలో అసలు అభివృద్ధి ముందుంది
- మాది అవినీతిపై పోరాటం.. విపక్షాలది అవినీతిపరులను కాపాడే యత్నం
- చౌధరి చరణ్‌సింగ్‌కు ఇండియా కూటమి సరైన గౌరవం ఇవ్వలేదు
- కాంగ్రెస్, ఎస్పీ నేతలు ఇంటింటికీ వెళ్లి క్షమాపణ చెప్పాలి: ప్రధాని మోదీ

ఆడ్వాణీకి భారతరత్న ప్రదానం

స్వయంగా ఇంటికి వెళ్లి అవార్డు అందజేసిన రాష్ట్రపతి ముర్ము

రాష్ట్రపతి నిలబడితే.. మోదీ కూర్చుంటారా?

ప్రధాని తీరుపై కాంగ్రెస్ విమర్శలు

మేరఠ్, మార్చి 31: రాబోయే లోక్‌సభ ఎన్నికలు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికే కాదని, 'వికసిత్ భారత్' నిర్మాణం కోసం జరుగుతున్నవని ప్రధాని మోదీ అన్నారు. ఆదివారం ఆయన ఉత్తరప్రదేశ్‌లోని మేరఠ్‌లో ప్రచారం ప్రారంభించారు. మూడో సారి అధికారం చేపట్టడానికి తమ ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించిందని, దేశాన్ని ప్రగతి పథంలో నడిపించడానికి వచ్చే ఐదేళ్లకు సంబంధించిన

మిగతా 8వ పేజీలో...



ఆదివారం ఢిల్లీలో జరిగిన 'ఇండియా' ర్యాలీలో ఖర్గే, పవార్, సోనియా, రాహుల్, భగవంత్‌మాన్, ఫరూక్ అబ్దుల్లా అభివాదం

మ్యాచ్ ఫిక్సింగ్ మోదీని గద్దె దింపుదాం!

- ఈసీలు అనే అంపైర్లను మోదీనే ఎంపిక చేశారు
- ముగ్గురు-నలుగురు బిలియనీర్లను అడ్డం పెట్టుకొని 'మ్యాచ్ ఫిక్సింగ్' ద్వారా గెలవాలని అనుకుంటున్నారు
- సీబీఐ, ఈడీ బెదిరింపుల ద్వారా దేశాన్ని నడిపిస్తారా?
- బీజేపీ మళ్లీ వస్తే ప్రస్తుత రాజ్యాంగాన్ని ఖతం చేస్తారు
- మీడియాను కొనకుండా, ఈవీఎంలను వాడకుండా బీజేపీకి 180 సీట్లు కూడా రావు: రాహుల్ గాంధీ
- కేజ్రీవాల్, హేమంత్ సోరెన్‌ను విడుదల చేయాలి
- ఢిల్లీలో 'ప్రజాస్వామ్య పరిరక్షణ సభ'లో విపక్ష నేతలు

న్యూఢిల్లీ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కెప్టెన్లపై ఒత్తిడి పెంచి.. క్రీడాకారులను కొనుగోలు చేస్తే క్రికెట్ పరిభాషలో మ్యాచ్ ఫిక్సింగ్ అంటారని, ఇలానే మ్యాచ్ ఫిక్సింగ్ చేసి లోక్‌సభ ఎన్నికల్లో గెలవాలని మోదీ కుట్ర పన్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. మ్యాచ్ అనే ఈ ఎన్నికల వేళ ఎన్నికల కమిషనర్లు అనే అంపైర్లను మోదీయే ఎంపిక చేశారని.. రాజకీయ నాయకులనే ఇద్దరు క్రీడాకారులను (కేజ్రీవాల్, హేమంత్ సోరెన్)ను జైలుకు పంపారని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు ఇదే చివరి అవకాశమని, మోదీ ప్రభుత్వాన్ని కలిసికట్టుగా గద్దె దించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. బీజేపీ గనక మళ్లీ గెలిస్తే రాజ్యాంగాన్నే మార్చేసి, ప్రజల హక్కులను కాలరాస్తుందని హెచ్చరించారు. రాజ్యాంగం లేకపోతే రిజర్వేషన్లూ పోతాయని... పేదలు, రైతులు, శ్రామికుల సంపద అంతా దేశంలోని ఓ

మిగతా 8వ పేజీలో...

200 సీట్లైనా గెలవండి.. చూద్దాం | **బీజేపీకి మమతాబెనర్జీ సవాల్**

సైబర్ బానిసలు!

కంబోడియాలో దుర్భర స్థితిలో 5000 మంది భారతీయులు

- ఉద్యోగాల ఆశతో అక్కడికి చేరుకుని నిర్బంధంలోకి.. ఫ్రాడ్ కాల్స్ చేసి జనాన్ని మోసగించడమే డ్యూటీ
- రోజుకు 12 గంటల పని.. రోజుకు ఇంతని టార్గెట్లు.. చేయనని మొండికేస్తే కరెంటు షాకులతో హింస
- ఆర్నెల్లలో 500 కోట్లు దోచుకున్న సైబర్ మాఫియా.. కంబోడియాలోని భారత ఎంబసీకి పలు ఫిర్యాదులు
- ఇప్పటిదాకా 250 మందిని రక్షించి భారతదేశానికి తీసుకువచ్చినట్టు వెల్లడించిన మన విదేశాంగ శాఖ
- 8 మంది అరెస్టు.. 16 మందిపై లుకౌట్.. లుకౌట్ నోటీసుల ఆధారంగా అదుపులోకి ఇద్దరు తెలుగువారు

6



నా బొమ్మ ఉండాల్సిందే

- రైతు పాస్‌పుస్తకాలు, రికార్డులపై తీసేయొద్దు
- సీఎం జగన్ పట్టు.. అధికారులకు హుకుం
- సర్వే పథకంలోనూ జగన్ పేరు ఉండాలట
- ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా పట్టని వైనం
- బెజవాడ వేదికగా సమీక్షకు సిద్ధమైన సర్వే శాఖ
- 2 నుంచి 16 వరకు జిల్లాలవారీగా సమీక్షలు
- జగన్ ఫొటోలున్న రికార్డులతో రావాలని ఆదేశం

10

వివిధ

సాహిత్య వేదిక

అంతా మన మంచికే



1
కాలం ఓ రెక్కను విరిచేస్తే ఎగరలేని,
ఒంటి రెక్క తూనీగల సమూహం మధ్యలో నిలబడి,
జంట రెక్కల రంగు వెలసిందని విలపిస్తుంటావు...

2
ఏడుస్తుంటావు నిర్విరామంగా,
ఈరోజు నీది కాదనో,
నీదైన రోజు రాదనో..

లోతైన పాత గాయాల్ని,
గోడ కొత్త క్యాలెండర్లో దాచేసినట్టు,
యుగాల నాటి విషాదాలపై బొట్టుగా రాలిపడుతూ,
పైకి నవ్వినట్టు నటిస్తుంటావు...

మనది కాని కాలానికి, కాసిన కలతల చెట్టుకు,
కన్నీటి పుష్పాలు విరబూయడం సహజమే....
బహుశా ఈ రహస్యాన్ని నీకింకా ఎవరూ
చెప్పకపోవచ్చు...

3
నడిస్తే పడిపోతావనే భయం,
పడిపోతే లేవలేననే అపనమ్మకాల వంతెనపై,
జీవితాన్ని అంబాడిస్తుంటావు.

పరధ్యానంగా అడుగులు వేయడాన్నే
నడకనుకుంటావు తప్ప,
అసలేనాడైనా,
నేలకూ, కాళ్లకూ మధ్య జరిగే సంభాషణను
ఆస్వాదించావా....?
మడమకూ, మట్టి రేణువుకూ నడుమ ప్రేమను
పుట్టించగలిగావా....??

4
పులి భయంతో అరణ్యాన్ని వీడిన జింక పిల్ల,
చివరాఖరికి వీధి కుక్కల పాలైనట్టు,
రాయి విసిరితే పగిలిపోయే అద్దాన్ని
మనసులా మోసినంత కాలం,
పులిపంజానో, శునకపు పంటి గాటునో
తప్పించుకు తిరగడం అసాధ్యం.

5
మర్చిపోవాలి,
కీడును తలపెట్టిన ఉదయాల్ని,
ఆ ఉదయాల్ని ఉసిగొల్పిన హృదయాల్ని,
అన్నిటినీ మర్చిపోవాలి...

నింగి గిన్నెలోని వెలుగునంతా ఆరగించి,
ఎక్కిళ్ళతో నీ ముందుకొచ్చిన ఈ రాత్రికి,
కాసిన్ని కన్నీళ్లు తాగించైనా సరే,
తెలవారే లోపే అంతా మర్చిపోవాలి....

కాలానికి దాహమేసినప్పుడల్లా,
గుండె తడిని కంటి బొక్కెనతో తోడుకోనివ్వాలి,
ఆ తర్వాతే,
నీరింకిన బావిలాంటి దేహం,
ఉబికే ఆశయాల చెలిమెను కలగంటుంది...

6
ఒకానొక అనూహ్యమైన ఘడియలో,
వేల కోరల వికృత రూపంతో,
నీ ముందు ప్రత్యక్షమైన ప్రశ్నను చూసి
జడుసుకుంటావు కానీ,
ప్రశ్న బహురూపులది...

పడగొట్టి వెర్రిగా నవ్వినంతలోనే,
నిలబెట్టి గుండెకు హత్తుకోగలదు....

నిజానికి,
కలలోనూ వెంటాడే ప్రశ్నలుంటేనే కదా,
మెలకువలో విజయాల్ని వేటాడగలవు.

7
"అంతా మన మంచికే"

నువ్వు రాయాల్సిన కొత్త కావ్యానికి
అందమైన శీర్షికా ఇదే....
సశేషంగా సాగుతున్న నీ కన్నీటి కథకు
ముగింపు వాక్యమైనా ఇదే....

జాబేర్ పాషా
00968 78531638 (మస్కట్)

"శిల్పం వల్లే మన రాతలు సజీవం"



రఘు శేషభట్టర్ | పలకరింపు

కవిత్వంలో వస్తు శిల్పాలు సమతూకంలో ఉండాలా? వస్తువొక నెపం మాత్రమే అన్న మీ స్టేట్‌మెంట్‌ను ఎట్లా సమర్థించుకుంటారు?

ఆ రెండూ సమతూకంలో ఉండకపోవటం వల్ల కవిత్వానికి వచ్చిన ఇబ్బందేమీ లేదు. కవి ప్రతిభ అతడి వస్తువులో కన్నా శిల్పంలోనే బయట పడుతుంది. వస్తువెంత పేలవంగా ఉన్నా శిల్పంలో దమ్ముంటే ఆ కవిత నిలబడుతుంది. బండ్ల కొద్దీ కవిత్వం రాసినా diction అబ్బని వాళ్ళతో భాష బాగుపడదు కదా. మన ఉద్దేశ్యాలన్నీ భాషను ఉద్ధరించేందుకే ఉపయోగపడాలి. శిల్పంవల్లే మన రాతలు సజీవంగా ఉండగలుగుతాయి.

> **జీవితంలో ఉండే రాజకీయాలు కవిత్వంలోకి చొరబడి దాన్ని కలుషితం చేయటం ఒక సారస్వత విషాదం. కవిత్వం రాస్తున్న తొలిరోజుల నుండి దీన్ని నిశితంగా చూసినవాడ్ని కనుక వాటికి దూరంగా ఉంటూ వచ్చాను.**

జీవితానుభవాలు కవిత్వంగా మలిచినపుడు దృష్టి శిల్పం మీద నిలబడగలదా?


ఖచ్చితంగా నిలబడుతుంది. ఐతే దీని కోసం కొంచెం ప్రయత్నం చేయాలి ఏదీ దానంతటదే వళ్ళోకి వచ్చి వాలదు కనుక. శిల్పాన్ని తక్కువ చేసేవాళ్ళకు వార్తలు రాసినట్టు కవిత్వం రాసేవాళ్ళకు అది సాధ్యం కాదు. వాక్యాల్ని quotable గా ఉండేలా చూసుకుంటే ఎలాంటి అనుభవమైనా కవిత్వంలోకి ఒదుగుతుంది.

కవిత్వానికి ఒక సిలబస్ లాంటిదేమీ లేనప్పుడు కవిత్వాన్ని, అకవిత్వానికి మధ్య విభజన రేఖ గీయటం సాధ్యమేనా? దానికి మీరెంచుకున్న పద్ధతేమిటి?

చదివించే గుణమే నేనెంచుకున్న పద్ధతి. ఒక వాక్యం రాసినప్పుడు ఆ శైలిని బట్టి రాసిన వాడిని పట్టి ఇస్తే కవిగా వాడు సఫలం ఐనట్టు లెక్క. నిష్కర్షగా ఎవరి కవిత్వాన్నైనా విమర్శనాత్మకంగా చదివినప్పుడే ఇది అర్థమౌతుంది. విషాదం ఏమిటంటే మనలో కొమ్ములు తిరిగిన కవులు కూడా అకవిత్వం రాస్తారు. చుట్టూ ఉన్న వందిమాగధ బృందాలు దాన్ని మోస్తారు. ముందుగా ఏర్పరుచుకున్న అభిప్రాయాలతో ఒక కవిని చదవటం లేదా దూరంగా జరగటం రెండూ ఆగిపోవాలి.

పద్యంలో ఉన్నట్టు వచన కవిత్వానికి ధార ఉండాలా?

ఉండాలనే అంటాను. ధార అంటే వాక్యాలు బిరడా మూత విప్పి ఒంపినట్టు జారటం. దానికోసం ఎంతో మానసిక ప్రయాస కావాలి. రాసేవాడు ఏ స్థితిలో ఉన్నా మెట్టు వెనక మెట్టు చెక్కినట్టు వాక్యాన్ని చెక్కాలి. కవిత్వం పట్ల అపారమైన ప్రేమ ఉన్నప్పుడే అది సాధ్యమౌతుంది.



సాహిత్యేతర కారణాలతో ఒక కవిని లెక్కగట్టడాన్ని మీరు ఎట్లా పరిగణిస్తారు? ఈ విషయంలో మీ ముప్పైయేళ్ళ మీ కవిత్వానుభవం నేర్పిన పాఠం ఏమిటి?

జీవితంలో ఉండే రాజకీయాలు కవిత్వంలోకి చొరబడి దాన్ని కలుషితం చేయటం ఒక సారస్వత విషాదం. కవిత్వం రాస్తున్న తొలిరోజుల నుండి దీన్ని నిశితంగా చూసినవాడ్ని కనుక వాటికి దూరంగా ఉంటూ వచ్చాను. ప్రతిభావంతుడైన కవిని అతడి భావజాలంతో సంబంధం లేకుండా లెక్కగట్టటం నా అలవాటు. నా సారస్వత వ్యాస సంపుటి 'సౌరభం' దీనికొక గట్టి సాక్ష్యం. సాహిత్యేతర కారణాలతో కవుల్ని అంచనా కట్టేవాళ్ళు సహకవులకు పురాకవులకు చేసిన తాత్కాలిక ద్రోహాన్ని సరిచేయటంలో నా వంతు బాధ్యత నేను తీసుకున్నాను. మనం పట్టించుకోని కవుల్ని వాళ్ళ కాలాలతో నిమిత్తం లేకుండా తూచే ప్రయత్నం చేశాను.

మీ కవిత్వ జీవితం మీకు ఇచ్చిన గొప్ప కానుక ఏదైనా ఉందా?

జీవితంతో ఒడంబడిక చేసుకున్నట్టు కవిత్వం రాయటం వినా నాకు ఏ లాలసా లేదు. అదే గొప్ప కానుక. తెలుగు కవిత్వం ఖండాలు దాటి వెళ్ళాలి. అది మన ఉమ్మడి బాధ్యత.

వాసా ప్రభావతి స్మారక కవితల పోటీ

పాలపిట్ట - వాసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో వాసా ప్రభావతి సంస్మరణార్థం నిర్వహించే కవితల పోటీకి రచనల్ని పంపవలసిందిగా అన్ని ప్రాంతాల కవులను కోరుతున్నాం. మొదటి, రెండవ, మూడవ బహుమతులు వరుసగా: రూ.3వేలు, రూ.2వేలు, రూ.1000. ఎనిమిది కవితలకు రూ.500 చొప్పున ప్రత్యేక బహుమతులు. కవితలను ఏప్రిల్ 30 లోగా చిరునామా: ఎడిటర్, పాలపిట్ట, ఫ్లాట్ నెం: 2, బ్లాక్-6, ఎం.ఐ.జి-2, ఏపిహెచ్‌బి, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 500 044కు పంపాలి. వివరాలకు: 94900 99327.

గుడిపాటి

కందికొండ పురస్కారం - 2023

నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక నిర్వహించిన కందికొండ రామస్వామి స్మారక పురస్కారానికి స్ఫూర్తి కందివనం రచించిన 'డిమ్కి' కథల సంపుటి ఎంపికైంది. ఏప్రిల్ 21న నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో జరిగే సభలో పురస్కార ప్రదానంతో పాటు పదివేల నగదు, శాలువా మెమెంటోతో సత్కారం జరుగుతుంది. వివరాలకు: 94927 65358.

వనపట్ల సుబ్బయ్య

అభినందన సత్కారాలు

జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదిక అధ్యక్షులు ఆచార్య జి. చెన్నకేశవరెడ్డి 80వ జన్మదిన సందర్భంగా కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత అంపశయ్య నవీన్‌కు పురస్కారం, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం ప్రకటించిన సందర్భంగా అనువాదకులు, కవి ఎలనాగకి జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదిక అధ్యక్షుడి అభినందన సత్కారం ఏప్రిల్ 7 మధ్యాహ్నం 2గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతాయి. సభలో అమ్మంగి వేణుగోపాల్, వాణీదేవి సురభి, డి.కె. సమరసింహారెడ్డి, పి.వి. ప్రభాకరరావు, వెలుదండ నిత్యానందరావు, వై. రామకృష్ణారావు, పి. లక్ష్మీనారాయణ, ఎం.కె. రాము, ఎస్.టి. సురేందర్ రావు, ఎం. శంకర్ రెడ్డి, నాశేశ్వరం శంకరం, కోట్ల వెంకటేశ్వరరెడ్డి, గంటా జలంధర రెడ్డి తదితరులు పాల్గొంటారు.

సూర్యప్రకాశరావు రాయారావు

వి. చంద్రశేఖరరావు సాహిత్య పురస్కారం

ఏప్రిల్ 13న వి. చంద్రశేఖరరావు జయంతి సందర్భంగా యువ కథారచయిత చరణ్ పరిమి 2024 సంవత్సరానికి గాను వి. చంద్రశేఖరరావు సాహిత్య పురస్కారాన్ని అందుకుంటారు. గతంలో ఈ పురస్కారాన్ని ఎండపల్లి భారతి, సుంకోజి దేవేంద్రాచారి, ఇండ్ల చంద్రశేఖర్, దుగ్గినపల్లి ఎజ్రాశాస్త్రి, వి. మల్లిఖార్జున్ స్వీకరించారు.

వి. ప్రసూన

శ్రీశ్రీ కి సినిమా అభ్యుదయ సాధనం

బొమ్మలు: అక్బర్

అప్పుడప్పుడే సినిమాలు మూకీల నుంచి టాకీల వైపు ప్రయాణం చేస్తున్నాయి. సినిమాల పట్ల సదభిప్రాయంలేని ఓ సంస్కృత పండితుడిని ఓ పాతికేళ్ళ కుర్రాడు "మాతో సినిమాకి మీరు కూడా రావాల్సిందే"నని బలవంతపెట్టి మరీ తీసుకెళ్లాడు. తెర వెలిగింది. "మందలు మందలుగా వెళ్తున్న గొర్రెలు" - ఫ్రేమ్ కాస్త డిజాల్వ్ - "గుంపులు గుంపులుగా తోసుకుంటూ వెళ్తున్న కార్మికులు". ఇది ఆ సినిమాలోని ఫస్ట్ షాట్. "వీడెవడో ఘటికుడులా వున్నాడు! నాందీశ్లోకంలోనే కథాంశం యావత్తూ సూచించడం సంస్కృత నాటక మర్యాద! ఎంత చక్కగా ఆ మర్యాద పాటించాడు!" అని మెచ్చుకుని చిత్రమంతా తదేక దీక్షతో చూసి ఒక కొత్త అనుభవం కలిగించావంటూ ఆ కుర్రాడ్ని అభినందించారు. అలా ఆ పండితుడికి సినిమాలపట్ల ఉన్న అభిప్రాయం పూర్తిగా మారిపోయింది. ఆ చిత్రం చార్లీచాప్లిన్ నటించి, దర్శకత్వం వహించిన 'మోడ్రన్ టైమ్స్' (1936). ఆ సంస్కృత పండితుడు భారతి సాహిత్య మాసపత్రికకు తొలి సంపాదకుడైన గన్నవరపు సుబ్బరామయ్య. ఆ పాతికేళ్ళ కుర్రాడు శ్రీశ్రీ.

శ్రీశ్రీది 73ఏళ్ళ సుదీర్ఘ జీవితం. "ఎనిమిదో ఏట నుంచే రచనలు చేసేవాడిని" అన్న మాట పరిగణన లోకి తీసుకొంటే 65ఏళ్ళ సాహితీ వ్యాసంగం. అందులో సినీరచయితగా 35ఏళ్ళ అనుభవం. కమ్యూనిజం తెలియకమునుపే ఆ ధోరణి, భావజాలాన్ని అలవరుచుకొన్న అభ్యుదయవాది. అప్పుడప్పుడే సమాజంపై ప్రభావం పెరుగుతున్న సినిమాలపట్ల కూడా శ్రీశ్రీ లోతైన అభ్యుదయభావాలను కలిగి ఉన్నాడు.

శ్రీశ్రీ విద్యాభ్యాస దశలోనే ఒకవైపు షేక్స్పియర్, బైరన్, కీట్స్, షెల్లీల వంటి సాహిత్యకారుల సాహిత్యారాధనలోనూ మరోవైపు చార్లీచాప్లిన్, పుడోవ్కిన్, డెసీకా వంటి దర్శక దిగ్గజాల సినిమా మోజులోనూ ఒకేసారి పడ్డాడు. శ్రీశ్రీ పుట్టింది 1910లో. భారతదేశ సినిమా పుంజుకున్నది



1935 తర్వాత. అంటే శ్రీశ్రీ వయసు పాతికేళ్ళు. అప్పటికి మద్రాసులోనే ఉన్నాడు. దక్షిణ భారత దేశం లోకి సినిమా బీజం ఎక్కడి నుంచి వచ్చింది? ఎలా మొలకెత్తి, మారాకులేసింది? - ఇదంతా శ్రీశ్రీ కళ్ళముందు జరిగిందనడంలో సందేహం లేదు.

1952లో ముంబాయిలో జరిగిన 'మొదటి అఖిల భారత చలనచిత్రోత్సవం'కి శ్రీశ్రీ ఆత్రేయతో కలిసి న్యాయనిర్ణేతగా వెళ్ళాడు. మద్రాసులో దక్షిణ భారత సినీ రచయితల సంఘానికి ఉపాధ్యక్షుడిగా (1976) కూడా పనిచేశాడు. రాజకీయ, సాహిత్య రంగాలను చూసినట్టే సినిమాని కూడా సామ్యవాద దృష్టితోనే చూస్తూ ఎదిగాడు. ఈ క్రమంలో 50ఏళ్ళ క్రింద వెల్లడించిన అభిప్రాయాలు, సూచనలు, సలహాలు ఈనాటికీ ఎంతో విలువైనవిగా తోస్తున్నాయి. చిత్రసీమపై, అందులోని వివిధ విభాగాలపై తన ఆలోచనలను అక్కడక్కడ వ్యాసాల్లోను, ముఖాముఖి చర్చల్లోను, 'సినీతంత్ర కాలమ్'ల ద్వారాను వెల్లడించాడు..

చిత్రసీమకి శ్రీశ్రీ కంటే ముందే శ్రీశ్రీ పాట వచ్చింది. ఆయన 1950లో 'ఆహుతి' సినిమా కోసం 'ప్రేమయే జనన మరణలీల' పాట రాయకముందే 1947లోనే 'కాలచక్రం' సినిమాలో శ్రీశ్రీ మహాప్రస్థాన గీతం 'నేను సైతం...'ను వాడారు. శ్రీశ్రీది వెయ్యికిపైగా గీతాలు రాసిన అనుభవం ఉంది. 'తెలుగు వీరలేవరా!' పాటతో తొలి జాతీయ అవార్డును 1974లో తెలుగువారికి తెచ్చిపెట్టాడు. కొన్ని పాటలు దృశ్యాలను మోస్తాయి, మరికొన్ని పాటలు సినిమాలనే మోస్తాయని నమ్మే శ్రీశ్రీని అసలు సినిమాకి పాటలు అవసరమా అని ప్రశ్నిస్తే, "పాటల్లేని చిత్రమే నిజమైనటువంటి చిత్రం" అంటూనే "మన ప్రత్యేక పరిస్థితుల్లో పాటలకి కథను మించిన ప్రాముఖ్యం కూడా ఉన్నదని చెప్పాలి" అంటాడు. మనకి ఇతర దేశాల్లో మాదిరి సెపరేట్ మ్యూజిక్ ట్రాక్స్ లేవు కాబట్టి పాటలు అవసరం అన్నది ఆయన ఉద్దేశం. పాటలు రాయటం గురించి మాట్లాడుతూ, "ఆది-అంత్యప్రాసలు వస్తే చాలు సినిమా పాట రాసెయ్యొచ్చని చాలామంది పొరబడుతూ ఉంటారు. పాటలు రాయడం చాలామంది అజ్ఞానులు అనుకున్నంత సులభం కాదు. పండితుల అనుకునేంత తేలిక కాదు. సినిమాపాట కొన్ని లక్షలమందిని మెప్పించాల్సి ఉంటుంది" అన్నాడు. సినిమా పాటలను కూడా సాహిత్య ప్రక్రియగా గుర్తించాలని భావించాడు శ్రీశ్రీ.

కథా రచయిత చిత్రసీమని శాసించే స్థాయికి చేరుకున్నప్పుడే విజయవంతమైన చిత్రాలొస్తాయని శ్రీశ్రీ భావించాడు. తమిళనాడులో రచయితల చేతిలోకి స్టీరింగ్ వీల్ వచ్చిందనీ, అందుకే అక్కడ కె.ఎస్. గోపాలకృష్ణ, వేలన్, ఎ.పి. నాగరాజన్‌లు రచయితలుగా మొదలై స్టూడియో అధినేతలయ్యారని; అన్నాదురై, కరుణానిధి లాంటివాళ్ళు గవర్నమెంటుని కూడా చేతుల్లోకి తీసుకున్నారని అంటాడు శ్రీశ్రీ. తమిళ నాడులో సాధ్యమైంది మన తెలుగులో కూడా సాధ్యమవుతుందన్నది ఆయన ఆకాంక్ష. తెలుగు రచయితల్లో అలసభావం ("డెవిల్ మే కేర్") మెంటాలిటీ ఉన్నదనీ, దీనితోపాటు ఇతర సాంకేతిక శాఖలలో పరిచయం లేదనీ చెబుతూ, ఈ కారణం వల్లనే మాటల ద్వారా చిత్రాల్ని విజయవంతం చేసిన సముద్రాల రాఘవాచార్య, త్రిపురనేని గోపీచంద్, అనిశెట్టి సుబ్బారావు, ఆత్రేయ లాంటి రచయితలు డైరెక్షన్‌లో మాత్రం ఫెయిల్ అయ్యారంటాడు. శ్రీశ్రీ అన్నట్టు నాటక రంగం నుంచి నిరూపించుకువచ్చిన ఆ తరం రచయితలు దర్శకులుగా విజయవంతమయ్యుంటే సినిమా కళకు సామాజికపరంగా, రాజకీయపరంగా మరిన్ని మెరుగులు దిద్దే ప్రయత్నం జరిగేది. గిరీష్ కర్నాడ్ (కన్నడ), జయకాంతన్ (తమిళం) మాదిరి మన చిత్రసీమలో కూడా కొన్ని 'జ్ఞానపీఠాల'ను సైతం చూసేవాళ్ళం. ఇప్పుడిప్పుడు పరిస్థితి మెరుగుపడి సినీరచయితలకు కూడా పద్మశ్రీలు పెరుగుతున్నాయి. ఇక, స్టూడియోలు, రాజ్యాధికారం ఏమోగాని రైటర్ - డైరెక్టర్ - ప్రొడ్యూసర్ క్రోనాలజీలో శ్రీశ్రీ ఆశించినట్టు ఇప్పుడిప్పుడే తెలుగులోనూ స్పీడు పెరిగిందనిపిస్తుంది.

"అసలు ప్రక్రియాభేదంతో రచయితలంతా రాసేది నాటకమే. నాటకం ఉత్తమోత్తమ కళ. దీనికి మూలధాతువు నటుడు. ఏ కవిత్వమైన అభినయంతోనే పరాకాష్ఠకు చేరుకుంటుంది. అది ప్రజల్లో చేర్చే నటుడికి క్రమశిక్షణతోపాటు నాటకరంగ అనుభవం కూడా ఉండాలి" అంటారు శ్రీశ్రీ. తారాగణ "ప్రాధాన్యత"ను మాత్రం ఆయన నిరసించాడు. హీరో అనీ విలన్ అనీ ఒక్క మనదేశంలో మాత్రమే ఉంటుందని చెప్తూ, "ఇతర దేశాల చిత్రాలలోని ప్రముఖ నటీనటులను లీడ్ రోల్స్ అంటారు. ఒక పదేళ్ళ కుర్రాడి చుట్టూ కథ అల్లి చిత్రం తీస్తే అతడే ప్రముఖ నటుడవుతాడు," అంటారు. "ఒక్క నటుడికే ప్రాధాన్యం పెరిగితే సినిమా కళ కాకుండా వ్యాపార రంగంగా మారిపోతుంది" అంటారు. "నేటి సినిమా ఒక ఐస్‌బెర్గ్! నీటిమట్టం మీద నాలుగోవంతు ఈదేవాళ్లతో కలకలలాడుతుంటే నాలుగింట మూడువంతుల అభాగ్యులు నీటిలో మునిగి కనపడకుండా కలవరపడుతున్నారు" అని ఆయన అన్న మాట నేటికీ నిజమే. అందుకు చిత్తూరు నాగయ్య, పేకేటి శివరాం, కస్తూరి శివరావు వంటి నటుల అవసానదశలని గమనించవచ్చు. ఇది పేద సినీకళాకారుల దీనస్థితిపై శ్రీశ్రీ ఎప్పుడో చెప్పిన జోస్యం.

"ప్రొడ్యూసర్లందరూ డబ్బు చేసుకుందామనే దృష్టితో వచ్చేవాళ్ళే"నంటూ, "తెలుగు సినీమా రంగం తిమింగలాలతో కూడిన సముద్రం. ఈ తిమింగలాలు మొత్తం కళా సాగరాన్ని కల్లోలపరుస్తున్నాయి. ఈ సముద్రంలో కనీసం అభ్యుదయ భావాలతో కూడిన చిన్న దీవినైనా ఏర్పాటు చేయాలి," అని ఆశపడ్డాడు. ఇదంతా సమిష్టి భావనతో సాధ్యమయ్యే మార్పు. పెట్టిన రూపాయి వెనక్కి రావడం సినిమాకు ప్రధాన అంశం. అది లేకపోతే ఒక ప్రొడ్యూసర్ ఒక సినిమా మాత్రమే తీయగలడు. ఈ మధ్యకాలంలో క్రౌడ్ ఫండింగ్ సినిమాలు ఒకటీ అరా మొదలై ఆగిపోయాయి. ఈ తోవలో శ్రీశ్రీ అప్పట్లోనే దృష్టి సారించడమన్నది విశేషం. దీనివెనుక 'చెవిలో రహస్యం' సినిమాకు నిర్మాతగా చేతులు కాల్చుకున్న అనుభవం లేకపోలేదు. దర్శకుడిగా మెగాఫోన్ పట్టుకునే అవకాశాలు, సందర్భాలు శ్రీశ్రీకి అప్పట్లో చాలానే ఉన్నాయి. కానీ కమ్యూనిస్ట్ కార్యకలాపాల్లో సమయం లేకనో, ఇష్టం లేకనో దర్శకత్వం చేయలేదు. "సమాజాన్ని ప్రభావితం చేయగలిగిన సినిమా నాకో సరదాగానే మిగిలింది.... నాకున్న ఇన్ని సంవత్సరాల సినిమా అనుభవంతోనూ లవలేశమైనా సామాజిక ప్రయోజనం సాధించలేకపోయాను" అని బాధపడ్డాడు.

సాహిత్యంలో అందరూ మెచ్చే ఠాగూర్‌ని తాను మెచ్చనట్టుగానే, సినిమాల్లో సత్యజిత్ రేని శ్రీశ్రీ హర్షించలేదు. ఇటాలియన్ సినిమాల ప్రభావంతో పైకొచ్చాడు తప్పా అతడిలో సొంత నిబద్ధత, వ్యక్తిత్వమంటూ ఏదీ లేదని ఆరోపించాడు. ఈ రెండు గుణాలు కలిగిన మృణాల్ సేన్, శ్యామ్ బెనగల్ గొప్ప దర్శకులన్నాడు. తెలుగులో ఆదుర్తి సుబ్బారావు, కె.బి. తిలక్, మాదాల రంగారావులని శ్రీశ్రీ అభిమానించి ప్రోత్సహించేవాడు. నిర్మాతకూ నటుడికీ మధ్య దర్శకుడు నలిగిపోతున్నాడని, ఈ ఇద్దరినీ శాసించే స్థాయికి చేరుకున్నప్పుడే విజయవంతమయ్యే చిత్రాల శాతం పెరుగుతుందనీ శ్రీశ్రీ సూచించాడు. శ్రీశ్రీ పేర్కొన్న ఈ లోపం కొన్ని తరాలపాటు అలాగే కొనసాగింది. ఇప్పుడిప్పుడే చిత్రసీమలో హీరోలతో సమానంగా దర్శకుణ్ణి గుర్తించి ఆదరిస్తున్నారు.

ఆధునిక కాలంలో సంస్కృతీ సంప్రదాయాలపై, రాజకీయ, ఆర్థిక వ్యవస్థలపై మాధ్యమాలు ఎంతో ప్రభావాన్ని చూపుతున్నాయి. అందులో సినీమాధ్యమం తీవ్రత ఎక్కువ. ఈ ప్రభావాన్ని తమిళ సినీ రచయితలు గుర్తించారు. జాతీయ కవిగా సుబ్రహ్మణ్య భారతి, అంబేద్కర్ సరసన పెరియార్‌ని నిలిపే ప్రయత్నాల్లో సినిమాను కూడా భాగం చేసుకున్నారు. తెలుగులో ఈ విధమైన చేవ ఉన్నా చొరవ తక్కువ. తెలుగువాళ్ళు తీసే సినిమాల్లో సమకాలిక సమాజం కనపడదన్న విమర్శ ఎప్పటి నుంచో ఉంది. శ్రీశ్రీ కూడా తెలుగు సినిమాల్లో "కథానాయకుడి ఊరేదో, పేరేదో, ఇంటిపేరేదో తెలియదు" అంటాడు. వాస్తవానికి సమాజ ధోరణిని తెలిపే వాస్తవిక ఘటనలెన్నో సినిమాగా మలచగలిగే నాటకీయతను కలిగి ఉన్నవి మనకు చాలానే ఉన్నాయి. పునర్వివాహానికి సుముఖంగా వుండి సనాతనుల మధ్య ఇరుక్కుపోయిన ఓ వితంతువును ఆ గ్రామం నుంచి రాత్రిపూట ఎలా లేవదీసుకు రావాలని కందుకూరి, బ్రహ్మ సమాజం బృందం వేసిన ప్రణాళికలు; వితంతు వివాహం అనంతరం అటు పుట్టింటివారు - ఇటు మెట్టినింటి వారుగాని కలగజేసుకోకపోతే పెళ్లి చేసిన తామే తిరిగి బాధ్యత వహించవలసి వచ్చినప్పుడు ఉన్నవ లక్ష్మీనారాయణ దంపతులు పడ్డ మానసిక, ఆర్థిక సంఘర్షణలు; ఒకప్పుడు చల్లా యానాదుల జీవన కేంద్రమైన నేటి రాకెట్ కేంద్రం శ్రీహరికోట నుంచి వారిని ఖాళీ చేయిస్తున్నప్పుడు వారి వేదనలు; వాకపల్లి గిరిజన మహిళల తరపున కె. బాలగోపాల్ పోరాటం ఇలా ఎంతో నాటకీయత ఉన్న వాస్తవ సామాజిక సంఘటనలు ఎన్నో ఉన్నాయి. కానీ వాటిని సినిమాలుగా మలచటంపై ఎందుకో నాటి 'మధ్యతరం' దర్శకులు దృష్టి సారించలేకపోయారు. "వాళ్ళు అవే చూస్తున్నారు కాబట్టి మేము ఇవే తీస్తున్నాం" అన్న వాదనను మొన్న 'జైభీం' సినిమాకు ఇక్కడ తెలుగులో లభించిన ఆదరణ కూలదోసింది. రచయిత ముదిరి దర్శకుడు అయితేనే తెరపై తెలుగు జీవితాల సాంద్రత పెరుగుతుందని శ్రీశ్రీ అన్న మాట వాస్తవ రూపం దాల్చగలిగే పరిస్థితులు ఇప్పుడు ఉన్నాయి. శ్రీశ్రీ అన్నట్టు సినిమా బాగుకీ, భ్రష్టుకీ కూడా ఉపయోగపడుతుంది. అది చాలావరకు తీసేవారిని బట్టి, కొంతవరకు చూసేవారిని బట్టి ఉంటుంది. శ్రీశ్రీ దృష్టితో సాహిత్య కోణంలో సినిమా కళని చూస్తే, ఆయన ఆలోచనలు ఇప్పటికైనా సాకారమైతే- సినిమా ఒక వినోదంగా మాత్రమేగాక, అభ్యుదయ సాధనంగా కూడా మారగలదు.

> **"ప్రొడ్యూసర్లందరూ డబ్బు చేసుకుందామనే దృష్టితో వచ్చేవాళ్ళే. తెలుగు సినీమా రంగం తిమింగలాలతో కూడిన సముద్రం. ఈ తిమింగలాలు మొత్తం కళా సాగరాన్ని కల్లోలపరుస్తున్నాయి. ఈ సముద్రంలో కనీసం అభ్యుదయ భావాలతో కూడిన చిన్న దీవినైనా ఏర్పాటు చేయాలి." - శ్రీశ్రీ**

బుగడూరు మదనమోహన్ రెడ్డి
99898 94308

ఊరు లేని పేరు

దిక్కూలేని దివాణమూ లేని
దీనికీ నలుదిక్కులున్నాయి.

తూర్పునుంటుంది
తత్తర పడని తొత్తరమూడి.
పశ్చిమాన
అల్లుకునుంటుంది అయినవిల్లి
దక్షిణానేమో నేమినాథునూరు.
ఏనాటిదో ఉత్తరాన వృద్ధగౌతమి.

చొరబడలేక
సంచరించే సందేలేక
ఉభయ సంధ్యల నడుమ
ఊగిసలాడుతుంది
ఊరేలేని ఆ పేరు.

వీనులు వింటూ
నాల్కలపై నానే
నదీ తీరప్రాంతంపై
చూపెంత సారించినా
చూడలేవు కదా కనులు.

మేఘాలు మారుతంతో
మసకలాడుతాయి.
రుతువులు ఇరుకు
ఇరుసుగుండా దొర్లాడుతాయి.

కాలమనే భ్రమల ముళ్ళు
మూడు తిరుగాడుతాయి.
సాధువుల గుండెలు పీల్చే
గంజాయి పొగలా
కనీకనిపించక వాసనేస్తుంది.
దీన నేత్రాల భిక్షకుల గుంపులాగా
కళకళలాడుతుంది కాంతులీనుతుంది.

తాను నడుమ నుండి
పైనొకటీ క్రిందొకటీ
కార్తీక దీపాలను
మోసుకుపోతుంది కాల్వ

ప్రభల తీర్థపు తీరంలో
మందగించిన చూపులను
స్పృశిస్తుంది
యవ్వన కాలంనాటి
ప్రౌఢ ప్రియురాలు.

ఆకాశ దుఃఖాన్ని
కురిసే ఆరుద్ర కార్తె,
రోహిణీ కార్తె
తీక్షణ గ్రీష్మమూ
స్నిగ్ధ హిమవన్నగం
అనూరాధ కార్తె
ఈ పురాప్రాంతంపై పరిఢవిల్లుతాయి.

వరదలు ముంచుకు వస్తాయి.
కావలి కాసే ఏటిగట్ల నడుమ
ఆత్మీయుల ఆత్మలన్నిటికీ
పుణ్యస్నానాలు చేయిస్తాయి.

పురిటినొప్పులనూ
పేద రైతు లేగలనూ
నిర్భాగ్యపు దొంగల



లేత రెక్కలనూ
తమతో తోడ్కొని వెళతాయి.

పన్నెండేళ్ళకోమారు
ప్రాయం మారి వస్తాయి
నవీన జలాలు,
పాపాలను ప్రక్షాళించి
సముద్రాన నిమజ్జనమవుతాయి.

అనాది నాదాన్ని
గానం చేసే రావిచెట్టు
చితి మొదలు మొలిచిన
తులసి మొక్క
ఒంటరి రాత్రుళ్ళతో
సహవాసం చేస్తాయి.

ఆకాశానికీ నేలకూ నడుమ
భస్మమయ్యే దేహాలు.
పాతాళానికీ భువికీ మధ్యన
ఖననమయ్యే కాయాలు.
సమాధులపై శయనించే పౌర్ణమి.
చితిమంటల్లో కాలిపోయే
అమావాస్య.

కాయలు కాసి చూసే
పూర్వీకుల కనులు
బాల్యపు వేదనను
మరల అలమే అశ్రుపొర.

మృదువైన ఎముకల వంటి
పొడవాటి రెల్లు పూలూ
బంగారు రంగు ఇసుకా సాక్షి.

విలస తామ్రపత్రంలోలేని
కడకు కడ తేరిపోవటమేనని
గడచిన ఘడియలనీ
నిర్నిమిత్త నిమిషాలనీ
క్షణికమైన క్షణాలనీ క్షమించే
ఊరు మాత్రం లేని ఆపేరొకటీ

క్షణముక్తేశ్వరం.

బడుగు భాస్కర్ జోగేష్
98666 02325

కవితా నా కవితా!



ఉప్పొంగే భావాల్ని అదిమిపడతాను
కూరలో ఉప్పూకారం
సరిపడ్డాయా అని కంగారుపడతాను
ఓపక్క రసతృష్ణ కృష్ణమేఘమై
లోలో జలజలమంటుంది
పొయ్యిమీద మిరియాలరసం ఎక్కడికి పోతావని
సలసలమంటుంది

ఇంటిల్లిపాదినీ వదుల్చుకుని
వంటిల్లిపాదినీ
తెముల్చుకుని
డొలుమాటల్నీ బోలుమర్యాదల్నీ విదుల్చుకుని
నాకోసం నే జీవించాలని
గుప్పెడు నిముషాల్ని గుండెమూలన అస్తారపదంగా
అట్టిపెట్టుకుంటానా -
విచ్చుకోబోయిన భావకల్హారం
అప్పటికే ముడుచుకున్న అత్తిపత్తి అవుతుంది!
కొద్దిపాటి ఆశాతైలంతో మినుకుమనే కవనదీపం
కునకనా వద్దా అని రెపరెపమంటుంది!!


మసకేసిన భావంలో
రసపుష్టి
ఇసుకను ఇంకిన నీటిఛాయ!
క్షీణజ్యోత్స్నలో కనుజారిన
జిలుగుచేలాంచలసుందరి మహామాయ!!

ఘంటశాల నిర్మల



లోక రక్షణకు పునరుత్థానమైన వేళ


తాడేపల్లిలో సమాధి వద్ద జ్యోతి వెలిగిస్తున్న చిన్నారి


తాడేపల్లిలో సమాధి వద్ద ప్రార్థనలు చేస్తున్న కుటుంబ సభ్యులు

జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఈస్టర్ వేడుకలను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. చర్చిలలో ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. లోక రక్షణకు క్రీస్తు పునరుత్థానం చెందిన రోజును విశ్వాసులు ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. సమాధుల వద్ద కుటుంబ సభ్యులు కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు.

వారు వీరయ్యారు..!

2019లో వైసీపీ అభ్యర్థులు నేడు టీడీపీ తరపున

నాడు టీడీపీ అభ్యర్థులు నేడు వైసీపీ తరపున కనుమరుగైపోయిన పలువురు నేతలు

రాజకీయాల్లో శాశ్వత శత్రువులు.. శాశ్వత మిత్రులు ఉండరన్నది పెద్దల మాట. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో ఈ ఐదేళ్లలో జరిగిన రాజకీయ పరిణామాలను గమనిస్తే అది అక్షర సత్యం అనిపిస్తుంది. 2019లో వైసీపీ అభ్యర్థులుగా బరిలో నిలిచిన వారు నేడు టీడీపీ తరపున పోటీ చేస్తుండగా టీడీపీ తరపున పోటీ చేసిన వారు వైసీపీ పంచన చేరి ఆ పార్టీ తరపున పోటీ చేస్తున్నారు. గత ఎన్నికల బరిలో నిలిచి హోరాహోరీగా పోరాడిన పలువురు నేతలు నేడు ఎన్నికల బరికి దూరంగా ఉండిపోయారు.

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : వల్లభనేని వంశీ, యార్లగడ్డ వెంకట్రావు నడుమ చిత్రమైన పోటీ నెలకొంది. గత ఎన్నికల్లో గన్నవరం నుంచి వంశీ టీడీపీ తరపున, వెంకట్రావు వైసీపీ తరపున పోటీ చేశారు. వంశీ 993 ఓట్ల స్వల్ప మెజారిటీతో గెలుపొందారు. ఈ ఎన్నికల్లో అదే గన్నవరం నుంచి వంశీ వైసీపీ తరపున పోటీ చేస్తుంటే వెంకట్రావు టీడీపీ తరపున బరిలో ఉన్నారు. కొడాలి నాని, దేవినేని అవినాశ్ వీరిద్దరూ గత ఎన్నికల్లో ప్రత్యర్థులు. ఈసారి ఒకే పార్టీ తరపున వేర్వేరు నియోజకవర్గాల నుంచి బరిలో ఉన్నారు. 2019లో గుడివాడ నుంచి వైసీపీ తరపున నాని, టీడీపీ తరపున అవినాశ్ పోటీ చేశారు. ఈసారి గుడివాడ నుంచి వైసీపీ అభ్యర్థిగా నాని బరిలో ఉంటే విజయవాడ తూర్పు నుంచి వైసీపీ అభ్యర్థిగా అవినాశ్ పోటీలో ఉన్నారు.


యార్లగడ్డ వెంకట్రావు


వల్లభనేని వంశీ


వల్లభనేని బాలశౌరి


కేశినేని నాని

అటు నుంచి ఇటు.. ఇటు నుంచి అటు..

గత ఎన్నికల్లో ఒక పార్టీ తరపున పోటీ చేసిన నేతలు నేడు ప్రత్యర్థి పార్టీ తరపున బరిలో నిలవడం గమనార్హం. గత ఎన్నికల్లో మచిలీపట్నం పార్లమెంటు స్థానం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన బాలశౌరి నేడు టీడీపీ, బీజేపీ బలపర్చిన జనసేన అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. విజయవాడ పార్లమెంటు స్థానం నుంచి గత ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన కేశినేని నాని ఈసారి వైసీపీ తరపున బరిలో ఉన్నారు. గత ఎన్నికల్లో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీచేసి గెలుపొందిన వసంత కృష్ణప్రసాద్, కొలుసు పార్థసారథి నేడు టీడీపీ తరపున పోటీ చేస్తున్నారు. గత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులుగా పోటీ చేసిన బొప్పన భవకుమార్ ప్రస్తుతం టీడీపీలో ఉన్నారు.

కొందరు కనుమరుగు.. మరికొందరు పోటీకి దూరం

గత ఎన్నికల్లో పోటీ చేసి మంచి మెజారిటీతో గెలుపొందిన పలువురు నేతలు ఈ ఎన్నికల్లో పోటీలో లేరు. వీరిలో కొందరు కనుమరుగైపోగా మరికొందరు తమ పార్టీ గెలుపు కోసం క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. 2019లో తిరువూరు నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన కొక్కిలిగడ్డ రక్షణనిధి 11647 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈ ఎన్నికల్లో ఆయనకు టికెట్ లేకుండాపోయింది. గత ఎన్నికల్లో విజయవాడ సెంట్రల్ నుంచి పోటీ చేసి కేవలం 13 ఓట్ల మెజారిటీతో గెలుపొందిన మల్లాది విష్ణుకి ఈసారి టికెట్ లేదు. గత ఎన్నికల్లో మచిలీపట్నం నుంచి పోటీ చేసిన పేర్ని నాని ఈ ఎన్నికల్లో పోటీ చేయడం లేదు. ఈసారి తాను తప్పుకొని తన కుమారుడు పేర్ని కిట్టుని పోటీలో పెట్టారు. నాడు తండ్రితో నేడు తనయుడితో తలపడే ప్రత్యర్థి మాత్రం కొల్లు రవీంద్రే. పామర్రు నుంచి గత ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఉప్పులేటి కల్పన ఈ ఎన్నికల్లో అసలు జాడే లేకుండా పోయారు. విజయవాడ పశ్చిమ నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన షబానా ఖాతూన్‌ది అదే పరిస్థితి. మైలవరం నుంచి గత ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన దేవినేని ఉమా ఈసారి ఎన్నికలకు దూరంగా ఉన్నారు. గత ఎన్నికల్లో విజయవాడ తూర్పు నుంచి వైసీపీ తరపున పోటీ చేసిన బొప్పన భవకుమార్ ఈసారి ఎన్నికల బరిలో నిలవకున్నా టీడీపీ తరపున క్రియాశీలకంగా ఉన్నారు. మచిలీపట్నం ఎంపీ స్థానం నుంచి టీడీపీ తరపున పోటీ చేసిన కొనకళ్ల నారాయణ ఈసారి ఎన్నికల బరిలో లేరు. గత ఎన్నికల్లో విజయవాడ ఎంపీ స్థానం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీచేసిన పొట్లూరి వరప్రసాద్ రాజకీయాలకు దూరంగా ఉండిపోయారు.

నాడు నేడు వారే..

2019లో ప్రత్యర్థులుగా తలపడిన వారు ఈ ఎన్నికల్లోనూ ప్రత్యర్థులుగా ఉన్నది కేవలం రెండు చోట్ల మాత్రమే. జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లో గత ఎన్నికల్లో ప్రత్యర్థులుగా తలపడిన శ్రీరాం తాతయ్య, సామినేని ఉదయభాను, తంగిరాల సౌమ్య, మొండితోక జగన్మోహనరావు ఈసారి కూడా ప్రత్యర్థులుగా బరిలో ఉన్నారు. సమీకరణాలు అనుకూలిస్తే అవనిగడ్డ నియోజకవర్గంలోనూ పాత ప్రత్యర్థులే మళ్లీ తలపడే అవకాశాలు ఉన్నాయి. ఇక్కడ వైసీపీ తరపున సింహాద్రి రమేశ్ బరిలో ఉండగా గత ఎన్నికల్లో ఆయనకు ప్రత్యర్థిగా టీడీపీ తరపున పోటీ చేసిన మండలి బుద్ధ ప్రసాద్ ఈసారి జనసేన అభ్యర్థిగా బరిలో నిలిచే అవకాశాలు ఉన్నాయి.



ఈస్ట్ బైపాస్‌కు దారేదీ..?



దాదాపు పక్కనపెట్టేసిన కేంద్ర ప్రభుత్వం

- ఈస్ట్ బైపాస్‌ను ప్రతిపాదించిన సీఎం జగన్
- అమరావతి అవుటర్ రింగ్‌ను కాదని..
- 'ఈస్ట్'కు డీపీఆర్ పూర్తయినా నిధులు నిల్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ ఈస్ట్ బైపాస్‌ను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నామని రాష్ట్ర ప్రభుత్వం అప్పట్లో ఊదరగొట్టింది. తన క్యాంపు కార్యాలయంలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో సీఎం జగన్ భేటీ అయ్యారు. అదేరోజు ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను దర్శించుకున్న గడ్కరీ మీడియా ముఖంగా విజయవాడ ఈస్ట్ బైపాస్‌కు డీపీఆర్ పిలుస్తున్నామని కూడా చెప్పారు. డీపీఆర్ అయితే పిలిచారు కానీ, ఏడాదిన్నరగా డబ్బు మాత్రం విదల్చలేదు. తాము అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ప్రాజెక్టును కూడా సాకారం చేయించుకోలేని పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం మౌనంగా ఉండిపోయింది.

అమరావతి ఇన్నర్ రింగ్‌రోడ్డును తప్పించి, ఆ స్థానంలో విజయవాడ ఈస్ట్ బైపాస్‌ను ప్రతిపాదించిన రాష్ట్ర ప్రభుత్వం దానిని కూడా సాధించలేని అసమర్థ స్థితికి చేరుకుంది. ఈ బైపాస్‌కు ఎన్నికల ముందైనా కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందని అందరూ భావించారు. డీపీఆర్ పూర్తి చేసినా పైసా విదిల్చింది లేదు. దీంతో ఈ ప్రాజెక్టుకు దాదాపు చెక్ పడినట్టే అయ్యింది.

డీపీఆర్ పూర్తయినా..

ఈస్ట్ బైపాస్ దాదాపు రూ.1,400 కోట్ల ప్రాజెక్టు. పొట్టిపాడు టోల్‌ప్లాజా నుంచి కాజా వరకు 40 కిలోమీటర్ల దూరంతో దీనిని ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనతో కనీసం విజయవాడకైనా అవుటర్ రింగ్ వస్తుందనుకున్నారు.

- మిగతా 4లో


మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరిని ఆహ్వానిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు

పోర్టుకు రుణం ఇప్పించా..

- విసిగిపోయి వైసీపీని వీడాను
- పట్టాభి స్మారక భవనం నిర్మాణం చేయకుండా అడ్డుకున్నారు
- మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గం జనసేన ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్లతో మర్యాదపూర్వక కలయిక

మచిలీపట్నం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : 'బందరు పోర్టు నిర్మాణం కోసం అవసరమైన రుణం మంజూరు చేసే విషయంలో అనేక అవాంతరాలు ఎదురయ్యాయి. కేంద్రప్రభుత్వ సంస్థ పవర్‌ఫైనాన్స్ కార్పొరేషన్ అధికారులతో మాట్లాడి పోర్టు నిర్మాణం కోసం రుణం మంజూరు చేయించా. అయినా వైసీపీ నాయకుల తీరు నన్ను బాధించింది. వారి వల్ల ఎంతో విసిగిపోయా.

- మిగతా 4లో

రసకందాయంలో అవనిగడ్డ రాజకీయం

జనసేనలోకి మండలి బుద్ధప్రసాద్?

- నేడు పిఠాపురంలో జనసేనలో చేరే అవకాశం


మండలి బుద్ధప్రసాద్

గడిచిన నెల రోజులుగా కృష్ణాజిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిత్వ విషయం రసకందాయంలో పడింది. ఎన్నో తర్జనభర్జనల అనంతరం టీడీపీ నేత మండలి బుద్ధప్రసాద్‌ను జనసేనలోకి ఆహ్వానించి కూటమి అభ్యర్థిగా నిలబెట్టాలనే చర్చ నడుస్తున్నట్టు నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. నేడు పిఠాపురంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో ఆ పార్టీలో చేరతారని చర్చ జరుగుతోంది.

అవనిగడ్డ, మార్చి 31 : అవనిగడ్డ సీటును పొత్తుల్లో భాగంగా జనసేనకి కేటాయించగా, ఆ పార్టీ నుంచి పోటీ చేసేందుకు ప్రముఖ పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాస్, జనసేన జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ, మచిలీపట్నం ఆర్కే మెస్ అధినేత బండి రామకృష్ణ, న్యాయవాది మత్తి వెంకటేశ్వరరావు, సీనియర్ రాజకీయవేత్త బచ్చు వెంకటనాథ్ తదితరులు ప్రయత్నాలు చేశారు. కొద్దిరోజుల క్రితం జనసేన ఐవీఆర్ఎస్ సర్వే నిర్వహించగా, అందులో విక్కుర్తి శ్రీనివాస్, బండి రామకృష్ణ, బండ్రెడ్డి రామకృష్ణల పేర్లు ఉదాహరించగా, వారిలో ఎవరో ఒకరికి జనసేన పార్టీ అభ్యర్థిత్వం ఖరారు అవుతుందని ఆ పార్టీ శ్రేణులు భావించాయి. అనూహ్యంగా శనివారం నుంచి బుద్ధప్రసాద్ పేరు తెరపైకి రావటంతో జనసేన సీటు ఎవరికి ఖరారు అవుతుందోనన్న విషయం ప్రధానంగా చర్చనీయాంశమైంది.

కూటమి అభ్యర్థిగా బుద్ధప్రసాద్?

అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి మండలి బుద్ధప్రసాద్ జనసేన పార్టీలోకి చేరుతున్నట్టు అవనిగడ్డ నియోజకవర్గంలో పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. గత తెలుగుదేశం ప్రభుత్వం ఉపసభాతిగా పనిచేశారు. పార్టీ ఓటమి చెందిన అనంతరం అవనిగడ్డ నియోజకవర్గంలో ప్రజాసమస్యలపై ఆందోళనల్లో ముందుంటారు. ఈ తరుణంలో జనసేన పార్టీలో అభ్యర్థిత్వం ఆశిస్తున్న వారి సంఖ్య అధికంగా ఉండటం, వారిలో రాజకీయ అనుభవం కలిగిన వారు లేకపోవటం కారణంగా జనసేన, తెలుగుదేశం పార్టీల ముఖ్యనేతలు బుద్ధప్రసాద్‌ను జనసేనలోకి ఆహ్వానించి టిక్కెట్ ఇవ్వాలని భావిస్తున్నట్టు నియోజకవర్గంలో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఆదివారం సాయంత్రం మండలి బుద్ధప్రసాద్ తెలుగుదేశం పార్టీ ముఖ్య నేతలను ఇంటికి పిలిపించుకుని తెలుగుదేశం, జనసేన పార్టీల నుంచి కూటమి అభ్యర్థిగా పోటీ చేయాలని వస్తున్న ఆహ్వానంపై పార్టీ నేతలకు వివరించినట్టు తెలిసింది. రెండు పార్టీల ముఖ్య నేతలు జనసేన పార్టీలో చేరమని చెబుతున్నందున ఓ నిర్ణయం తీసుకోవాలని కోరినట్టు సమాచారం. సోమవారం ఉదయం 11 గంటల సమయంలో పిఠాపురంలో జరుగుతున్న పవన్ కల్యాణ్ ప్రచార కార్యక్రమంలో ఆయన్ను కలిసి పార్టీలో చేరనున్నట్టు టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. జనసేన పార్టీలో చేరిన వెంటనే ఆయన అభ్యర్థిత్వాన్ని అధికారికంగా ఖరారు చేస్తారని పార్టీ నేతలు చెబుతున్నారు.

ముత్తంశెట్టికి సీటు ఇవ్వాలని మరో ప్రతిపాదన

అవనిగడ్డ కూటమి అభ్యర్థి నోవా విద్యాసంస్థల అధినేత ముత్తంశెట్టి కృష్ణారావుకు సీటు ఇవ్వాలని కొందరు ఆ పార్టీ అధిష్టానానికి సూచించారు. 2019 ఎన్నికల్లో జనసేన పార్టీ తరపున అవనిగడ్డ నియోజకవర్గం నుంచి పోటీ చేసి 28,500 ఓట్లు సాధించారని, జనసేన కార్యకర్తల్లో ఆయన పట్ల ఆదరాభిమానం ఉన్నందున ఆయన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని కొందరు పార్టీ రాష్ట్ర నాయకత్వానికి లేఖలు రాయటం విశేషం.



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) : 6-22 (సోమ)
సహర్ (ఉదయం) : 4-50 (మంగళ)

వెలంపల్లా.. మజాకా!

- ఎన్టీఆర్ కాంప్లెక్స్‌లో అనధికార బల్లలు

- 4లో..

బస్సుల్లేవ్.. సెలవుపెట్టి పొండి!



విధులకు వచ్చిన ఆర్టీసీలో ఉద్యోగులకు అధికారుల హుకుం

రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ)లో పనిచేస్తున్న ఉద్యోగులను ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో ఉన్నతాధికారులు బలవంతంగా సెలవులోకి పంపుతున్నారు. అధికార పార్టీ తలపెట్టిన సిద్ధం సభలకు వేలాది సంఖ్యలో ఆర్టీసీ బస్సులను అద్దెకు ఇవ్వడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. బస్సులు లేకపోతే ఫీల్డ్‌లో డ్యూటీలు విధించాల్సిందిపోయి.. ప్రతిసారీ వందలాది మందితో బలవంతంగా సెలవులు పెట్టించడం విడ్డూరంగా ఉంది. ఇది మొదలుకొని బస్సులు పెళ్లిళ్లు, ఫంక్షన్లకు అద్దెకు ఇచ్చినా, రిపేర్లు వచ్చినా, ఆఖరికి వివిధ కారణాలతో ట్రిప్పులను రద్దు చేయాల్సిన పరిస్థితుల్లో కూడా ఉద్యోగులను బలవంతంగా సెలవులు పెట్టమంటున్నారు.

- బస్సులు లేవన్న సాకుతో బలవంతపు సెలవులు
- వైసీపీ సభలకు, ప్రైవేటుగా అద్దెకు ఇచ్చిన ప్రతిసారీ సిబ్బంది ఇంటిబాటే
- రిపేర్లు, ట్రిప్ క్యాన్సిల్స్ సందర్భంలోనూ ఇదే తీరు అమలు
- అద్దెల పేరుతో ఆర్టీసీకి ఆదాయం.. సెలవులతో ఉద్యోగులకు నష్టం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఆర్టీసీ ఇబ్బంది కొత్త తలనొప్పి వచ్చిపడింది. బస్సుల్లేకపోవడంతో సెలవులు పెట్టమనడంతో ఏం చేయాలో దిక్కుతోచక సతమతమవుతున్నారు. బస్సులు లేకపోతే రిజర్వులో ఉన్న బస్సులను నడపాలి? లేదంటే సిబ్బందికి వేరే విధులు నిర్వహించాలి. ఆర్టీసీ ఉద్యోగులు గతంలో మాదిరిగా ప్రభుత్వ రంగ సంస్థ ఉద్యోగులు కాదు. ప్రభుత్వంలో విలీనమైన నేపథ్యంలో, ప్రభుత్వ సర్వీసు రూల్స్ ప్రకారం అన్ని హక్కులు వారికి ఉంటాయి. అయినప్పటికీ ఆర్టీసీ ఉన్నతాధికారుల తీరు మారటం లేదు. విజయవాడ సిటీ పరిధిలో ఉన్న బస్సులన్నీ 90 శాతానికిపైగా కాలం తీరిపోయి ఉన్నాయి. తరచూ బస్సులు రిపేర్లు వచ్చి ఆగిపోతున్నాయి. బస్సులు ఆగిపోతే సిబ్బంది తప్పా? రిపేర్ల కారణంగా బస్సులు ఆగిపోతే ప్రత్యామ్నాయంగా రిజర్వులో ఉన్న బస్సులను తెచ్చి నడపాలి. ఏదైనా రూట్‌లో ట్రాఫిక్ లేదన్న కారణంగా డిపో మేనేజర్ల స్థాయిలో ఆయా రూట్లలో ట్రిప్పులను అర్థంతరంగా రద్దు చేస్తున్నారు. ఇలా రద్దు చేసిన బస్సుల స్థానంలో సిబ్బందిని సెలవు పెట్టేయమని బలవంతం చేస్తున్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లా వేదికగా ప్రభుత్వ సభలు ఎక్కువగా జరగటం వల్ల వందల సంఖ్యలో బస్సులను అద్దెకు ఇచ్చారు. దీంతో ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో ఆర్టీసీ ఉద్యోగ బాధితులు భారీ సంఖ్యలో ఉన్నారు. ప్రతినెలలో రెండు, మూడు సార్లకుపైగా ప్రభుత్వ కార్యక్రమాలకు బస్సులను తరలించాల్సి వచ్చేది. ఈ కారణంగా బస్సులు ఒకరోజు ముందు నుంచే పంపించటం వల్ల నాలుగైదు రోజుల పాటు బలవంతపు సెలవులు పెట్టించేస్తున్నారు. సిద్ధం సభలకు వందలాది సంఖ్యలో బస్సులు వెళ్లాయి. ఈ బస్సులకైతే భారీ సంఖ్యలో ఉద్యోగులతో సెలవులు పెట్టించారు. రాష్ట్రంలో ఎక్కడ సిద్ధం సభలు జరిగినా ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో బస్సులు వెళ్లాయి. దీంతో భారీ సంఖ్యలో ఉద్యోగులు బాధితులుగా మారారు. అద్దె ప్రాతిపదికన బస్సులు కేటాయించినపుడు వందల సంఖ్యలో ఉద్యోగులకు ఉమ్మడి కృష్ణాజిల్లాలో బలవంతపు సెలవులు పెట్టించారు. బస్సుల్లో విధులు నిర్వహించే డ్రైవర్లు, కండక్టర్లతో పాటు క్షేత్రస్థాయిలో పనిచేసే ట్రాఫిక్ సూపర్‌వైజర్లను కూడా బలవంతంగా సెలవులు పెట్టిస్తున్నారు. ప్రతిరోజూ ఉద్యోగులను బలవంతంగా సెలవులు పెట్టమనే పరిస్థితి నెలకొంది. ప్రతిరోజూ విధినిర్వహణలో పాలుపంచుకోవటానికి వచ్చే ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, ట్రాఫిక్ సూపర్ వైజర్లలో ఎవరు డ్యూటీలు చేస్తారో? ఎవరు బలవంతంగా సెలవులు పెట్టాల్సి వస్తుందో అర్థం కాకుండా ఉంది.

ఫీల్డ్‌లో ఎందుకు వేయకూడదు?

ఆర్టీసీ బస్సులు లేవనుకుంటే.. సిబ్బందికి ఫీల్డ్‌లో డ్యూటీలు వేయవచ్చు. నగరంలో జంక్షన్ల దగ్గర ట్రాఫిక్ గైడ్లుగా డ్యూటీలు వేయవచ్చు. ఆర్టీసీ బస్టాపుల దగ్గర విచ్చలవిడిగా ఆటోలు, ప్రైవేటు బస్సులు ఆగుతున్నాయి. ఆర్టీసీ బస్సులు ఆగటానికి చోటు కూడా ఉండటం లేదు. బెంజిసర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, రామవరప్పాడు, కృష్ణవేణి, ఈనాడు, పోలీసు కంట్రోల్ రూమ్ వంటి సెంటర్లలో సాయంత్రమైతే ప్రైవేటు బస్సులన్నీ బస్టాపుల ముందే తమ బస్సులను ఆపి ప్రయాణికులను తన్నుకుపోతున్నాయి. బస్సుల్లో డ్యూటీలు వేయటానికి అవకాశంలేని సిబ్బందిని ఇలాంటి చోట్ల ప్రత్యేకంగా డ్యూటీలు వేయటం వల్ల ఇతర ఆర్టీసీ బస్సులకు ఆదాయాన్ని చేకూర్చే అవకాశం ఉంటుంది.

అద్దెలతో ఆదాయం.. సెలవులతో ఉద్యోగులకు నష్టం

అద్దె పేరిట అధికార పార్టీకి వేలాదిగా బస్సులను సరఫరా చేసిన ఆర్టీసీ అధికారులకు భారీగానే ఆదాయం వచ్చింది. కానీ, ఇదే సమయంలో బస్సులు లేవన్న సాకుతో విధులకు బలవంతంగా దూరం ఉండాల్సి వచ్చిన ఉద్యోగులు మాత్రం నష్టపోవాల్సి వచ్చింది. బలవంతపు సెలవుల వల్ల ఈ నష్టం ఏర్పడింది. విధి నిర్వహణకు వస్తే భవిష్యత్తులో వారికి ఎర్న్‌లీవ్‌గా మారుతుంది. ఆ లీవ్‌ను ఎన్‌క్యాష్‌మెంట్ చేసుకోవటానికి వీలుగా ఉంటుంది.

బలవంతపు సెలవులు పెట్టించే అధికారం ఉందా?

ఆర్టీసీ ఉద్యోగులు ప్రభుత్వ ఉద్యోగులుగా మారినపుడు.. వారి సర్వీసు రూల్స్ ప్రకారం నడుచుకోవాలి. సిబ్బంది వారంతట వారి అవసరాలకు సెలవులు పెడితే తప్ప.. బలవంతపు సెలవులు పెట్టించే అధికారం ఆర్టీసీ అధికారులకు లేదు. దీనిపై ఎవరైనా కోర్టుకు వెళితే.. ఆర్టీసీ అధికారులు చీవాట్లు తినే పరిస్థితి ఉంటుంది.



హైకోర్టు న్యాయమూర్తికి స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈవో

సుబ్రహ్మణ్యేశ్వరుని దర్శించిన హైకోర్టు న్యాయమూర్తి

మోపిదేవి, మార్చి 31 : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మల్లిఖార్జునరావు కుటుంబసమేతంగా ఆదివారం సాయంత్రం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చక బృందం వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలుపోసి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు నిర్వహించిన అనంతరం అర్చక బృందం వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికి శేషవస్త్రాలతో వారిని సత్కరించారు. ఈవో ఎస్.ఎస్.చక్రధరరావు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు న్యాయమూర్తికి అందజేశారు.



ఆలయ అభివృద్ధిపై ఈఈలు, అధికారులతో సమీక్షిస్తున్న ఈవో రామారావు

దుర్గగుడి అభివృద్ధిలో భాగస్వాములు కండి

వన్‌టౌన్, మార్చి 31 : దుర్గగుడి అభివృద్ధిలో సంబంధిత అన్ని విభాగాల అధికారులు భాగస్వాములు కావాలని ఆలయ ఈవో రామారావు సూచించారు. మహామండపంలోని నాలుగో అంతస్తులోని చాంబర్‌లో ఆదివారం ఈఈలు కోటేశ్వరరావు, రమాదేవి, ఏఈవోలు సీసీ రెడ్డి, రమేష్‌బాబు, పర్యవేక్షులు, ఇతర సిబ్బందితో పలు అంశాలపై సమీక్షించారు. 2024-2025 బడ్జెట్‌కు ఆమోదం లభించిన నేపథ్యంలో ఏప్రిల్ 1 నుంచి కొత్త బడ్జెట్ మేరకు ఆయా పనులను నిర్వహించేందుకు సిద్ధం కావాలని అధికారులకు సూచించారు. అస్తవ్యస్తంగా ఉన్న పార్కింగ్‌ను మెరుగు పరచడం, ప్రసాదాల పంపిణీ, తయారీ, కౌంటర్ల నిర్వహణ, కౌంటర్లలో సేవలను మరింతగా మెరుగు పరచడం, డిజిటలీకరణ, శానిటేషన్ తదితర అంశాలపై సమీక్షించి తగు ఆదేశాలు జారీ చేశారు. ఆలయంలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించడంలో అధికారులు తమ వంతు పాత్ర పోషించాలన్నారు. అభివృద్ధి పనులను వేగవంతం చేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

అన్న వితరణకు దాతల విరాళం



దుర్గగుడిలో అన్నవితరణకు హైదరాబాద్ మియాపూర్‌కు చెందిన వేదా పవర్ కంట్రోల్స్ అధినేత ఆదివారం ఇంద్రకీలాద్రికి వచ్చి ఏఈవో రమేష్‌బాబు ద్వారా రూ. 1,01,116విరాళం అందజేశారు. అమ్మవారి దర్శనం అనంతరం దాతకు ప్రసాదం, శేషవస్త్రం చిత్రపటం, ఆశీస్సులు అందజేశారు. పిఠాపురానికి చెందిన ఎస్ సత్యనారాయణ ఆదివారం ఆలయానికి విచ్చేసి అధికారుల ద్వారా అన్నవితరణకు లక్ష రూపాయల విరాళాన్ని చెక్కురూపంలో అందచేశారు. అమ్మవారి దర్శనం అనంతరం ప్రసాదం,శేషవస్త్రం, ఆశీస్సులు అందచేశారు.

ఆదివారం ఆలయంలో అర్చకులు, వేదపండితులు సూర్యోపాసన సేవ నిర్వహించారు. సూర్యనారాయణస్వామిని ఆరాధించారు. సమస్త జనులకు ఆయురారోగ్యాలు కలగ చేయాలని సంకల్పం చెప్పి పూజాదికాలు నిర్వహించారు. ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. పొంగళ్లను సమర్పించారు. ధర్మపథం వేదికపై ఎం.గాయత్రి శిష్య బృందం ఆంధ్ర నాట్యప్రదర్శనతో భక్తులను పరవశింపచేశారు.


దుర్గమ్మ ఆశీస్సులతో 5 నుంచి ప్రచారంలోకి

▸ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి



విద్యాధరపురం, మార్చి 31 : పశ్చిమనియోజకవర్గ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి ఈనెల 5 నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించనున్నట్టు తెలిపారు. ఆదివారం ఆయన భవానీపురంలో ఎన్నికల కార్యాలయ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, పశ్చిమ నుంచి టీడీపీ, జనసేన బలపరచిన ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేయడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ఎప్పట్నుంచో ప్రత్యక్ష రాజకీయాలలోకి రావాలనుకుంటున్నానని, అది ఇప్పుడు నెరవేరుతోందని తెలిపారు. చంద్రబాబునాయుడు తనను రెండు పర్యాయాలు రాజ్యసభకు పంపించారన్నారు. ఇప్పుడు పశ్చిమ నుంచి పోటీ చేయడం ద్వారా ప్రత్యక్ష రాజకీయాల్లో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేసేందుకు అవకాశం లభించిందని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవ చేస్తానన్న నమ్మకం తనకు ఉందన్నారు. జనసేన, టీడీపీ శ్రేణులు తన గెలుపునకు సహకరించాలన్నారు. అసంతృప్తివాదులను స్వాంతన పరచి ఎన్నికల ప్రచారంలో ముందుకు వెళతామన్నారు. ఏప్రిల్ 5న కనకదుర్గమ్మ ఆశీస్సులతో తన ప్రచారం ప్రారంభమవుతుందని తెలిపారు.

అవ్వా తాతలతో జగన్ చెలగాటం : రవీంద్ర



మచిలీపట్నం టౌన్, మార్చి 31 : స్వార్థ ప్రయోజనాలకోసం అవ్వా తాతలతో జగన్‌రెడ్డి చెలగాటం ఆడుతున్నారని మాజీ మంత్రి, మచిలీపట్నం అసెంబ్లీ నియోజక వర్గ ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్ర విమర్శించారు. ఆదివారం రవీంద్ర మీడియాతో మాట్లాడారు. సీఎం జగన్‌రెడ్డి స్వార్థ రాజకీయాల వల్లే పెన్షన్‌ల పంపిణీ బాధ్యత నుంచి వలంటీర్లను ఎన్నికల కమిషన్ తప్పించిదన్నారు. కోడ్ అమలులోకి వచ్చాక వలంటీర్లను రాజకీయ ప్రచారం కోసం వినియోగించరాదన్న ఎన్నికల కమిషన్ ఆదేశాలను బేఖాతరు చేస్తూ వలంటీర్లపై వైసీపీ నేతలు ఒత్తిడి తెచ్చి ఓటర్లను ప్రలోభ పెడుతుంటే వారిని విధులనుంచి తప్పించింది నిజం కాదా అని ప్రశ్నించారు. రాజకీయ లబ్ధి కోసమే వలంటీర్లకు ఇబ్బందికర పరిస్థితి తెచ్చారన్నారు. వలంటీర్లు లేకుండా గతంలో పింఛన్లు ఇవ్వలేదా అని ప్రశ్నించారు. ఈసీపై వంకతో పింఛన్లు ఎగ్గొట్టేందుకు జగన్‌రెడ్డి యోచిస్తున్నారన్నారు. ఎన్డీఆర్ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత పింఛను రూ.4 వేలకు పెంచి ఇంటి వద్దకే తెచ్చి అందిస్తామన్నారు. రాష్ట్ర ప్రజలు జగన్ రెడ్డి కుట్రలను ఓటు ఆయుధంతో తిప్పికొట్టాలన్నారు.

రాష్ట్రాన్ని స్వర్ణయుగం చేసేది చంద్రబాబే : నెట్టెం



జగ్గయ్యపేట, మార్చి 31 : మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణమే కాదు.. జగన్‌పాలనలో రాతియుగంగా మారిన రాష్ట్రాన్ని స్వర్ణయుగం దిశగా తీసుకెళ్లే సారథిగా చంద్రబాబు నిలుస్తారని మాజీమంత్రి, విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం అన్నారు. ఆదివారం తన నివాసంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలకు క్షేమం, సాధికారత, దేశంలో అత్యున్నత జీవనప్రమాణాల సమాజ నిర్మాణం దిశగా తీసుకెళ్లే అనుభవం, సమర్థత ఉన్న సారథి చంద్రబాబు అని ప్రశంసించారు. జగన్ అసమర్థ పాలనతో రాష్ట్రం రివర్స్ గేర్‌లో నడిచిందని, దేశంలో గంజాయి, డ్రగ్స్‌కు కేరాఫ్‌గా నిలిపి పరువుతీశాడని, చంద్రబాబు అంటే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, స్వర్ణాంధ్రప్రదేశ్ గుర్తుకు వస్తే జగన్ వచ్చాక ఏపీ అంటే అప్పులు, అరాచకం, అస్తవ్యస్త పాలన స్మరణకు వస్తున్నాయని నెట్టెం విమర్శించారు. బాబు సభలకు వస్తున్న స్పందన చూసి తట్టుకోలేక అసత్యాలను జగన్ మీడియా ద్వారా ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు.

బ్రాహ్మణ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసిన వైసీపీ

▸ పీవీ ఫణికుమార్



హనుమాన్‌జంక్షన్, మార్చి 31 : ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని దీవించే బ్రాహ్మణుల అభివృద్ధికి చంద్రబాబు హయాంలో ఏర్పాటు చేసిన కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసి వారికి సంక్షేమ పథకాలు అందకుండా వైసీపీ ప్రభుత్వం మోసం చేసిందని టీడీపీ బ్రాహ్మణ సాధికారసమితి జిల్లా కన్వీనర్, రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘ అధికారప్రతినిధి పీవీ ఫణికుమార్ ఆరోపించారు. యార్లగడ్డ నివాసంలో ఆదివారం యార్లగడ్డ వెంకట్రావు, జ్ఞానేశ్వరి దంపతులకు ఆయన వేదాశీర్వాదం చేశారు. ఈ సందర్భంగా యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, దేశంలోనే ఎక్కడాలేని విధంగా బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసి బడ్జెట్లో నిధులు కేటాయించి, వేదాధ్యయనాన్ని ప్రోత్సహించిన ఘనత చంద్రబాబుదే అన్నారు. టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే కార్పొరేషన్‌కు పూర్వ వైభవం తెచ్చి నిరుపేద బ్రాహ్మణుల కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

వెలంపల్లా.. మజాకా!

▸ ఎన్టీఆర్ కాంప్లెక్స్‌లో అనధికార బల్లలు
▸ తొలగించేందుకు సిద్ధమైన వీఎంసీ
▸ ఇప్పుడు తొలగిస్తే ఓట్లు పడవని వైసీపీ నేత ఆగ్రహం
▸ తాత్కాలికంగా నిలిపేసిన సిబ్బంది



ఎన్టీఆర్ కాంప్లెక్సులో అనధికారికంగా ఏర్పాటు చేసిన బల్లలు (గుర్తించిన భాగం)

(విజయవాడ - ఆంధ్రజ్యోతి/వన్‌టౌన్)

విజయవాడ పశ్చిమ నుంచి సెంట్రల్‌కు బదిలీ అయిన వైసీపీ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు అప్పుడే సెంట్రల్ నియోజకవర్గంపై పెత్తనం మొదలుపెట్టారు. ఓట్ల కోసం ప్రభుత్వ స్థలాలను పప్పుబెల్లాల మాదిరి పంచి పెట్టిన వెలంపల్లి ఇప్పుడు ఎన్టీఆర్ కాంప్లెక్స్‌లో వీఎంసీ ఆదాయానికి గండికొడుతున్న అనధికార బల్లల తొలగింపునకు అడ్డుపడుతున్నారు.

విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిధిలోని గవర్నరుపేట ఎన్టీఆర్ కాంప్లెక్సులోని గ్రౌండ్‌ఫ్లోర్‌లో మొత్తం 104 షాపులున్నాయి. షాపుల ఎదుట సుమారు వందమంది అనధికారికంగా బల్లలు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు సాగిస్తున్నారు. బల్లలు పెట్టిన వారి నుంచి వీఎంసీ సిబ్బంది, ఎన్టీఆర్ కాంప్లెక్సు అసోసియేషన్ నాయకులు రోజుకు రూ.1000 నుంచి రూ.2000 వరకు మామూళ్లు తీసుకుంటున్నారు. దీంతో వీఎంసీకి అద్దె రూపేణా రావాల్సిన ఆదాయానికి గండిపడుతోంది. ఈ అనధికార బల్లల వ్యాపారం కారణంగా తరచూ షాపు యజమానులకు అనధికారికంగా బల్లలు పెట్టుకున్న వారికి గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయాన్ని ఇటీవల కొందరు వ్యాపారులు వీఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సంబంధిత ఆక్రమణలు తొలగించాలని ఎస్టేట్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. రెండు రోజుల క్రితం అధికారులు అనధికార బల్లలు తొలగించేందుకు సమాయత్తమయ్యారు. విషయం తెలుసుకున్న ఆక్రమణదారులు వెలంపల్లి శ్రీనివాసరావును కలిశారు. దీంతో ఆయన ఎస్టేట్ అధికారులకు ఫోన్‌చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఎన్నికల సమయంలోనే మీకు ఈ ఆక్రమణలు గుర్తుకు వచ్చాయా? మీ ఇష్టం వచ్చినట్టు మీరు చేస్తామంటే కుదరదు. మీరు చేసే పనుల వల్ల నా ఓట్లు పోయే పరిస్థితి వస్తుంది. మీరు ఒక్క బల్ల తొలగించినా ఊరుకునేది లేదు' అంటూ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దీంతో చేసేది లేక అధికారులు ఒక్క బల్లను కూడా తొలగించకుండా అక్కడి నుంచి నిష్క్రమించారు. వెళుతూ వెళుతూ తమ అధికార దర్పాన్ని ప్రదర్శించడానికి సెల్లార్‌లో ఉన్న రెండు బల్లలను ఎత్తుకెళ్లారు.



చినఓగిరాలలో స్థానిక వైసీపీ నాయకుల ప్రోద్బలంతో బీసీ కాలనీ సమీపంలో ఆర్అండ్‌బి రోడ్డు పక్కన షెడ్డు నిర్మాణానికి వేసిన పైపులు

వైసీపీ నేతల ఓట్ల రాజకీయం!

▸ ప్రభుత్వ స్థలంలో షెడ్డు నిర్మాణం

చినఓగిరాలలో స్థానిక వైసీపీ నేతలు ఓట్ల రాజకీయానికి తెరతీశారు. ప్రభుత్వ స్థలంలో అక్రమంగా షెడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. గ్రామంలో బీసీ కాలనీ సమీపంలో తోట్లవల్లూరు వెళ్లే ఆర్అండ్‌బి రోడ్డుపక్కన కాలనీ వాసుల కోసం ఆలయం పేరుతో షెడ్డు నిర్మాణ పనులు చేప ట్టారు. మీకోసం షెడ్డు నిర్మిస్తాం.. ఎన్నికల్లో ఓట్లన్నీ మాకే వేయాలన్న షరతుతో రోడ్డుపక్కన, పంటకాల్వలో బోర్లుకోసి సిమెంట్ కాంక్రీట్‌తో పైపులు ఏర్పాటు చేశారు.

- చినఓగిరాల(ఉయ్యూరు)

కాంగ్రెస్‌లో కొత్త నమూనా



▸ పలుచోట్ల కొత్తవారికి అవకాశం ఇవ్వాలని నిర్ణయం
▸ ఉమ్మడి జిల్లాలో మూడు సీట్లు కోరుతున్న వామపక్షాలు
▸ విజయవాడ పశ్చిమ సీపీఐ, సెంట్రల్ సీపీఎం
▸ గన్నవరం కోరుతున్న సీపీఎం

(ఆంధ్రజ్యోతి - విజయవాడ)

కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికల్లో పాత, కొత్త కలయికను అమలు చేయాలని భావిస్తోంది. ఉమ్మడి కృష్ణా జిల్లాలో కొన్ని నియోజకవర్గాల్లో కొత్త అభ్యర్థులకు అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్టు సమాచారం. ఇంకొన్ని నియోజకవర్గాల్లో సీనియర్ నేతలను రంగంలోకి దింపాలని భావిస్తోంది. ఈ ఎన్నికల్లో గెలుపు మాట ఎలా ఉన్నా ఓటింగ్ శాతాన్ని పెంచుకోవాలని పార్టీ విశ్వప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే తమకు అవకాశం కల్పించాలని దరఖాస్తులు చేసుకున్నారు. ఈ జాబితా మరో రెండుమూడు రోజుల్లో విడుదలకాబోతుంది. ఎవరికి ఎక్కడెక్కడ అవకాశాలు దక్కుతాయో తేలిపోనుంది.

- విజయవాడ తూర్పు నియోజకవర్గ సీటును పొనుగుపాటి నాంచారయ్య ఆశిస్తున్నారు. ఆయన 2019 ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఈ సీటు పరిస్థితి ఎంపీ సీటుతో ముడిపడింది. విజయవాడ ఎంపీ స్థానాన్ని నగర కమిటీ అధ్యక్షుడు నరహరశెట్టి నరసింహరావు, ఎన్టీఆర్ జిల్లా కమిటీ అధ్యక్షుడు బుర్రా కిరణ్, పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ ఆశిస్తున్నారు. పద్మశ్రీ కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గ పరిధిలో ఓటు హక్కు ఉంది. ఆమె మాత్రం విజయవాడ ఎంపీ స్థానాన్ని కోరుతున్నారు. ఈ స్థానాన్ని పద్మశ్రీకి కేటాయిస్తే నరహరశెట్టి నరసింహరావును తూర్పు నియోజకవర్గానికి మార్చే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది.
- పెనమలూరు సీటుకు ఆరు నుంచి ఏడుగురు పోటీ పడుతున్నారు. జిల్లాకమిటీ ఉపాధ్యక్షుడు కిలారు వెంకటరత్నం, తాడిగడప మున్సిపాలిటీ కమిటీ అధ్యక్షుడు వి.సుబ్రహ్మణ్యం, సనత్‌నగర్‌కు చెందిన హమీద్ సీటు ఆశిస్తున్నారు.
- తిరువూరు సీటును ఐదుగురు ఆశిస్తున్నారు. మహిళా విభాగ రాష్ట్ర అధ్యక్షురాలు తాంతియా కుమారి ఇక్కడ సీటు ఖరారయ్యే అవకాశాలు ఉన్నాయి.
- మచిలీపట్నం సీటును అబ్దుల్ మతీన్, నల్లబోలు కుమారి, కోకా ఫణిభూషణ్ ఆశిస్తున్నారు. వారిలో ఫణిభూషణ్ పేరు పెడన నియోజకవర్గానికీ పరిశీలిస్తున్నారు.
- మచిలీపట్నం ఎంపీ స్థానం హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గొల్లు కృష్ణ, చలమలశెట్టి ఆదికిరణ్ ఇద్దరిలో ఒకరికి ఖరారయ్యే సూచనలు ఉన్నాయి.
- పెడనకు సంబంధించి కోకా ఫణిభూషణ్, దిలీప్, లింగాల సుధాకర్ పేర్లు పరిశీలనలో ఉన్నాయి.
- పామర్రు సీటుకు తోట్లవల్లూరు మాజీ ఎంపీపీ మొవ్వా మోహనరావు, మాజీ ఎమ్మెల్యే డీవై దాసు పేర్లను పరిశీలిస్తున్నారు.
- గుడివాడకు శిష్టా దత్తుడు, రాజేష్, కుక్కల పోతురాజు పేర్లు పరిశీలినలో ఉన్నాయి.
- అవనిగడ్డకు 2019లో పోటీ చేసిన అందె శ్రీరామమూర్తి, చల్లపల్లి మండల కమిటీ అధ్యక్షుడు రిజ్వాన్, ఆది రామ్మోహన్ దరఖాస్తు చేసుకున్నారు.
- మైలవరం సీటుకు ఎన్టీఆర్ జిల్లా కమిటీ అధ్యక్షుడు బుర్రా కిరణ్, అక్కల నాగేంద్రప్రసాద్ పేర్లను పరిశీలిస్తున్నారు. వారిలో కిరణ్ విజయవాడ ఎంపీ సీటును అడుగుతున్నారు.
- జగ్గయ్యపేట నుంచి మాజీ ఏఎంసీ చైర్మన్ కర్నాటి అప్పారావు, జూపూడి శ్యాంప్రసాద్, అజీజ్ దరఖాస్తు చేసుకున్నారు. వారిలో అప్పారావు సీటు ఖరారయ్యే అవకాశాలు ఉన్నాయి.

మూడు కోరుతున్న వామపక్షాలు

ఉమ్మడి కృష్ణా జిల్లాలో వామపక్షాలు మూడు నియోజకవర్గాలను కోరుతున్నాయి. విజయవాడ మూడు నియోజకవర్గాల్లో రెండింటిని వామపక్షాలకు కేటాయించాలని కాంగ్రెస్ ఇప్పటికే నిర్ణయం తీసుకున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. సెంట్రల్ నియోజకవర్గంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు ప్రచారం నిర్వహిస్తున్నారు. పశ్చిమ నియోజకవర్గం నుంచి సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు పోటీచేసే సూచనలు కనిపిస్తున్నాయి. విజయవాడ సెంట్రల్ కాకుండా కృష్ణా జిల్లాలోని గన్నవరం నియోజకవర్గాన్ని తమకు కేటాయించాలని సీపీఎం కోరుతోంది. ఇక్కడి నుంచి కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షుడు వింతా సంజీవరెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో రెండు సీట్లను కేటాయిస్తున్నందున మూడో సీటు కేటాయింపు విషయంలో చర్చలు జరుగుతున్నాయి. దీనిపైనా రెండు, మూడు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశాలు ఉన్నాయి.

యువతకు నందిగామ

ఉమ్మడి కృష్ణా జిల్లాలో యువతకు అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ భావిస్తోంది. నందిగామ ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం కావడంతో ఏడు నుంచి ఎనిమిది మంది పోటీపడుతున్నారు. వారిలో ఐదుగురు న్యాయవాదులు ఉన్నారు. యువతకు అవకాశం ఇవ్వడానికి సన్నాహాలు జరగడంతో యువజన కాంగ్రెస్ నాయకుడు జోసఫ్ దరఖాస్తు చేసుకున్నారు. ఆయన విజయవాడకు చెందిన వారు కావడంతో నందిగామలో స్థానికేతర సమస్య వస్తోంది.

రెండు దరఖాస్తుల తిరస్కరణ

విజయవాడ ఎంపీకి, మైలవరం ఎమ్మెల్యేకి హైకోర్టు న్యాయవాది సుంకర కృష్ణమూర్తి దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తులను కాంగ్రెస్ పార్టీ తిరస్కరించింది. 2019 ఎన్నికల్లో సీటు కేటాయించకపోవడంతో అప్పటి పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డిపై కేసు పెట్టారు. దీనితో పార్టీ అతడ్ని సస్పెండ్ చేసింది. ఇటీవల జరిగిన దరఖాస్తుల స్వీకరణలో దరఖాస్తులను తీసుకున్నా పరిశీలనలో తిరస్కరించారు.



కేశినేని చిన్నికి హారతి ఇస్తున్న మహిళ

జగన్ చేసింది గోరంత.. చెప్పుకొనేది కొండంత

▸ కేశినేని శివనాథ్ (చిన్ని)

సత్యనారాయణపురం, మార్చి 31 : అమరావతి రాజధానిగా ఉండాలన్నా, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని చిన్ని అన్నారు. 32వ డివిజన్ లోటస్ ల్యాండ్ మార్క్ సెక్టార్-1లో ఆదివారం పార్టీ నేతలు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కేశినేని చిన్ని ఇంటింటికి వెళ్లి వైసీపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో హామీలు అమలు చేసింది గోరంత అయితే చెప్పుకునేది కొండంతగా ఉందని ఎద్దేవా చేశారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి తెలుగుదేశం పార్టీని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

పటమట : ఏసుక్రీస్తు బోధనలు సర్వమానవాళికి అనుసరణీయమని జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే ఎంపీ అభ్యర్థులు గద్దె రామ్మోహన్, కేశినేని శివనాథ్‌లు అన్నారు. ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం పటమట పంట కాల్వ రోడ్డులోని స్టెల్లా కాలేజ్ ఆడిటోరియం క్రైస్ట్ టెంపుల్‌లో పాస్టర్ పాల్ ఇమ్మాన్యుయేల్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనల్లో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగర ప్రజలకు ఈస్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు.

గుణదల మేరీమాత చర్చిలో ప్రార్థనలు

భారతీనగర్ : ఈస్టర్ సందర్భంగా గుణదల మేరిమాత చర్చిలో నిర్వహించిన ప్రార్థనలో కేశినేని శివనాథ్, గద్దె అనురాధ, బొప్పన భవకుమార్, షేక్ కరీముల్లా పాల్గొన్నారు. ఫాదర్ ఏలేటి విలియం జయరాజ్‌ను కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఫాదర్ కె.సునీల్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

పోర్టుకు రుణం ఇప్పించా..

(3వ పేజీ తరువాయి)

ఆ విరక్తితో ఆ పార్టీని వీడా' అని మచిలీపట్నం ఎంపీ, మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గం జనసేన అభ్యర్థి వల్లభనేని బాలశౌరి తెలిపారు. ఆయన్ను అభ్యర్థిగా ఖరారు చేసిన అనంతరం ఆదివారం మచిలీపట్నం వచ్చారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ నివాసానికి వెళ్లారు. వారితో సంప్రదింపులు జరిపారు. జిల్లాలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థుల గెలుపుకోసం తీసుకోవాల్సిన అంశాలపై సమాలోచనలు చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మచిలీపట్నం పార్లమెంటు నియోకవర్గం పరిధిలో అభివృద్ధి కోసం తాను ప్రయత్నం చేస్తే వైసీపీకి చెందిన ప్రజాప్రతినిధులే అడ్డుకున్నారన్నారు. అధిష్ఠానానికి అన్ని విషయాలు తెలిసినా మిన్నకుండిపోయిందన్నారు. ఆంధ్రా బ్యాంకు వ్యవస్థాపకుడు డాక్టర్ భోగరాజు పట్టాభిసీతారామయ్య స్మారక భవన నిర్మాణానికి సీఎం జగన్‌తో మాట్లాడి మచిలీపట్నంలో రెండు ఎకరాల భూమి ఇప్పించానని, బ్యాంకు ఉన్నతాధికారులతో మాట్లాడి రూ.40 కోట్లను మంజూరు చేయించానని చెప్పారు. భవన నిర్మాణానికి కార్పొరేషన్ ద్వారా అనుమతులు ఇవ్వకుండా, తీర్మానం చేయకుండా పేర్ని నాని అడ్డుకున్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. ఎంపీ హోదాలో మచిలీపట్నం మెడికల్ కళాశాల నిర్మాణం కోసం తానే అనుమతులు తీసుకువచ్చానన్నారు. కొనకళ్ల నారాయణ బందరుపోర్టు అంశంపై తనతో మాట్లాడారని, పోర్టు నిర్మాణం కోసం రుణం తీసుకువస్తానని చెప్పానన్నారు. ఎవరిపైనా అతిగా విమర్శలు చేయడం, విపరీతంగా పొగడటం తనకు అలవాటు లేదన్నారు. బందరుపోర్టును రానున్న రోజుల్లో మరింతగా అభివృద్ధి చేస్తామని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. మునిసిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక తయారు చేసేందుకు కేంద్ర ప్రభుత్వ బృందాన్ని తీసుకురావాలని ప్రయత్నిస్తే స్థానిక ఎమ్మెల్యే అడ్డుకున్నారని అన్నారు. అధిష్ఠానానికి అన్ని విషయాలు తెలిసినా మిన్నకుండిపోవడంతో మనస్థాపానికి గురై వైసీపీని వీడానని చెప్పారు. కొనకళ్ల నారాయణ, కొనకళ్ల బుల్లయ్య సహకారంతో నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని ఆయన అన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల మాట్లాడుతూ, జిల్లాలోని ఎంపీ సీటుతోపాటు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థులను గెలిపించేందుకు కలసికట్టుగా కృషి చేస్తామన్నారు. అసెంబ్లీ నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గం జనసేన, టీడీపీ, బీజేపీ ఎంపీ అభ్యర్థిగా వల్లభనేని బాలశౌరిని ప్రకటించడమే విజయానికి సోపానమన్నారు. జనసేన మచిలీపట్నం నియోజకవర్గం ఇన్‌చార్జి బండి రామకృష్ణ, రొండి కృష్ణయాదవ్, మాదివాడ రాము టీడీపీ, జనసేన బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

బాలశౌరిని కలిసిన కాగిత, వర్ల

వల్లభనేని బాలశౌరిని గూడూరు మండలం టీడీపీ కార్యాలయంలో పెడన నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ గెలుపు కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చలు జరిపారు. విజయవాడలోని ఎంపీ కార్యాలయంలో పామర్రు టీడీపీ అభ్యర్థి వర్ల కుమార్‌రాజా బాలశౌరిని కలిసి చర్చలు జరిపారు.

రూ.1,62,320 విలువైన తెలంగాణా మద్యం స్వాధీనం

జగ్గయ్యపేట, మార్చి 31 : తెలంగాణాలో కోదాడ నుంచి జి.కొండూరుకు ఆటోలో అక్రమంగా శనివారం అర్ధరాత్రి తరలిస్తున్న రూ.1,62,320లు విలువ చేసే మద్యాన్ని తక్కెళ్లపాడు గ్రామంలో ఆటోతో సహ స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఈబీ సీఐ మణికంఠరెడ్డి చెప్పారు. జగ్గయ్యపేట కార్యాలయంలో మద్యం సీసాలు, ఆటో, నిందితుడిని విలేకర్ల ఎదుట హాజరుపరిచారు. వివిధ రకాల బ్రాండ్ల 149 మద్యం సీసాలను జి.కొండూరుకు చెందిన తాతా రాజేష్, తాతా గోపి, బళ్లా ఫణీంద్రలు కోదాడకు చెందిన దొడ్డి నాగరాజు ద్వారా ప్యాసింజర్ ఆటోలో తెప్పించి, వీటీపీఎస్ ప్రాంతంలో పలువురు ఉద్యోగులకు డోర్ డెలివరీ చేస్తున్నారని వివరించారు. ఆటో, మద్యాన్ని సీజ్ చేశామని, డ్రైవర్‌తో పాటు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

బస్సులో రూ.4.90 లక్షలు స్వాధీనం

ఎ.కొండూరు : ఆర్టీసీ బస్సులో ఎటువంటి పత్రాలు లేకుండా నగదును తరలిస్తున్న వ్యక్తి నుంచి రూ 4.90 లక్షలు స్వాధీనం చేసుకున్నట్టు ఎ.కొండూరు ఎస్సై చల్లా కృష్ణ తెలిపారు. ఆదివారం తిరువూరు నుంచి విజయవాడ వెళుతున్న ఆర్టీసీ బస్సును ఎస్సై కృష్ణ కంభంపాడు వద్ద తనిఖీ చేయాగా ఓ వ్యక్తి వద్ద ఉన్న రూ 4.90 లక్షలకు సరైన ఆధారాలు చూపకపోవడంతో నగదును స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై తెలిపారు.

ఈస్ట్ బైపాస్‌కు దారేదీ..?

(3వ పేజీ తరువాయి)

విజయవాడ-మచిలీపట్నం ఆరువరసల విస్తరణ పనులు, నిడమానూరు ఫ్లైఓవర్ ప్రాజెక్టులకు కూడా నిధులు ఇవ్వలేదు. ఈ ప్రాజెక్టులు డీపీఆర్ దశలో ఉన్నాయి. విజయవాడ ఈస్ట్ బైపాస్‌కు సంబంధించి డీపీఆర్ పూర్తయింది. ప్రభుత్వం ఇప్పుడేం సమాధానం చెబుతుందో చూడాలి.

పక్కన పెట్టేసిన కేంద్రం

కేంద్ర ప్రాజెక్టులకు దాదాపు భూసేకరణ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు భరించాల్సి ఉంటుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి భూ సేకరణ వ్యయాన్ని మాత్రం కేంద్రమే భరించాలని అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ప్రతిగా మెటీరియల్ కాంపోనెంట్స్, మినరల్స్ కొనుగోళ్లకు సంబంధించి పన్నులు వేయబోమని హామీ ఇచ్చింది. ఈ ప్రతిపాదనకు కేంద్రం అంగీకరించింది. ఈస్ట్ బైపాస్ భూసేకరణ నుంచి రాష్ట్ర ప్రభుత్వం తప్పుకున్నందున, పాత ప్రాజెక్టు అయిన లాజిస్టిక్ పార్కుకు 100 ఎకరాలు కేటాయించాల్సిందిగా కేంద్రం కోరింది. దీనికి అంగీకరించిన రాష్ట్ర ప్రభుత్వం లాజిస్టిక్ పార్కుకు పనికిరాని భూములు ఇచ్చింది. అమరావతిలో భూములను ప్రతిపాదించటంతో కేంద్రం తోసిపుచ్చింది. లాజిస్టిక్ పార్క్ అనేది ఎక్కడపడితే అక్కడ ఏర్పాటుచేసేది కాదు. రోడ్డు, రైలు మార్గాలకు అత్యంత దగ్గరగా ఉండాలి. రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే రోడ్డు, రైలు మార్గాలకు దూరంగా ఉన్న భూములను చూపించిందన్న విమర్శలు వచ్చాయి. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం లాజిస్టిక్ పార్క్ భూముల అంశాన్ని పక్కన పెట్టింది. దీంతో విజయవాడ తూర్పు బైపాస్ అంశాన్ని కేంద్రం పక్కన పెట్టింది. ఈ నెలలో ప్రధాని మోదీ గుర్‌గావ్ నుంచి ప్రారంభించిన ఏపీ ఎన్‌హెచ్ ప్రాజెక్టుల్లో విజయవాడ ఈస్ట్ బైపాస్‌కు చోటు లేకుండాపోయింది.

రెండు వర్గాల ఘర్షణ.. 9మంది అరెస్టు

పెనుగంచిప్రోలు, మార్చి 31 : పెనుగంచిప్రోలులో శనివారం రాత్రి రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో గుంజ యాదగిరితో పాటు ఎనిమిది మందిని అరెస్టు చేసినట్టు విజయవాడ రూరల్ డీసీపీ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం పెనుగంచిప్రోలు స్టేషన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, 28న చినతిరునాళ్ల సందర్భంగా పాగా గోపాలరావు, పాగా రాము సోదరులకు డేరంగుల యాదగిరి, మక్కుల శ్రీకాంత్‌లు ఏరా బామ్మర్ది అనటంతో వివాదం మొదలైందని, 29వ తేది రాత్రి యాదగిరి అతడి స్నేహితులు దొడ్ల ఆనంద్‌మోహన్ (బాబి)పై దాడి చేయటం, స్థానికులు సర్దిచెప్పటంతో వెళ్లిపోయారని, 30వ తేదీ శనివారం రాత్రి పెనుగంచిప్రోలు డౌన్ సెంటర్‌లో నందికోలు రాజేష్, గోపాలరావు, గేర నవీన్, ఐదుమళ్ల విగ్నేష్, మహేష్‌లపై యాదగిరి, శ్రీకాంత్, వీరయ్య, గోపి, నరసింహారావు మరికొంత మంది ఆటోలో మారణాయుధాలతో వచ్చి దాడిచేశారని వివరించారు. దాడిలో రాజేష్, గోపాలరావు, విఘ్నేశ్వర్, నవీన్‌లకు గాయాలుకాగా ప్రభుత్వాసుపత్రిలో చికిత్స తీసుకుని ఆదివారం డిశ్చార్జ్ అయ్యారని చెప్పారు. చింతల శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుంజ యాదగిరి, శ్రీకాంత్, గోపి, నరసింహారావు, గణేష్, శ్రీనివాసరావు, రాంప్రసాద్, ఉపేంద్ర, చైతన్యలను అరెస్టు చేసినట్టు చెప్పారు. సమావేశంలో ఏసీపీ రవికిరణ్, సీఐజానకీరాం, ఎస్సై రాంబాబులు పాల్గొన్నారు. గ్రామాల్లో ఎన్నికల సందర్భంగా శాంతియుత వాతావరణానికి భంగం కలిగిస్తే రౌడీషీట్లు తెరుస్తామని డీసీపీ హెచ్చరించారు.



ఆందోళనకారులకు సర్దిచెబుతున్న పోలీసులు

డౌన్ సెంటర్‌లో ఆగని ఘర్షణలు.. ఉద్రిక్తత

పెనుగంచిప్రోలు డౌన్ సెంటర్‌లో ఆదివారం రాత్రి మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఒక వర్గానికి చెందిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ సీహెచ్ ప్రవీణ్‌కుమార్ (30)పై గుంజా యాదగిరికి చెందిన కొంతమంది దాడి చేయటంతో నందికోలు రాజేష్‌కు చెందిన వర్గీయులు ఆందోళనకు దిగారు. తమపై అన్యాయంగా దాడిచేసి కొడుతున్నారని, పోలీసుల సమక్షంలోనే దాడులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రవీణ్ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి నిందితులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు సర్దిచెప్పారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	244
చికెన్ స్కిన్‌లెస్	254

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.03

శ్రీరంగనాథుని స్పృశించిన ఆదిత్యుని కిరణాలు

జగ్గయ్యపేట, మార్చి 31: పట్టణంలో పాలేటి ఒడ్డున వేంచేసియున్న రంగనాయకస్వామి దేవస్థానంలో ఆదివారం అద్భుత దృశ్యం ఆవిష్కృత మైంది. స్వామి వారిని సూర్యోదయ సమయంలో ఆదిత్యుని కిరణాలు స్వామి వారిని స్పృశించాయి. గతంలో ఎప్పుడు లేని విధంగా ధ్వజస్తంభం మీదుగా స్వామి వారి పాదాలను ఆదిత్యుని కిరణాలు స్పృశించటంతో ఆకర్షణీయంగా దర్శనమిచ్చారు. భక్తులు భారీగా దర్శనం చేసుకున్నారు.



క్రీస్తు బోధనలు ఆచరణీయం: గద్దె

కృష్ణలంక, మార్చి 31: క్రీస్తు బోధనలు మానవాళి ఆచరించదగినవని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థి గద్దె రామ్మోహన్ అన్నారు. ఆదివారం 20వ డివిజన్ డొంకరోడ్డులోని పెంతెకోస్తు చర్చి వద్ద నిర్వహించిన ఈస్టర్ ప్రార్థనల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమ్మిశెట్టి వాసులకు చర్చి ఫాదర్ జాన్ వెస్లీ ప్రార్థనలు చేశారు. క్రైస్తవులకు గద్దె, అమ్మిశెట్టి ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నాయకులు గొరిపర్తి నామేశ్వరరావు, కొడాలి సాయిబాబు, మోటేపల్లి చిన్నా, గోగుల రమేష్, పులమోలు లక్ష్మీ, మాదాల చిన్నతల్లి, చింతా వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు కొప్పూరి కిరణ్, వడ్లమూడి నాయుడు, జి.జయ, షేక్ జావెద్, బీజేపీ నాయకులు వాసా పల్లపురాజు పాల్గొన్నారు.





కృష్ణలంక డొంకరోడ్డులోని పెంతెకోస్తు చర్చి వద్ద ప్రార్థనలు చేసుకునేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ నేతలతో వచ్చిన ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, బెంజ్‌సర్కిల్ వద్ద కథెడ్రల్ చర్చిలో ఈస్టర్ ప్రార్థనల్లో పాల్గొన్న గద్దె అనురాధ

కూటమి విజయం ఖాయం: గద్దె రామ్మోహన్

రాబోయే ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి విజయకేతనం ఎగురువేయడం ఖాయమని గద్దె రామ్మోహన్ అన్నారు. జగన్ కల్లబొల్లి కబుర్లు ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. ఎన్నికల షెడ్యూల్ వస్తుందనగా డీఎస్సీ ప్రకటించి ఎన్నికల కోడ్ రావడంతో నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లినట్లైందన్నారు. జర్నలిస్టులకు మూడు సెంట్ల స్థలం ఇస్తామని చెప్పి అది కూడా ప్రభుత్వం వద్ద డబ్బులేదని ఎగ్గొట్టారన్నారు. కూటమి ప్రభుత్వమొచ్చాక తొలిసంతకం డీఎస్సీపైనే పెడతానని చంద్రబాబు ఇప్పటికే ప్రకటించారని, అన్న మాట ప్రకారం నిరుద్యోగులకు ఇచ్చిన హామీని చంద్రబాబు నెరవేరుస్తారని ఆయన అన్నారు.

ఈస్టర్ వేడుకల్లో పాల్గొన్న గద్దె అనురాధ

పటమట: ప్రేమ, ఆప్యాయతలను క్రీస్తు బోధనలు పెంపొందిస్తాయని, తుది విజయం ఎప్పుడు సత్యానిదేనని ఏసుక్రీస్తు చాటి చెప్పారని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ అన్నారు. ఈస్టర్ సందర్భంగా ఆదివారం నిర్మల స్కూల్ వద్ద ఉన్న కథెడ్రల్ చర్చి, గాయత్రినగర్ మరనాత చర్చిల్లో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆమె పాల్గొన్నారు. క్షమాగుణం, త్యాగం, కరుణ, సత్యానికి ఏసుక్రీస్తు ప్రతిరూపమని, ప్రేమ, శాంతి, అహింసా మార్గంలో మానవాళి యావత్తు నడుచుకోవాలని, క్రీస్తు చేసిన బోధనలను ప్రతీ ఒక్కరూ అనుసరించాలని కోరారు. ఏసుక్రీస్తు పునరుత్థానం చెందిన ఈస్టర్‌ను క్రైస్తవులందరూ సంతోషంగా జరపుకోవాలని కోరారు.



కార్యక్రమంలో పాల్గొన్న బాబూరావు

హామీల అమలును విస్మరించిందీ ప్రభుత్వం

● ఓటుతో వచ్చే ఎన్నికల్లో వైసీపీకి బుద్ధి చెప్పండి ● సీపీఎం నేత సీహెచ్ బాబూరావు పిలుపు

పాయకాపురం, మార్చి 31: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రానున్న ఎన్నికలో ప్రజలు ఓటు అనే ఆయుధంతో వైసీపీకి బుద్ధి చెప్పాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు పిలుపునిచ్చారు. 64వ డివిజన్ రాధానగర్‌లో ఆదివారం నిర్వహించిన మార్పు కోసం సీపీఎం కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ వెళ్లి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. తాగునీటి సమస్య, దోమల విజృంభణపై స్థానికులు బాబూరావు దృష్టికి తీసుకెళ్లారు. ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేసి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్న హామీ ఏమైందని జగన్‌ను బాబూరావు ప్రశ్నించారు. రోడ్లు, డ్రెయినేజీ, సైడ్ కాలువలు, కల్యాణ మండపాలు, స్కూల్స్ భవనాల అభివృద్ధిపై మాట తప్పిన వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కె.దుర్గారావు, జి.ఝాన్సీ, సాంబిరెడ్డి పాల్గొన్నారు.

గద్దె రామ్మోహన్ మాటల మనిషి కాదు..

చేతల మనిషి: గద్దె అనురాధ



13వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న గద్దె అనురాధ

పటమట, మార్చి 31: గద్దె రామ్మోహన్ మాటల మనిషి కాదని, చేతల మనిషి అని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ అన్నారు. ఆదివారం 13వ డివిజన్‌లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు గద్దె రామ్మోహన్, కేశినేని శివనాథ్(చిన్ని)ల విజయాన్ని కాంక్షిస్తూ ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. టీడీపీ హయాంలో గద్దె రామ్మోహన్ రూ.2630 కోట్లతో తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించారని అనురాధ తెలిపారు. ఓవర్‌హెడ్ ట్యాంకులు, కమ్యూనిటీ హాల్స్, రిటైనింగ్ వాల్, స్ట్రామ్ వాటర్ డ్రెయిన్ పనులతో పాటు మెయిన్‌రోడ్లు, సీసీ రోడ్ల నిర్మాణం టీడీపీ ప్రభుత్వంలో రామ్మోహన్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే జరిగాయని అన్నారు. 15 ఏళ్లుగా తూర్పు నియోజక వర్గంలో గద్దె రామ్మోహన్ శాంతియుత వాతావరణంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా పని చేశారని, మంచితనంతో ప్రజలకు అందుబాటులో ఉంటున్న ఆయనను ఎమ్మెల్యేగా మూడోసారి గెలిపించాలని కోరారు. కేశినేని చిన్నిని ఎంపీగా గెలిపించాలని కోరారు.



ప్రచారంలో పాల్గొన్న గద్దె రామ్మోహన్ తదితరులు

ఎన్టీఆర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యం

● తూర్పు టీడీపీ అభ్యర్థి గద్దె రామ్మోహన్

మొగల్రాజపురం, మార్చి 31: సమాజమే దేవాలయంగా ప్రజలే దేవుళ్లుగా భావించిన ఎన్టీయార్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని తాను రాజకీయాల్లోకి వచ్చానని జనసేన బిజెపి బలపరచిన తూర్పు ని యోజకవర్గ టిడిపి అభ్యర్థి గద్దె రామ్మోహన్ అన్నారు. ఆదివారం పిన్నమనేని రోడ్డులో లలితా జ్యూయలరీస్ పైన ఉన్న జిఐవి రాధామాధవ్ అపార్టుమెంట్స్ వాసులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయనతో పాటు జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ గద్దె అనూరాధ కూడా పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము నియోజకవర్గంలోని పేదలకు అవసరం ఉన్న వారికి తనవంతు సాయం చేసున్నామని చెప్పారు. ఎవరి దగ్గర ఏమీ ఆశించకుండా నిస్వార్థంగా పని చేస్తూ ప్రసాంతంగా ఉండేలా చేస్తున్నామన్నారు. వచ్చే ఎన్నికలలో గద్దె రామ్మోహన్‌కు, యంపిగా పోటీ చేస్తున్న కేశినేని శివనాద్(చిన్ని)కి సైకిల్ గుర్తు మీద ఓటేసి గెలిపించాలని అనూరాధ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వెల్లవెల చంద్రశేఖర్, ఆలూరి రాదాకృష్ణ, యలమంచిలి సాంబశివరావు, యంవి శ్రీనాద్ బాబు, ముమ్మనేని ప్రసాద్, నల్లజర్ల గణేష్ గుప్తా, మనోజ్ ముత్తా, నాగుల్ మీరా తదితరులు ఉన్నారు.

సత్ప్రవర్తనతో మెలగండి

వన్‌టౌన్, మార్చి 31: ఎన్నికల వేళ రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని వెస్ట్ డివిజన్ సహాయ పోలీస్ కమిషనర్ పి.మురళీకృష్ణారెడ్డి అన్నారు. వన్‌టౌన్, కొత్తపేట స్టేషన్ల పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. రౌడీషీటర్లపై నిత్యం నిఘా ఉంటుందని, ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. వన్‌టౌన్, కొత్తపేట సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఎట్టకేలకు రౌడీషీటర్ బంకా శివ హాజరు

ఎట్టకేలకు వైసీపీకి చెందిన రౌడీషీటర్ బంకా శివ కౌన్సెలింగ్‌కు హాజరయ్యాడు. గతం నుంచి ఇతను హాజరు కాకపోవడంతో ఆంధ్రజ్యోతిలో కథనాలు వచ్చాయి. దీంతో అతనికి ఏసీపీ వార్నింగ్ ఇచ్చారు. దీంతో హాజరయ్యారు.

రౌడీషీటర్లకు డీసీపీ కౌన్సెలింగ్

సత్యనారాయణపురం: రౌడీ, సస్పెక్ట్ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని డీసీపీ కృష్ణమూర్తి సూచించారు. సత్యనారాయణపురం స్టేషన్ పరిధిలోని సస్పెక్ట్, రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సీఐ వెంకటనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.



కౌన్సెలింగ్ ఇస్తున్న డీసీపీ కృష్ణమూర్తి

సుజనాచౌదరిని కలిసిన

టీడీపీ, జనసేన నాయకులు

వన్‌టౌన్, మార్చి 31: పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న టీడీపీ, జనసేన బలపర్చిన బీజేపీ అభ్యర్థి సుజనాచౌదరిని ఆదివారం కానూరులోని ఆయన నివాసంలో పలువురు టీడీపీ, జనసేన నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛాలిచ్చి అభినందించారు. సుజనాను కలిసినవారిలో టీడీపీ నేత వేమూరి మల్లికార్జునరావు, కోగంటి రామారావు, పరిశపోగు రాజేష్, చుంచు సురేష్, కొణిజేటి రమేష్, జనసేన నేత సముద్రాల ప్రసాద్ ఉన్నారు.



సుజనా చౌదరిని కలిసిన వేమూరి మల్లికార్జునరావు

కార్యకర్తలకు అండగా టీడీపీ : మీరా



ఆర్థికసాయం అందిస్తున్న టీడీపీ నేతలు నాగుల్‌మీరా, గుర్రం కొండ

చిట్టినగర్, మార్చి 31: కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని టీడీపీ నాయకుడు కె.నాగుల్‌మీరా భరోసా ఇచ్చారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన 46వ డివిజన్ సాయిరాం థియేటర్ ప్రాంతానికి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త సొంగ ప్రభుదాస్‌ను ఆదివారం ఆయన నివాసంలో నాగుల్‌మీరా పరామర్శించారు. వైద్యఖర్చుల నిమిత్తం రూ.10వేలు అందించారు. గుర్రం కొండ, కాజా, పోతినేడి లోకేష్, పాలవాయి దాసు, సీహెచ్ నరేష్, కొండరాయుడు, సొంగ సురేష్, జానీ, బాషా పాల్గొన్నారు.



జాబు రావాలంటే బాబు రావాలి

● ప్రజాచైతన్యయాత్రలో కేశినేని వెంకట్

సత్యనారాయణపురం, మార్చి 31: రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, యువతకు జాబ్ రావాలన్నా, జగన్ పోవాలి.. చంద్రబాబు రావాలని టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) తనయుడు కేశినేని వెంకట్ అన్నారు. 27వ డివిజన్‌లో గులాబితోట నుంచి సీతన్నపేట మీదుగా న్యూఇండియా హోటల్ సెంటర్ వరకూ ఆదివారం ఆయన ప్రజాచైతన్య యాత్ర నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని, టీడీపీ ఎన్నికల మేనిఫెస్టో కరపత్రాలు పంచారు. కూటమి అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాలను ప్రజలకు వివరించారు. రాబోయే ఎన్నికల్లో కూటమి ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని)ని భారీ మెజారీటితో గెలిపించాలని కోరారు. జగన్ ఐదేళ్లలో రాష్ట్రానికి ఒక్క కంపెనీని తీసుకురాలేదన్నారు. యువతకు సరైన ఉపాధి చూపించకపోవడంతో యువత పక్క రాష్ట్రాలకు వలసలు వెళుతున్నారని అన్నారు. యువత పెడదారి పట్టేలా రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ అమ్మకాలకు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. 28వ డివిజన్ కార్పొరేటర్ వీరమాచినేని లలిత, ఫ్లోర్ లీడర్ నెలిబండ్ల బాలస్వామి. టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

మాయమాటలతో జగన్‌రెడ్డి మోసం

దర్నాచౌక్: తన మాయమాటలతో ప్రజలను జగన్‌రెడ్డి మోసం చేశారని, ఇచ్చిన హామీలో 85 శాతం హామీలను అమలు చేయలేదని టీడీపీ యువనేత కేశినేని వెంకట్ విమర్శించారు. సెంట్రల్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ప్రజాచైతన్య యాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గొట్టుముక్కల రఘురాంరాజు, నవనీతం సాంబశివరావు, రూపకుమార్, చలమలశెట్టి శ్రీనివాసరావు, జనసేన నేత బొలిశెట్టి వంశీకృష్ణ, పాల్గొన్నారు.



గులాబీతోటలో ప్రచారం చేస్తున్న కేశినేని వెంకట్

కృష్ణవేణి ఘాట్‌లో గుర్తుతెలియని మృతదేహం

వన్‌టౌన్, మార్చి 31: కృష్ణవేణి ఘాట్ వద్ద ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం గుర్తించినట్టు కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయింది. మృతుడి వయస్సు 35 సంవత్సరాలు ఉంటుందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

విద్యాధరపురం, మార్చి 31: భవానీపురం పరిధిలోని 11కేవీ హైవే ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఈఈ టీవీ సుధాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటేశ్వర పౌండ్రీ రోడ్డు, హైవే రోడ్డు, వెంకటేశ్వర పౌండ్రీ నుంచి స్వాతి థియేటర్ వరకు, ఆశ్రమం రోడ్డు, బేతపూడి అరుణకుమారి రోడ్డు, బాజీబాబా మందిరం రోడ్డు, సభాపతి రోడ్డు, ఔట్ ఏజన్సీ, మీరాసాహెబ్ రోడ్డులో ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వన్‌టౌన్‌లోని ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్ ఫీడర్‌లైన్ల మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు పరిసర ఏడు సందుల్లో, ఆర్ఆర్ అప్పారావు వీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ తెలిపారు.

దిక్సూచి DIKSUCHI

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

కన్ను గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని ఆప్తాల్మాలజి అంటారు. కన్ను దృష్టికి సంబంధించిన జ్ఞానాంగం. పుర్రెలోని నేత్రగుళికలో కన్ను ఇమిడి ఉంటుంది. కన్నులో నేత్రగోళం, అనుబంధ నిర్మాణాలు(కనురెప్పలు, కంటి పక్ష్మాలు, కనుబొమ్మలు, అశ్రు పరికరం, వెలుపలి కండరాలు) ఉంటాయి. అశ్రు పరికరంలోని నిర్మాణాలు, కన్నీటిని ఉత్పత్తి చేస్తుంది. కన్నీటిలో లవణాలు, శ్లేష్మం, సూక్ష్మ జీవనాశక ఎంజైమ్ లైసోజోమ్ ఉంటాయి. నేత్రగుళికలో నేత్రగోళం కదలిక ఆరు కండరాల సహాయంతో జరుగుతుంది.

నేత్రగోళపు పొరలు

నేత్రగోళ కుడ్యంలో మూడు పొరలు ఉంటాయి. అవి ఒక దాని వెనక ఒకటి ఉంటాయి. అవి- 1) తంతు పటలం 2)



ప్రసరణ పటలం 3) రెటీనా

తంతు పటలం: ఇది నేత్రగోళం వెలుపలి పొర. దీని పూర్వాంతంలో కార్నియా, పరాంతంలో దృఢస్తరం(స్క్లీరా) ఉంటాయి. కార్నియా రక్తనాళరహిత పారదర్శక పొర, ఇది స్థిరకటకంగా ఉండి ఐరిస్‌ను కప్పుతుంది. కార్నియాను ఆవరించి కంజెక్టివా ఉంటుంది. నేత్రదాన ప్రక్రియలో కార్నియాను మాత్రమే సేకరిస్తారు. మృతిచెందిన వ్యక్తి నుంచి నేత్రాలను ఆరుగంటల లోపు తీసుకోవాల్సి ఉంటుంది. స్క్లీరా అనేది కంటిలోని తెల్లని భాగం. ఇది అంతర్భాగాలకు రక్షణనిస్తుంది.

ప్రసరణ పటలం: దీనిని యూవియా అని కూడా పిలుస్తారు. ఇది నేత్రగోళం మధ్యపొర. దీనిలో మూడు భాగాలుంటాయి. అవి- ఎ) కొరాయిడ్ బి) సిలియరి బాడీ సి) ఐరిస్. కొరాయిడ్ అనేది విరివిగా రక్తనాళాలతో కూడి నీలివర్ణంలో ఉంటుంది. సిలియరిబాడీలోని నునుపు కండరాలు కంటి కటకాన్ని నిర్దిష్టస్థానంలో ఉంచడానికి, కటకం ఆకారాన్ని హ్రస్వదృష్టి, దీర్ఘదృష్టికి అనుకూలంగా మార్చడానికి ఉపయోగపడతాయి. ఐరిస్ అనేది నేత్రగోళంలోని వర్ణక ప్రాంతం. ఇది కార్నియాకు కటకానికి మధ్య సస్పెండెడ్‌గా ఉంటుంది. ఐరిస్ మధ్యలో కనుపాప ఉంటుంది. ఇది కెమెరాలోని డయాఫ్రమ్‌లా పనిచేస్తుంది. రాత్రిపూట సంచరించే నిశాచర జీవుల్లో ఐరిస్ పైన పడిన కాంతి పరావర్తనం చెందడం వల్ల వాటి కళ్లు మెరుస్తాయి.

రెటీనా: ఇది నేత్రగోళంలోని లోపలిపొర. దీనిలో పిగ్మెంటెడ్ ఎపిథీలియం, నాడీప్రాంతం అనే రెండు భాగాలుంటాయి. పిగ్మెంటెడ్ ఎపిథీలియం అనేది ఒక మెలనిన్ ఆచ్ఛాదం. నాడీ ప్రాంతంలో ఫోటోరిసెప్టార్ లేయర్, బైపోలార్ సెల్ లేయర్, గాంగ్లియాన్ సెల్ లేయర్ అనే మూడు పొరలుంటాయి. ఫోటోరిసెప్టార్ లేయర్‌లో రాడ్స్, కోన్స్ అనే రెండురకాల కాంతి గ్రాహకాలు ఉంటాయి. రాడ్స్, కోన్స్ మధ్య నిష్పత్తి 15:1. రాడ్స్ అనేవి రొడాప్సిన్ అనే వర్ణకాన్ని కలిగి ఉంటాయి. రాడ్ సెల్ అతి తక్కువ కాంతిలో అనగా చీకటిలో వస్తువులను చూడటానికి పనికొస్తాయి. కానీ వివిధ రంగులను గుర్తించలేవు. కోన్ సెల్స్‌లో అయోడాప్సిన్ అనే వర్ణక పదార్థం ఉంటుంది. కోన్‌సెల్స్ కాంతివంతమైన వెలుతురులో వస్తువులను చూడటానికి ఉపయోగపడతాయి. ఇవి రంగులను గుర్తిస్తాయి. రెటీనా పరాంత మధ్య భాగాన్ని మాక్యులాల్యూటియా లేదా పసుపుచుక్క అంటారు. పసుపు చుక్కలో కోన్‌సెల్స్ అధికంగా ఉంటాయి. కంటిలో ప్రతిబింబం ఏర్పడే ప్రాంతమే ఈ పసుపు చుక్క.

నేత్రగోళం నుంచి వార్తలను మెదడుకి చేరవేసే నాడిని దృక్ నాడి అంటారు. రెటీనాతో దృక్‌నాడి కలిసే ప్రాంతాన్ని బ్లైండ్ స్పాట్ అంటారు. దీనిలో ఏవిధమైన కాంతి గ్రాహకాలు ఉండవు. అందువల్ల ఈ ప్రదేశంలో ప్రతిబింబాలు ఏర్పడవు. రెటీనాను కెమెరాలోని ఫిల్మ్‌తో పోల్చవచ్చు. నేత్రగోళ కుహరంలో ఐరిస్ వెనుక ద్వికుంభాకార కటకం ఉంటుంది. ఇది సర్దుబాటు చేసుకునే కటకం. దీనిని కెమెరాలోని కటకంతో పోలుస్తారు. చూసే వస్తువు దూరాన్ని బట్టి ఈ కటకం తన నాభ్యాంతరాన్ని మార్చుకుంటుంది. కన్ను లోపలి భాగాన్ని కటకం పూర్వాంతపు, పరాంత కక్ష్యలుగా విభజిస్తుంది. పూర్వాంతపు కక్ష్యను అక్వియస్ చాంబర్ అని, పరాంతపు కక్ష్యను విట్రియస్ చాంబర్ అని అంటారు. అక్వియస్ చాంబర్‌లోని ద్రవం కటకానికి, కార్నియాకి పోషక పదార్థాలను అందిస్తుంది. విట్రియస్ చాంబర్‌లోని ద్రవం అంతరనేత్ర ఒత్తిడిని స్థిరంగా ఉంచి నేత్రగోళం ఆకారాన్ని కాపాడుతుంది.

కన్ను పనిచేసే విధానం

కన్ను కాంతిని సేకరించి కుంభాకార కటకం ద్వారా కేంద్రీకరించి, కంటిలో వెనుక భాగాన ఉండే రెటీనాపై ప్రతిబింబాన్ని ఏర్పరుస్తుంది. కటకం వల్ల ఏర్పడే ప్రతిబింబంలో ఎడమ కుడిగాను, తలకిందులుగాను ఉంటుంది. మెదడులోని జ్ఞానకేంద్రాల్లో పటాలన్నీ సాధారణంగా తిరగబడి, తలకిందులుగా అవుతాయి. నాడీ కణాలన్నీ కట్టలా కలిసి, కంటి నుంచి దృష్టి సమాచారాన్ని మెదడుకు పంపించే దృక్ నాడిని ఏర్పరుస్తాయి. రెండు కళ్లూ సేకరించిన రెండు దృశ్యాలను కలిపి ఒక త్రిమితీయ పటంగా మెదడు తయారుచేస్తుంది. కంటిగుడ్డులో మన కంటికి కనిపించే భాగం 1/6వ వంతు మాత్రమే. కంటికి, టీవీకి మధ్యదూరం 2 1/2 మీటర్లు లేదా ఆరు అడుగులు ఉండాలి. కంటికి, పుస్తకానికి మధ్య దూరం 30 సెం.మీ. ఉండాలి. ఒక ప్రతిబింబం ముద్ర రెటీనా మీద ఉండే సమయం 1/6 సెకను మాత్రమే. కంటిచూపు లేనివారిని అంధులు అంటారు. లూయిస్ బ్రెయిలీ స్పర్శ ద్వారా చదివే బ్రెయిలీ లిపిని అంధుల కోసం కనుగొన్నారు. ఈయన ఫ్రెంచ్ దేశీయుడు. అంధుల కోసం ఆరు చుక్కల బ్రెయిలీ లిపిని ఆవిష్కరించారు.


కె. నాగశేషులు
బయాలజీ ఫ్యాకల్టీ

జమిలి ఎన్నికలు
వివిధ కమిటీల సిఫార్సులు

'జమిలి/ ఏకకాల ఎన్నికలు' అనగా లోక్‌సభ, రాష్ట్ర శాసన సభలు, పట్టణ/ గ్రామీణ స్థానిక సంస్థలన్నింటికీ ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం. అధికారపక్ష బీజేపీ మానిఫెస్టో అంశమైన జమిలి ఎన్నికల సాధ్యాసాధ్యాల పరిశీలనకు మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అధ్యక్షతన నియమించిన ఉన్నతస్థాయి కమిటీ 2024 మార్చి 14న జమిలి ఎన్నికలను సిఫార్సు చేస్తూ నివేదిక సమర్పించడంతో ఈ అంశం మరోసారి చర్చనీయాంశం అయింది.

ఈ నేపథ్యంలో రామ్‌నాథ్ కోవింద్ కమిటీ సిఫార్సులు, జమిలి ఎన్నికలపై గతంలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ, లా కమిషన్‌లు, ఎలక్షన్ కమిషన్ వెల్లడించిన అభిప్రాయాలు, జమిలి ఎన్నికల వల్ల లాభనష్టాలను పరిశీలించాల్సిన అవసరం ఉంది.

రామ్‌నాథ్ కోవింద్ కమిటీ సిఫార్సులు

ప్రభుత్వం జమిలి ఎన్నికలపై సిఫార్సుల కోసం మాజీ రాష్ట్రపతి కోవింద్ అధ్యక్షతన, ఎనిమిదిమంది సభ్యులతో ఒక ఉన్నతస్థాయి కమిటీని(హెచ్‌ఎల్‌సీ) నియమించింది. దీనినే 'వన్ నేషన్, వన్ ఎలక్షన్ కమిటీ'గా కూడా వ్యవహరిస్తారు. ఈ కమిటీకి చైర్మన్‌గా రామ్‌నాథ్ కోవింద్ ఉండగా సభ్యులుగా అమిత్‌షా(కేంద్ర హోంమినిస్టర్), హరీష్ సాల్వే(సీనియర్ అడ్వకేట్), సుభాష్ కాశ్యప్(లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్), ఎన్.కె.సింగ్(కేంద్ర 15వ ఆర్థికసంఘం మాజీ చైర్మన్), సంజయ్ కొఠారి (సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ మాజీ కమిషనర్), గులాం నబీ ఆజాద్(రాజ్యసభ మాజీ ప్రతిపక్ష నాయకుడు), అధిర్ రంజన్ చౌదరి(లోక్‌సభ కాంగ్రెస్ నాయకుడు- ఈయన కమిటీలో ఉండటానికి నిరాకరించారు) ప్రత్యేక ఆహ్వానితులుగా కేంద్ర న్యాయశాఖమంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ ఉంటారు. లా సెక్రటరీ ఈ కమిటీకి సెక్రెటరీగా వ్యవహరిస్తారు.

ఈ కమిటీ మొత్తం 65 సమావేశాలు నిర్వహించి, 18,626 పేజీల నివేదికను 2024 మార్చి 14న రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సమర్పించింది. ఈ కమిటీ జమిలి ఎన్నికలను ఏకగ్రీవంగా సమర్థిస్తూ వాటిని జరపడానికి చేపట్టాల్సిన సముచిత చర్యలు, రాజ్యాంగ సవరణలు, ఎదురుకానున్న కొన్ని కీలక సమస్యలకు పరిష్కార మార్గాలను సూచిస్తూ ఒక సమగ్ర నివేదికను రూపొందించింది.

కమిటీ సిఫార్సుల్లో ప్రధానాంశాలు

1. తొలుత లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలకు ఏకకాలంలో ఎన్నికలు జరిపి, ఈ ఎన్నికలు పూర్తయిన వందరోజుల్లోగా స్థానిక సంస్థలకు ఎన్నికలు జరపాలి.
2. ఎప్పటినుంచి జమిలి ఎన్నికలు అమల్లోకి రావాలనే విషయాన్ని సార్వత్రిక ఎన్నికలు ముగిసిన తరవాత ఎన్నికయ్యే కొత్త ప్రభుత్వం నిర్ణయిస్తుంది.
3. జమిలి ఎన్నికలను తొలిసారి జరిపేటప్పుడు ఒక అపాయింటెడ్ డేట్‌ను నిర్ణయించాలి. అప్పటికి లోక్‌సభతో పాటు అన్ని రాష్ట్రాల శాసనసభ కాలపరిమితి ముగిసినట్లు భావించవచ్చు. ఇక్కడ అయిదు సంవత్సరాల కాలపరిమితిలో హెచ్చుతగ్గులతో సంబంధం లేకుండా స్థిరీకరించవచ్చు.
4. హంగ్‌హౌస్ లేదా అవిశ్వాస తీర్మానం నెగ్గడం వంటి సందర్భాల్లో మరలా ఎన్నికలు నిర్వహిస్తారు. అయితే మిగిలిన కాలపరిమితి వరకే ఆ ప్రభుత్వాలు కొనసాగుతాయి. ఈవిధంగా కేంద్ర, రాష్ట్ర స్థాయుల్లో ప్రభుత్వాల పాలన కాలాన్ని సమాంతరం చేయవచ్చు.
5. జమిలి ఎన్నికలను ప్రవేశపెట్టడానికి కొన్ని రాజ్యాంగ ప్రకరణలను సవరించడంతోపాటు, కొన్ని అంశాలపరంగా కనీసం సగం రాష్ట్రాల ఆమోదం సాధించాల్సి ఉంటుంది. రాష్ట్రాల శాసనసభల కాలావ్యవధికి సంబంధించిన రాజ్యాంగ ప్రకరణ 172, లోక్‌సభ కాలావధికి సంబంధించిన రాజ్యాంగ ప్రకరణ 83లను సవరించాలి. అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర శాసనసభలతోపాటు స్థానిక సంస్థలకు కూడా ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు విధివిధానాలు గల ఒక కొత్త ప్రకరణను, ప్రకరణ 324కు జోడించి 324(ఎ)ను రూపొందించాలి.
6. కేంద్ర, రాష్ట్రాలకు, స్థానిక ప్రభుత్వాలకు కలిపి సంయుక్తంగా ఒకే ఓటర్ల జాబితా ఉండాలి. దానికోసం కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్లతో కలిసి 'యూనిఫైడ్ ఎలక్టోరల్ రోల్'ను ఏర్పాటుచేసి, ఒకే ఓటరు ఐడీ కార్డును జారీ చేయాల్సి ఉంటుంది. దీనికోసం రాజ్యాంగ ప్రకరణ 325లో మార్పులు చేయాల్సి ఉంటుంది. ఈ సవరణలకు కనీసం సగం రాష్ట్ర ప్రభుత్వాల మద్దతు అవసరం.



లా కమిషన్ సిఫార్సులు(2018)

1999, 2018ల్లో లా కమిషన్లు జమిలి ఎన్నికల ఆవశ్యకత గుర్తిస్తూ ఇంచుమించుగా ఒకే సిఫార్సులు చేశాయి. అవి-

- జమిలి ఎన్నికల వల్ల ప్రజాధనం ఆదా అవుతుంది. ప్రభుత్వ వర్గాలపై భద్రతా బలగాలపై పనిభారం తగ్గుతుంది.
- ప్రభుత్వ పథకాలు, పాలన నిరంతరాయంగా కొనసాగేందుకు అవకాశం ఉంటుంది.
- ప్రస్తుతం ఉన్న రాజ్యాంగంలో కనీసం అయిదు సవరణలన్నా చేయాల్సి ఉంటుంది. 50 శాతం రాష్ట్రాలు ఈ సవరణలకు ఆమోదం తెలపాలి.
- ప్రజా ప్రాతినిధ్యచట్టం(1951), లోక్‌సభ, అసెంబ్లీల నియమ నిబంధనల్లో కూడా మార్పులు తేవాలి.
- అవిశ్వాస తీర్మానాలు నెగ్గడం లేదా గడువుకు ముందే ప్రభుత్వాలు రద్దును కోరినప్పుడు మిగతా కాలం ప్రభుత్వాలు కొనసాగేందుకు ఏంచేయాలి అన్నది జమిలి విధానానికి ఉన్న ప్రధాన అవరోధం.
- ఒక ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టినప్పుడు, ఏ ప్రభుత్వం కొనసాగుతుందో చెప్పే విశ్వాస తీర్మానం కూడా నెగ్గాల్సి ఉండటం వంటి ఏర్పాట్లు ఉండాలి.

పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ, లా కమిషన్, ఎలక్షన్ కమిషన్ అభిప్రాయాలు

పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ(2015) సూచనలు

- వేర్వేరు ఎన్నికలు అధికవ్యయంతో కూడుకున్నవి.
- తరచూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి(ఎంసీసీ) అమలులోకి రావడంతో పాలసీ పెరాలసిస్(పథకాల స్తంభన) ఏర్పడుతుంది. దీనితో అత్యవసరంగా చేపట్టాల్సిన పాలన చర్యలకు అవరోధాలు కలుగుతున్నాయి.
- తరచూ ఎన్నికలతో మానవ వనరులపై అధిక పని భారం, ఒత్తిడి పెరుగుతుంది.
- జమిలి ఎన్నికలు దేశవ్యాప్తంగా ఒకేసారి కన్నా కొంత వ్యవధితో రెండు దఫాలుగా జరపడం ఆచరణ సాధ్యంగా ఉంటుంది.
- తమ కాలవ్యవధి పూర్తిచేసుకునే సమయం ఆధారంగా రాష్ట్రాలను వర్గీకరించి ఒక ఏడాదిలో రెండు దఫాలుగా తొలుత ఎన్నికలు జరపాల్సి ఉంటుంది. జమిలిని ప్రవేశపెట్టిన మొదటి సంవత్సరం పాలన కాలం కొన్ని రాష్ట్రాలకు అధికం కావచ్చు. మరికొన్ని రాష్ట్రాలకు తగ్గనూవచ్చు.
- రాష్ట్రాలపై ప్రభావం ఉంటుంది కావున కనీసం 2/3వ వంతు రాష్ట్రాల ఆమోదం కావాలి.
- అవిశ్వాస తీర్మానంతోపాటు, విశ్వాస తీర్మానం కూడా(ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని ఎన్నుకుంటూ) ఏకకాలంలో ఆమోదించేటప్పుడు ఉంటేనే జమిలి విధానం సాధ్యం.

(మిగతా రేపటి దిక్సూచిలో)


ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

ఎలక్షన్ కమిషన్ అభిప్రాయం

జమిలి ఎన్నికలకు పెద్దఎత్తున ఎలక్ట్రానిక్ ఓటింగ్ విఎషన్లు, ఓటరు వెరిఫైయబుల్ పేపర్ ఆడిట్ ట్రైల్(వీవీపీఏటీ) అవసరమవుతాయి. ప్రస్తుతం ఉన్నవాటికి అదనంగా రెండింతలు, మొత్తంగా 30 లక్షల ఈవీఎంఎస్, వీవీపీఏటీలు అవసరమవుతాయని పేర్కొంది.

అయితే జమిలి ఎన్నికలు నిర్వహించేందుకు తాము సిద్ధమేనని, ఇది ఎలక్షన్ కమిషన్‌పై గణనీయంగా భారం తగ్గిస్తుందని 2022లోనే ప్రధాన ఎలక్షన్ కమిషనర్ సుశీల్‌చంద్ర సంసిద్ధత వ్యక్తం చేశారు. నిజానికి 1983లోనే ఎలక్షన్ కమిషన్ జమిలి ఎన్నికల ప్రస్తావన తెచ్చింది. కానీ అప్పటి ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేయలేదు.

ఈ జమిలి విధానం గతంలో భారతదేశ స్వాతంత్ర్యానంతరం జరిగిన నాలుగు వరుస సార్వత్రిక ఎన్నికల్లో(1952, 1957, 1962, 1967ల్లో) పాటించారు. కారణం, అప్పటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తికాలంపాటు కొనసాగడం. కానీ, 1957లో కేరళలో అధికారంలోకి వచ్చిన వామపక్ష ప్రభుత్వాన్ని, ప్రకరణ 356ను ప్రయోగించి కేంద్రప్రభుత్వం రద్దు చేసి రాష్ట్రపతి పాలన విధించింది. 1960లో తిరిగి కేరళ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించారు. దీనితో కేంద్ర, రాష్ట్రాల్లో ఒకేసారి ఎన్నికలు నిర్వహించే విధానానికి గండిపడింది. 1967 ఎన్నికల్లో చాలా రాష్ట్రాల్లో(బిహార్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, పంజాబ్, పశ్చిమబెంగాల్, ఒరిస్సా) కాంగ్రెసేతర ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. అయితే వాటిలో చాలావరకూ పూర్తికాలం కొనసాగకుండానే రద్దవడంతో 1967 తరవాత జమిలి ఎన్నికలు సాధ్యపడలేదు.

రాష్ట్రాన్ని ఆదుకునే ఎన్నారైలపై ఇంత అక్కసా?

» కోమటి జయరామ్



అమరావతి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఆపద సమయాల్లో ఆపన్న హస్తం అందించే ఎన్నారైలపై వైసీపీ నాయకులు తీవ్ర విమర్శలు చేయడం, బెదిరింపులకు పాల్పడటం అత్యంత దారుణమని ప్రముఖ ప్రవాసాంధ్రుడు, ఎన్నారై టీడీపీ అమెరికా కోఆర్డినేటర్ కోమటి జయరామ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ప్రవాస భారతీయులు ఎన్నికల సమయంలో వచ్చి గ్రామాల్లో గొడవలు సృష్టిస్తే మాత్రం.. వారు ఏ దేశాల నుంచి వచ్చారో తిరిగి అక్కడికి వెళ్లడానికి వీల్లేకుండా చేస్తాం' అంటూ బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి వరకూటి అశోక్‌బాబు చేసిన బెదిరింపు వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఏపీకి అన్ని విధాలా సాయం చేస్తున్న ఎన్నారైలను ఇలాంటి వ్యాఖ్యలతో అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి బెదిరింపులకు పాల్పడుతున్న అశోక్‌బాబుపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏ దేశమేగినా ఎందు కాలిడినా పొగడరా నీజాతి నిండు గౌరవమూ అన్న గురజాడ స్ఫూర్తిని అణువణువునా నింపుకొన్న ప్రవాసాంధ్రులు విభజిత ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి తమ వంతు కర్తవ్యంగా అనేక కార్యక్రమాలు చేస్తున్నారని, నిధులు ఇస్తున్నారని, పాఠశాలలను దత్తత తీసుకుంటున్నారని తెలిపారు. పల్లెల్లో వైద్య, ఆరోగ్య సేవలను మెరుగుపరుస్తున్నారని, పన్నులు కూడా కడుతున్నారని పేర్కొన్నారు. పరిశ్రమల స్థాపన ద్వారా రాష్ట్రంలోని నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారని, విద్యను అందిస్తున్నారని తెలిపారు. కరోనా సమయంలో ప్రభుత్వానికి సమాంతరంగా అనేక కార్యక్రమాలు చేపట్టి రోగులను ఆదుకున్నారని వివరించారు.

రేపు తిరుమలలో వీఐపీ బ్రేక్ దర్శనం రద్దు


తిరుమల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో మంగళవారం శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ నెల తొమ్మిదో తేదీన ఉగాది ఆస్థానం సందర్భంగా మంగళవారం శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం (ఆలయ శుద్ధి) నిర్వహించనున్నారు. ఉదయం 6 నుంచి 11 గంటల వరకు ఈ కార్యక్రమం జరగనుండటంతో వీఐపీ బ్రేక్‌ను టీటీడీ రద్దు చేసింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఇప్పటికే ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను రద్దు చేసిన విషయం తెలిసిందే. ప్రొటోకాల్ పరిధిలో స్వయంగా వచ్చే వీఐపీలకు, ట్రస్టు దాతలకు మాత్రమే బ్రేక్ దర్శన టికెట్లను జారీ చేస్తున్నారు. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నేపథ్యంలో వీటిని కూడా రద్దు చేస్తున్నట్టు టీటీడీ తెలిపింది.

15 రోజుల్లో శ్రీవాణి ట్రస్టుకు 22.75 కోట్లు

ఎన్నికల కోడ్ నేపథ్యంలో తిరుమల శ్రీవారి శ్రీవాణి ట్రస్టుకు గడిచిన 15 రోజుల్లో రూ.22.75 కోట్ల విరాళాలు అందాయి. ఎన్నికల కోడ్ కారణంగా మార్చి 16వ తేదీ నుంచి వీఐపీ బ్రేక్ సిఫారసు లేఖలను టీటీడీ రద్దు చేసింది. ఈ క్రమంలో శ్రీవాణి ట్రస్టుకు రూ.10 వేల విరాళం అందించి రూ.500 బ్రేక్ దర్శన టికెట్లను కొనుగోలు చేసే వారి సంఖ్య పెరిగింది. తిరుమలలో ఇచ్చే ఆఫ్‌లైన్ కోటా కూడా పెంచి కౌంటర్లను రెండు నుంచి నాలుగుకు పెంచారు. దీంతో 15 రోజుల్లో 22,752 శ్రీవాణి టికెట్లను కొనుగోలు చేయగా, రూ.22.75 కోట్లు ట్రస్టుకు జమయ్యాయి.

సైబర్ బానిసలు!
కంబోడియాలో దుర్భర స్థితిలో 5000 మంది భారతీయులు

న్యూఢిల్లీ, మార్చి 31: "మీ పేరు మీద విదేశాల నుంచి ఒక పార్శిల్ వచ్చింది. దానికి ఆ పన్నులు కట్టాలి.. ఈ పన్నులు కట్టాలి" అంటూ రూ.లక్షల్లో, రూ.కోట్లల్లో దోచుకునే సైబర్ స్కామ్‌ల గురించి వినే ఉంటారు! ఈ తరహా సైబర్ కుంభకోణాల బాధితులైతే.. తమకు కాల్ చేసి బెదిరించినవారిని దారుణంగా తిట్టుకుంటారు. కానీ.. ఈ దందాలో భాగస్వాములై అమాయకులకు కాల్ చేస్తున్నవారిలోనూ కొందరు బాధితులు ఉంటారని తెలుసా? కంబోడియా కేంద్రంగా సాగుతున్న ఈ తరహా సైబర్ ఫ్రాడ్ ఇందుకు నిదర్శనం. కేవలం ఈ ఫ్రాడ్ చేయడం కోసమే.. ఉద్యోగావకాశాల పేరుతో భారతీయులకు ఎర వేసి, వారిని అక్కడికి తరలించి.. వారితో సైబర్ ఫ్రాడ్‌లు చేయిస్తూ.. చేయనంటే కరెంటు షాకులతో దారుణంగా హింసిస్తున్న దందా ఇది. దాదాపు 5000 మంది భారతీయులు ఈ మాఫియా చేతికి చిక్కి.. రోజుకు 12 గంటలకు పైగా పనిచేస్తూ దుర్భరపరిస్థితుల్లో జీవితం గడుపుతున్నట్టు కంబోడియాలోని భారతీయ రాయబార కార్యాలయానికి ఇటీవలికాలంలో ఫిర్యాదులు అందాయి. దీంతో.. అక్కడున్న మనవారిని కాపాడి, ఇక్కడికి తీసుకొచ్చేందుకు కంబోడియా, భారతదేశ ప్రభుత్వాలు ఉమ్మడి ఆపరేషన్ చేపట్టాయి. ఈ విషయాన్ని మన విదేశాంగ శాఖ ఒక ప్రకటన ద్వారా వెల్లడించింది. "ఉద్యోగావకాశాల పేరుతో తమను ప్రలోభపెట్టి.. తీరా కంబోడియాకు తీసుకొచ్చాక సైబర్ నేరాలు చేయాలంటూ తమపై ఒత్తిడి తెస్తున్నారంటూ బాధితులు కంబోడియాలోని మా రాయబార కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. మీడియా కథనాల ద్వారా కూడా కంబోడియాలోని భారతీయుల దుస్థితి గురించి మా దృష్టికి వచ్చింది." అని విదేశాంగ శాఖ ఆ ప్రకటనలో వివరించింది. ఇప్పటిదాకా ఆ మాఫియా నుంచి 250 మంది భారతీయులను కాపాడి, మనదేశానికి తరలించినట్టు వెల్లడించింది. ఉద్యోగాల కోసం కంబోడియాకు వెళ్లి సైబర్ మాఫియా వలకు చిక్కిన మనోళ్ల పని.. అక్కణ్నుంచీ ఇక్కడికి ఫోన్ చేసి భారతీయులను మోసగించడమే. "మీకు ఫలానా దేశం నుంచి ఒక పార్శిల్ వచ్చింది. దాంట్లో మాదక ద్రవ్యాలు ఉన్నాయి (లేదా) అనుమానాస్పద వస్తువులు ఉన్నాయి. ఈడీ/ సీబీఐ/ఐటీ అధికారులు మీ మీద నిఘా పెట్టారు. మీరు అర్జెంటుగా జరిమానా/పన్ను చెల్లించాలి. అలా చెల్లించకపోతే అధికారులు మిమ్మల్ని అరెస్ట్ చేస్తారు" అంటూ బెదిరించడమే. ఆ బెదిరింపులకు భయపడిన చాలా మంది.. వారు అడిగిన డబ్బులు చెల్లిస్తున్నట్టు నిత్యం వార్తల్లో చూస్తూనే ఉన్నాం. ఇలా ఆ ముఠా.. గడిచిన ఆరు నెలల వ్యవధిలోనే మన భారతీయులను మనపైనే ప్రయోగించి అక్షరాలా 500 కోట్ల రూపాయలను అన్యాయంగా కాజేసినట్టు వెల్లడైంది.



మోసం ఇలా..

భారత ప్రభుత్వం ఈ ముఠా నుంచి కాపాడినవారిలో స్టీఫెన్ అనే వ్యక్తి ఉన్నాడు. ఈ దందా ఎలా జరుగుతోందో అతడు వివరంగా అధికారులకు తెలిపాడు. "నేను ఐటీఐ చేశాను. కరోనా సమయంలో ఉద్యోగాన్వేషణలో ఉంటే మంగళూరు నుంచి ఒక ఏజెంట్ నన్ను సంప్రదించాడు. కంబోడియాలో డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగం ఉందని చెప్పాడు. సరేనన్నాను. నాతో పాటు.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బాబూరావు అనే వ్యక్తిని కూడా కంబోడియాకు తీసుకెళ్లాడా ఏజెంటు. ఎయిర్‌పోర్టులో ఇమిగ్రేషన్ సమయంలో.. మేం ముగ్గురం టూరిస్టు వీసా మీద వెళ్తున్నట్టు చెప్పాడు. అప్పుడే నాకు అనుమానం వచ్చింది. కానీ ఏమీ అనలేదు. కంబోడియాకు చేరుకున్నాక మమ్మల్ని ఒక ఆఫీసుకు తీసుకెళ్లాడు. అక్కడ మమ్మల్ని ఇంటర్వ్యూ చేశారు. అక్కడి బాస్ ఒక చైనీయుడు. వారు మా టైపింగ్ స్పీడ్‌ను పరీక్షించారు. కానీ.. మా ఉద్యోగం డేటా ఎంట్రీ కాదని.. నిత్యం ఫేస్‌బుక్ ప్రొఫైల్స్ చెక్ చేసి.. సైబర్ ఫ్రాడ్‌లకు లొంగిపోయే బలహీన మనస్తత్వం ఉన్నవారెవరో గుర్తించడమే మా ఉద్యోగమని ఆ తర్వాత తెలిసింది. మేం మహిళల పేరుతో, ఫొటోలతో ఫేక్ సోషల్ మీడియా ఖాతాలను తెరవాలి. డేటింగ్ యాప్స్ ద్వారా.. బలహీనులకు వలవేయాలి. వారు మా వలలో పడ్డాక క్రిప్టో కరెన్సీ ట్రేడింగ్ పేరుతోనో, వారి పేరు మీద ఇండియాకి ఏవో వస్తువులను పంపిస్తున్నామనో ముగ్గులోకి లాగాలి. ఆ తర్వాత మరి కొందరు రంగంలోకి దిగుతారు. వలలో పడ్డవారికి దర్యాప్తు ఏజెన్సీ అధికారుల పేర్లతో ఫోన్లు చేసి డబ్బులు పిండుతారు. ఈ దందా చేసే దంతా చైనీయులే" అని స్టీఫెన్ వివరించాడు. తమకు రోజువారీ లక్ష్యాలు విధిస్తారని.. ఆ లక్ష్యాలను అందుకోలేకపోతే శిక్ష విధిస్తారని.. టార్గెట్ సాధించే దాకా తిండి పెట్టకుండా, తమ గదికి వెళ్లి విశ్రాంతి తీసుకోనివ్వకుండా హింసిస్తారని వాపోయాడు. కంబోడియాకు వెళ్లి ఉద్యోగంలో చేరగానే వారి పాస్‌పోర్టులను సైబర్ ఫ్రాడ్ ముఠా తీసేసుకోవడంతో.. వారు అక్కణ్నుంచీ బయటపడడం కష్టమవుతోందని ఒడిశా పోలీసులు వివరించారు. సైబర్ నేరగాళ్లు చెప్పిన పని చేయడానికి మనవాళ్లు నిరాకరిస్తే వారిపై దాడి చేయడం, కరెంటు షాకులివ్వడం వంటి దారుణాలకు పాల్పడుతున్నారని.. వారిని ఒంటరిగా గదుల్లో బంధిస్తున్నారని ఈ కేసును దర్యాప్తు చేసిన ఒడిశా పోలీసు అధికారి ఉపాసన తెలిపారు. అక్కడ ఇలా చిక్కుకున్న భారతీయుల వివరాలను గుర్తించి వారిని వెనక్కి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని ఆమె వివరించారు.

బాధితుడి ఫిర్యాదుతో..

కేంద్ర ప్రభుత్వ సీనియర్ ఉద్యోగి ఒకరు గత ఏడాది ఈ మాఫియా బారిన పడి రూ.67 లక్షలు పోగొట్టుకున్నారు. ఆయన ఫిర్యాదు మేరకు ఈ కేసును దర్యాప్తు చేసిన ఒడిశా పోలీసులు.. ఈ దందా అంతా కంబోడియా నుంచి జరుగుతున్నట్టు గుర్తించారు. ఉద్యోగాల పేరుతో ఇక్కణ్నుంచీ అక్కడికి మనోళ్లను తరలిస్తున్న ఎనిమిది మందిని గత ఏడాది డిసెంబరు 30న అరెస్టు చేశారు. ఆ ఎనిమిది మందీ ఒకే ప్రాంతానికి చెందినవారు కాదు. వారంతా దేశంలోని వేర్వేరు ప్రాంతాలకు చెందినవారు కావడం గమనార్హం. వారిచ్చిన సమాచారం ఆధారంగా ఒడిశా పోలీసులు మరో 16 మందిపై లుకౌట్ నోటీసులు జారీ చేశారు. ఆ లుకౌట్ నోటీసుల ఆధారంగా ఇమ్మిగ్రేషన్ బ్యూరో అధికారులు.. కంబోడియా నుంచి హైదరాబాద్‌కు చేరుకున్న హరీశ్ కూరపాటి, నాగవెంకట సౌజన్య కూరపాటి అనే ఇద్దరిని ఎయిర్‌పోర్టులో అదుపులోకి తీసుకున్నారు.

కడప తహశీల్దార్ శివప్రసాద్ అరెస్టు
14 రోజుల రిమాండ్

తిరుపతి క్రైం, మార్చి 31: ఆదాయానికి మించి దాదాపు రూ.70 కోట్ల చర, స్థిరాస్తులు కూడబెట్టిన కేసులో కడప తహశీల్దార్ సిద్దాల శివప్రసాద్‌ను విజయవాడ సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ అధికారులు ఆదివారం అరెస్టు చేశారని ఏసీబీ ఏఎస్పీ సౌమ్యలత తెలిపారు. ఆయనకు నెల్లూరు ఏసీబీ కోర్టు 14 రోజుల పాటు రిమాండ్ విధించిందని తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తహశీల్దారుగా పనిచేసిన శివప్రసాద్ అనతికాలంలోనే కోట్లకు అధిపతిగా ఎదిగారు. తిరుపతి, రేణిగుంట, కడప ప్రాంతాల్లో కోట్లాది రూపాయల విలువ చేసే భూములు, మాల్స్, ప్లాట్స్, భవనాలు, అపార్టుమెంట్లు సమకూర్చుకున్నారు. దీనిపై ఫిర్యాదులు అందడంతో విజయవాడ అవినీతి నిరోధక శాఖలోని సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ బృందం శనివారం రంగంలోకి దిగింది. పీలేరు, తిరుపతి, రేణిగుంట, బంగారుపాళెం, కడప ప్రాంతాల్లో సోదాలు చేశారు. ఈ సోదాల్లో దాదాపు రూ.70 కోట్ల స్థిర, చరాస్తులు ఉన్నట్టు గుర్తించారు. తాజాగా.. రాష్ట్రంలోని అన్ని జాతీయ బ్యాంకులకు ఏసీబీ అధికారులు లేఖలు రాశారు. శివప్రసాద్, ఆయన భార్య మాధవి, బంధువులు, బినామీ పేర్లతో ఎక్కడైనా అకౌంట్లు ఉంటే వెంటనే లావాదేవీలు ఆపి.. ఖాతాలను సీజ్ చేయాలని ఆ లేఖలో పేర్కొన్నారు. అలాగే సోమవారం నుంచి బ్యాంకు లాకర్లు పరిశీలించడానికి ఏసీబీ అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే తహసీల్దార్‌కి సంబంధించిన బినామీల జాబితాను తెప్పించుకున్న ఏసీబీ అధికారులు తనిఖీలు చేయడానికి చర్యలు చేపట్టారు.


ప్రచార రథంపై ప్రభుత్వ సలహాదారు కర్నాటి ప్రభాకర్‌రెడ్డి, వైసీపీ నేతల బైక్ ర్యాలీలో పాల్గొన్న ఫీల్డ్ అసిస్టెంట్ (సర్కిల్‌లో)

కోడ్ ఉన్నా.. డోంట్‌కేర్!

» వైసీపీ ప్రచారంలో ప్రభుత్వ సలహాదారు
» మారని కొంతమంది ఉద్యోగుల తీరు
» రాజీనామా చేసి రావాలని వలంటీర్లపై ఒత్తిడి
» సాయిరెడ్డి ర్యాలీలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్

వరికుంటపాడు/ ఉదయగిరి రూరల్/ బిట్రగుంట(దగదర్తి), మార్చి 31: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులు ఇప్పటికీ వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటూనే ఉన్నారు. ఇలాంటివారిపై ఫిర్యాదులు అందిన వెంటనే ఎన్నికల సంఘం అధికారులు చర్యలు తీసుకుని, విధుల నుంచి సస్పెండ్ చేస్తున్నా ఉద్యోగుల్లో మాత్రం ఎలాంటి మార్పు కనిపించడం లేదు. ఆదివారం నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి వరికుంటపాడు మండలంలో 'విజయసంకల్ప యాత్ర' పేరుతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దీనిలో పలువురు ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు. అలాగే ఏపీ రైతు సాధికారిత సంస్థ ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు కర్నాటి ప్రభాకర్‌రెడ్డి ఏకంగా ప్రభుత్వం కేటాయించిన వాహనం ఎక్కి దారి పొడవునా ర్యాలీలో పాల్గొన్నారు. అలాగే, వింజమూరు మండలం నందిగుంట ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు జక్కం మోహన్‌రెడ్డి సైతం ప్రచారంలో పాల్గొన్నారు. ఇటీవల నిబంధనలు ఉల్లంఘించిన తూర్పుకొండారెడ్డిపల్లి ఫీల్డ్ అసిస్టెంట్ చెంచురెడ్డిని విధుల నుంచి తొలగించినా ఆయన ఏమాత్రం భయం లేకుండా మళ్లీ ప్రచారంలో పాల్గొన్నారు.

వలంటీర్లపై ఒత్తిడి

రాజీనామా చేసి వైసీపీ ప్రచారంలో పాల్గొనాలని అధికార పార్టీ నేతలు గ్రామ/వార్డు వలంటీర్లపై ఒత్తిడి తెస్తున్నారు. వైసీపీ మరోసారి అధికారంలోకి రాగానే మీరే వలంటీర్లుగా ఉంటారని వారికి భరోసా ఇస్తున్నారు. అయినప్పటికీ కొందరు వలంటీర్లు జంకుతున్నారు. కాగా, నెల్లూరు జిల్లా దగదర్తి మండలంలో ఆదివారం వైసీపీ నేతల ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీలో రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, విజయసాయిరెడ్డి పాల్గొన్నారు. వారి వెనుకే వెలుపోడు పంచాయతీ కామినేనిపాలెం ప్రాంతానికి చెందిన ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ కామినేని నాగరాజు కూడా పాల్గొన్నారు. ఈ విషయాన్ని కొందరు స్థానికులు మండల, డివిజన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

భర్త మర్మాంగంపై మరిగే నీళ్లు..!

» కుటుంబ కలహాలతో హత్యాయత్నం చేసిన భార్య

వినుకొండటౌన్, మార్చి 31: నిద్రిస్తున్న భర్త మర్మాంగంపై సలసల మరిగే నీటిని పోసి భార్య హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన పల్నాడు జిల్లా వినుకొండలో ఆదివారం తెల్లవారుజామున జరిగింది. బాధితుడి కథనం మేరకు ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం గ్రామానికి చెందిన నాయిని ప్రభుదాస్, అతని భార్య అనూష గత కొన్ని రోజులుగా వినుకొండ పట్టణంలోని హనుమాన్ నగర్ 13వ లైన్‌లో నివాసం ఉంటున్నారు. కుటుంబ కలహాలతో కొంతకాలంగా వేర్వేరుగా జీవనం సాగిస్తున్నారు. పెద్ద మనుషులు సర్దిచెప్పి కాపురానికి పంపించారు. వారంరోజుల క్రితం కాపురానికి వచ్చిన భార్య ఆమె తల్లిదండ్రులతో కలిసి సలసల మరిగే నీరు పోసి హత్యాయత్నానికి పాల్పడినట్టు ప్రభుదాస్ తెలిపాడు. తీవ్రంగా గాయపడిన బాధితుడిని ప్రైవేట్ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

శ్రీశక్తి



సౌరశక్తికి బ్రాండ్ అంబాసిడర్

అమెరికాలో ఉన్నత చదువు... ప్రముఖ కంపెనీలో కొలువు... ఇవేవీ ఆమెకు సంతృప్తినివ్వలేదు. అందుకే మాతృభూమికి తిరిగివచ్చి... అంకుర సంస్థ ఒకటి నెలకొల్పారు. సౌర విద్యుత్‌ను కొత్త పుంతలు తొక్కించి... దానికి బ్రాండ్ ఇమేజ్‌ను తీసుకువచ్చారు. దేశం నలుమూలలా సేవలు విస్తరించి... అనతి కాలంలోనే కంపెనీని వంద కోట్ల టర్నోవర్‌కు తీసుకువెళ్లారు. 'ఫ్రేయర్ ఎనర్జీ' రూఫ్‌టాప్ సోలార్ కంపెనీ సహవ్యవస్థాపకురాలు రాధిక చౌదరి విజయప్రస్థానం 'నవ్య'కు ప్రత్యేకం.

"జీరో కరెంట్ బిల్... ఈ లక్ష్యంతోనే మా 'ఫ్రేయర్ ఎనర్జీ' సోలార్ కంపెనీ పుట్టింది. కంపెనీ ప్రారంభించేనాటికి నాకు మూడేళ్ల బాబు ఉన్నాడు. మా కుటుంబ స్నేహితుడు సౌరబ్ మర్దా, నేను కలిసి 2014లో దీన్ని నెలకొల్పాం. ఇళ్లకు, చిన్నపాటి వ్యాపార సంస్థలు, పరిశ్రమలకు సోలార్ పవర్ సిస్టమ్స్ అమర్చే కంపెనీ మాది. ఒక్కసారి పెట్టుబడి పెడితే సరిపోతుంది. మేం అందించే సోలార్ ప్యానల్స్ జీవిత కాలం... పాతికేళ్లు. ఈ మధ్యలో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తినా మేమే పరిష్కరిస్తాం. దాని కోసం ఒక యాప్‌ను తెచ్చాం. ఎంత విద్యుత్‌చ్ఛక్తి ఉత్పత్తి అయింది, ఎంత ఖర్చయింది తదితర వివరాలన్నీ ఆ యాప్‌లోనే చూసుకోవచ్చు. ఒకవేళ ఉత్పత్తి తగ్గితే దానికి గల కారణాలు ఏంటనేది కనుగొని చెబుతాం. వినియోగదారులకు ఒకేసారి భారం కాకుండా ఫైనాన్స్ సదుపాయం కూడా కల్పిస్తున్నాం. మొత్తం పెట్టుబడిలో కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ కూడా ఇస్తోంది.

అమెరికా నుంచి వచ్చాక...

సోలార్ కంపెనీ ఒకటి పెట్టాలన్న ఆలోచన నాకైతే లేదు. నేను పుట్టి పెరిగిందంతా హైదరాబాద్‌లోనే. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తయ్యాక 2004లో అమెరికా వెళ్లాను. అక్కడి 'పర్డ్యూ యూనివర్సిటీ'లో న్యూక్లియర్ ఇంజనీరింగ్‌లో మాస్టర్స్ చదివాను. 'జనరల్ ఎలక్ట్రికల్స్'లో ఆరు నెలలు ఇంటర్న్‌షిప్ తరువాత 'ఎస్‌కేఎఫ్ యూఎస్‌ఏ ఇంక్'లో విండ్ ఎనర్జీకి సంబంధించి అప్లికేషన్ ఇంజనీర్‌గా రెండేళ్లకు పైగా పని చేశాను. అయితే ఎందుకో అమెరికాలో ఉద్యోగం నాకు సంతృప్తినివ్వలేదు. దాంతో 2008లో భారత్‌కు వచ్చేశాను. ఇక్కడి 'ల్యాంకో విండ్ పవర్'లో ఏజీఎంగా కొత్త ఉద్యోగం మొదలుపెట్టాను. అక్కడి నుంచి 'ల్యాంకో సోలార్ ప్రైవేట్ లిమిటెడ్'లో డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా, తరువాత మరో రెండు కంపెనీల్లో వివిధ హోదాల్లో పని చేశాను.



అవగాహన అవసరం...

మహిళలు ఎవరైనా సరే వ్యాపార రంగంలోకి రావాలంటే ముఖ్యంగా కావల్సింది అన్ని విషయాలపై అవగాహన. అదే ఉద్యోగం అయితే... కోడింగ్ అనో, టెస్టింగ్ టూల్స్ అనో సంబంధిత సబ్జెక్ట్‌పై పట్టు ఉంటే సరిపోతుంది. కానీ బిజినెస్‌లో అలా కుదరదు. సమర్థవంతమైన టీమ్‌ను పెట్టుకోవాలి. అకౌంట్స్, ఫైనాన్స్ ఫండ్ రైజింగ్, లీగల్, కాంట్రాక్ట్ తదితర అంశాలపై కనీస అవగాహన ఉండాలి. అందరినీ కలుపుకొని పోయే తత్వం కావాలి. అలాంటివారే ముందుకు వెళ్లగలుగుతారు.

అలా మొదలైంది...

వ్యాపారం ఒకటి ప్రారంభించాలన్న ఆలోచన సౌరబ్‌ది. ఆయన అమెరికాలో చదువుకొని తిరిగి వచ్చాక... సోలార్ ఎనర్జీకి సంబంధించి నాకున్న అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని అటు వైపు ఆలోచించమన్నారు. నాకు కూడా ఆ రంగంలో మంచి అనుభవం, నెట్‌వర్క్, రిలేషన్‌షిప్స్ ఉండడంతో ఓకే అన్నాను. రాబోయే రోజుల్లో ఈ రంగానికి భారత్‌లో మంచి భవిష్యత్తు ఉందనిపించింది. ఎందుకంటే పదేళ్ల కిందట మా కంపెనీ ప్రారంభించే నాటికి సౌర విద్యుత్ రంగంలో అభివృద్ధి చాలా పరిమితం. అదీకాకుండా ఫలానా కంపెనీ నంబర్ వన్ అనేది లేదు. ఏ ప్రాంతంలోని వ్యాపారులు ఆ ప్రాంతానికే పరిమితమయ్యేవారు. ఉదాహరణకు వరంగల్‌లోనివారు హైదరాబాద్‌లో ఇన్‌స్టాల్ చేసేవారు కాదు. అలాగే హైదరాబాద్‌వారు మరో నగరానికి వెళ్లరు. సోలార్ ఎనర్జీకి సంబంధించి ఒక బ్రాండ్ అంటూ లేదు. ఎక్కడివాళ్లు అక్కడే ఉండేవారు. ఇవన్నీ బేరీజు వేసుకొని... కంపెనీ ప్రారంభించాం. ఏకరూపత తీసుకువచ్చాం. అంటే హైదరాబాద్‌లో వినియోగదారుడు మా ద్వారా ఎలాంటి సేవలు పొందుతారో... ఈశాన్య రాష్ట్రాల్లోనివారికి కూడా అంతే నాణ్యమైన, కచ్చితమైన సేవలు అందుతాయి. అదే సమయంలో ధర అందుబాటులో ఉండేలా చూసుకొంటున్నాం.

కోటి నుంచి వంద కోట్లకు...

భారత్‌లో సోలార్ ప్యానల్స్ తయారు చేసే మంచి కంపెనీలు చాలా ఉన్నాయి. మాకు ఎలా కావాలో చెప్పి తయారు చేయించుకొంటాం. ప్రధానంగా మాది ఇంజనీరింగ్, డిజైనింగ్, ప్రొక్యూర్‌మెంట్, ఇన్‌స్టాలేషన్, సర్వీస్. వారంటీ సర్టిఫికెట్‌తో సహా అన్నీ పక్కాగా ఉంటాయి మా దగ్గర. అందుకే ఇవాళ భారత్‌లోనే నంబర్ వన్ కంపెనీగా నిలవగలిగాం. కోటి రూపాయలు బ్యాంకు రుణంతో మొదలుపెట్టిన మా కంపెనీ టర్నోవర్ నేడు దాదాపు వందట కోట్లకు చేరిందంటే కారణం... మాపై వినియోగదారులకు ఉన్న నమ్మకం.

ఎలా పని చేస్తుందంటే...

ఇంటిపైన సోలార్ ప్యానల్స్ బిగిస్తాం. వాటిపై నీడ పడకూడదు. దీని నుంచి వెలువడే డీసీ పవర్ ఇంటికి ఉపయోగించే ఏసీ పవర్‌గా మారుతుంది. లైట్ల నుంచి ఏసీల వరకు అన్నిటికీ ఉపయోగించుకోవచ్చు. ఒకవేళ మన అవసరానికి మించి విద్యుత్ ఉత్పత్తి అయితే, విగిలింది గ్రిడ్‌కు వెళుతుంది. అప్పుడు ప్రభుత్వం ఫలానా ఇంటి నుంచి ఇన్ని యూనిట్లు వచ్చాయని లెక్క కడుతుంది. ఉదాహరణకు ఒక విల్లాకు కరెంటు బిల్లు నెలకు మూడు వేలు వస్తుందనుకోండి. అలా ఏడాదికి 36 వేలు. దీన్ని జీరో బిల్ చేసుకోవాలంటే 3కేవీ సోలార్ సిస్టమ్ పెట్టుకోవాలి. దానికి అయ్యే పెట్టుబడి రెండున్నర లక్షలు. ఎక్విప్‌మెంట్, ఇన్‌స్టాలేషన్ కలిపి. ప్రభుత్వం నుంచి 78 వేలు సబ్సిడీ నేరుగా వినియోగదారుడి ఖాతాలో జమ అవుతుంది. నాలుగేళ్లలో పెట్టింది వెనక్కి వచ్చేస్తుంది. అపార్ట్‌మెంట్లలో కామన్ ఏరియాలో ఉపయోగించే మోటార్లు, లైట్లు, పంపులకు సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేసుకోవచ్చు. అయితే వ్యక్తిగతంగా ఫ్లాట్లలో అమర్చుకొనే సౌకర్యం ఇంకా మన దేశంలో అందుబాటులోకి రాలేదు. కానీ ఇతర దేశాలతో పోల్చితే సౌర విద్యుత్ రంగం భారత్‌లోనే అభివృద్ధి దిశగా సాగుతోంది.

అంత సులువు కాదు...

మా ప్రధాన కార్యాలయం హైదరాబాద్‌లోనే ఉంది. దేశంలోని 26 రాష్ట్రాల్లో సేవలు అందిస్తున్నాం. ప్రస్తుతం మా సంస్థలో మూడొందల మంది పని చేస్తున్నారు. వారిలో ముప్పై శాతం మహిళలు. ఒక అంకుర సంస్థగా ప్రారంభమైన మా ప్రయాణం ఇవాళ ఇంతమందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగిందంటే ఎంతో సంతోషంగా ఉంది. పారిశ్రామికవేత్తగా రాణించాలంటే నిత్యం ఎన్నో సవాళ్లు, ఇబ్బందులు ఎదురవుతాయి. ముఖ్యంగా ఒక మహిళగా ప్రత్యేకమైన సమస్యలు ఉంటాయి. నాకు ఇద్దరు పిల్లలు. అన్నీ బాగున్న రోజు ఇబ్బందేమీ అనిపించదు. కానీ ఇల్లు, పిల్లలు, వ్యాపారం... అన్ని బాధ్యతలనూ సమర్థవంతంగా నిర్వర్తించడం అంత సులువు కాదు. అందుకు కుటుంబ సహకారం తప్పనిసరి. నేను అమెరికా నుంచి తిరిగి రావడానికి అది కూడా ఒక కారణం... ఇక్కడైతే మా కుటుంబం మద్దతు ఉంటుందని. ఆ విషయంలో నేను అదృష్టవంతురాలిని. అందరికీ ఆ అవకాశం ఉండదు. అలాగే ఒక బిజినెస్‌లో ప్రధానంగా వచ్చే సమస్య... భాగస్వాముల మధ్య, ఉద్యోగుల మధ్య విబేధాలు. మార్కెట్‌లో ఒక ఉత్పత్తి అమ్మాలంటే ఎన్నో వ్యయప్రయాసలు పడాలి. కొన్నిసార్లు మన ఆలోచన, అన్నీ బాగుంటాయి. కానీ మార్కెటింగ్ పరంగా ఆశించిన ఫలితాలు రావు. అన్నిటికంటే పెద్ద సమస్య... వినియోగదారులను ఎలా ఆకట్టుకోవాలి అనేది. కొన్నిసార్లు ఏ ప్రాజెక్ట్‌ను చేపట్టాలి? పెద్దదా? చిన్నదా? అనేదానిపై సరైన అవగాహన లేకపోతే ఇబ్బందులు ఎదురవుతాయి. అయితే మొదటి నుంచీ సౌరబ్‌కు... నాకు మధ్య మంచి అవగాహన ఉంది. అందువల్లే ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కోగలుగుతున్నాం. ముఖ్యంగా సరైన టీమ్‌ను నిర్మించుకోవడానికి మాకు చాలా సమయం పట్టింది. ప్రస్తుతం మా కంపెనీకి సంబంధించి మార్కెటింగ్, స్ట్రేటజీస్, యాప్ డెవలప్‌మెంట్ నేను చూసుకొంటున్నా. ఫైనాన్స్, ఆపరేషన్స్, సేల్స్ బాధ్యతలు సౌరబ్ తీసుకున్నారు. ఈ రంగంలో నా కృషికి గానూ పలు అవార్డులు కూడా అందుకున్నాను. మేం సౌర విద్యుత్‌పై అపార్ట్‌మెంట్లలో స్టాల్స్ లాంటివి పెట్టి అవగాహన కల్పిస్తున్నాం. స్కూల్స్‌లో పిల్లలకు అవగాహనా తరగతులు నిర్వహిస్తున్నాం. సోలార్ ఎనర్జీ వల్ల పర్యావరణానికి కలిగే ప్రయోజనాన్ని వివరిస్తున్నాం."

● హనుమా



ఫ్యాషన్ ఐకాన్...

మోడలింగ్, నటన... ఇవి ఆమె కలలు. "కానీ కట్టుబాట్లు, అందానికి సమాజం ఇచ్చే పడికట్టు నిర్వచనాలు ఆ లక్ష్య సాధన మార్గంలో అవరోధాలు. అయితే దేనికీ భయపడకపోవడమే నా బలం" అంటూ ముందుకు సాగింది ఆంజెల్ మరీనా టిర్కీ. జార్ఖండ్‌లోని ఒక చిన్న పట్టణంలో మొదలై... 'ఫ్యాషన్ ఐకాన్'గా ప్రశంసలందుకుంటూ... 'క్వీన్ ఆఫ్ ఇంటర్నేషనల్ టూరిజం టైటిల్' గెలిచిన ఆమెది స్ఫూర్తివంతమైన ప్రయాణం.

"నమ్‌కుమ్... జార్ఖండ్ రాజధాని రాంచీకి సమీపంలో ఉన్న పట్టణం. నిశ్శబ్దంగా ఉండే ఆ పట్టణంలో... గిరిజన సంప్రదాయాలు ప్రజల దైనందిన జీవనంతో గాఢంగా పెనవేసుకొని ఉంటాయి. ఓరాన్ గిరిజన కుటుంబంలో పుట్టిన నేను కఠినమైన కట్టుబాట్ల మధ్య పెరిగాను. అలాంటి పరిస్థితుల్లో ఒక అమ్మాయి మోడలింగ్ రంగంలోకి, వినోద పరిశ్రమలోకి వెళ్లాలనుకోవడం సాహసమే. కానీ అదే నా గమ్యమని నేను హైస్కూల్లో ఉన్నప్పుడే నిర్ణయించుకున్నాను. ఆ సంగతి ఎవరికీ చెప్పలేదు... నవ్వుతారని, ఎగతాళి చేస్తారని భయం. ఒక్కోసారి 'నేను అసాధ్యమైన కల కంటున్నానా' అని కూడా అనిపించేది. అయితే... రాంచీలోని సెయింట్ జేవియర్స్ కాలేజీలో... గ్రాడ్యుయేషన్ కోసం చేరడంతో నాకు కొత్త ద్వారాలు తెరుచుకున్నట్టయింది. అప్పటివరకూ కట్టుబాట్ల చిన్న ప్రపంచంలో ఉన్న నా పరిధి విస్తృతమయింది. అందరినీ అక్కున చేర్చుకొనే కాలేజీ వాతావరణం, తోటి విద్యార్థులు, లెక్చరర్ల వైఖరిని చూసి నా అభిప్రాయాలెన్నిటినో మార్చుకున్నాను.

ఆత్మన్యూనతను గెలిచి...

అందానికి సమాజం ఇచ్చే సాధారణ నిర్వచనంలో నేను ఇమడననేది అప్పట్లో నా నమ్మకం. రంగు తక్కువగా ఉన్నాననీ, గిరిజన కుటుంబానికి చెందినదాన్ననీ నాకు న్యూనతలు ఉండేవి. 'నా ఆశయం నెరవేర్చుకోగలనా?' అనే అనుమానం కలిగేది. కానీ క్రమంగా అర్థం లేని సామాజిక నిబంధనలను పట్టించుకోకుండా... నా ఆదివాసీ మూలాల్లోని ప్రత్యేకతను స్వీకరించే శక్తిని సంపాదించాను. అయితే అది అంత సులభంగా జరగలేదు. నేను మోడల్‌ను, నటిని కావాలని ఎవరితోనైనా మాటవరసకు చెప్పినా అదోలా వింతగా చూసేవారు. అనేక సందర్భాల్లో అవమానాలూ పడ్డాను. ఆదివాసీ లక్షణాలను అందానికి ప్రమాణాలుగా పరిగణించని ప్రపంచంలో... విజయం తాలూకు అర్థాన్ని పునర్నిర్వచించడం తేలిక కాదని నాకు తెలుసు. నా ప్రతిభను రుజువు చేసుకోవడానికి... కాలేజీలో ఏ కార్యక్రమం జరిగినా ఉత్సాహంగా పాల్గొనేదాన్ని. క్రమంగా ఆత్మన్యూనత దూరమయింది. అందాల పోటీలకు సిద్ధమయ్యాను. ఈ సంగతి తెలిసి మా కమ్యూనిటీవాళ్ళు అభ్యంతరం తెలిపారు. సంప్రదాయాల్ని ధిక్కరిస్తోందనీ, అదుపులో ఉంచాలనీ మా అమ్మనూ, నాన్ననూ హెచ్చరించారు. కానీ నేను ఊహించిని స్థాయిలో నా కుటుంబం నుంచి నాకు మద్దతు లభించింది. వారి సహకారం నేను మరింత పట్టుదలగా నా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడానికి దోహదపడింది.



ఆ ప్రశంస మరచిపోలేను...

2019లో 'నార్త్ ఈస్ట్ ఐకాన్- సీజన్6'లో టైటిల్ గెలుచుకోవడం నా జీవితంలో పెద్ద మలుపు. అది కేవలం నా వ్యక్తిగత విజయం మాత్రమే కాదు... నా కలలను పరిమితం చెయ్యడానికి ప్రయత్నించిన అనేక పక్షపాతాల మీద విజయం. ఇది నా ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. సమాజం అందాన్ని చూసే విధానంలో మార్పు వస్తోందనే వాస్తవాన్ని స్పష్టం చేసింది. ఆ మార్పుకు నేనొక చిహ్నంగా మారాను. "మూస పద్ధతులను సవాల్ చేస్తూ... అందానికి మరింత సమగ్రమైన నిర్వచనానికి మార్గం సుగమం చేశావు" అంటూ న్యాయనిర్ణేతల్లో ఒకరు ఇచ్చిన ప్రశంసను నేను ఎప్పటికీ మరచిపోలేను. ఆ తరువాత దేశ, విదేశాల్లోని ఈవెంట్స్‌లో మోడల్‌గా నిలిచి... నా కలలో మొదటి భాగాన్ని నెరవేర్చుకున్నాను. 2020లో 'మిస్ ఇండియా యునైటెడ్ నేషన్స్' ఫైనలిస్ట్‌తో సహా పలు టైటిల్స్ గెలిచాను. 'ఫ్యాషన్ ఐకాన్'గా గుర్తింపు పొందాను. ఫిలిప్పీన్స్‌లోని మనీలాలో ప్రతిష్ఠాత్మకమైన 'క్వీన్ ఆఫ్ ఇంటర్నేషనల్ టూరిజం-2023' టైటిల్ విజేతగా అంతర్జాతీయ వేదికపై నిలబడినప్పుడు... నా గతాన్ని గుర్తు చేసుకున్నాను. నా కథలో ప్రధానాంశం ఫ్యాషన్, వినోద పరిశ్రమలో ప్రవేశించడం గురించి మాత్రమే కాదు... అడ్డంకులను దాటడం, సామాజిక అంచనాలను ధిక్కరించడం, అందాన్ని పునర్నిర్వచించడం, లక్ష్యాన్ని సాధించడానికి ధైర్యంగా ముందుకు సాగడం... లాంటి ఎన్నో అంశాలు అందులో ఉన్నాయి. అందుకే... 'మరింతమంది గిరిజన, సామాన్య కుటుంబాలకు చెందిన వారిని కలలు కనేలా, వాటిని నెరవేర్చుకొనేలా ప్రేరేపించడం నా బాధ్యత' అని గ్రహించాను. దానికోసం బాలికలకు ఒక శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తాను. మరోవైపు పేదల కోసం పలు కార్యక్రమాలు చేపడుతున్నాను. నా లక్ష్యంలో రెండో భాగం... వినోద పరిశ్రమలో పేరు తెచ్చుకోవడం. ఇప్పుడు ఆ దిశగా అడుగులు వేస్తున్నాను."

నవ్య | చిత్రజ్యోతి



ట్రెండీ లుక్‌లో

'భీష్మ' చిత్రం లాంటి భారీ విజయం తర్వాత నితిన్, దర్శకుడు వెంకీ కుడుముల కలయికలో వస్తున్న చిత్రం 'రాబిన్‌హుడ్'. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. శనివారం నితిన్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా స్పెషల్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ యాక్షన్ అడ్వెంచర్ చిత్రంలో తన పాత్రలోని విభిన్న షేడ్స్‌ను చూపిస్తూనే, ట్రెండీ లుక్‌లో నితిన్ ఆకట్టుకున్నారు. రాజేంద్ర ప్రసాద్, వెన్నెల కిశోర్ కీలకపాత్రలు పోషిస్తున్నారు.

నితిన్ 'తమ్ముడు'

డైరెక్టర్ వేణు శ్రీరామ్ దర్శకత్వంలో నితిన్ నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. శనివారం టైటిల్ లోగో, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసి, ఈ చిత్రానికి 'తమ్ముడు' అనే టైటిల్‌ను ఫిక్స్ చేశారు. 'దిల్', 'శ్రీనివాస కల్యాణం' చిత్రాల తర్వాత నితిన్ సినిమాను దిల్ రాజు మూడోసారి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది.

నానితో మళ్లీ దసరా టీమ్




పీరియాడిక్ లవ్, మాస్ యాక్షన్ డ్రామాగా రూపొందిన 'దసరా' చిత్రం ఘన విజయం సాధించిన సంగతి విదితమే. హీరో నానికి ఎంతో పేరు తెచ్చిన సినిమా ఇది. ఇప్పుడు 'దసరా' టీమ్.. నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల, నిర్మాత సుధాకర్ చెరుకూరి కొత్త సినిమా కోసం మళ్లీ చేతులు కలిపింది. ఈ సినిమా అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను శనివారం విడుదల చేశారు. నానిని మరో పవర్‌ఫుల్ క్యారెక్టర్‌లో ప్రజెంట్ చేయడానికి దర్శకుడు శ్రీకాంత్ స్క్రిప్ట్ సిద్ధం చేశారు. భారీ బడ్జెట్‌తో సుధాకర్ చెరుకూరి నిర్మించే ఈ చిత్రం వచ్చే ఏడాది వేసవిలో విడుదలవుతుంది.

వేసవిలో అలరించే భరతనాట్యం



సూర్య తేజ ఏలే కథానాయకుడిగా పరిచయం అవుతున్న చిత్రం 'భరత నాట్యం'. 'దొరసాని' ఫేమ్ కేవీఆర్ మహేంద్ర దర్శకత్వం వహిస్తున్నారు. పాయల్ సరాఫ్ నిర్మించారు. మీనాక్షి గోస్వామి కథానాయిక. ఏప్రిల్ 5న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ఆనంద్ దేవరకొండ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ 'కేవీ మహేంద్రగారి 'దొరసాని' చిత్రం మా అందరికీ మంచి పేరు తెచ్చింది. ఇప్పుడు ఈ 'భరతనాట్యం' చిత్రం సూర్యతేజతో పాటు యూనిట్‌కు గొప్ప గుర్తింపు తెస్తుంది' అన్నారు. కేవీఆర్ మహేంద్ర మాట్లాడుతూ "'దొరసాని' విజయం పునరావృతమౌతుంది. సినిమా ఆద్యంతం కడుపుబ్బా నవ్వించేలా ఉంటుంది. 'భరతనాట్యం' ఈ వేసవిలో ప్రేక్షకులను అలరిస్తుంది' అని చెప్పారు. నిర్మాతలు ఖర్చుకు వెనుకాడకుండా క్వాలిటీతో సినిమాను నిర్మించారని సూర్య తేజ తెలిపారు.

నిజం తెలియాలంటే చూడండి



- **యూట్యూబ్‌లో సెన్సేషన్‌గా వైఎస్ వివేకానందరెడ్డి బయోపిక్ - 'వివేకం'**
- **స్ట్రీమింగ్ అయిన తొలిరోజే పది లక్షల వ్యూస్**

అగ్రతారలు లేరు, దర్శకుడి పేరు కూడా తెలియదు, ప్రచారం కోసం పైసా ఖర్చు లేదు... అయితేనేం ఆ సినిమా ఏకంగా అధికార పార్టీకి ముచ్చెమటలు పట్టిస్తోంది. ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ సోషల్ మీడియాతో పాటు సామాన్య జనాల చర్చల్లో భాగమైన ఆ చిత్రం మాజీ ఎంపీ దివంగత వైఎస్ వివేకానంద రెడ్డి బయోపిక్ - 'వివేకం'. యూట్యూబ్‌లో ఈ చిత్రం సెన్సేషన్ సృష్టిస్తోంది. స్ట్రీమింగ్ మొదలైన తొలి రోజే పది లక్షలకు పైగా వ్యూస్ సాధించి అగ్రహీరోల చిత్రాలను సైతం వెనక్కి నెట్టింది. మరోవైపు సోషల్ మీడియాలోనూ నెటిజన్లు 'వివేకం' సినిమాలోని సీన్లను వైరల్ చేస్తున్నారు. మేధావులనే కాదు సామాన్య జనాలను సైతం ఈ సినిమా ఇంతలా ఆకర్షించడం సినీ విశ్లేషకులను సైతం ఆశ్చర్యపరుస్తోంది.

ఏపీ ప్రభుత్వం ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించి ఓటీటీ విడుదలను అడ్డుకోవడంతో మేకర్స్ యూట్యూబ్‌లో స్ట్రీమింగ్ చేశారు. అక్కడా లక్షల్లో వ్యూస్‌ను దక్కించుకుంటూ దూసుకుపోతోంది. యూట్యూబ్‌తో పాటు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.వివేకా బయోపిక్.కామ్ అనే వెబ్‌సైట్‌లోనూ ఈ చిత్రాన్ని లైవ్ స్ట్రీమింగ్‌కు ఉంచారు. పే పర్ వ్యూ పద్ధతిలో వీక్షించవచ్చు. రోజు రోజుకూ ఈ చిత్రాన్ని చూసే వారి సంఖ్య భారీగా పెరుగుతుండడం, ఇది ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీకి లాభించేలా ఉండడంతో వైఎస్సార్ సీపీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. ప్రభుత్వం ఈ సినిమా కంటెంట్‌ను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నా నెటిజన్లు పైరసీ లింకుల ద్వారా డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో వీక్షకులకు అందుబాటులో ఉంచుతున్నారు.

రామ్‌గోపాల్ వర్మ రాజకీయ ప్రేరేపిత సినిమాలు 'వ్యూహం, శపథం' లాంటి సినిమాలు సైతం తుస్సుమన్న తరుణంలో 'వివేకం' ప్రజలను ఇంతలా కదిలించడానికి సినిమాను తెరకెక్కించిన తీరే కారణం అని చెప్పాలి. ఇది వైఎస్ వివేకానందరెడ్డి హత్య చుట్టూ అల్లుకున్న కథ అని మేకర్స్ సినిమా ప్రారంభంలోనే కుండబద్దలు కొట్టారు. వివేకానందరెడ్డి హత్యకేసులో సీబీఐ తన చార్జిషీట్‌లో పొందుపొరచిన అంశాలే కథకు ఆధారమని తెలిపారు. ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి భారతీరెడ్డి, తల్లి విజయమ్మ, సోదరి సునీతారెడ్డి, అవినాష్‌రెడ్డి సహా ఇతర పాత్రల పేర్లను కూడా నేరుగానే వాడేశారు. ఆ పాత్రలు పోషించిన నటీనటుల రూపురేఖలు, వారి హావభావాలు సైతం అచ్చు గుద్దినట్లు దింపడం ప్రేక్షకులను మెప్పించింది. 'హూ కిల్డ్ బాబాయ్' అనే ట్యాగ్‌లైన్‌తో వచ్చిన ఈ సినిమాలో వివేకా హత్యలో పాత్రధారులు, సూత్రధారులతో పాటు పథక రచన నుంచి అమలు వరకూ ప్రతి పాయింట్‌ను సాధికారికంగా చూపించిన తీరు బాగుందని నెటిజన్లు దర్శకుణ్ణి ప్రశంసిస్తున్నారు. 'దస్తగిరి కదిరికి పోయినాడు... గొడ్డలి తీసుకొస్తున్నాడు' లాంటి డైలాగ్‌లు జనం నోళ్లలో నానుతున్నాయి. 'నిజం తెలియాలంటే చూడండి' అంటూ నెటిజన్లు 'వివేకం' సినిమా లింకులను షేర్ చేస్తున్నారు. 'ప్రతి ఒక్కరూ వివేకంతో ఆలోచించి 'వివేకం' చిత్రం చూడాలని ప్రజలను కోరుతున్నారు. దీంతో ఈ సినిమా ఆంధ్రప్రదేశ్ ఎన్నికల మీద ప్రభావం చూపే అవకాశముందంటున్నారు రాజకీయ విశ్లేషకులు. రామ్‌గోపాల్ వర్మ లాంటి వాళ్లు ఈ సినిమా టేకింగ్‌ను చూసి నేర్చుకోవాలని నెటిజన్లు ఓ సలహా పడేస్తున్నారు.

రేపటి నుంచి అయోధ్యకు నేరుగా విమానాలు



హైదరాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): అయోధ్య శ్రీరామచంద్రుడి దర్శనార్థం హైదరాబాద్ నుంచి నేరుగా విమాన సౌకర్యం అందుబాటులోకి రానుందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నుంచి ఈ సేవలు ప్రారంభమవుతాయని వివరించారు. వారంలో మూడు రోజులు– మంగళ, గురు, శని వారాలు ఈ విమానాల సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. "అయోధ్యకు నేరుగా విమాన సౌకర్యం కల్పించాలని ఫిబ్రవరి 26న కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాకు లేఖ రాశాను. ఆయన సానుకూలంగా స్పందించి, ఆ సేవలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు" అని కిషన్‌రెడ్డి వివరించారు. కాగా.. హైదరాబాద్ నుంచి అయోధ్యకు వెళ్లాలంటే.. గతంలో కనెక్టింగ్ ఫ్లైట్స్ మాత్రమే అందుబాటులో ఉండేవి. దీని వల్ల ధరాభారం ఎక్కువగా ఉండేది. రెండు వైపులా ప్రయాణానికి కనీసం రూ. 21 వేలు చెల్లించాల్సి వచ్చేది. పైగా.. కనెక్టింగ్ ఫ్లైట్ స్టాప్, లేఓవర్(సంబంధిత విమానాశ్రయంలో కనెక్టింగ్ ఫ్లైట్ కోసం ఎదురు చూసే సమయం) కలుపుకొని.. హైదరాబాద్ నుంచి అయోధ్యకు చేరేందుకు కనీసం మూడున్నర గంటల సమయం పట్టేది. గరిష్ఠంగా ఈ సమయం 10 గంటలకు పైగా ఉండేది. నేరుగా విమానాలు రావడం వల్ల రెండువైపులా ప్రయాణానికి కనిష్ఠంగా రూ.14 వేల మేర చార్జీలు అవుతాయి. రెండు గంటల్లో అయోధ్య విమానాశ్రయానికి చేరుకోవచ్చు.

డిజిటల్ ఇండియా ట్రస్ట్ ఏజెన్సీతో అక్రమ రుణ యాప్‌లకు చెక్

న్యూఢిల్లీ, మార్చి 31: సైబర్ మోసాలు నానాటికీ పెరిగిపోతున్న నేపథ్యంలో వాటికి అడ్డుకట్టవేసేందుకు ఆర్బీఐ ప్రయత్నాలను ముమ్మరం చేస్తోంది. ఇందులో భాగంగా పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న అక్రమ రుణ యాప్‌లను నిలువరించేందుకుగాను డిజిటల్ ఇండియా ట్రస్ట్ ఏజెన్సీ (డిజిట)ని ఏర్పాటు చేయాలనుకుంటోంది. ఈ ప్రతిపాదిత ఏజెన్సీ డిజిటల్ రుణ యాప్‌ల వెరిఫికేషన్‌కు దోహదపడుతుంది. అలాగే ధ్రువీకరించిన యాప్‌లకు సంబంధించి ఒక పబ్లిక్ రిజిస్టర్‌ను కూడా నిర్వహించనున్నట్టు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వర్గాలు పేర్కొన్నాయి. 'వెరిఫైడ్' అన్న డిజిట సిగ్నేచర్‌లేని యాప్‌లను అనధికారికంగా పరిగణించనున్నట్టు ఆ వర్గాలు తెలిపాయి. డిజిటల్ రంగంలో ఆర్థికపరమైన నేరాలపై పోరాటానికి ఇది ఒక కీలకమైన చెక్ పాయింట్‌గా ఉంటుందని భావిస్తున్నారు. ఇదిలా ఉండగా.. గూగుల్ వైట్‌లిస్టింగ్ కోసం 442 ప్రత్యేక డిజిటల్ రుణ వితరణ యాప్‌ల జాబితాను ఐటీ మంత్రిత్వ శాఖకు ఆర్బీఐ పంపింది. మరోవైపు గూగుల్ 2022 సెప్టెంబరు నుంచి 2023 ఆగస్టు వరకు తన యాప్ స్టోర్ నుంచి 2,200కు పైగా డిజిటల్ రుణ యాప్ (డీఎల్‌ఏ)లను తొలగించింది.

కేరళ మంత్రి రాజీవ్ వైఖరిపై కర్ణాటక ఆగ్రహం

బెంగళూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులో తాగునీటి సమస్య నెలకొన్న క్రమంలో కేరళ పరిశ్రమలశాఖ మంత్రి రాజీవ్ ఐటీ కంపెనీలను ఆహ్వానించడంపై కర్ణాటక పరిశ్రమల శాఖ మంత్రి ఎంబీ పాటిల్ విరుచుకుపడ్డారు. ఆదివారం ఆయన బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ.. ఎండాకాలం, కరువు రెండూ కలసి వచ్చాయని, ఈ కారణంతో బెంగళూరులో తాగునీటి సమస్య తలెత్తిందన్నారు. నగర శివారు ప్రాంతాల్లో బోరుబావులపై ఆధారపడ్డారని, ప్రస్తుతం అక్కడే తాగునీటి సమస్య ఉత్పన్నమైందని తెలిపారు. వర్షాభావంతో దేశవ్యాప్తంగా నీటి ఎద్దడి నెలకొందన్నారు. ఈ నేపథ్యంలో కొన్ని రోజులపాటు సమస్య తలెత్తితే తమ రాష్ట్రానికి పరిశ్రమలతో రండి అని కేరళ ప్రభుత్వం ఎలా ఆహ్వానిస్తుందని ప్రశ్నించారు. ఇది ఆరోగ్యకరమైన పరిణామం కాదని, సమాఖ్య వ్యవస్థలో పరస్పర సహకారం ఉండాలని, ఇలా అవకాశవాదం మంచిదికాదని హితవు పలికారు. కేరళలో ఎక్కడా తాగునీటి సమస్య లేదా..? అని ప్రశ్నించారు.

తెలుగు రాష్ట్రాల్లో మాకు మంచి ఫలితాలు: గడ్కరీ

నాగపూర్, మార్చి 31: లోక్‌సభ ఎన్నికల్లో ఈ సారి సొంతంగా 370 స్థానాలు సాధిస్తామని బీజేపీ సీనియర్ నేత, కేంద్ర రోడ్డు రవాణా మంత్రి నితిన్ గడ్కరీ స్పష్టం చేశారు. ఈ లక్ష్య సాధనకు దక్షిణ భారతం తమకు తోడ్పడుతుందని ఆదివారమిక్కడ ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. నాగపూర్ నుంచి వరుసగా మూడోసారి బరిలోకి దిగిన ఆయన... శనివారం మండుటెండలో 4 గంటలపాటు భారీ రోడ్‌షో నిర్వహించారు. ఎన్డీయే కచ్చితంగా 400 సీట్లను కైవసం చేసుకుంటుందనడంలో సందేహమే లేదని తెలిపారు. ప్రతిపక్షాలను బలహీనపరిచేందుకు ఈడీ, సీబీఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను తమ ప్రభుత్వం అస్త్రాలుగా వాడుతోందన్న ఆరోపణలను తోసిపుచ్చారు. "తమిళనాడు, కేరళ, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో మేం బాగా కష్టపడి పనిచేశాం. ఆంధ్ర, తెలంగాణల్లో ఈ సారి మంచి ఫలితాలు వస్తాయి' అని వివరించారు. ఎలక్టోరల్ బాండ్ల రూపంలో బీజేపీకి అధిక విరాళాలు అందడంపై వస్తున్న విమర్శలను తోసిపుచ్చారు. బీజేపీ అధికారపక్షం కాబట్టి ఎక్కువ విరాళాలు రావడం సహజమేనన్నారు.

మద్యం కుంభకోణం డబ్బును ఆప్ గోవా ఎన్నికల్లో వాడింది: ఈడీ

న్యూఢిల్లీ, మార్చి 31 : ఢిల్లీ మద్యం కుంభకోణం ద్వారా వచ్చిన ముడుపుల్లో రూ.45 కోట్లను ఆమ్‌ఆద్మీ పార్టీ(ఆప్) 2022 గోవా ఎన్నికల ప్రచారానికి వినియోగించిందని ఈడీ స్పష్టం చేసింది. ఈ నగదును హవాలా రూపంలో గోవా చేర్చారని తెలిపింది. ఐటీ, సీబీఐ వేర్వేరుగా చేసిన దర్యాప్తుల్లోనూ ఈ విషయం నిర్ధారణ అయిందని పీఎంఎల్ఏ ప్రత్యేక న్యాయస్థానానికి సమర్పించిన పత్రాల్లో ఈడీ పేర్కొంది. ఈ దర్యాప్తులో భాగంగా పెద్ద సంఖ్యలో హవాలా నిర్వాహకులు, అంగాడియా(హవాలా దళారుల్లో మరో వ్యవస్థ)లను విచారించామని ఈడీ వివరించింది. కాగా, 2021-22లో గోవా ఎన్నికల్లో ప్రచార కార్యక్రమాల నిర్వహణకు చారియట్ ప్రొడక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థతో ఆప్ ఒప్పందం చేసుకుంది. ఆ సంస్థకు చెందిన వారిని విచారణ చేయగా చెల్లింపులు ఎక్కువగా నగదు రూపంలో జరిగినట్టు వెల్లడైందని ఈడీ కోర్టుకు తెలిపింది.

మ్యాచ్ ఫిక్సింగ్ మోదీని గద్దె దింపుదాం!



ప్రజాస్వామ్య పరిరక్షణ సభలో కల్పన, సునీత, సోనియా గాంధీ

(మొదటి పేజీ తరువాయి)

ఐదారుగురు బడా వ్యక్తుల చేతుల్లోకి వెళతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగం అనేది ప్రజల గొంతుక అని, ఒకవేళ రాజ్యాంగం ఖతమైతే దేశం వేర్వేరు రాజ్యాలుగా మరోసారి ముక్కలవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సొరెన్‌ల అరెస్టును నిరసిస్తూ విపక్ష 'ఇండియా కూటమి' ఆదివారం ఢిల్లీలోని రామ్ లీలా మైదాన్‌లో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షణ సభ పేరుతో భారీ బహిరంగ సభ నిర్వహించింది. ఈ సభలో ఖర్గే, సోనియా, రాహుల్, శరద్ పవార్, అఖిలేశ్, సీతారాం ఏచూరి సహా 27 విపక్ష పార్టీలకు చెందిన నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ ప్రసంగించారు. "ఇవేం ఎన్నికలు? డబ్బు, అధికారాన్ని అడ్డం పెట్టుకొని ప్రభుత్వాలను కూల్చివేస్తున్నారు. రాజకీయ నేతలను బెదిరిస్తున్నారు. సొరెన్, కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారు. ముగ్గురు-నలుగురు బిలియనీర్లను అడ్డం పెట్టుకొని ఎన్నికల్లో 'మ్యాచ్ ఫిక్సింగ్' ద్వారా గెలవాలని మోదీ అనుకుంటున్నారు" అని ఆరోపించారు. పోలీసులు, సీబీఐ, ఈడీ బెదిరింపుల ద్వారా దేశాన్ని నడిపించగలం అని మోదీ అనుకుంటున్నారని, మీడియాను కూడా కొనుగోలు చేశారని కానీ ప్రపంచంలో ఏ శక్తీ భారత ప్రజల గొంతు నొక్కలేదని హెచ్చరించారు. బీజేపీ 400 సీట్లు గెలుస్తామని చెబుతోందని.. 'మ్యాచ్ ఫిక్సింగ్ లేకుండా.. మీడియాను కొనకుండా, ఈవీఎంలను వాడకుంటే కమలం పార్టీ కనీసం 180 స్థానాలను కూడా గెలవలేదని పేర్కొన్నారు.

ఐక్యత లేకపోతే విజయం సాధించలేం

బీజేపీ, ఆర్ఎస్ఎస్ కాలకూట విషం లాంటివని, వారు దేశాన్ని ధ్వంసం చేశారని, మరింత విధ్వంసం సృష్టించేందుకు ఇక ఎంతమాత్రం అనుమతించరాదని మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. ప్రతిపక్షాలన్నీ కలిసికట్టుగా ఉంటేనే బీజేపీని ఓడించడం సాధ్యపడుతుందని, తద్విరుద్ధంగా విపక్ష పార్టీలే తమలో తాము పోట్లాడుకుంటే విజయం సాధించలేమని హెచ్చరించారు. అధికారం కోల్పోతామన్న భయంతో బీజేపీ నేతలు వ్యవహరిస్తున్నారని, ప్రతిపక్ష నేతలంతా ఢిల్లీలో ఉండటం చూసి.. ప్రధాని ఢిల్లీ విడిచి వెళ్లారని ఎస్పీ నేత అఖిలేశ్ యాదవ్ ఎద్దేవా చేశారు. ఈడీ, సీబీఐ, ఐటీని ప్రయోగించి చందాలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. తనపైనే కాకుండా తన తండ్రి, తల్లి, చెల్లెళ్లపైనా కేసులు మోపారని, అయితే తాము సింహాలమని, ఎవ్వరికీ భయపడబోమని ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ పేర్కొన్నారు. దేశంలో ఒకే వ్యక్తి చేతిలో ఒకే పార్టీ ప్రభుత్వం ఉండటం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని, సంకీర్ణ ప్రభుత్వమే దేశానికి సరైందని ఉద్ధవ్ ఠాక్రే పేర్కొన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడం ద్వారానే ప్రజాస్వామ్యాన్ని కాపాడగలమని పీడీపీ నేత ముఫ్తీ చెప్పారు. మతతత్వ శక్తుల నుంచి దేశాన్ని కాపాడాలని సీపీఎం నేత సీతారాం ఏచూరి అన్నారు.

నియంతృత్వం పోవాలి

కేజ్రీవాల్, హేమంత్ సొరెన్ అరెస్టులపై విపక్ష పార్టీల నేతలు తీవ్ర నిరసన తెలిపారు. కేజ్రీవాల్ సతీమణి సునీతా కేజ్రీవాల్, హేమంత్ సొరెన్ సతీమణి కల్పనా సొరెన్‌లు కూడా సభలో ప్రసంగించారు. భారత మాత గాయలతో బాధపడుతోందని, ఈ నియంతృత్వం పోవాలని సునీతా కేజ్రీవాల్ పేర్కొన్నారు. తాము అధికారంలోకి వస్తే ఇండియా కూటమి ఆరు గ్యారంటీలు అమలు చేస్తుందంటూ కేజ్రీవాల్ పంపిన సందేశాన్ని ఆమె చదివి వినిపించారు.

రాముడి నుంచి మోదీ తెలుసుకోవాలి

బీజేపీ ప్రభుత్వం అప్రజాస్వామికంగా ఎన్ని అడ్డంకులు కల్పించినా ఇండియా కూటమి దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు పోరాటం చేస్తుందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ అన్నారు. తాను చిన్నప్పటి నుంచీ రామలీలా మైదాన్‌కు వచ్చి రావణుడిని దగ్ధం చేస్తుంటే చూసేదాణ్ని అని గుర్తు చేసుకున్నారు. అరెస్టయిన నేతలను విడిచిపెట్టి, నిష్పాక్షిక విచారణ జరిపించాలనే ప్రతిపక్ష కూటమి డిమాండ్లను ఆమె చదివి వినిపించారు.

ఇండియా కూటమి తరఫున ఎన్నికల కమిషన్‌కు ప్రియాంకా గాంధీ చేసిన ఐదు డిమాండ్లు ఇవే!

- లోక్‌సభ ఎన్నికల్లో పరిస్థితులు ప్రభుత్వానికి, విపక్షాలకు సమాన అవకాశాలు ఉండేలా ఎన్నికల కమిషన్ భరోసా ఇవ్వాలి.
- ఎన్నికలను ప్రభావితం చేసేందుకు విపక్షాలపై కేంద్రం ప్రయోగిస్తున్న ఐటీ, సీబీఐ, ఈడీ అస్త్రాలను ఈసీ ఆపివేయాలి.
- హేమంత్ సొరెన్, కేజ్రీవాల్‌ను తక్షణమే విడుదల చేయాలి.
- విపక్షాల ఆర్థికంగా చిదిమివేసే పరిస్థితులను ఈసీ నిరోధించాలి.
- ఎలక్టోరల్ బాండ్ల ద్వారా దొడ్డిదారిన బీజేపీ నిధులు సమకూర్చుకున్న వ్యవహారంపై దర్యాప్తునకు సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సిట్ ఏర్పాటు చేయాలి.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నంద్యాల	41.0	26.0
అనంతపురం	40.0	24.0
తిరుపతి	39.2	24.0
విజయవాడ	37.6	25.2
విశాఖపట్నం	36.8	25.2
ఒంగోలు	36.2	23.0

నేడు, రేపు ఎండ మంటలే!

అమరావతి, విశాఖపట్నం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఉపరితల ఆవర్తనాలు, ద్రోణులు లేకపోవడం, సముద్రం నుంచి తేమగాలులు వీయకపోవడంతో రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో ఎండ తారెత్తించింది. రాయలసీమ, కోస్తాలో పలుచోట్ల వడగాడ్పులు వీయగా, మరికొన్నిచోట్ల వేడి వాతావరణం నెలకొంది. రాయలసీమ, కోస్తాలో మారుమూల ప్రాంతాల్లో సైతం గాలిలో తేమశాతం గణనీయంగా పడిపోవడంతో ఉక్కపోత పెరిగింది. దేశంలోనే అత్యధికంగా ఆదివారం నంద్యాలలో 41.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న రెండు, మూడు రోజుల వరకు రాయలసీమ, కోస్తాలో పలుచోట్ల గాడ్పులు వీస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా సోమ, మంగళవారాల్లో కొన్ని జిల్లాల్లో 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. నంద్యాల, కడప, మన్యం జిల్లాల్లోని 37 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని తెలిపింది. ఆదివారం 18 మండలాల్లో వడగాడ్పులు వీచినట్లు పేర్కొంది. పగటి ఉష్ణోగ్రతలు రాయలసీమలో రెండు నుంచి నాలుగు, కోస్తాలో రెండు నుంచి మూడు డిగ్రీలు ఎక్కువగా నమోదవుతాయని పేర్కొంది. మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లే ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

ఏప్రిల్ 5న కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల

న్యూఢిల్లీ, మార్చి 31: కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో ఏప్రిల్ 5న విడుదల చేయనుంది. కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జైరాం రమేష్ ఈ సందర్భంగా మాట్లాడుతూ... మార్చి 16న తమ పార్టీ 5 న్యాయాలు, 25 గ్యారెంటీలను(పాంచ్ న్యాయ్, పచ్చీస్ గ్యారెంటీస్) విడుదల చేసిందన్నారు. ఇంటింటికీ గ్యారెంటీ పేరిట ఏప్రిల్ 3 నుంచి 8 కోట్ల గ్యారెంటీ కార్డులను దేశ వ్యాప్తంగా పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. ఏప్రిల్ 5న మేనిఫెస్టో విడుదల చేస్తామన్నారు. దేశ వ్యాప్తంగా ప్రజలతో సంప్రదించి, అలాగే ఈ మెయిల్ ద్వారా, 'ఆవాజ్ భారత్ కి' వెబ్‌సైట్ ద్వారా అందిన వేలాది సూచనలను క్రోడీకరించి కాంగ్రెస్ మేనిఫెస్టోని రూపొందించినట్లు జైరాం రమేష్ చెప్పారు. ప్రజల మనోభావాలకు తమ మేనిఫెస్టో ప్రతిబింబం అని స్పష్టం చేశారు.

కాంగ్రెస్‌కు 'పన్ను' పోటు!

» రూ.3,567 కోట్లకు చేరిన బకాయిలు..సుప్రీంలో కేసు

న్యూఢిల్లీ, మార్చి 31: కాంగ్రెస్ పార్టీని 'పన్ను'పోటు వెంటాడుతోంది. రాజకీయ పార్టీల నిధులకు ఆదాయపన్ను మినహాయింపును తొలగించినప్పటి నుంచి ఆ పార్టీ పన్ను బకాయిలు పెరుగుతూ వస్తున్నాయి. 2014-15లో రూ. 663 కోట్లు, మరో 2015-16లో రూ.664 కోట్లు, 2016-17లో ఇంకో రూ.417 కోట్ల పన్నును కలిపి.. బకాయిలు ఆ మూడు ఆర్థిక సంవత్సరాలకు రూ.1,745 కోట్లకు చేరుకుంది. తాజాగా ఆ పార్టీ చెల్లించాల్సిన పన్ను బకాయిల మొత్తం రూ.3,567 కోట్లుగా ఐటీశాఖ లెక్కగట్టింది. గతంలో కాంగ్రెస్ పార్టీ ఖాతా నుంచి ఐటీ అధికారులు రూ.135కోట్లను విత్‌డ్రా చేసుకున్న విషయం తెలిసిందే. దీనిపై కాంగ్రెస్ పార్టీ ఆదాయ పన్ను అప్పిలేట్ ట్రిబ్యునల్, హైకోర్టులను ఆశ్రయించినా.. చుక్కెదురైంది. దాంతో సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. ఈ వ్యాజ్యం సోమవారం విచారణకు రానుంది. మరోవైపు బీజేపీ సర్కారు విపక్ష పార్టీలపై ట్యాక్స్ టెర్రరిజానికి పాల్పడుతోందని కాంగ్రెస్ మండిపడింది.

200 సీట్లైనా గెలవండి.. చూద్దాం

» బీజేపీకి మమతాబెనర్జీ సవాల్



కృష్ణానగర్(పశ్చిమ బెంగాల్), మార్చి 31: లోక్‌సభ ఎన్నికల్లో 400లకు పైగా సీట్లు గెలుస్తామని చెబుతున్న బీజేపీ కనీసం 200 సీట్లైనా గెలిచి చూపాలని పశ్చిమ బెంగాల్ సీఎం మమతాబెనర్జీ సవాల్ విసిరారు. ఆదివారం కృష్ణానగర్ ప్రాంతంలో టీఎంసీ అభ్యర్థి మహువా మొయిత్రా తరఫున ఆమె ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. బీజేపీని జుమ్లా పార్టీ అని అన్నారు. "2021 బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ 200 సీట్లు గెలుస్తామని బీజేపీ గొప్పలు చెప్పుకుంది. కానీ 77 సీట్లకే పరిమితమయ్యింది" అని ఆమె పేర్కొన్నారు. రాష్ట్రంలో పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) అమలును అనుమతించబోమని మమతాబెనర్జీ స్పష్టం చేశారు. సీఏఏకు దరఖాస్తు చేసుకుంటే 5 ఏళ్ల విదేశీయులుగా మారుతారని, కాబట్టి ఎవరూ దరఖాస్తు చేసుకోవద్దని ఆమె కోరారు. రాష్ట్రంలో సీపీఐ(ఎం), కాంగ్రెస్‌లు బీజేపీ కోసం పనిచేస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో వామపక్ష-కాంగ్రెస్-ఐఎస్ఎఫ్ కూటమి అభ్యర్థులకు ఓటు వెయ్యొద్దని, వారికి ఓటేస్తే బీజేపీకి వేసినట్టేనని మమతాబెనర్జీ చెప్పారు.

కీలక నిర్ణయాలన్నీ తొలి 100 రోజుల్లోనే

(మొదటి పేజీ తరువాయి)

రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేస్తోందని తెలిపారు. మొదటి 100 రోజుల్లో ఎలాంటి కీలక నిర్ణయాలు తీసుకోవాలనే దానిపై శరవేగంగా పనులు సాగుతున్నాయని పేర్కొన్నారు. దేశ ప్రజలు గత పదేళ్లలో ట్రైలర్‌ను మాత్రమే చూశారని, అసలు అభివృద్ధి ముందుందని చెప్పారు. 2024 ఎన్నికల తీర్పుతో భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా అవతరించేందుకు దోహదం చేయనుందన్నారు. ఈ సందర్భంగా మేరఠ్‌లో నిర్వహించిన మెగా ర్యాలీలో ప్రసంగించిన ప్రధాని విపక్షాలపై విరుచుకుపడ్డారు. అవినీతికి వ్యతిరేకంగా తాము తీసుకుంటున్న చర్యలతో కొందరు వణికిపోతున్నారని ఎద్దేవా చేశారు. ఇటీవల కొందరు ఇండియా కూటమి నేతలను కేంద్ర దర్యాప్తు సంస్థలు అరెస్టు చేయడాన్ని ప్రతిపక్షాలు తప్పుబడుతున్నారని ఆరోపించారు. ఈ ఎన్నికలు అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతున్న ఎన్డీయేకు, అవినీతిపరులను రక్షించడమే లక్ష్యంగా పెట్టుకున్న మరో వర్గానికి మధ్య సాగుతున్నాయన్నారు. 'భ్రష్టాచార్ హటావో' అని తాము పిలుపునిస్తుంటే వారు మాత్రం 'భ్రష్టాచారీ బచావో' అని అంటున్నాయని దుయ్యబట్టారు. గత పదేళ్లలో తాము తీసుకున్న చర్యల ఫలితంగానే నేడు అవినీతిపరులు జైల్లో ఉన్నారని తెలిపారు. అవినీతిపరులపై విచారణ జరపడమే కాకుండా ప్రజల నుంచి వారు దోచుకున్న సొమ్మును తిరిగి ప్రజలకే ఇప్పిస్తున్నామని వెల్లడించారు. పేదరికంలో జీవించిన తనకు ప్రతి పేదవాడి బాధ, కష్టాలు తెలుసని, అందుకే పేదల ప్రతి సమస్యను పరిష్కరించేందుకు పథకాలు రూపొందించినట్లు చెప్పారు. చౌదరి చరణ్‌సింగ్ వంటి విప్లవ వీరులను దేశానికి అందించిన విప్లవాల పురిటిగడ్డ మేరఠ్ అని మోదీ కొనియాడారు. రైతులను ద్వేషించే ఇండియా కూటమి చౌదరి చరణ్‌సింగ్‌కు సరైన గౌరవం కూడా ఇవ్వలేదని విమర్శించారు. పార్లమెంట్‌లో చర్చ సందర్భంగా విపక్ష నేతలు ఏం చేశారో దేశం మొత్తం చూసిందన్నారు. భారతరత్న అవార్డు గురించి మాట్లాడేందుకు మా సోదరుడు జయంత్ చౌధరి లేచినప్పుడు అడ్డుకోవడానికి ప్రయత్నించడంతో పాటు ఆయన్ను కించపరిచేందుకు కూడా యత్నించారని మోదీ గుర్తుచేశారు.



మేరఠ్ ర్యాలీలో యూపీ సీఎం యోగి, ప్రధాని మోదీ

ఎన్నికల బాండ్ల రద్దుపై విపక్షాలు పశ్చాత్తాప పడతాయ్

న్యూఢిల్లీ, మార్చి 31: తమ ప్రభుత్వం తీసుకవచ్చిన ఎన్నికల బాండ్ల విధానాన్ని మోదీ సమర్థించుకున్నారు. ఈ బాండ్లే పెద్ద కుంభకోణమని విపక్షాలు విమర్శిస్తుండగా మోదీ మాత్రం వీటి ద్వారా పారదర్శకత పెరిగిందని అన్నారు. 2014కు ముందు ఎన్నికల్లో ఎంత ఖర్చు పెట్టేవారో ఎవరికీ తెలిసేది కాదని, ఇప్పుడు ఎన్నికల బాండ్ల పుణ్యమా అని అన్ని వివరాలు అందుబాటులో ఉంటున్నాయని చెప్పారు. వీటిని రద్దు చేయించిన విపక్షాలు అనంతర కాలంలో పశ్చాత్తాపడుతాయన్నారు. ఆదివారం ఓ టీవీ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు.

కచ్చతీవుపై రాజకీయ దుమారం!

న్యూఢిల్లీ, మార్చి 31: పాక్ జలసంధిలోని కచ్చతీవు ద్వీపంపై రాజకీయ దుమారం చెలరేగింది. ఆ ద్వీపాన్ని కాంగ్రెస్ పార్టీ శ్రీలంకకు ధారాదత్తం చేసేసిందని ప్రధాని మోదీ ఆక్షేపించారు. దీనిపై ఒక మీడియా కథనాన్ని ఉటంకిస్తూ ఆదివారం 'ఎక్స్'లో మోదీ స్పందించారు. 'కాంగ్రెస్ ఉద్దేశపూర్వకంగా కచ్చాతివును వదులుకున్న కొత్త వాస్తవాలు కళ్లు తెరిపించాయి' అని మోదీ పేర్కొన్నారు.తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై ఆర్టీఐ కింద దరఖాస్తు ద్వారా సేకరించిన ఈ సమాచారాన్ని ఒక ఆంగ్ల దినపత్రిక ఆదివారం ప్రచురించింది. కచ్చతీవును శ్రీలంకకు అప్పగించడంలో కాంగ్రెస్, డీఎంకే ఎలా కుమ్మక్కయ్యాయో ఆ ఆంగ్ల పత్రిక స్పష్టం చేసిందని అన్నామలై 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఆ దీవిని పొరుగుదేశానికి అప్పగిస్తూ 1974లో ఇందిరాగాంధీ ప్రభుత్వం ఒప్పందం చేసుకున్నట్టు తెలిపారు. నాడు కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయం వల్లే ఇప్పుడు తమిళనాడు జాలర్లు తమ రాష్ట్రానికి కేవలం 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆ దీవి వద్ద చేపల వేటకు వెళ్లి శ్రీలంక నేవీ చేతిలో అరెస్టవుతున్నారని బీజేపీ ఆక్షేపించింది. అయితే, కచ్చతీవును వెనక్కి తీసుకునేందుకు గత పదేళ్లుగా మోదీ ప్రభుత్వం ఎందుకు ప్రయత్నించలేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నిలదీశారు. ఎన్నికల ముందు సున్నితమైన అంశాలను లేవనెత్తడం మోదీలోని నిరాశను తెలియజేస్తోందన్నారు. స్నేహపూర్వక ఒప్పందంలో భాగంగానే శ్రీలంకకు కచ్చాతివును అప్పగించినట్టు 'ఎక్స్'లో తెలిపారు.

ఏకగ్రీవంగా.. అధ్యక్షా..!

» అరుణాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో.. 10 సీట్లలో ఎదురే లేని బీజేపీ నేతలు

» పెమాఖండు ఏకగ్రీవం.. ఇది మూడోసారి



ప్రజాస్వామ్యానికి అసలైన అర్థం ఎన్నికలే! ఇద్దరు లేదా అంతకు మించి నేతలు బరిలో దిగాలి. పోటీ పడాలి. ప్రజలు వారిలో ఎవరిని ఎన్నుకుంటే వారు గెలవాలి. అలా కాకుండా.. అసలు పోటీయే లేకుండా.. ఒక్కరే నామినేషన్ వేసేసి, ఎన్నికే జరగకుండా గెలిచేస్తే అందులో ఏం మజా ఉంటుంది? అసలు అలా జరుగుతుందా? అంటారా..! జరుగుతుంది. జరుగుతోంది. తాజాగా మూడ్రోజుల క్రితమే అరుణాచల్ ప్రదేశ్‌లో జరిగింది కూడా. ఆంధ్రప్రదేశ్‌లోలాగానే అరుణాచల్‌లో కూడా 2024 ఎంపీ ఎన్నికలతో పాటు ఆ రాష్ట్ర శాసనసభకూ ఎన్నికలు జరుగుతున్నాయి. ఆ రాష్ట్ర అసెంబ్లీలో మొత్తం అరవై సీట్లు ఉండగా.. అందులో ఆరోవంతు.. అనగా 10 సీట్లకు అసలు పోటీయే లేకుండా.. నామినేషన్‌తోనే బీజేపీ నేతలు గెలిచేశారు. ఆ పదిమందిలో అరుణాచల్ ప్రస్తుత సీఎం పెమా ఖండు, డిప్యూటీ సీఎం చౌనామీన్ కూడా ఉండడం విశేషం. బీజేపీకే చెందిన మరో అభ్యర్థి జిక్కే టాకో అయితే ఏకగ్రీవంగా ఎన్నిక కావడం ఇది వరుసగా రెండోసారి. ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ కేవలం 34 సీట్లలోనే పోటీ చేయడం గమనార్హం.

ఏకగ్రీవాలు.. కొత్త కాదు..

స్థానిక సంస్థల ఎన్నికల్లో, రాజ్యసభ ఎన్నికల్లో ఏకగ్రీవాలు సాధారణమేగానీ.. ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలకు జరిగే ఎన్నికల్లో ఏకగ్రీవాలు అరుదు. కానీ, కొత్త విషయమేమీ కాదు. ఎవరిదాకానో ఎందుకు.. పెమా ఖండునే 2011లో, 2014లో ఇలాగే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2014లో అయితే అరుణాచల్‌లో ఏకంగా 11 సీట్లు ఏకగ్రీవమయ్యాయి. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి చూస్తే.. 1952లో దేశవ్యాప్తంగా 298 మంది ఎమ్మెల్యేలు, 28 మంది ఎంపీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నాగాలాండ్‌లో ఇప్పటిదాకా అన్ని ఎన్నికల్లో కలిపి ఎలాంటి పోటీ లేకుండా ఎన్నికైన ఎమ్మెల్యే సంఖ్య 77. తర్వాతి స్థానంలో 63 మంది ఎమ్మెల్యేలతో జమ్మూకశ్మీర్ ఉండగా, అరుణాచల్ ప్రదేశ్ 40 మంది ఏకగ్రీవ ఎమ్మెల్యేలతో మూడోస్థానంలో నిలిచింది. ఎంపీ సీట్ల విషయానికి వస్తే.. 1952 నుంచి ఇప్పటిదాకా జమ్ముకశ్మీర్‌లో నలుగురు ఎంపీలు పోటీ లేకుండా గెలిచారు. ఏపీ, అసోం, ఒడిశా, తమిళనాడు, తెలంగాణ, యూపీల్లో ఒకరికి మించి ఎంపీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పార్టీలు.. నేతల లెక్క..

ఏకగ్రీవ ఎన్నికల విషయంలో పార్టీల పరంగా చూస్తే.. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటిదాకా కాంగ్రెస్ పార్టీ నుంచి అత్యధికంగా 194 మంది ఎమ్మెల్యేలు పోటీ లేకుండా నెగ్గారు. అలాంటి 34 మంది ఎమ్మెల్యేలతో నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ రెండోస్థానంలో.. 15 మంది ఎమ్మెల్యేలతో బీజేపీ మూడో స్థానంలో నిలిచాయి. 29 మంది స్వతంత్ర ఎమ్మెల్యేలు ఇప్పటిదాకా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎక్కువసార్లు ఏకగ్రీవంగా ఎమ్మెల్యే అయినవారి జాబితాలో అగ్రస్థానం పెమా ఖండు (3సార్లు), జమ్ముకశ్మీర్ మాజీ సీఎం సయ్యద్ మీర్ ఖాసిం (3సార్లు). పెమా ఖండు తండ్రి దోర్జీ ఖండు కూడా 1990లో, 2009లో అదే సీటులో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇక లోక్‌సభ ఎన్నికల విషయానికి వస్తే.. కాంగ్రెస్ పార్టీ నుంచి 20 మంది (1952 నుంచి ఇప్పటిదాకా) ఎంపీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇద్దరేసి ఎంపీలతో నేషనల్ కాన్ఫరెన్స్, సమాజ్‌వాదీ పార్టీ తర్వాతి స్థానంలో నిలిచాయి. ఒక స్వతంత్ర ఎంపీ కూడా ఎలాంటి పోటీ లేకుండా గెలవడం గమనార్హం. మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, మాజీ ఉపప్రధాని వైబీ చవాన్ నాసిక్ నుంచి, నేషనల్ కాన్ఫరెన్స్ చీఫ్ ఫరూక్ అబ్దుల్లా శ్రీనగర్ నుంచి, కేంద్ర మాజీ మంత్రి టీటీ కృష్ణమాచారి (తిరుచెందూర్), కేంద్ర మాజీ మంత్రి పీఎం సయీద్ (లక్షద్వీప్), కేఎల్ రావు (విజయవాడ).. తదితరులు ఎలాంటి పోటీ లేకుండానే ఎంపీలయ్యారు. - సెంట్రల్ డెస్క్

ఆడ్వాణీకి భారతరత్న ప్రదానం

న్యూఢిల్లీ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): బీజేపీ అగ్ర నేత, మాజీ ఉప ప్రధాని ఆడ్వాణీకి దేశ అత్యున్నత పౌర పురస్కారం భారతరత్నను ప్రదానం చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆదివారం స్వయంగా ఆడ్వాణీ ఇంటికి వెళ్లి అవార్డును అందజేశారు. శనివారం రాష్ట్రపతి భవన్‌లో అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. అయితే.. వయోభారం, అనారోగ్య కారణాలతో ఆడ్వాణీ హాజరు కాలేదు. దీంతో రాష్ట్రపతే స్వయంగా ఆడ్వాణీ ఇంటికి వెళ్లి ఆయనకు పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ, ఉప రాష్ట్రపతి ధన్‌ఖడ్, రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడుతో పాటు ఆడ్వాణీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. దేశ చరిత్రలో ఎప్పటికీ గుర్తుండిపోయే చెరగని అధ్యాయం ఆడ్వాణీ అని మోదీ ఈ సందర్భంగా కొనియాడారు. దేశ అభ్యున్నతికి, పురోగమనానికి ఆడ్వాణీ చేసిన సేవలకు భారతరత్న ఒక గుర్తింపని తెలిపారు. తన గురువుకు దేశ అత్యున్నత పౌరపురస్కారం ప్రదానం చేయడం, ఆ వేడుకకు తాను హాజరు కావడం తనకెంతో గౌరవంగా ఉందని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.

ఆడ్వాణీ రథయాత్రతో బీజేపీకి ఖ్యాతి

1927 నవంబర్ 8వ తేదీన ప్రస్తుత పాకిస్థాన్‌లోని కరాచీలో ఆడ్వాణీ జన్మించారు. 1947లో దేశ విభజన సమయంలో భారత్‌కు ఆయన కుటుంబం తరలి వచ్చింది. కాగా, 14 ఏళ్ల వయసులోనే ఆడ్వాణీ ఆర్ఎస్ఎస్‌లో చేరారు. 1970లో తొలిసారి ఢిల్లీ నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 1980లో వాజపేయితో కలిసి బీజేపీని స్థాపించారు. మూడుసార్లు బీజేపీ అధ్యక్షుడిగా పనిచేశారు. 1990లో ఆడ్వాణీ చేపట్టిన రథయాత్ర ఆ పార్టీకి జాతీయ ఖ్యాతిని తీసుకొచ్చింది. ఆయన రెండుసార్లు కేంద్ర హోంమంత్రిగా పనిచేశారు. 2019 నుంచి క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉన్నారు.

రాష్ట్రపతి నిల్చుంటే.. మోదీ కూర్చుంటారా?

ఆడ్వాణీకి భారతరత్న పురస్కారం ప్రదానం సందర్భంగా వెలువడిన ఒక ఫొటోపై విమర్శలు వ్యక్తమయ్యాయి. సదరు ఫొటోలో ప్రధాని మోదీ, ఆడ్వాణీ కుర్చీలపై కూర్చొని ఉండగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నిలబడి ఉన్నారు. దీనిని పలువురు తప్పు పడుతున్నారు. వయోభారం వల్ల ఆడ్వాణీ కూర్చోవచ్చుగానీ.. రాష్ట్రపతి నిల్చున్నప్పుడు ప్రధాని మోదీ కూర్చోవటమేమిటని ప్రశ్నిస్తున్నారు. ప్రధాని మోదీ ఉద్దేశపూర్వకంగానే ఆదివాసీ మహిళ అయిన రాష్ట్రపతిని అవమానిస్తున్నారని కాంగ్రెస్ ఆరోపించింది. ఈ అంశంపై తెలంగాణ కాంగ్రెస్ పార్టీ కూడా స్పందిస్తూ.. 'ప్రధాని మోదీ గారు.. ఆదివాసీ అంటే చులకనా? రాష్ట్రపతి పదవి అంటే చులకనా? లేక ప్రజాస్వామ్యం అంటేనే చులకనా?' అని ఎక్స్‌లో ప్రశ్నించింది.


కుంచనపల్లిలో అపార్టుమెంట్ వాసుల సమావేశంలో ప్రసంగిస్తున్న లోకేశ్

మైనింగ్ దోపిడీ నిగ్గుతేలుస్తాం

» అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటాం: లోకేశ్

మంగళగిరి, మార్చి 31: 'రాష్ట్రంలోని సహజ వనరులను అడ్డగోలుగా దోచుకున్నారు. మైనింగ్ శాఖలో భారీగా అక్రమాలకు పాల్పడ్డారు. ఎన్జీటీ నిబంధనలను బేఖాతరు చేశారు. ఈ చర్యలతో రాష్ట్ర ఖజానాకు పెద్దఎత్తున నష్టం వాటిల్లింది. మేం అధికారంలోకి వచ్చాక జే గ్యాంగ్ యథేచ్ఛగా సాగించిన మైనింగ్ దోపిడీపై పూర్తిస్థాయి విచారణ జరిపించి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటాం' అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ హెచ్చరించారు. మంగళగిరి టీడీపీ అభ్యర్థి లోకేశ్ ఆదివారం తాడేపల్లి మండలం కుంచనపల్లిలోని అన్నపూర్ణ రెసిడెన్సీ అపార్టుమెంట్‌వాసులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయిదేళ్ల జగన్ పాలనలో జ్యుడీషియరీ తప్ప మిగతా వ్యవస్థలన్నీ ధ్వంసమయ్యాయని మండిపడ్డారు. ప్రజాప్రభుత్వం ఏర్పటయ్యాక ఈ వ్యవస్థలన్నింటినీ తిరిగి బలోపేతం చేస్తామని, చట్టాలను అందరూ గౌరవించే విధంగా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. సరళతరమైన ఇసుక విధానాన్ని అమల్లోకి తెచ్చి నిర్మాణ రంగానికి పూర్వవైభవం తీసుకొస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధి, సంక్షేమాలను జోడెడ్ల బండిలా నడిపించాలన్నదే టీడీపీ సిద్ధాంతమని తెలిపారు. యువతకు ఉద్యోగాల కల్పనే తమ మొదటి ప్రాధాన్యమని లోకేశ్ పేర్కొన్నారు. ఎన్నికల తర్వాత రాజకీయాలకు అతీతంగా వలంటీర్ వ్యవస్థను అభివృద్ధి చేసి ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య సంక్షేమ వారధిగా తీర్చిదిద్దుతామని చెప్పారు.

మెరుగైన ఇసుక పాలసీ తెస్తాం

అమరావతి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చాక మెరుగైన ఇసుక పాలసీతో ఇసుకను అందుబాటులోకి తెస్తామని లోకేశ్ చెప్పారు. అమరావతి పనులు కొనసాగించి, అందరికీ చేతినిండా పని కల్పిస్తామని భరోసా ఇచ్చారు. భవన నిర్మాణ కార్మికులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఆదివారం ఉండవల్లి నివాసంలో భవన నిర్మాణ కార్మికులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ టీడీపీ పాలనలో ట్రాక్టర్ ఇసుక రూ.1,500 ఉంటే, నేడు రూ.5-7వేలకు పెరిగింది. జగన్ పాలనలో ఆత్మహత్యలు భవన నిర్మాణ కార్మికులతోనే ప్రారంభమయ్యాయి. ఇసుక కొరతతో కార్మికుల నుంచి పురోహితుల వరకు ఇబ్బందులు పడుతున్నారు. చంద్రబాబు హయంలో చంద్రన్న బీమా అమలు చేస్తే.. జగన్‌రెడ్డి బీమాను రద్దు చేశాడు. టీడీపీ అధికారంలోకి రాగానే బీమా పథకంతో పాటు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తాం. వృత్తి నైపుణ్యాన్ని పెంచేలా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి, కార్మికుల ఆదాయం రెట్టింపయ్యేలా చర్యలు తీసుకుంటాం' అని తెలిపారు. ఇసుక కొరతతో పనులు లేక ఇబ్బందులు పడుతున్నామని, కరెంటు చార్జీల భారాన్ని తగ్గించి, ఇల్లు లేని కార్మికులకు స్థలమిచ్చి, ఇళ్లు నిర్మించాలని భవన నిర్మాణ కార్మికుల నేతలు లోకేశ్‌ను కోరారు.

వందరోజుల్లో ఆర్ఎంపీల సమస్యల పరిష్కారం

యువగళం పాదయాత్రలో తాను ప్రత్యక్షంగా చూసిన ఆర్ఎంపీల సమస్యలను టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే పరిష్కరిస్తానని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చెప్పారు. ఆదివారం ఉండవల్లిలోని నివాసంలో ఆర్ఎంపీలు, మెడికల్ షాపుల అసోసియేషన్ ప్రతినిధులతో ఆయన ముఖాముఖి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ 'ఆర్ఎంపీలకు మెరుగైన శిక్షణ, గుర్తింపు కోసం టీడీపీ ప్రభుత్వంలో ఇచ్చిన జీవో 429ని వైసీపీ సర్కార్ నిలిపివేసింది. జీవో పునరుద్ధరణతో పాటు మెడికల్ అసోసియేషన్‌తో చర్చించి, సమస్యల్ని పరిష్కరిస్తాం. మెడికల్ షాపులపై పన్నుల భారం తగ్గించి, ప్రభుత్వ వేధింపులకు అడ్డుకట్ట వేస్తాం' అని హామీ ఇచ్చారు. ప్రభుత్వ వైద్యఆరోగ్య కార్యక్రమాల్లో ఆర్ఎంపీలను భాగస్వామ్యం చేసి, అసోసియేషన్‌కు భవనం నిర్మించాలని ప్రతినిధులు కోరారు.


కార్యకర్తలు ఇచ్చిన నాగలితో చంద్రబాబు

"బాబాయిని చంపించిన.. కోడికత్తి డ్రామా ఆడిన.. కంటైనర్లలో డబ్బులు పంపించే.. అక్రమ కేసులు బనాయించే వ్యక్తి సీఎంగా కావాలా? అసలిలాంటి వ్యక్తి ముఖ్యమంత్రిగా వస్తాడని నా రాజకీయ జీవితంలో ఏనాడూ ఊహించలేదు.

తమిళనాడులో అమ్మ క్యాంటీన్లు, కర్ణాటకలో ఇందిరా క్యాంటీన్లను అక్కడి ప్రభుత్వాలు కొనసాగించాయి. ఇక్కడ మాత్రం జగన్ వచ్చాక అన్న క్యాంటీన్లు తీసివేసి పేదల కడుపు కొట్టాడు.

జగన్ విశ్వసనీయత లేని దుర్మార్గుడు. ఇలాంటి వ్యక్తికి రాజకీయాల్లో ఉండే అర్హతే లేదు. అందుకే ప్రజలంతా పోలింగ్ వరకూ ఇదే ఉత్సాహాన్ని చూపించి ఎన్నికలు ఏకపక్షంగా జరిగేలా చూడాలి."

- చంద్రబాబు


బాపట్లలో ప్రజాగళం సభకు హాజరైన జనం

జగన్ చేసింది అప్పులే

(మొదటి పేజీ తరువాయి)

భాగంగా ఆదివారం ఆయన ప్రకాశం జిల్లా మార్కాపురం, కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు, బాపట్ల జిల్లా కేంద్రంలో జరిగిన భారీ బహిరంగ సభల్లో ప్రసంగించారు. జగన్ ఈ ఐదేళ్లలో రూ.13 లక్షల కోట్ల అప్పు చేశాడని, వాటిని ఆయన రోత పత్రిక తీరుస్తుందా.. భారతీ సిమెంట్స్ తీరుస్తుందా అని నిలదీశారు. ఈ సీఎం నవ్వించి గొంతు కోసే రకమని దుయ్యబట్టారు. రాయలసీమ బిడ్డనని చెప్పుకొంటూ ఈ ప్రాంతానికి ఏమీ చేయలేదన్నారు. ఈ ప్రాంతంలో ఒక్క ఇరిగేషన్ ప్రాజెక్టయినా పూర్తి చేశాడా.. కర్నూలు ప్రాంతానికి కనీసం నీళ్లు ఇవ్వాలన్న ఆలోచనైనా చేశాడా.. పేదలు, యువత భవిష్యత్ గురించి ఆలోచించాడా అని నిలదీశారు. ఆయన రాయలసీమ ద్రోహి అని.. ఒక్క ఓటు వేసినా మన నెత్తిన మనమే చెత్తవేసుకున్నట్లు అవుతుందని హెచ్చరించారు. రాష్ట్ర విభజన సమయంలో ఏపీ కన్నా తెలంగాణలో తలసరి ఆదాయం 35శాతం అధికంగా ఉంటే 2014-19లో దానిని 27శాతానికి తగ్గేలా చేశామని.. జగన్ వచ్చాక తేడా 45 శాతానికి పెరిగిందని.. బటన్ నొక్కి పేదల సంక్షేమం చేస్తే ఇంత వ్యత్యాసం ఎందుకొచ్చిందని ప్రశ్నించారు. ఐదేళ్లుగా రాష్ట్రాన్ని పట్టి పీడిస్తున్న శని మే 13తో విరగడైపోతుందని చెప్పారు. ఇంకా ఏమన్నారంటే..

ఫ్యాన్ చెత్తబుట్టలోకే..

ఈ ఎన్నికల్లో ఫ్యాన్ ముక్కలై చెత్తబుట్టలో పడేయడం ఖాయం. గత ఐదు రోజులుగా వివిధ ప్రాంతాల్లో తిరుగుతున్నా. ప్రజలు ఉత్సాహంగా ఉన్నారు. ఎన్నికల్లో కూటమి విజయం ఖాయమని తేలిపోయింది. వైసీపీ చిత్తుచిత్తుగా ఓడిపోతుంది. అందులో అనుమానం లేదు. సంపద సృష్టించి, ఆదాయం పెంచి రూ.10తో వేలు సంపాదించే మార్గం ప్రజలకు నేను చూపిస్తా. జగన్‌కు అసలు విశ్వసనీయత అనేది ఉందా? కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తానన్నాడు.. మద్య నిషేధం చేస్తానన్నాడు.. అధికారంలోకి వచ్చిన వారంలో సీపీఎస్ రద్దు చేస్తానన్నాడు., ఏటా జాబ్ కేలెండర్, మెగా డీఎస్సీలను తెస్తానన్నాడు.. గద్దెనెక్కాక ఒక్కటైనా చేశాడా? బాబాయి హత్య కేసులో నిందితుడైన ఎంపీని పక్కన పెట్టుకుని బాధితులనే నిందితులుగా భావించేలా చేస్తున్నాడు. కూటమిని గెలిపించాలని ఇప్పటికే ప్రజలు నిర్ణయానికి వచ్చిన విషయం స్పష్టంగా కనిపిస్తోంది. జగన్ లాంటి దుర్మార్గుడిని అసలు రాజకీయాల్లోనే లేకుండా చేయాలి. ఐదేళ్లుగా కొనసాగుతున్న అరాచక పాలనపై రచ్చబండలు, ఆర్టీసీ బస్సులు, టీ దుకాణాలు, రైల్వే స్టేషన్లు.. ఇలా అన్ని చోట్లా విస్తృతంగా చర్చ జరగాలి.

పొత్తుకు ఆద్యుడు పవన్

ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని, విధ్వంసకర వైసీపీ పాలన అంతం కావాలన్న ఉద్దేశంతో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి పొత్తుకు ఆద్యుడు పవన్. మూడు పార్టీలు కలవడం మాకోసం, మా రాజకీయాల కోసం కాదు. ప్రజలు గెలవాలి, ఏపీ బాగుండాలన్న ఉద్దేశంతోనే! ఈ విషయాన్ని ప్రజలంతా గుర్తించాలి. మేం కలిస్తే జగన్ ఎందుకు కంగారుపడుతున్నాడు? ముస్లింలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నాడు. గతంలో రెండుసార్లు ఎన్డీయేలో భాగస్వామిగా ఉన్నా.. ఏ ఒక్క ముస్లిం హక్కులకూ భంగం కలగకుండా చూశాం. మా పిల్లల భవిష్యత్ నీవే చంద్రన్నా అంటూ ఈ రోజు ముస్లింలు ముందుకొస్తున్నారు.

'మిచౌంగ్' ముంచేసినా రైతులను ఆదుకోలేదు

డిసెంబరులో మిచౌంగ్ తుఫాన్ వచ్చి రైతాంగం చితికిపోయింది. అన్నదాతలను ఆదుకోలేని చెత్త ప్రభుత్వం ఇది. రైతంటే కనీసం గౌరవం లేదు. ధాన్యం కొనే దిక్కు లేదు. రైతుల పరామర్శకు వచ్చేటపుడు పరదాలు కట్టుకుని రెడ్ కార్పెట్ వేయించుకున్న ఘనత ఈ ముఖ్యమంత్రిది. ఆకాశంలో చక్కర్లు కొట్టాడు తప్ప రైతులను ఆదుకోలేదు. అమరావతి, పోలవరం రాష్ట్రానికి రెండు కళ్లు. రాజధానిని ధ్వంసంచేశాడు. పోలవరం ప్రాజెక్టును గోదావరిలో కలిపేశాడు. 80శాతం పనులు జరిగిన వెలిగొండలో మిగిలిన 20శాతం చేయకుండానే ఓట్ల కోసం రిబ్బన్ కత్తిరించాడు. ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన నేనే తిరిగి అధికారంలోకి వచ్చాక నీళ్లు ఇస్తా. మార్కాపురం కేంద్రంగా జిల్లాను ఏర్పాటు చేస్తా. ఈ సీఎం విచిత్రమైన మనిషి. నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు, నా మైనారిటీలు అంటూనే వారిని బాధితులుగా చేయడంతో పాటు పథకాలనూ అటకెక్కించాడు. ఈ మధ్య వివేకం అనే సినిమా వచ్చింది. ఆ సినిమా చూడండి ప్యాలెస్ కుట్రలు ఎలాంటివో తెలిసిపోతుంది. ఆ సినిమా ఎవరు తీశారో గానీ.. కుట్రలు చాలా స్పష్టంగా చూపించారు.

రూ.250 కోట్ల ఆస్తి ఉన్న పేద..

బుట్టా రేణుక పేద మహిళ అంటూ శుక్రవారం ఇదే ఎమ్మిగనూరులో జరిగిన సభలో జగన్ ప్రకటించారు. అవును.. ఆమె రూ.250కోట్ల ఆస్తి ఉన్న పేదరాలే. 2014లో అఫిడవిట్‌లో ఆమె చూపించిన ఆస్తులే అంత ఉన్నాయి. మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఇసుక, మట్టి, మద్యమే కాదు, చివరకు మంత్రాలయం దేవుడిని కూడా మింగేశాడు. అలాంటివ్యక్తికి సీటిచ్చి ఆయన పేదవాడని చెప్పాడు. 1983లో వాళ్ల నాన్న టీడీపీలోనే ఉన్నాడు. యుద్ధాల్లో సామంతరాజులను చంపేసి రాజ్యాన్ని పంచుకున్నట్లు ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి సోదరులు నాయకులను అణగదొక్కి గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం పంచుకున్నారు.. దోచుకుంటున్నారు. సేవాభావంతో రాజకీయాల్లోకివచ్చి మూడు దశాబ్దాలకు పైగా మాగుంట కుటుంబం ప్రకాశం జిల్లాలో పనిచేస్తోంది. అలాంటి మాగుంట శ్రీనివాసులరెడ్డిని అవమానించిన జగన్.. ఎర్రచందనం దొంగ, రౌడీయిజం ద్వారా డబ్బు సంపాదించే వ్యక్తిని ఇక్కడ ఎంపీగా పోటీకి నిలిపాడు. మనకు రౌడీలు, స్మగ్లర్లు కావాలో.. సేవ చేసే నాయకులు కావాలో ప్రజలు ఆలోచించాలి.

నేనే డ్రైవర్‌గా ఉంటా...

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణానికి నేనే డ్రైవర్‌గా ఉండి సురక్షితంగా గమ్యం చేరుస్తా. 18 ఏళ్ల పైబడిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఇస్తాం. మహిళలకు మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం. నిరుద్యోగ భృతి రూ.3,000 ఇస్తాం. ఆక్వా రైతులకు రూ.1.50కే కరెంటు ఇస్తాం. టీడీపీ హయాంలో మొత్తం 11 సార్లు డీఎస్సీ వేశాం. ఐదేళ్లలో ఒక్కసారి కూడా వేయలేని దద్దమ్మ ప్రభుత్వమిది. ఏపీపీఎస్సీలో ఉద్యోగాలు అమ్ముకున్నారు. మేమొచ్చాక ఏపీపీఎస్సీ ద్వారా ఉద్యోగాల భర్తీ చేపడతాం. చిందరవందరగా మిగిలిన రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెడతాం.

టీడీపీ డీఎన్ఏలోనే బీసీ

టీడీపీ పేదల పక్షపాతి. మన పార్టీ డీఎన్ఏలోనే బీసీ ఉంది. బీసీలను గుండెల్లో పెట్టుకునే పార్టీ. కురుబ సామాజిక వర్గానికి చెందిన సామాన్య ఎంపీటీసీ నాగరాజుకు కర్నూలు లోక్‌సభ టికెట్ ఇచ్చాం. మంత్రాలయంలో వాల్మీకులకు చెందిన రాఘవేంద్రకు, ఆలూరులో వీరశైవలింగాయత్‌కు చెందిన వీరభద్ర గౌడ్‌కు, పత్తికొండలో ఈడిగ కులానికి చెందిన కేఈ శ్యాంబాబుకు ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చాం. పొత్తుల్లో భాగంగా బీజేపీకి ఆదోని సీటు ఇస్తే ఆ పార్టీ కూడా వాల్మీకులకు చెందిన డాక్టర్ పీవీ పార్థసారథికి టికెట్‌ఇచ్చింది. కోడుమూరులో ఎస్సీ మాదిగ కులానికి చెందిన బొగ్గుల దస్తగిరికి, కర్నూలులో ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన టీజీ భరత్‌కు టికెట్ ఇచ్చాం. ఎమ్మిగనూరులో టీడీపీ డీఎన్ఏ కలిగిన బీవీ కుటుంబానికి చెందిన బీవీ జయనాగేశ్వరరెడ్డికి టికెట్ ఇచ్చాం. సామాజిక న్యాయం అంటే ఇదీ! మనం అధికారంలోకి రాగానే అధికారికంగా కుల గణన చేసి దామాషా ప్రకారం నిధులు కేటాయించి బీసీలకు న్యాయం చేస్తాం. బోయలను (వాల్మీకులు) ఎస్టీలుగా కురవ, బుడగ జంగాలను ఎస్సీలుగా మార్చేందుకు కట్టుబడి ఉన్నాం. రూ.5 వేల కోట్లతో ఆదరణ పథకం తీసుకువచ్చి పనిముట్లు అందిస్తాం. చంద్రన్న బీమాతో 10లక్షల ఆర్థిక సహాయం, శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలు, బీసీ భవనాలు, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం.. అన్నీ చేస్తాం. ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నాం. మాల, మాదిగ, రెల్లి వర్గాలను అన్ని విధాలుగా ఆదుకుంటాం. చేనేతలను అన్ని రకాలుగా ఆదుకున్నది మేమే. చేనేత మగ్గం ఉంటే 200 యూనిట్లు, పవర్‌లూమ్ ఉంటే 500 యూనిట్లు ఉచితంగా కరెంటు ఇస్తాం. ఫైనాన్స్ కార్పొరేషన్ పెట్టి వారిని ఆర్థికంగా ఆదుకుంటాం. ఎమ్మిగనూరు కేంద్రంగా టెక్స్‌టైల్ పార్కు తీసుకొస్తాం. బీసీ డిక్లరేషన్‌లో భాగంగా 50 ఏళ్ల పైబడిన బీసీలకు ఇంట్లో ఎంత మంది ఉన్నా ప్రతి ఒక్కరికీ రూ.4 వేల చొప్పున పెన్షన్ ఇస్తాం.

వచ్చేది మనమే!

» 3 పార్టీల కూటమి విజయం ఖాయం: పవన్

» పిఠాపురంలో ఆత్మీయ సమావేశం

పిఠాపురం, మార్చి 31: రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో విజయం సాధించి రాబోయేది జనసేన-టీడీపీ-బీజేపీ కూటమి ప్రభుత్వమేనని జనసేన అధినేత పవన్ కల్యాణ్ పునరుద్ఘాటించారు. భారీ మెజారిటీతో సీట్లు గెలవబోతున్నామని తెలిపారు. ప్రస్తుతం అమలు చేస్తున్న ఏ సంక్షేమ పథకం ఆగిపోదని.. ఈ విషయాన్ని స్పష్టంగా అందరికీ తెలియజేయాలని మూడు పార్టీల నేతలకు పిలుపిచ్చారు. ఆదివారం కాకినాడ జిల్లా పిఠాపురం మండలం కుమారపురం గోకులం గ్రాండ్‌లో ఆదివారం పిఠాపురం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవం, ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసి సైబరాబాద్ వంటి ప్రత్యేక నగరాన్ని తయారు చేసిన అనువజ్ఞుడు, టీడీపీ అధినేత చంద్రబాబును జగన్ ప్రభుత్వం అకారణంగా, కక్షపూరితంగా జైలులో పెట్టినప్పుడు బాధేసిందని జనసేనాని పవన్ కల్యాణ్ అన్నారు. రాజమహేంద్రవరం వెళ్తున్నప్పుడు దారిపొడవునా టీడీపీ కార్యకర్తలు తమ నాయకుడి కోసం పడిన తపన తనను కదిలించిందని, అందుకే సెంట్రల్ జైలులో చంద్రబాబును కలిశాక తన వంతుగా ఏదైనా చేయాలని భావించి కచ్చితంగా వచ్చే ఎన్నికల్లో రెండు పార్టీలు కలిసి వెళ్తాయని ప్రకటించానని ఆయన తెలిపారు. అప్పుడు తాను చెప్పినట్లుగానే బీజేపీ తమతో కలిసి వచ్చిందని చెప్పారు. ఆ పార్టీ కోసం ఎంపీ సీట్లు తగ్గించుకున్నానని తెలిపారు. తాను పొత్తు కోసం ఎంత తపించానో.. మూడు పార్టీల నాయకులు గెలుపు కోసం అంతే కష్టపడాలని సూచించారు. చిన్న చిన్న ఇబ్బందులు ఉన్నా వాటిని అధిగమించి పనిచేయాలని కోరారు. 'మూడు పార్టీల మధ్య సమన్వయంతో పొత్తులతో ఎన్నికలకు వెళ్లాలంటే ఎన్నో అలకలు, మరెన్నో సంఘర్షణలు ఉంటాయి. ఇవేమీ లేకుండా వైసీపీ రాక్షస పాలన నుంచి రాష్ట్రాన్ని విముక్తి చేయాలనే ఏకైక లక్ష్యంతో ఎలాంటి అరమరికలు లేకుండా పొత్తు కుదిరింది. జనసేన ఎన్ని సీట్లలో పోటీ చేయాలో నేను లెక్కలు వేయలేదు. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ బాగుండాలి, వైసీపీ కీచక పాలనను తరిమికొట్టాలనే ముందుకెళ్లాను. టీడీపీ, జనసేనల్లో పొత్తుకు సానుకూలంగా 70-80శాతం మంది ఉన్నారు. దీనివల్లే ముందడుగు పడింది. అయితే పొత్తుల వల్ల జనసేన నాయకులు నలిగిపోయారు. ఎక్కువ స్థానాల్లో పోటీ చేయలేకపోయామని బాధపడ్డారు. మనకు యువ బలం, పోరాడేతత్వం మెండుగా ఉన్నా.. టీడీపీ, బీజేపీ వంటి బలమైన పునాదులు, సమూహాన్ని క్రమశిక్షణతో నడిపించే మెకానిజం ఇంకా సంపాదించలేదు. ఎన్నికల సమయంలో దశాబ్దాలుగా రాజకీయం చేస్తున్న పార్టీల ఎత్తుగడలు, ఎలక్షనీరింగ్, సమన్వయం చాలా కీలకం' అని వివరించారు. 'ఇప్పుడు ఇస్తున్న పథకాల కంటే అధికంగానే సంక్షేమ ఫలాలు పంచుతాం. మద్యం, గంజాయి, ఇసుక, ల్యాండ్ మాఫియా వంటి వాటిని అరికడితే అన్ని పథకాలకు కచ్చితంగా డబ్బులు సర్దుబాటవుతాయి. వైసీపీ దోపిడీ అరికడితే అప్పులు చేయకుండానే సంక్షేమ పథకాలు అమలు చేయవచ్చు. ఎన్నికల కోడ్ వల్ల ప్రతినెలా ఒకటో తేదీన అందాల్సిన సామాజిక పింఛన్లు ఈ నెల ఆలస్యం కావచ్చు. వలంటీర్లు లేకుండా పింఛన్లు సక్రమంగా పంపిణీ చేసేందుకు మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎన్నికల నియామవళికి అనుగుణంగా అధికారులకు సహకరించాలి' అని సూచించారు. సమావేశంలో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ, గిరీశ్ వర్మ, బీజేపీ ఇన్‌చార్జి బుర్రా కృష్ణంరాజు, కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ పాల్గొన్నారు.


పిఠాపురం శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో పూజలు నిర్వహిస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్


పిఠాపురంలో జరిగిన జనసేన, టీడీపీ, బీజేపీ ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న పవన్

ఆలయాల్లో పూజలు..

పిఠాపురం పాదగయ క్షేత్రంలో కొలువై ఉన్న పురుహూతికా అమ్మవారిని పవన్ ఆదివారం దర్శించుకుని పట్టుచీర సమర్పించారు. అష్టోత్తర కుంకుమార్చనలో పాల్గొన్నారు. కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. శ్రీపాద శ్రీవల్లభ మహాసంస్థానంలో పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని ఔదంబర వృక్షానికి కొబ్బరికాయ ముడుపు కట్టారు. స్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు.

జ్వరంతో హైదరాబాద్ పయనం.. నేడు తిరిగిరాక

జ్వరం, గొంతునొప్పితో రెండ్రోజులుగా బాధపడుతున్న పవన్.. ఆదివారం తన పర్యటన ముగించుకుని సాయంత్రం హెలికాప్టర్‌లో హైదరాబాద్ వెళ్లారు. అక్కడ చికిత్స చేయించుకుని సోమవారం తిరిగి వస్తారని జనసేన వర్గాలు తెలిపాయి.

'విశాఖ దక్షిణం' అభ్యర్థి వంశీకృష్ణ యాదవ్

» ప్రకటించిన జనసేన అధినేత పవన్ కల్యాణ్

అమరావతి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం దక్షిణ అసెంబ్లీ స్థానం నుంచి జనసేన అభ్యర్థిగా సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాసయాదవ్ బరిలోకి దిగుతున్నట్లు ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ప్రకటించారు. ఈ మేరకు జనసేన పార్టీ కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా పిఠాపురం నియోజకవర్గంలో పర్యటిస్తున్న పవన్.. ఆదివారం ఉదయం పార్టీ ముఖ్యులతో వివిధ అంశాలపై చర్చించారు. ఈ క్రమంలో విశాఖ దక్షిణ స్థానం అభ్యర్థిగా వంశీకృష్ణ యాదవ్ పేరును ఆయన ఖరారు చేశారు.

ఎన్నికల పర్యవేక్షణకు ఐదుగురు సభ్యుల కమిటీ

ఎన్నికల్లో జనసేన పార్టీ పోటీ చేస్తున్న అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో ఎన్నికల పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటైంది. పార్టీ ఉపాధ్యక్షుడు బి.మహేందర్ రెడ్డి, రాజకీయ కార్యదర్శి పి.హరిప్రసాద్, జాతీయ అధికార ప్రతినిధి వేములపాటి అజయ్‌కుమార్, అనపర్తి ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్, అధికార ప్రతినిధి కె.శరత్‌కుమార్‌ను కమిటీ సభ్యులుగా పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ప్రకటించారు.

జనసేనలోకి మండలి బుద్ధప్రసాద్

» నేడు పవన్ సమక్షంలో పార్టీలో చేరిక

అవనిగడ్డ, మార్చి 31: సీనియర్ రాజకీయవేత్త, మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ టీడీపీకి రాజీనామా చేసి జనసేన పార్టీలో చేరనున్నారు. పొత్తులో భాగంగా అవనిగడ్డ సీటును జనసేనకు కేటాయించటంతో బుద్ధప్రసాద్ పోటీ చేసేందుకు అవకాశం లేకుండాపోయింది. ఆయన అభిమానులు జనసేన నుంచి పోటీ చేయాలని కొద్దిరోజులుగా కోరుతూ వస్తున్నారు. అంతేకాకుండా టీడీపీ, జనసేన ముఖ్యనేతలు ఆయనకు జనసేనలో చేరాలని సూచించారు. ఆదివారం ఆయన అవనిగడ్డలో టీడీపీ పార్టీ సమన్వయ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి తన అభిప్రాయం వెల్లడించారు. సోమవారం పిఠాపురంలో పవన్ కల్యాణ్‌ను కలసి అధికారికంగా జనసేనలో చేరనున్నారు. కూటమి అభ్యర్థిగా ఆయన పేరును జనసేన తరఫున దాదాపుగా ఖరారు చేస్తారని నియోజకవర్గంలో ప్రచారం జరుగుతోంది.

జగన్ పెదాలపైనే బీసీలు.. గుండెల్లో లేరు

» అందరి నెత్తినా అప్పు పెట్టిన సీఎం అవసరమా?: పురందేశ్వరి



అమరావతి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మనకు మన బిడ్డలకే కాదు.. మనవళ్లు, మనవరాళ్లపైనా ఒక్కొక్కరి నెత్తిన 2లక్షలకు పైగా అప్పు పెట్టిన ఈ ముఖ్యమంత్రి మళ్లీ మనకు అవసరమా? అని రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ప్రశ్నించారు. 'నా బీసీలు, నా ఎస్సీ, ఎస్టీలు అంటోన్న జగన్ గుండెల్లో ఎప్పటికీ ఆ వర్గాలు ఉండాలి.. కానీ ఆయన మాటల్లో తప్ప ఇంకెక్కడా వారికి చోటులేదు' అని ఆమె వ్యాఖ్యానించారు. విజయవాడలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆమె మాట్లాడుతూ 'మీ అకౌంట్లో డబ్బులు పడితేనే వైసీపీని ఆదరించాలని ఎన్నికల సభల్లో డ్రామాలు ఆడుతున్నారు. ఇచ్చింది గోరంత వాళ్ల నెత్తిన పెట్టిన అప్పు కొండంత అన్న విషయం అర్థమైన అన్ని వర్గాల ప్రజలు వైసీపీని ఇంటికి పంపేందుకు సిద్ధమయ్యారు' అని అన్నారు. 'మాట తప్పి, మడమ తిప్పి నాసిరకం మద్యం వైసీపీ ప్రభుత్వమే అత్యధిక ధరలకు విక్రయిస్తూ జనాన్ని దోచేస్తూ మహిళల పుస్తెలు తెంచేస్తుంటే.. ఆ వితంతువులు మీకేలా ఓటేస్తారు' అంటూ పురందేశ్వరి మండిపడ్డారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై కర్రలతో దాడి

హరిపురం, మార్చి 31: ఆర్టీసీ హైర్ బస్‌ను దారికాచి కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు శ్రీకాకుళం జిల్లా గౌడగురంటి గ్రామానికి చెందిన గాడి దేవరాజు విధులకు హాజరయ్యేందుకు ఇంటి నుంచి పలాస డిపోకు బైక్‌పై బయలుదేరారు. బుడార్సింగి వద్ద కొందరు ఆయనపై కర్రలతో దాడి చేశారు. దాడికి పాల్పడిన వారంతా సివిల్ డ్రెస్‌లో ఉన్న పోలీసులని దేవరాజు చెప్పారు. తమ కుటుంబం ఇటీవల టీడీపీలో చేరడంతో సర్పంచి సురేశ్ పాణిగ్రాహి కక్షతో దాడి చేయించాడని ఆరోపించారు.

ఆంధ్ర కాంగ్రెస్ అభ్యర్థుల జాబితాకు నేడు ఆమోదం!

న్యూఢిల్లీ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపిక కొలిక్కి వచ్చినట్లు తెలిసింది. మొత్తం 175 అసెంబ్లీ, 25 లోక్‌సభ స్థానాలకు సంబంధించి జాబితా సిద్ధమైందని సమాచారం. సోమవారం జరిగే కేంద్ర ఎన్నికల కమిటీ(సీఈసీ) భేటీలో దానికి ఆమోదముద్ర వేసే అవకాశం ఉంది. ఆదివారమిక్కడ ఏఐసీసీ స్క్రీనింగ్ కమిటీ ఇన్‌చార్జి మధుసూదన్ మిస్త్రీ ఇంట్లో రాష్ట్ర స్క్రీనింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఏఐసీసీ స్క్రీనింగ్ కమిటీ సభ్యులు సూరజ్ హెగ్డే, మాణిక్కం ఠాగూర్‌తోపాటు పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి, రఘువీరారెడ్డి, కొప్పుల రాజు హాజరయ్యారు.

అచ్చెన్నకు మాతృవియోగం

టెక్కలి, మార్చి 31: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు తల్లి కింజరాపు కళావతి(90) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. స్వగ్రామమైన శ్రీకాకుళం జిల్లా నిమ్మాడలో ఆమె కన్నుమూశారు. దీంతో నిమ్మాడలో విషాదఛాయలు అలుముకున్నాయి. కళావతి మృతదేహానికి సోమవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. కళావతమ్మ మృతి పట్ల చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. అచ్చెన్నకు ఫోన్ చేసి ఓదార్చారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అచ్చెన్నకు నారా లోకేశ్ ఫోన్ చేసి సంతాపం తెలిపారు.

పెన్షన్లతో ఓట్లాట

(మొదటి పేజీ తరువాయి)

బాధ్యతల నుంచి తొలగించడంతో పెన్షన్ల పంపిణీ జరగడం లేదని, చంద్రబాబుకు ఓటు వేస్తే వలంటీర్లను తొలగిస్తారని, సామాజిక పెన్షన్లు ఇక అందవన్న ప్రచారానికి వైసీపీ నేతలు తెరలేపారు. వలంటీర్లను లబ్ధిదారుల కుటుంబాల వద్దకు పంపి అబద్ధాలు ప్రచారం చేయిస్తున్నారు. అంతేగాక పెన్షన్ల పంపిణీకి నిధులు అందనీయకుండా మరింత ఆలస్యం చేసి పెన్షన్‌దారులను ఇబ్బందులు పెట్టే యోచనలో సర్కార్ ఉన్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో పెన్షన్ల పంపిణీ సకాలంలో జరిగేలా అన్ని రకాల చర్యలు తీసుకోవాలంటూ ప్రతిపక్షాలు ప్రభుత్వానికి లేఖలు రాశాయి.

నిధులివ్వకుండా కుట్ర!

ఇన్నాళ్లూ ప్రతినెలా ఒకటో తేదీన పెన్షన్ల పంపిణీకి నిధులు సమకూర్చిన సర్కార్.. ఏప్రిల్ నెలలో పంపిణీకి ఆ మేరకు చర్యలు తీసుకోవడం లేదు. ఆర్థిక సంవత్సరం ముగింపు కావడంతో ఏప్రిల్ 3వ తేదీ నుంచి పెన్షన్లు అందిస్తామని చెప్తోంది. అయితే గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఈ దఫా పెన్షన్ల పంపిణీకి 10 రోజులు సమయం పడుతుందని సీఎస్ పేర్కొన్నారు. కావాలనే నిధులు సకాలంలో ఇవ్వకుండా పెన్షన్ల పంపిణీని ఆలస్యం చేసేందుకు వైసీపీ సర్కార్ కుట్ర చేస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. వలంటీర్లు పెన్షన్లు ఇస్తే వైసీపీ ఇచ్చినట్టుగా, ఇప్పుడు వలంటీర్లను బాధ్యతల నుంచి తప్పించడం వల్లే పెన్షన్లు అందడం లేదని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులను నమ్మించేలా వైసీపీ దుష్ప్రచారం చేయిస్తోంది. చంద్రబాబు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం వల్లే వలంటీర్లతో పెన్షన్ పంపిణీ చేయకుండా నిలిపేశారని పెన్షన్‌దారులకు నూరిపోయిస్తోంది. మళ్లీ జగన్ ప్రభుత్వం వస్తేనే పెన్షన్ల పంపిణీ సక్రమంగా జరుగుతుందనే ప్రచారాన్ని ఉధృతం చేసింది. అందుకే పెన్షన్ల పంపిణీని మరికొన్ని రోజులు సాగదీసే యోచన సర్కార్ చేస్తోందనే విమర్శలు వస్తున్నాయి.

సకాలంలో పంపిణీ చేయలేరా?

వాస్తవానికి గ్రామ, వార్డు సచివాలయాల్లో పెన్షన్ల పంపిణీ ప్రక్రియను ఆ ఉద్యోగుల ఆధ్వర్యంలోనే చేపడతారు. సంక్షేమ కార్యదర్శి బ్యాంకుల నుంచి డబ్బులు తీసుకొచ్చి ఆయా వలంటీర్లకు అందిస్తారు. ప్రతి వలంటీరు తమకు కేటాయించిన 50 ఇళ్లల్లో పెన్షన్ల పంపిణీ చేపడతారు. ఒక్కో వలంటీర్‌కు సుమారుగా 20 నుంచి 40 మందికి మాత్రమే పెన్షన్లు పంపిణీ చేసే బాధ్యత ఉంటుంది. రాష్ట్రవ్యాప్తంగా 66 లక్షల పెన్షన్లను రెండున్నర లక్షల మంది వలంటీర్లు ఒకటి రెండు రోజుల్లో పంపిణీ చేస్తున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వలంటీర్లను పక్కనపెట్టినా, గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు ద్వారా పెన్షన్ల పంపిణీ చేపడితే అదనంగా మరో రెండు రోజులు పట్టే అవకాశం ఉంది. వలంటీర్లకు బదులుగా ఒకటిన్నర లక్షల మంది సచివాలయ ఉద్యోగులు నాలుగు రోజుల్లో పెన్షన్ల పంపిణీ పూర్తి చేయవచ్చు.

గతంలో ఒక్కరే వారంలో పంపిణీ

గతంలో చంద్రబాబు ప్రభుత్వంలో పంచాయతీ కార్యదర్శి పెన్షన్లు పంపిణీ చేసేవారు. ఆయా గ్రామ పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శి ఒక్కరి ద్వారానే వారం రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తయ్యేది. ఇప్పుడు ఒక్కో సచివాలయంలో 8 నుంచి 14 మంది దాకా సిబ్బంది ఉన్నారు. సచివాలయంలో పనిచేసే కార్యదర్శులందరికీ బాధ్యతలు అప్పచెప్తే రెండు మూడు రోజుల్లోనే పెన్షన్ల పంపిణీ ప్రక్రియ పూర్తి చేసే అవకాశాలు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఒకటిన్నర లక్షల మంది సచివాలయ ఉద్యోగులు అందుబాటులో ఉన్నారు. ఏప్రిల్ నెలలో పెన్షన్ల పంపిణీ ఆలస్యమైతే ప్రభుత్వం కావాలని చేస్తోందని, ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు వైసీపీ చేస్తున్న కుట్రేనని భావించాల్సి ఉంటుంది.

సేవ ముసుగులో అరాచకాలు

రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ పాలన పట్ల జనాల్లో తీవ్ర వ్యతిరేకత వస్తోంది. ఎంతోమంది నాయకులు పార్టీని వీడారు. ఈ పరిస్థితుల్లో జగన్ ఎన్నికల్లో గెలిచేందుకు వలంటీర్ల మీదనే ఆధారపడ్డారు. వలంటీర్లు పెన్షన్లు పంపిణీ చేయడం ద్వారా ఆయా కుటుంబాలతో నిత్యం టచ్‌లో ఉన్నారు. వారి ద్వారా ఓటర్లను ప్రలోభపెట్టాలని భావిస్తున్నారు. ఇప్పటిదాకా సొంత, పార్టీ ప్రచారం కోసం వారిని వాడుకున్నారు. ఏదో ఒక కరపత్రం, బుక్‌లెట్ పంపిణీ చేయడం, జగన్ బొమ్మలు ఇళ్ల తలుపులపైన అంటించడం వంటి పనులు చేయించారు.



సచివాలయాల వద్దే పెన్షన్ల పంపిణీ

- ఈసీ ఆదేశాల మేరకు సెర్ప్ మార్గదర్శకాలు

గ్రామ, వార్డు సచివాలయాల వద్దనే పెన్షన్లు పంపిణీ చేపట్టాలని సెర్ప్ ఆదేశాలు జారీ చేసింది. సచివాలయ ఉద్యోగులకు పెన్షన్లను పంపిణీ చేసే బాధ్యతలు అప్పగించింది. పెన్షన్లతో పాటు నగదు బదిలీ పథకాలను వలంటీర్ల ద్వారా చేపట్టవద్దని ఎన్నికల కమిషన్ ఆదేశించడంతో పెన్షన్ల పంపిణీకి సంబంధించి సెర్ప్ సీఈఓ మురళీధర్‌రెడ్డి మార్గదర్శకాలు విడుదల చేశారు. బ్యాంకుల నుంచి పెన్షన్ మొత్తం తీసుకొచ్చేందుకు ఆయా గ్రామ సంక్షేమ కార్యదర్శి, వార్డు విద్యా కార్యదర్శులకు ఆథరైజేషన్ ఇవ్వాలని ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. పెన్షన్ పంపిణీ చేసేటప్పుడు ఎలాంటి ప్రచారాలు చేయకుండా పూర్తి చేయాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు.

పింఛన్లు ఇవ్వడం చేతకాక టీడీపీపై దుష్ప్రచారమా?

- వైసీపీవి దిగజారుడు రాజకీయాలు
- సకాలంలో అందించకపోతే సీఎస్‌దే బాధ్యత: టీడీపీ ఫైర్
- తప్పుడు ప్రచారం చేస్తున్న సజ్జలపై చర్యలకు డిమాండ్

అమరావతి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): పింఛన్ల పంపిణీపై వైసీపీ నేతలు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని టీడీపీ నేతలు మండిపడ్డారు. వలంటీర్లతో పింఛన్లు పంపిణీ చేయించొద్దని ఎన్నికల కమిషన్ ఆదేశిస్తే.. చంద్రబాబు అవ్వాతాతలకు పింఛన్ అందకుండా చేశాడంటూ తప్పుడు ప్రచారం, నీచ రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సకాలంలో పింఛన్ అందకపోతే.. సీఎస్ జవహర్ రెడ్డిదే బాధ్యతని, పింఛన్ల పంపిణీలో అవకతవకలు జరిగితే ఈసీ ఉత్తర్వులు ఉల్లంఘించినట్లేనని పేర్కొన్నారు. ఈమేరకు ఆదివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పింఛన్లలో వలంటీర్ల ప్రమేయం ఉండకూడదని ఈసీ ఆదేశాలివ్వగానే జగన్‌రెడ్డికి ఒళ్లంతా జెర్రెలు పాకుతున్నట్టైంది. పింఛన్ల పంపిణీ పేరుతో ఇంటింటికీ వెళ్లి వలంటీర్లు వైసీపీకి అనుకూల ప్రచారం చేస్తున్న విషయాన్ని ఎన్నికల కమిషన్ గమనించి, వలంటీర్లతో పింఛన్లు పంపిణీ చేయొద్దని చెప్పింది. కానీ టీడీపీ అధినేత చంద్రబాబుపై సజ్జల రామకృష్ణారెడ్డి తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నాడు. సజ్జల భార్గవ్‌రెడ్డి కారుకూతలతో కార్టూన్లు వేసి, నీచ ప్రచారానికి దిగజారాడని మండిపడ్డారు. ఒకటో తేదీన పింఛన్లు ఇవ్వడం చేతకాక టీడీపీపై వైసీపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని దేవినేని ఉమామహేశ్వరరావు మండిపడ్డారు. సోమవారం తెల్లవారు జామున పింఛన్ పంపిణీ చేయకపోతే.. ప్రజల తరఫున ఉద్యమిస్తామని హెచ్చరించారు. పింఛన్ ఎగ్గొట్టాలని జగన్‌రెడ్డి కుట్రలు చేస్తున్నాడని టీడీపీ ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ఆరోపించారు. పింఛన్ లబ్ధిదారులపై ప్రభుత్వానికి ఏమాత్రం శ్రద్ధ ఉన్నా.. ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా పింఛన్ల పంపిణీలో వలంటీర్లను భాగస్వామ్యం చేయకూడదని టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి గురజాల మల్యాద్రి సూచించారు. ఈసీ ఆదేశాలను తప్పు పట్టేలా, చంద్రబాబుపై తప్పుడు ప్రచారం చేస్తున్న సజ్జల రామకృష్ణారెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

డబ్బులు లేక టీడీపీపై నెపమేస్తారా?: నీలాయపాలెం

అమరావతి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వద్ద డబ్బులు లేకపోవడంతో పెన్షన్లు ఆలస్యంగా చెల్లించి నెపం టీడీపీపై వేసేందుకు వైసీపీ కుట్ర చేస్తోందని టీడీపీ అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో ఆరోపించారు. అనుమతించిన దాని కంటే రెండింతలు అప్పు చేయడంతో మార్చి నెలలో ఏపీకి రిజర్వుబ్యాంక్ ద్వారా అప్పులకు కేంద్రం అనుమతించలేదని తెలిపారు. ఆర్బీఐ దగ్గర మంగళవారం(ఏప్రిల్ 2వ తేదీన) అప్పు చేసి మూడో తేదీన నిధులు వస్తే అప్పుడు పింఛన్లు ఇస్తామంటున్నారని తెలిపారు.

పింఛన్ల పంపిణీ ఆలస్యమైతే ఆందోళన

అమరావతి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): పింఛన్ల పంపిణీ ఆలస్యమైతే ఆందోళన చేపడతామని రాష్ట్ర సామాజిక పెన్షనర్ల సంక్షేమ సంఘం కన్వీనర్, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు హెచ్చరించారు. ఎన్నికల నిబంధనల మేరకు పింఛన్ల పంపిణీకి వలంటీర్లను దూరం పెడితే.. దానికి చంద్రబాబు, నిమ్మగడ్డ రమేష్‌కుమార్ కారణమని వైసీపీ ప్రచారం చేయడం సరికాదన్నారు.

అభాండాలు వేయడంలో జగన్ సిద్ధహస్తుడు: అచ్చెన్న

టెక్కలి, మార్చి 31: ఈఎం జగన్ ఓ అబద్ధాల కోరని, ఆయన జీవితమంతా అబద్ధాల మీదే నడుస్తోందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఆదివారం ఉదయం నిమ్మాడలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 'సీఎం జగన్‌రెడ్డి, వైసీపీ నేతలు.. రాష్ట్ర ప్రజలను, పింఛన్‌దారులను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఈ దుర్మార్గమైన సీఎం చేసిన తప్పులు ఇతరులపై నెట్టడంలో సిద్ధహస్తుడు. టీడీపీ వల్లే పింఛన్ల పంపిణీ ఆగిపోయిందని ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. పింఛన్లు కోసం రూ.2వేల కోట్లు నెలాఖరుకు సిద్ధంగా ఉంచాలి. ఈనెల కూడా రూ.2వేల కోట్లు సిద్ధంగా ఉంచిన ప్రభుత్వం పదిరోజులు కిందట సీఎం, ఆర్థికమంత్రి ఒకటై పదిరోజుల్లో రూ.1,500కోట్లు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కింద బిల్లులు రూపంలో చెల్లించేశారు. పేదవాడికి ఇవ్వాల్సిన డబ్బు దారిమళ్లించేసి.. తప్పుడు సమాచారం ఇస్తున్నారు. ఖజానాలో కనీసం రూ.200 నుంచి రూ.300 కోట్లు లేవు. సీఎంపై ప్రజలు తిరగబడాలి' అని అచ్చెన్న పిలుపునిచ్చారు.

పింఛన్ల పంపిణీకి ప్రత్యామ్నాయం చూడాలి

- సీఎస్, సీఈవోకు చంద్రబాబు లేఖలు

అమరావతి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి, లబ్ధిదారులందరికీ సోమవారం నుంచి ఐదు రోజుల్లో పింఛన్ అందేలా చూడాలని టీడీపీ అధినేత చంద్రబాబు డిమాండ్ చేశారు. ఎన్నికల కోడ్ కారణంగా వలంటీర్లతో పింఛన్ల పంపిణీకి కేంద్ర ఎన్నికల సంఘం అభ్యంతరం తెలిపిన నేపథ్యంలో లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా, డోర్ టూ డోర్ విధానంలో పింఛన్లు అందించేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదివారం 'ఎక్స్' వేదికగా ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ ఖజానాలో నిధులు లేని కారణంగా పింఛన్ల పంపిణీ నిలిచిపోకూడదని, ప్రభుత్వం వెంటనే అవసరమైన నిధులు కేటాయించి, పింఛన్లు పంపిణీ పూర్తి చేయాలని సూచించారు. ఇదే విషయంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి లేఖలు రాశారు. 'పింఛన్ల పంపిణీకి తగిన నగదును సెర్ప్ సీఈవోలు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లకు అందుబాటులో ఉంచాలి. గ్రామ సచివాలయ సిబ్బంది, ఇతర క్షేత్రస్థాయి సిబ్బంది ద్వారా పింఛన్ సొమ్మును వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర లబ్ధిదారుల ఇంటికి వెళ్లి నగదు రూపంలో చెల్లించాలి. పింఛన్ల పంపిణీ కోసం బ్యాంకుల నుంచి డబ్బులు తీసుకువెళ్లేందుకు ఎన్నికల సంఘం అనుమతించాలి' అని కోరారు. గతంలో మాదిరిగా పింఛన్లను ఒకటో తేదీ నుంచి ఐదో తేదీ లోపు పంపిణీకి అవసరమైన నగదును, యంత్రాంగాన్ని సిద్ధం చేయాలని సీఎస్‌ను కోరారు. అలాగే, లబ్ధిదారుందరికీ పింఛన్ అందించేలా ప్రభుత్వానికి తగిన ఆదేశాలివ్వాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి చంద్రబాబు విజ్ఞప్తి చేశారు.

పింఛన్ల జాప్యం ప్రభుత్వ కుట్రే: షర్మిల



అమరావతి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): సామాజిక పింఛన్ల పంపిణీ వలంటీర్లతో వద్దన్న నేపథ్యంలో తక్షణమే డైరెక్టు బెనిఫిషియరీ ట్రాన్స్‌ఫర్ (లబ్ధిదారుని ఖాతాలోకి నేరుగా నగదు) విధానంలో ఒక్కరోజులోనే పింఛను అందజేయాలన్న సూచనకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి ఆమోదించకపోవడంపై ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె ఆదివారం సీఎస్ జవహర్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. వలంటీరు వ్యవస్థను నిలుపుదల చేయడం వల్ల.. పింఛన్ల పంపిణీకి కనీసం పది రోజులు సమయం పడుతుందని సీఎస్ చెప్పడంపై షర్మిల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు ఇచ్చిన నేపథ్యంలో.. సంబంధిత శాఖల అధికారులతో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసి పింఛన్ల పంపిణీకి అవసరమైన చర్యలు ఎందుకు చేపట్టలేదని నిలదీశారు. పింఛన్ల పంపిణీలో జాప్యం ప్రభుత్వ కుట్రలో భాగమేనని సీఎస్‌పై షర్మిల అసహనం వ్యక్తం చేశారు. కాగా, సామాజిక పింఛన్లతో సహా ఇతర నగదు బదిలీ పథకాలన్నింటినీ వలంటీర్లతో పంపిణీ చేయించొద్దన్న కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలను స్వాగతిస్తున్నట్లు ఆమె 'ఎక్స్'లో తన అభిప్రాయాన్ని వెల్లడించారు. మరోవైపు, కర్నూలు జిల్లాకు చెందిన టీడీపీ నాయకుడు రాంపుల్లయ్య యాదవ్ ఆదివారం హైదరాబాద్ లోటస్ పాండ్‌లో షర్మిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

సకాలంలో పంపిణీ చేయించండి: సీపీఐ

పింఛన్ల పంపిణీకి వలంటీర్లను వినియోగించవద్దని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలిచ్చిన నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా సకాలంలో పెన్షన్లు పంపిణీ చేయించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆదివారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి లేఖ రాశారు. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో పెన్షన్‌దారులకు ఎలాంటి ఆటంకం లేకుండా పింఛన్లు పంపిణీ చేసేందుకు గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు, రెవెన్యూ సిబ్బంది ద్వారా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు.

మే మొదటి వారంలో టెన్త్ ఫలితాలు

- నేటి నుంచి మూల్యాంకనం

అమరావతి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల ఫలితాలను మే మొదటివారంలో ప్రకటించేందుకు పాఠశాల విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. సోమవారం నుంచి ఏప్రిల్ 8వ తేదీ వరకు ప్రశ్నపత్రాల మూల్యాంకనం జరుగుతుందని పాఠశాల విద్యాశాఖ ఓ ప్రకటనలో తెలిపింది. 26 జిల్లా కేంద్రాల్లో 47.88 లక్షల జవాబు పత్రాలను మూల్యాంకనం చేయాల్సి ఉందని, 25 వేల మంది టీచర్లు ఈ ప్రక్రియలో పాల్గొంటారని వివరించింది. గత అనుభవాల దృష్ట్యా మూల్యాంకనం కేంద్రాలను మార్చినట్లు తెలిపింది.

అజ్ఞాతం వీడిన పిన్నెల్లి వైసీపీ బాధితులు

- ఐదేళ్ల తర్వాత 60 కుటుంబాలు స్వగ్రామానికి..
- స్వాగతం పలికిన సానుభూతిపరులు

మాచవరం, మార్చి 31: ఐదేళ్ల క్రితం పల్నాడు జిల్లా మాచవరం మండలంలోని పిన్నెల్లి గ్రామాన్ని విడిచి వెళ్లిన వైసీపీ బాధిత, టీడీపీకి చెందిన కుటుంబాల అజ్ఞాతవాసానికి ఎట్టకేలకు విముక్తి లభించింది. 2019 ఎన్నికల అనంతరం వైసీపీ శ్రేణులు టీడీపీ నేతలు, కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్న తరుణంలో అప్పట్లో మాజీ సర్పంచ్ నన్నే కుటుంబంతో పాటు సుమారు 100 కుటుంబాల వారు పిన్నెల్లి గ్రామాన్ని వదిలి వివిధ ప్రాంతాలలో తలదాచుకున్న విషయం విదితమే. ఈ విషయంపై రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం జోక్యం చేసుకోవడంతో ఐదేళ్ల తర్వాత ఆదివారం సుమారు 60 కుటుంబాల వారు పోలీసుల భద్రత నడుమ గ్రామంలోకి ప్రవేశించి వారి సొంత ఇళ్లకు చేరుకున్నారు. గ్రామానికి చెందిన టీడీపీ సానుభూతి పరులు ఆయా కుటుంబాలకు ఘనస్వాగతం పలికారు. రాష్ట్రంలో వైసీపీ పాలన వచ్చిన తరువాత పల్నాడులో నెలకొన్న భయంకర పరిస్థితులకు పిన్నెల్లి ఘటన ఉదాహరణగా నిలుస్తుంది.



పిన్నెల్లి గ్రామానికి చేరుకున్న టీడీపీ శ్రేణులు

ఎన్నికలప్పుడే గుర్తొచ్చామా?

- వైసీపీ ఎమ్మెల్యే కళావతికి నిరసన సెగ
- మూడు గ్రామాల్లోనూ సమస్యలపై నిలదీత

పార్వతీపురం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎమ్మెల్యే కళావతికి ప్రజల నుంచి నిరసన సెగ తగిలింది. ఆదివారం ఆమె పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ మండలం వెలగవాడలో పర్యటించారు. గ్రామస్థులు పలు సమస్యలపై ఆమెను నిలదీశారు. సంక్షేమ పథకాలలో మొండిచేయి చూపారని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సింగన్నవలస గ్రామంలో ఆమె ఇంటింటి ప్రచారం చేయగా.. వలంటీర్ పోస్టు కోసం స్థానిక నాయకులు కొంత మొత్తాన్ని వసూలు చేశారని చెప్పారు. అంపిలి గ్రామానికి వెళ్లగా తాగునీరు ఎందుకు సరఫరా చేయలేదని ఆ ప్రాంత వాసులు ప్రశ్నించారు. 'ఎన్నికలప్పుడే ప్రజలు గుర్తుకు వస్తారా?' అంటూ ఎమ్మెల్యేను నిలదీశారు.



వెలగవాడలో వైసీపీ ఎమ్మెల్యే కళావతిని ప్రశ్నిస్తున్న గ్రామస్థులు

చదువుల పేరిట చక్కబెట్టేద్దాం!

- వలంటీర్ల వ్యూహం ఆగడంతో వైసీపీ సర్కారు కొత్త పన్నాగం
- చదువుల పేరిట ఇంటింటి ప్రచారం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఎప్పుడో జూన్‌లో మొదలయ్యే ఇంటర్మీడియట్ తరగతులకు ఏప్రిల్‌లోనే ప్రచారం చేయాలని వైసీపీ ప్రభుత్వం నిర్ణయించింది. తద్వారా విద్యారంగంలో తాము తీసుకువచ్చిన సంస్కరణలను పరోక్షంగా ప్రజలకు వివరించి ఎన్నికల్లో లబ్ధి పొందాలనే ఎత్తుగడ వేసింది. నిర్ణయం తీసుకోవడమే ఆలస్యం ఇంటర్ విద్యాశాఖ ఆదేశాలు కూడా జారీ చేసేసింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రతి కాలేజీ స్థాయిలో ఒక కమిటీని ఏర్పాటు చేసి మరీ విద్యార్థులను మోటివేట్ చేస్తూ, ఆన్ ది స్పాట్ అడ్మిషన్లు చేపట్టాలని పేర్కొంది. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో స్పాట్ అడ్మిషన్లు చేపట్టడం ఇదే మొదటిసారి. అది కూడా అడ్మిషన్లకు ప్రచారాన్ని వద్దని చెప్పే ప్రభుత్వమే ఈసారి నేరుగా ప్రచారం చేయాలని ఆదేశించడం వెనుక ఉద్దేశం ఎన్నికల నేపథ్యమేనని విద్యారంగ నిపుణులు అంటున్నారు. కాగా, ఈ ప్రచారం సోమవారం నుంచి ప్రారంభించనున్నారు.

ఇవీ ఆదేశాలు

ప్రభుత్వం 504 హైస్కూళ్లను జూనియర్ కాలేజీలుగా అప్‌గ్రేడ్ చేసింది. 476 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు రాష్ట్రంలో ఉన్నాయి. వీటిలో అడ్మిషన్ల సంఖ్య పెంచే ప్రయత్నం చేయాలి. జడ్పీ, మున్సిపల్ హైస్కూల్స్, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు, ఇతర ప్రభుత్వానికి చెందిన ఉన్నత పాఠశాలల నుంచి పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే ఇంటర్ చదివేలా చూడాలి. దీనికోసం ప్రతి జూనియర్ కాలేజీ స్థాయిలో ఒక బృందాన్ని ఏర్పాటు చేయాలి. ఎంఈవోలను సంప్రదించి, సంబంధిత ఉన్నత పాఠశాలలను సందర్శించి ప్రభుత్వ కాలేజీల్లో చేరేలా విద్యార్థులను మోటివేట్ చేయాలి. వెంటనే అప్పటికప్పుడు స్పాట్ అడ్మిషన్లు తీసుకుని, ఆ వివరాలను 'జ్ఞానభూమి' పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. సెక్షన్‌కు జనరల్ కోర్సుల్లో 88 మంది, ఒకేషనల్ నాన్-పారామెడికల్ కోర్సుల్లో 40 మంది, పారామెడికల్ కోర్సుల్లో 30 మంది చేరేలా ప్రచారం చేయాలని ఇంటర్ విద్యాశాఖ కమిషనర్ సౌరబ్ గౌర్ ఆదేశాల్లో పేర్కొన్నారు.

ఇంటింటికీ తిరగాల్సిందే

ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి ప్రచారం చేయాలి అని పైకి చెబుతున్నా అసలు ఉద్దేశం ఇంటింటి ప్రచారమే. ఎందుకంటే మార్చి 27న పదో తరగతి పరీక్షలు ముగిశాయి. ఆ తర్వాత పాఠశాలలకు వెళ్లి ప్రచారం చేయడానికి విద్యార్థులు ఉండరు. దీంతో జూనియర్ లెక్చరర్లు(జేఎల్స్) తప్పనిసరిగా ఆ విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ప్రచారం చేయాలి. ప్రభుత్వ జూనియర్ కాలేజీలతో పాటు, హైస్కూల్ ప్లస్‌లలోనూ అడ్మిషన్లకు ప్రచారం చేస్తున్నందున జేఎల్స్‌తో పాటు, పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్లు(పీజీటీ) కలిసి వెళ్లి ఈ ప్రచారం చేపట్టాల్సి ఉంటుంది. దీనిలో భాగంగా ప్రభుత్వ కాలేజీలు, హైస్కూల్ ప్లస్‌లలో ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను వివరిస్తారు. ఇంటర్ కాలేజీల్లోనూ అమ్మఒడి, నాడు-నేడు, ఉచిత విద్యల గురించి తల్లిదండ్రులకు వివరిస్తారు. ఇక, హైస్కూల్ ప్లస్‌లలో అయితే అమ్మఒడి, జగనన్న గోరుముద్ద, ఉచిత పుస్తకాలు, బడుల్లో ఉన్న పథకాలను తల్లిదండ్రుల ముందు ఏకరువు పెడతారు. ఇవన్నీ చూపిస్తూ 'మీ పిల్లల్ని ప్రభుత్వ కాలేజీల్లో చేర్పండి' అని అడుగుతారు. తద్వారా జగన్ అధికారంలోకి వచ్చాకే ప్రభుత్వ కాలేజీల్లో అనేక పథకాలు వచ్చాయని తల్లిదండ్రులకు నూరిపోస్తారు.

ప్రవీణ్ పన్నాగమే?

చదువుల పేరుతో ఇంటింటి ప్రచారానికి కార్యక్రమాన్ని రూపొందించడం వెనుక వైసీపీ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్న ఇంటర్ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ ఉన్నారని తెలుస్తోంది. ఎందుకంటే ఇప్పటికే ఆయన అధికార పార్టీకి అనుకూలంగా కొన్ని కార్యక్రమాలు చేశారు. గత నెలలో పరీక్షల అనంతరం అన్ని పాఠశాలల్లో తల్లిదండ్రులతో సమావేశాలు పెట్టాలని ఆదేశించారు. వర్చువల్ విధానంలో స్వయంగా తానే తల్లిదండ్రులతో మాట్లాడతానంటూ షెడ్యూలు ఇచ్చారు. ఈ సమావేశాల ద్వారా పాఠశాల విద్యాశాఖ పథకాల గురించి ప్రచారం చేసేలా ప్లాన్ చేశారు. ఇప్పుడు హైస్కూల్ ప్లస్‌లు, జూనియర్ కాలేజీల ద్వారా కూడా అధికార పార్టీకి పథకాల ప్రచారం చేయించడం వెనుక ఆయనే ఉన్నారని జేఎల్స్, టీచర్లు చెబుతున్నారు.

సొంత ఆదేశాలకు తూట్లు

"కొన్ని ప్రైవేటు కాలేజీలు అడ్మిషన్లు చేపడుతున్న విషయం మా దృష్టికి వచ్చింది. అడ్మిషన్ల నోటిఫికేషన్ విడుదల కాకుండా అడ్మిషన్లు తీసుకోకూడదు. ఫీజులు వసూలు చేస్తే వెనక్కి ఇచ్చేయండి. తల్లిదండ్రులు కూడా అడ్మిషన్ల గురించి చెప్పే మాటలు వినొద్దు" అంటూ తాజాగా ఇంటర్ విద్యామండలి ఓ ప్రకటన విడుదల చేసింది. నోటిఫికేషన్ విడుదల కాకుండా అడ్మిషన్లు తీసుకోవద్దని చెప్పిన ఇంటర్ విద్యా శాఖే ఇప్పుడు ప్రభుత్వ కాలేజీల్లో అడ్మిషన్లకు ప్రచారం ప్రారంభించి, తన ఆదేశాలకే తూట్లు పొడిచింది. పైగా అసలు అడ్మిషన్ల గురించి ప్రచారమే చేయకూడదని ఇంటర్ విద్యాశాఖ నిబంధనలు చెబుతున్నాయి. విద్యార్థి స్వేచ్ఛగా కోరుకున్న చోట చేరే వాతావరణం ఉండాలని సూచించాయి. అందుకే ప్రైవేటు కాలేజీల ప్రచారాన్ని వీలైనంత మేర నియంత్రిస్తున్నాయి. అలాంటిది ఇప్పుడు ప్రభుత్వమే నిబంధనలను కాలరాస్తూ, పథకాల ప్రచారం చేస్తూ అడ్మిషన్ల పేరిట ఇంటింటికీ వెళ్లడంపై విమర్శలు వస్తున్నాయి.

నెలన్నర ముందుగానే

2023-24 అడ్మిషన్ల కోసం గతేడాది మే 15 నుంచి దరఖాస్తులు స్వీకరించారు. దీనికి అనుగుణంగా అప్పట్లో మే నెలలో అడ్మిషన్లకు నోటిఫికేషన్ ఇచ్చారు. ఈ ఏడాది రాష్ట్రంలో మే 13న పోలింగ్ జరుగుతుంది. ఆ వెంటనే అడ్మిషన్లు తీసుకునే సమయం ఉంది. పోలింగ్ ముగిస్తే ప్రశాంతంగా అడ్మిషన్లు చేపట్టే వీలుంది. అయినప్పటికీ ఎన్నికలకు నెలన్నర ముందుగానే స్పాట్ అడ్మిషన్ల పేరుతో పథకాలను ప్రచారం చేయడం అధికార పార్టీకోసమేనని అర్థమవుతోంది. కాగా, వెకేషన్ డిపార్ట్‌మెంట్‌గా ఉన్న తమకు ఈ గోలేంటని జూనియర్ లెక్చరర్లు అంటున్నారు. ప్రతి ఏటా ఏప్రిల్ నుంచి మే నెలాఖరు వరకు వెకేషన్ ఉంటుందని, మొదటిసారి ఇప్పుడే అడ్మిషన్లు అంటూ పరీక్షలు ముగిసిన వెంటనే కొత్త పని పెట్టారని అంటున్నారు.



నా బొమ్మ ఉండాల్సిందే

- రైతు పాస్‌పుస్తకాలు, రికార్డులపై తీసేయొద్దు
- సీఎం జగన్ పట్టు.. అధికారులకు హుకుం
- సర్వే పథకంలోనూ జగన్ పేరు ఉండాలట
- ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా పట్టని వైనం
- బెజవాడ వేదికగా సమీక్షకు సిద్ధమైన సర్వేశాఖ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చి పక్షం రోజులవుతోంది. అయినా రాష్ట్రంలో కోడ్ అమలు అంతంత మాత్రమే. ప్రభుత్వ పెద్దలకు ఈసీ నియమావళి అంటే లెక్కలేకుండా పోయింది. రైతులకు ఇచ్చే పట్టాదార్ పాస్‌పుస్తకాలు, భూముల సర్వే అనంతరం రైతు భూమి చిత్రపటాన్ని తెలియజేసే ల్యాండ్ పార్సిల్ మ్యాప్ (ఎల్‌పీఎమ్), ఇతర రికార్డులపై తన బొమ్మలు ఉండి తీరాల్సిందేనని ముఖ్యమంత్రి జగన్ హుకుం జారీ చేసినట్లు తెలిసింది. 100 ఏళ్ల తర్వాత భూముల సర్వే తానే ప్రారంభించానని, సర్వే కార్యక్రమంలో తన పేరు తొలగించడం కుదరదని ఆయన అధికారులకు తేల్చిచెప్పినట్లు సమాచారం. జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంగానే స్కీమ్ కొనసాగాలని, అందులో నుంచి తన పేరు తొలగించడానికి వీల్లేదని అధికారులకు స్పష్టం చేసినట్లు తెలిసింది. అలాగే రైతులకు ఇచ్చే పాస్‌పుస్తకాల్లో తన బొమ్మ, నవరత్నాల లోగోను తీసేయ్యడానికి వీల్లేదని జగన్ ఆదేశించినట్టు సమాచారం. దీంతో భూముల సర్వే ప్రత్యేకించి ముగిసిపోయిన సర్వేకు సంబంధించిన రికార్డుల నవీకరణపై సమీక్షించాలని సర్వేశాఖ నిర్ణయించింది. అదేదో ఆషామాషీగా కాకుండా జిల్లాలు, రెవెన్యూ డివిజన్ల వారీగా పక్షం రోజుల పాటు సమీక్షలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు జిల్లాల వారీగా సమీక్షల షెడ్యూల్ ప్రకటించింది. ఎన్నికల విధుల్లో రెవెన్యూ యంత్రాంగం నిమగ్నమై ఉన్న దశలో ఇటు రెవెన్యూ, అటు సర్వే సిబ్బందితో పక్షం రోజుల పాటు సమీక్ష నిర్వహించాలని షెడ్యూల్ ఇవ్వడంలోనే పెద్దల అసలు ఉద్దేశాలు స్పష్టంగా తెలుస్తున్నాయి. ఎన్నిల కోడ్ అమల్లో ఉన్నా పాస్‌పుస్తకాలు, ఎల్‌పీఎమ్‌లపై జగన్ ఫొటోలు, నవరత్నాల లోగోలు తొలగించవద్దని సర్వే ఉన్నతాధికారి ఒకరు ఇటీవల జాయింట్ కలెక్టర్లను ఆదేశించిన విషయం 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకొచ్చింది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జేసీలపై ఒత్తిడి తీసుకొచ్చి ఎన్నికల సమయంలో కూడా జగన్ బొమ్మలున్న పాస్‌పుస్తకాలు ముద్రించి రైతులకు అందించాలని, తద్వారా తను అభిమానించే సీఎం జగన్‌కు, ఆయన పార్టీ వైసీపీకి లబ్ధి చేకూర్చాలన్నది ఆ అధికారి అసలు వ్యూహం అయి ఉండొచ్చు. ఈ వార్తపై సర్వే శాఖ కమిషనర్ స్పందించారు. రాష్ట్రంలో ఎన్నికల నియమావళి అమల్లో ఉందని, దాన్ని పాటిస్తామని 'ఆంధ్రజ్యోతి' వార్తకు మార్చి 28న వివరణ పంపించారు. ప్రభుత్వం బయటకు చెప్పేదొకటి, ఆచరణలో చేసేది మరొకటని సరిగ్గా మూడురోజుల వ్యవధిలోనే నిరూపించింది. భూముల సర్వే ఒకటి, రెండు, మూడో దశల రికార్డుల తయారీ, సర్వే పురోగతి, ఎల్‌పీఎమ్, పాస్‌పుస్తకాల పంపిణీ తదితర అంశాలపై సమీక్ష ఉంటుందని 30వ తేదీన జిల్లాల అధికారులకు షెడ్యూల్ పంపించారు. రెవెన్యూ సిబ్బంది ఎన్నికల విధుల్లో బిజీగా ఉంటే భూముల సర్వే పేరిట వారిని సమీక్షలకు పిలవడం, తాజాగా జరుగుతున్న సర్వే పనులను కాకుండా ఎప్పుడో ముగిసిపోయిన పనులు, రికార్డులు, ఎల్‌పీఎమ్‌ల తయారీ, ముద్రణ, పంపిణీ గురించి సమీక్షించడం కోడ్ ఉల్లంఘన కిందకే వస్తుందని అధికారవర్గాలు చెబుతున్నాయి. ఎన్నికల కోడ్ పాటిస్తామని చెబుతూనే అందుకు విరుద్ధమైన పనులు చేయడం ఏమిటని సీనియర్ అధికారులు ప్రశ్నిస్తున్నారు. దీనివెనుక ముఖ్యమంత్రి జగన్ ఒత్తిళ్లు ఉన్నాయని తెలిసింది. ఈసీ నిబంధనల ప్రకారం కొత్తగా రైతులకు ఇచ్చే పాస్‌పుస్తకాలు, కొత్తగా ముద్రించే ల్యాండ్ పార్సిల్ మ్యాప్‌లపై జగన్ బొమ్మలు, నవరత్నాల లోగోలను తొలగించాలి. ఈ పనిచేయడం జగన్‌కు ఏమాత్రం నచ్చలేదు. 'నా బొమ్మలే తొలగిస్తారా' అంటూ అధికారులపై ఆయన ఫైర్ అయినట్లు తెలిసింది. 'నా బొమ్మలు ఉండి తీరాల్సిందే' అంటూ ఆయన పట్టుబట్టినట్లు తెలిసింది. అలాగే భూముల సర్వేను తానే ప్రారంభించాను కాబట్టి ఎన్నికలకు, దానికి సంబంధం లేదని, అవసరమైతే ఈ విషయంలో ఈసీకి లేఖలు రాయాలని ఆయన అధికారులకు హుకుం జారీ చేసినట్లు తెలిసింది. జగన్ ఆగ్రహంతో వెనక్కి తగ్గిన అధికారులు పాస్‌పుస్తకాలు, ఎల్‌పీఎమ్‌లపై జగన్ బొమ్మలు కొనసాగించేలా, ఎన్నికల సమయంలో రైతులకు పంపిణీ చేసే పాస్‌పుస్తకాలపై ఆయన బొమ్మలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఇందుకు ఓ వ్యూహం రచించినట్లు తెలిసింది. భూముల సర్వే, పాస్‌పుస్తకాల పంపిణీ ఎన్నికలతో సంబంధం లేని అంశమని చెబుతూ, ఆ కార్యక్రమాన్ని ఓ సీరియస్ అంశంగా తీసుకొచ్చినట్లు తెలిసింది.

ఏప్రిల్ 2 నుంచి సమీక్షలు

భూముల సర్వేకు సంబంధించి 1-3 దశలపై ఏప్రిల్ 1 నుంచి 16వ తేదీ వరకు విజయవాడ వేదికగా జిల్లాల వారీగా సమీక్షలు ఉంటాయని సర్వే శాఖ షెడ్యూల్ ఇచ్చింది. ఏప్రిల్ 2వ తేదీన ఏలూరు, ప్రకాశం, కాకినాడ జిల్లాలపై సమీక్ష ఉంటుందని తెలిపారు. 3వ తేదీన ఎన్టీఆర్, నెల్లూరు, కర్నూలు, విజయనగరం జిల్లాలు, 4న పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, అన్నమయ్య జిల్లాలు, 8వ తేదీన కృష్ణా, తిరుపతి, బాపట్ల, 10న పల్నాడు, అనకాపల్లి, వైఎస్ఆర్ కడప, విశాఖపట్నం, 12న కోనసీమ, సత్యసాయి, అనంతపురం, 15న తూర్పుగోదావరి, గుంటూరు, అల్లూరి, 16న నంద్యాల, పశ్చిమగోదావరి, చిత్తూరు జిల్లాలపై సమీక్ష ఉంటుందని షెడ్యూల్‌లో తెలిపారు. ఈ సమీక్షకు ఆయా జిల్లాల అధికారులు అప్పటికే జగన్ బొమ్మలతో ముద్రించిన పాస్‌పుస్తకాలు, ఎల్‌పీఎమ్‌లు, ఇతర డాక్యుమెంట్లను, వాటి ప్రజంటేషన్లను తీసుకొస్తారు. వాటిని ఎప్పుడు రైతులకు పంపిణీ చేయాలో అందులో దిశానిర్దేశం చేస్తారు. పాస్‌పుస్తకాలు, ఎల్‌పీఎమ్‌ల్లో జగన్ బొమ్మల కొనసాగింపే ప్రధాన అజెండాగా సర్వే అధికారి సమీక్షలు నిర్వహించనున్నారని తెలిసింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.





పూలకుండీ.. పగిలిందండీ..

నగరంలో పలు ఫ్లై ఓవర్‌లు అందంగా కనిపించేందుకు మున్సిపల్ అధికారులు కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ఎక్కడెక్కడి నుంచో తీసుకొచ్చిన పూలకుండీలు పర్యవేక్షణ కరువై శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎక్కడ చూసిన పగిలిన కుండీలు దర్శనమిస్తుండటంతో నగరం అభివృద్ధి గాలికొదిలేశారా అనుకుంటూ నగర ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పునరుత్థానుడు ఏసు

మానవాళి పాప విమోచన కోసం శిలువ ఎక్కిన ఏసు మూడవ రోజున పునరుత్థానుడై లేచినందున ఈ రోజు భక్తులంతా ఈస్టర్ పండుగ జరుపుకుంటారు. ఆదివారం భక్తులంతా తమ పూర్వీకులను తలచుకుని వారి సమాధుల వద్ద కొవ్వొత్తులు వెలిగించి వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ఆ దేవ దేవుని ప్రార్థించారు.



అజయ్‌కుమార్ శర్మ శిష్య బృంద నృత్య ప్రదర్శనలు

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

విజయవాడ కల్చరల్, మార్చి 31: దృశ్యవేదిక సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన నెలనెలా సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. గాంధీనగర్‌లోని వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం సాయంత్రం సిహెచ్.అజయ్‌కుమార్ బృందం ప్రదర్శించిన నృత్య తరంగం, హర్ష క్రియేషన్స్ బృందం ప్రదర్శించిన స్వర్ణ కమలాలు నాటిక ఫ్రైమరిపించాయి. ముందుగా విద్యార్థులు జాహ్నవి, సుష్మ, నవ్య సువర్ణ, షేక్ బబిత, భానుశ్రీ, తానియా సిరి, పుష్కర సౌమ్య, చైత్ర, తేజశ్రీదేవి, మృదుల, మేఘన ప్రదర్శించిన ఆనంద నర్తన గణపతి, రాముడు రాఘవుడు రవికులడితడు, భామనే సత్యభామనే, సూర్యాష్టకం, అర్ధనారీశ్వర స్తోత్రం వంటి సంకీర్తనలకు చక్కని నృత్యాలు ప్రదర్శించారు. హర్ష క్రియేషన్స్ బృందం ప్రదర్శించిన స్వర్ణకమలాలు నాటిక సందేశాత్మకంగా సాగింది. వద్దులే భావాలు గల కథారచయిత తన ఊహల్లో ఉండే పల్లెటూరి అమ్మాయిని వివాహం చేసుకొని తన చదువుతోపాటు నవల రాయడం నేర్పించి గొప్ప నవల రచయితను చేస్తాడు. తనకంటే ఎక్కువ పేరురావడం సహించలేక భార్యపై ప్రతీకార దాడిచేసి అవమానపరుస్తాడు. చివరికి తప్పు గ్రహించి క్షమాపణ కోరడంతో నాటిక సమాప్తమవుతుంది.

శ్యాంప్రసాద్, నరేన్ బొర్ర, ఎజ్జల విజయసాగర్, సాయితేజ నటించి మెప్పించారు. విద్యాధర మునిపల్లె రచనకు కత్తి శ్యాంప్రసాద్ దర్శకత్వం వహించారు. అనంతరం నాగార్జున పాఠశాలల అధినేత దేవినేని కిషోర్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని కళాకారులు సత్కరించి అభినందించారు. నిర్వాహకుడు హెచ్‌ఆర్‌ఎస్ ప్రసాద్ పర్యవేక్షించారు.

జగన్‌రెడ్డి మాటలకు బీసీలు మోసపోవద్దు

విద్యాధరపురం, మార్చి 31: రాష్ట్రంలోని బీసీలెవరూ జగన్‌రెడ్డి మోసపుమాటలను నమ్మవద్దని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్ అన్నారు. గురునానక్‌నగర్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్‌రెడ్డి తానిచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చినట్టు అబద్దాలు, మోసపూరిత మాటలను చెబుతున్నాడన్నారు. ఈ సందర్భంగా బీసీ నేతలు మనిముక్కు శ్రీనివాస యాదవ్, దివి ఉమామహేశ్వరరావు, సింగం వెంకన్న, తిరుపతిగౌడ్, మరక శ్రీనివాస్, పామర్తి కిషోర్ బాబుతో కలిసి టీడీపీ బీసీ డిక్లరేషన్ పాంప్లేట్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ బీసీలకు జగన్‌రెడ్డి హయాంలో జరిగిన అన్యాయాలు, మోసాలు, చంద్రబాబు హయాంలో జరిగిన న్యాయం, మేళ్లను గురించి సోదాహరణంగా వివరించారు. బీసీల కోసం చంద్రబాబు ప్రవేశపెట్టిన పథకాలను బీసీల ద్రోహి జగన్‌రెడ్డి తొలగించాడని దుయ్యబట్టారు. జగన్‌రెడ్డి మాటలకు మోసపోవద్దని బీసీలందరూ ఐక్యతతో భావితరాల కోసం జనసేన, బీజేపీ బలపరచిన ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని), తూర్పు నియోజకవర్గ అభ్యర్థి గద్దె రామ్మోహన్, సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావును, జిల్లాలో బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థులను గెలిపించాలని సూచించారు. చంద్రబాబునాయుడు ప్రభుత్వం వస్తే వలంటీర్లకు మంచి భవిష్యత్తు ఉంటుందని, పార్టీలకతీతంగా పనిచేయాలని కోరారు.



బీసీ డిక్లరేషన్ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న టీడీపీ నాయకులు



కూరగాయల ట్రక్‌కు పచ్చ జెండా ఊపి ప్రారంభిస్తున్న కుమార్, లక్ష్మి

తిరుమల, శ్రీశైల దేవస్థానాలకు కూరగాయలు

విజయవాడ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): శ్రీ వేంకటేశ్వర భక్త సమాజం, భరత సమాజం సంయుక్తంగా తిరుమల తిరుపతి, శ్రీశైలం దేవస్థానాలకు కూరగాయల ట్రక్‌లను పంపాయి. స్థానిక పటమటలోని బృందావన్ అపార్టుమెంట్ వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించి ఈ ట్రక్‌ను డాక్టర్ కేవీఎస్ కుమార్, లక్ష్మి జెండా ఊపి ప్రారంభించారు. ఇప్పటి వరకు తిరుమలకు 168, శ్రీశైలానికి 30 ట్రక్‌లను కూరగాయలతో పంపామని తెలిపారు. భారత సమాజం ప్రతినిధులు సీహెచ్ శ్రీనివాస్, మల్లికార్జునరావు, వై.ఈశ్వరరావు పాల్గొన్నారు.



జబర్దస్త్ నటీనటులు గడ్డం నవీన్, అప్పారావును సత్కరిస్తున్న సంస్థ నిర్వాహకులు ఝాన్సీ, చింతకాయల చిట్టిబాబు

అలరించిన నాన్‌స్టాప్ సంగీత విభావరి

విజయవాడ కల్చరల్, మార్చి 31: జేఎన్‌ఎస్ సరాగాలు సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానంద సత్రంలో 10 గంటల పాటు నాన్‌స్టాప్ సినీ సంగీత విభావరి నిర్వహించారు. 15 మంది గాయనీ గాయకులు పాల్గొని మధుర గానం చేశారు. అనంతరం జబర్దస్త్ నటీనటులు గడ్డం నవీన్, అప్పారావుతో పాటు సింగర్స్‌ను కూడా సత్కరించారు. నిర్వాహకురాలు ఝాన్సీ, చింతకాయల చిట్టిబాబు, డేవిడ్‌రాజు, పరుచూరి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు మార్గమే.. రక్షణ మార్గం

● బిషప్ తెలగతోటి జోసెఫ్ రాజారావు ● వైభవంగా సెయింట్ పాల్స్ కథెడ్రల్‌లో ఈస్టర్ వేడుకలు




పాస్కొ కొవ్వొత్తిని వెలిగిస్తున్న జోసెఫ్ రాజారావు, ఫాదర్ మువ్వల ప్రసాద్, కొవ్వొత్తులు వెలిగించి క్రీస్తుకు స్వాగతం పలుకుతున్న భక్తులు



క్రైస్ట్ టెంపుల్‌లో ఈస్టర్ వేడుకల్లో పాల్గొన్న గద్దె రామ్మోహన్, కేశినేని శివనాథ్

పటమట, మార్చి 31: క్రీస్తుమార్గం మానవుడికి రక్షణ మార్గమని విజయవాడ కథోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసెఫ్ రాజారావు అన్నారు. ఈస్టర్ పర్వదినం సందర్భంగా ఆదివారం బెంజిసర్కిల్ సమీపంలో సెయింట్ పాల్స్ కథెడ్రల్‌లో ఫాదర్ మువ్వల ప్రసాద్‌తో కలిసి బిషప్ రాజారావు ఈస్టర్ కొవ్వొత్తిని వెలిగించి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఆయన సందేశమిస్తూ ఈస్టర్ అంటే క్రీస్తు మరణాన్ని జయించారని అర్థమని తెలిపారు. క్రీస్తునందు విశ్వాసం ఉంచితే మానవుడు నిరంతరం జీవించగలడన్నారు. ప్రత్యేకంగా అలంకరించిన పూజాపీఠంపై బిషప్ జోసెఫ్ రాజారావు, ఫాదర్ మువ్వల ప్రసాద్,ఫాదర్ వినోద్, ఫాదర్ కిషోర్ తదితర గురువులు ఈస్టర్ సమష్టి దివ్య పూజాబలి సమర్పించారు. బిషప్ రాజారావు, ఫాదర్ మువ్వల ప్రసాద్ బాలబాలికలతో కలిసి ఆనందోత్సాహాలతో ఈస్టర్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. తదనంతరం వారివురూ ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు. సెయింట్ పాల్స్ కథెడ్రల్ మధిర బెర్నాడ్ బృందం ఆధ్వర్యంలో ఆలపించిన పాస్కొ గీతాలు, ఆద్యంతం భక్తులను ఆకట్టుకున్నాయి. మారిస్ స్టెల్లా, నిర్మలా కాన్వెంట్ సిస్టర్స్, చర్చి ప్రతినిధులు బండి బాబూరావు, సీఆర్.మోహన్‌రావు, రోశయ్య, విజయచంద్ర పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం: గద్దె, కేశినేని

పటమట: మహోన్నత ఏసుక్రీస్తు బోధనలు సర్వమానవాళికి అనుసరణీయమని జనసేన, బీజేపీ కూటమి బలపర్చిన టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు గద్దె రామ్మోహన్, కేశినేని శివనాథ్ తెలిపారు. ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం పటమట పంటకాల్వ రోడ్డులోని స్టెల్లా కాలేజ్ ఆడిటోరియం క్రైస్ట్ టెంపుల్‌లో పాస్టర్ పాల్ ఇమ్మాన్యుయేల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, కేశినేని శివనాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిద్దరూ నగర ప్రజలకు ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు.

వన్‌టౌన్‌లో ఘనంగా వేడుకలు

వన్‌టౌన్: క్రీస్తు పునరుత్థానం (ఈస్టర్) వేడుకలను వన్‌టౌన్‌లోని క్రైస్తవ సోదరులు ఘనంగా నిర్వహించారు. శిలువపై మరణించిన క్రీస్తు మూడు రోజుల తరువాత తిరిగి లోక రక్షణ కోసం లేచి వచ్చాడన్న కారణంగా ఈస్టర్‌ను జరుపుకుంటారు. వన్‌టౌన్‌లోని తెలుగు బాప్టిస్ట్ చర్చితో పాటు వివిధ చర్చిల్లో ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈస్టర్‌కు ముందు క్రీస్తును శిలువ వేసిన రోజున దుఃఖితులై ఆయన కొరకు స్తుతించిన క్రైస్తవ సోదరులు ఆయన పునరుత్థాన వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఆయన రాకకోసం ఎదురు చూసిన వారు ఆయన వచ్చాడని తమ పాపాలను పొగొట్టి ఆశీర్వదించాలని కోరుకున్నారు.



తెలుగు బాప్టిస్ట్ చర్చిలో ప్రార్థనలకు హాజరైన క్రైస్తవ సోదరులు



నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న రాజశ్రీనివాస్

సంఘసేవను ప్రథమ కర్తవ్యంగా భావిస్తా

● సౌత్‌జోన్ క్రెడాయ్ జాతీయ సంయుక్త కార్యదర్శి రాజశ్రీనివాస్

భారతీనగర్, మార్చి 31: వ్యాపారంతో పాటు సంఘసేవను ప్రథమ కర్తవ్యంగా క్రెడాయ్ కొనసాగుతోందని సౌత్‌జోన్ క్రెడాయ్ జాతీయ సంయుక్త కార్యదర్శి బి.రాజశ్రీనివాస్ అన్నారు. గురునానక్ రోడ్డులోని క్రెడాయ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాల్ ఆఫ్ కైండ్ నెస్ కార్యాలయాన్ని సౌత్‌జోన్ క్రెడాయ్ జాతీయ సంయుక్త కార్యదర్శి బి.రాజశ్రీనివాస్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిరుపేదలకు దుస్తులు, పుస్తకాలు, సామగ్రి వంటి నిత్యావసర వస్తువులను అందజేశారు. క్రెడాయ్ రాష్ట్ర చైర్మన్ ఆళ్ల శివారెడ్డి, ఏపీ అధ్యక్షుడు వైవీ రమణరావు, నగరాధ్యక్షుడు దాసరి రాంబాబు మాట్లాడుతూ సహృదయం కలవారు అందించిన దుస్తులు, పుస్తకాలు, పాత వస్తువులు నిత్యం ఉపయోగించే వాటిని స్వీకరించి సంస్థ ద్వారా నిరుపేదలకు అందజేశామన్నారు. క్రెడాయ్ నేతలు కె.రాజేంద్ర, రమేష్, అంకినీడు, కె.ఎస్సీ బోసు, బి.శ్రీనివాసరావు, తేజేశ్వర రావు, వంశీ, క్రెడాయ్ సీఎస్సార్ కన్వీనర్ సతీష్‌బాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత శివాజీ

కాంగ్రెస్ హయాంలోనే ముస్లింలకు న్యాయం

● కొలనుకొండ శివాజీ

లబ్బీపేట, మార్చి 31: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే దేశంలోని ముస్లిం, మైనారిటీలకు పూర్తి న్యాయం జరిగిందని కాంగ్రెస్ నేత కొలనుకొండ శివాజీ అన్నారు. ఎంబీవీకే భవన్‌లో ఆదివారం సాయంత్రం స్టూడెంట్ ఆఫ్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ప్రస్తుత విద్యార్థుల సమస్యలు, వాటి పరిష్కారాలనే అంశంపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింలకు ఇచ్చిన 4 శాతం రిజర్వేషన్‌ను మోదీ ప్రభుత్వం తొలగిస్తాననని చెబుతోందని అదే విధంగా బీజేపీ ప్రభుత్వంలో ముస్లింలపై దాడులు కూడా జరిగాయని, ఈ దాడులు ఆగాలంటే కేంద్రంతో పాటు రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం రావాలన్నారు. 2024లో జరిగే ఎనికల్లో విద్యార్థుల మ్యానిఫెస్టో విడుదల చేశామని, అన్ని విద్యార్థి సంఘాలు దృఢ సంకల్పంతో పనిచేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలన్నారు. అనంతరం పలు విద్యార్థి సంఘాల నేతలు తమ అభిప్రాయాలను వెల్లడించారు. మాజీ ఎస్ఐవో రాష్ట్ర అధ్యక్షుడు కరీముద్దీన్, అధ్యక్షుడు రోషన్ ఏపీసీసీ మైనారిటీ జనరల్ సెక్రటరీ జునైద్, బేగ్ పాల్గొన్నారు.



పోతిన మహేష్‌ను కలిసిన నగరాల యువత

సీటు కోసం హామీ పొందండి.. పోతినకు నగరాల యువత సూచన

వన్‌టౌన్, మార్చి 31: జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ నుంచి సీటు కోసం స్పష్టమైన హామీ పొందాలని జనసేన అధికార ప్రతినిధి పశ్చిమ నియోజకవర్గ సీటును ఆశిస్తున్న పోతిన మహేష్‌కు నగరాల యువజన సంఘం నేతలు సూచించారు. ఆదివారం యువజనసంఘం నేతలు పలువురు పోతిన మహేష్‌ను ఆయన కార్యాలయంలో కలిశారు. తాము వివిధ పార్టీలకు చెందినవారమైనప్పటికీ మహేష్ అభిమానులమేనని, సీటు కోసం ఇన్ని రోజులుగా పడిన శ్రమ వృథా కాకూడదని, పార్టీ అధినేత నుంచి హామీ పొందాలని సూచించారు.

జనసేన నగర ఉపాధ్యక్షుడు కామళ్ల సోమనాథం ఆధ్వర్యంలో సెంట్రల్ నియోజకవర్గ జనసేన నేతలు ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోతిన మహేష్ సేవలను గుర్తించి సీటు విషయంలో పునరాలోచన చేయాలని పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌ను కోరారు. మరోవైపు వలస పక్షులు ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని హెచ్చరించారు. నగర అధికార ప్రతినిధి నజీర్, డివిజన్ అధ్యక్షురాలు లక్ష్మీ అపర్ణ, రాము, శిరీష, ఆలియా, రజని, పలువురు నేతలు పాల్గొన్నారు.



మల్కాపురంలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ రిఫైనరీ

నేటి నుంచి అచ్యుతాపురంలో ఐవోసీ సేవలు

మల్కాపురం, మార్చి 31: విశాఖలోని మల్కాపురంలో ఉన్న ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ) రిఫైనరీ అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం తరలిపోనుంది. దశాబ్దాలుగా మల్కాపురం శివారు పోర్టు స్థలంలో ఏర్పాటుచేసిన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ రిఫైనరీని తాజాగా అనకాపల్లి జిల్లా అచ్యుతాపురానికి తరలించారు. దీంతో పెట్రోల్, డీజిల్ తరలింపు ప్రక్రియ సోమవారం నుంచి అచ్యుతాపురం టెర్మినల్ నుంచే జరుగుతుంది. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటివరకు ప్రతి రోజూ మల్కాపురం ఐవోసీ నుంచే ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాలతో పాటు తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాలకు పెట్రోల్, డీజిల్ తరలించేవారు. విదేశాల నుంచి వచ్చే నౌకలకు, స్థానికంగా ఉండే నౌకలకు ఇక్కడి నుంచే పెట్రోల్, డీజిల్ వెళ్తుండేది. ఈ క్రమంలో ఐవోసీని విస్తరించేందుకు అధికారులు అనేక ప్రయత్నాలు చేశారు. పనులు పూర్తి కావడంతో సోమవారం నుంచి ఐవోసీ కార్యకలాపాలను అచ్యుతాపురంలో ప్రారంభించనున్నారు. ఇకపై మల్కాపురం ఐవోసీ రిఫైనరీని బ్లాక్ ఆయిల్ ఉత్పత్తుల తయారీకి మాత్రమే వినియోగిస్తారు. బ్లాక్ ఆయిల్ విభాగంలో ఎల్‌డీవో (లైట్ డీజిల్ ఆయిల్), ఎఫ్‌వో (ఫర్నిస్ ఆయిల్), ఏటీఎఫ్ (విమాన ఇంధనం) వంటివి మాత్రమే ఉత్పత్తి చేసి తరలిస్తారు.

జగన్ మాయలో పడితే బతుకులు బుగ్గే

- ప్రజాశీస్సులతో మరోసారి ఎన్నికల బరిలోకి దిగుతా
- ఒకటి రెండు రోజుల్లో సానుకూల ప్రకటన: రఘురామ

న్యూఢిల్లీ, మార్చి 31(ఆంధ్రజ్యోతి): జగన్ మాయలో పడితే ప్రజల జీవితాలు బుగ్గి అయినట్టేనని ఎంపీ రఘురామకృష్ణరాజు హెచ్చరించారు. ఒకసారి అవకాశమిస్తే ఏపీని దశాబ్దాల వెనక్కి నెట్టేశారని, మళ్లీ నమ్మితే ప్రజలందరినీ అమ్మేస్తారని స్పష్టం చేశారు. రచ్చబండ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల విధుల్లో వలంటీర్ల ప్రమేయం సరికాదని పోరాడిన ఫోర్ అండ్ ఫర్ గుడ్ గవర్నెన్స్, సిటిజన్ ఫోరం ప్రతినిధులపై కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. విశ్రాంత న్యాయమూర్తులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు సమాజంలో జరుగుతున్న అన్యాయంపై సిటిజన్స్ ఫోరం పేరుతో పోరాటంచేస్తారని గుర్తుచేశారు. వారికి చంద్రబాబుకు సంబంధమేంటని ప్రశ్నించారు. ఒక దుర్మార్గుడిపై చంద్రబాబు పోరాడుతున్నారని, సిటిజన్స్ ఫోరం కూడా అదే పని చేస్తోందని తెలిపారు. అదే దారిలో తానుకూడా పోరాడుతున్నానని పేర్కొన్నారు. ఈసీ ఆదేశాలతో ఒకటో తేదీన పింఛన్లు ఇవ్వలేకపోతున్నామని, ఈ జీవో అకస్మాత్తుగా వచ్చిందని తన మీడియాలో జగన్ అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు సేవ చేయాలనే మనసుంటే మార్గం దొరుకుతుందని, కానీ రాజకీయ పబ్బం గడుకునే వారికి ప్రజల కష్టాలేం తెలుస్తాయని ఎద్దేవా చేశారు. బుట్టా రేణుక ఆర్థికంగా అంతంత మాత్రంగానే ఉన్నారని, ప్రజలే చూసుకోవాలని చెప్పడంపై రఘురామ స్పందించారు. గతంలో బుట్టా రేణుక తన ఎన్నికల అఫిడవిట్‌లో రూ.247 కోట్ల ఆస్తులు ఉన్నట్టు పేర్కొన్నారని గుర్తుచేశారు. రూ.లక్ష కోట్ల చిల్లర ఆస్తులు కలిగిన జగన్ దృష్టిలో రూ.1,000 కోట్ల ఆస్తులు ఉన్నవారు కూడా పేదవారే అన్నారు. గత నాలుగేళ్లుగా జగన్ అరాచకాలపై పోరాటం చేసిన తనకు కూటమి అన్యాయం చేస్తుందని అనుకోవడం లేదని చెప్పారు. కూటమి నేతల మధ్య చర్చలు జరుగుతున్నాయని తనకు తప్పకుండా న్యాయం జరుగుతుందని ఒకటి, రెండు రోజుల్లో సానుకూల ప్రకటన వస్తుందని రఘురామ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల దీవెనలు, అందరి మద్దతుతో ఈసారి కూడా ఎన్నికల బరిలోకి దిగుతానని పేర్కొన్నారు.

అంతిమ విజయం సత్యానిదే: బాబు

అమరావతి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): క్రీస్తును శిలువ వేయడం ద్వారా చెడు అన్నది తాత్కాలికంగా పైచేయి సాధించినా, ఏసు పునరుత్థానంతో అంతిమ విజయం సత్యానిదేనని ఈస్టర్ చాటుతోందని టీడీపీ అధినేత చంద్రబాబు పేర్కొన్నారు. ఆదివారం ఆయన 'ఎక్స్'వేదికగా క్రైస్తవులకు ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ యువనేత నారా లోకేశ్ కూడా క్రైస్తవ సోదరులకు ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రభువు చూపిన ప్రేమ, శాంతి, సహన మార్గంలో పయనించాలని ఆకాంక్షించారు.

సీఎం విడిది కేంద్రంలో ఈస్టర్ వేడుకలు

- పాల్గొన్న జగన్ సతీమణి భారతి



సీఎం జగన్ విడిది కేంద్రం వద్ద అనంతపురం-చెన్నై జాతీయ రహదారికి అడ్డంగా ఏర్పాటు చేసిన బారికేడ్లు

బత్తలపల్లి, మార్చి 31: శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం ముష్టూరు-రాఘవంపల్లి క్రాస్ మధ్య అనంతపురం-చెన్నై జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన సీఎం జగన్ విడిది కేంద్రంలో ఆదివారం ఈస్టర్ వేడుకలు నిర్వహించారు. జగన్ చేపట్టిన బస్సు యాత్ర శనివారం అర్ధరాత్రికి ఈ విడిది కేంద్రానికి చేరుకుంది. ఆదివారం విడిది కేంద్రంలో జగన్‌తో పాటు ఆయన సతీమణి భారతి ఈస్టర్ వేడుకలు ఘనంగా చేసుకున్నారు. ఈ క్రమంలో అక్కడ పోలీసులను భారీగా మోహరించారు. కాగా, నిత్యం రద్దీగా ఉండే అనంతపురం-చెన్నై జాతీయ రహదారి పక్కనే సీఎం విడిది కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో ముష్టూరు క్రాస్ నుంచి రాఘవంపల్లి క్రాస్ వరకు దాదాపు 2కిలోమీటర్ల మేర జాతీయ రహదారిని పోలీసులు బంద్ చేశారు. రోడ్డుకు అడ్డంగా బారికేడ్లు ఏర్పాటు చేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వన్‌వేలో వెళ్లాల్సి రావడంతో ఎక్కడ ప్రమాదాలు జరుగుతాయోనని భయాందోళన చెందారు. అలాగే పొలాలకు కూడా వెళ్లనీయకుండా అడ్డుకోవడంతో పోలీసులపై రైతులు మండిపడ్డారు. చివరకు పొరుగు గ్రామాల మీదుగా చుట్టూతిరిగి తమ పొలాలకు వెళ్లాల్సి వచ్చింది.

బిహార్‌లో కాంగ్రెస్‌కు సీనియర్ నేత రాజీనామా

పట్నా, మార్చి 31: ఎన్నికలు సమీపిస్తున్న వేళ బిహార్‌లో కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ సీనియర్ నాయకుడు, పీసీసీ మాజీ అధ్యక్షుడు అనిల్ శర్మ ఆదివారం పార్టీకి రాజీనామా చేశారు. ఆర్జేడీతో విధ్వంసకర పొత్తు పెట్టుకున్నందుకు, వివాదాస్పదుడైన మాజీ ఎంపీ రాజేష్ రంజన్ అలియాస్ పప్పు యాదవ్‌ను ఘనంగా కాంగ్రెస్‌లోకి ఆహ్వానించినందుకు నిరసనగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. కాంగ్రెస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం లేదని విమర్శించారు. కాంగ్రెస్‌కు తక్కువ సీట్లు ఇచ్చి, బీజేపీకి మేలు కలిగేలా ఆర్జేడీ అభ్యర్థులను నిలబెట్టిందని ఆరోపించారు.

అరుణాచల్‌ప్రదేశ్‌లోని మరో 30 ప్రాంతాలకు చైనా కొత్త పేర్లు

న్యూఢిల్లీ, మార్చి 31 : అరుణాచల్‌ప్రదేశ్ విషయంలో చైనా వివాదాస్పద వైఖరి కొనసాగుతోంది. అరుణాచల్ తమదేనంటూ చైనా ఇటీవల చేసిన ప్రకటనలు ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలను పెంచాయి. ఇదిలా ఉండగానే అరుణాచల్ ప్రదేశ్‌లోని మరో 30 ప్రాంతాలకు కొత్త పేర్లు పెట్టుకున్న చైనా తన మొండి వైఖరిని మరోసారి చాటుకుంది. క్యాబినెట్ సిఫారసుల మేరకు జాంగ్నాన్‌లోని 30 ప్రాంతాలకు కొత్త పేర్లు పెట్టామని చైనా ప్రభుత్వం ప్రకటించింది. అరుణాచల్ ప్రదేశ్‌ను చైనా జాంగ్నాన్‌గా పిలుస్తోంది. పేర్లు మార్చిన ప్రదేశాల్లో జనావాస ప్రాంతాలు, నదులు, సరస్సులు, పర్వతాలు, ఖాళీ ప్రదేశాలు ఉన్నాయి. అరుణాచల్ ప్రదేశ్‌లోని ప్రాంతాలకు చైనా ఇలా పేర్లు పెట్టుకోవడం ఇది తొలిసారి కాదు. 2017 ఏప్రిల్, 2021 డిసెంబరు, 2023 ఏప్రిల్‌లోనూ ఇలాగే పలు ప్రాంతాలకు సొంతంగా పేర్లు పెట్టుకుంది.

రిజిస్ట్రేషన్ చార్జీల వాటా స్వాహా!

- 9 నెలలుగా పంచాయతీలకు అందని వైనం
- ఇప్పటికే ఆర్థిక సంఘం నిధులు మళ్లింపు
- సెస్, సీనరేజ్ చార్జీలు కూడా ఇవ్వని సర్కార్
- అన్ని రకాలుగా పంచాయతీలకు టోకరా
- వేసవిలో తాగునీటి వసతి కల్పించలేని స్థితిలో గ్రామాలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



గ్రామ పంచాయతీలను అన్ని రకాలుగా ముంచేసిన వైసీపీ సర్కార్ ఇప్పుడు గ్రామాలకు రావాల్సిన రిజిస్ట్రేషన్ చార్జీల వాటాను కూడా నొక్కేస్తోంది. గత 9 నెలలుగా పంచాయతీలకు రావాల్సిన రిజిస్ట్రేషన్ చార్జీల వాటా ఇవ్వకుండా నిలిపేయడంతో గ్రామాలు విలవిలలాడుతున్నాయి. ఇప్పటికే పంచాయతీలకు వచ్చిన ఆర్థిక సంఘం నిధులను విద్యుత్ బిల్లుల పేరుతో ఓ వైపు మినహాయించుకుంటున్న సర్కార్, రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీల నిధులు సుమారు రూ.7 వేల కోట్లకు పైగా వాడుకుంది. ఇవి చాలవన్నట్లు ప్రతి ఏటా సెస్, సీనరేజ్ చార్జీల వాటా సైతం విడుదల చేయకుండా నిలిపేసింది. ప్రతి మూడు నెలలకోసారి గ్రామ పంచాయతీల్లో జరిగిన రిజిస్ట్రేషన్లకు సంబంధించి చార్జీలలో ఒకటిన్నర శాతం వాటా గ్రామ పంచాయతీలకు విడుదల కావాల్సి ఉంది. గత తొమ్మిది నెలలుగా ఒక్క పైసా కూడా విడుదల చేయకుండా సర్కార్ వాటిని లాగేసుకుంది. సుమారు రూ.100 కోట్లను ప్రభుత్వం ఇతర అవసరాలకు వాడుకుందని సర్పంచులు చెబుతున్నారు. అరకొర ఆదాయాలు కలిగిన పంచాయతీల నిధులను కూడా స్వాహా చేస్తుండటంతో గ్రామాల్లో వేసవిలో తాగునీటి వనరులకు కూడా మరమ్మతులు చేసుకోలేని దుస్థితిలో ఉన్నామని సర్పంచులు వాపోతున్నారు.

కేంద్ర నిధులు దారి మళ్లింపు...

రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం ఒక్కపైసా విదిల్చకపోయినా.. కేంద్రం నుంచి వస్తున్న 14వ, 15వ ఆర్థిక సంఘం నిధులను యథేచ్ఛగా వాడేసుకుంది. ఆ నిధులను విద్యుత్ చార్జీల పేరుతో లాగేసుకుందని సర్పంచులు ఆందోళన చెందుతున్నారు. చంద్రబాబు సర్కార్ దిగిపోయిన తర్వాత పంచాయతీలకు గడ్డు పరిస్థితి ఏర్పడింది. 2018 ఆగస్టు 1 నుంచి 2021 ఏప్రిల్ 2 వరకు గ్రామపంచాయతీల ఎన్నికలు జరగకపోవడంతో సర్పంచులు అధికారంలో లేరు. 2021లో ఎన్నికలు జరిగి సర్పంచులు ఆ ఏడాది ఏప్రిల్ 2న పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆ తర్వాత కూడా పంచాయతీ సీఎఫ్ఎంఎస్ అకౌంట్లలో కేంద్ర ప్రభుత్వం పంపించామంటున్న 14, 15వ ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర సర్కార్ మాయం చేసింది. సర్పంచ్ ఎన్నికలు నిర్వహించనందున 2018-2021 మధ్య కాలంలో నిధులు విడుదల చేయలేదని, అందుకే ఈ మూడు సంవత్సరాల్లో గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి కార్యక్రమాలు జరగలేదని అప్పట్లో అందరూ భావించారు. రూ.7659 కోట్లు రాష్ట్రానికి విడుదల చేశామని పార్లమెంట్‌లో విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్ర మంత్రి జవాబివ్వడంతో అసలు విషయం వెల్లడైంది. ఆ తర్వాత సర్పంచుల సంఘాలు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపట్టినా, ప్రభుత్వంపై ఎంత ఒత్తిడి తెచ్చినా పట్టించుకోలేదు. దీంతో విసుగు చెందిన పలువురు సర్పంచులు వైసీపీకి దూరమయ్యారు.

అసంపూర్తిగా భవన నిర్మాణాలు...

వైసీపీ సర్కారు గ్రామ, వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసిన వెంటనే సచివాలయాలు, విలేజ్ క్లినిక్, ఆర్బీకే భవనాల నిర్మాణాలు ప్రారంభించింది. వాటికి ఒక్క పైసా కూడా నిధులు విడుదల చేయకపోవడంతో రెండేళ్ల పాటు పునాదుల స్థాయిలో ఉన్నాయి. ఆ తర్వాత సిమెంట్ విడుదల చేయగా, వైసీపీ నేతలు, కార్యకర్తలు అమ్ముకున్నారు. ఇప్పుడు వాటి నిర్మాణాలు ఎక్కడేసిన గొంగళి అక్కడే అన్నట్టు ఉన్నాయి. స్థానికంగా ఎమ్మెల్యేలు దృష్టి సారించిన చోట కొంత మేర నిర్మాణాలు పూర్తయ్యాయి. ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన ఈ పనులను ప్రతి ఏటా నిర్దిష్ట సమయాల్లో పురోగతి లేకపోవడంతో ఏ సంవత్సరం నిధులు ఆ సంవత్సరం మురిగిపోతున్నాయి. వైసీపీ కార్యకర్తలకు ఈ పనులు అప్పగించడంతో ఎన్నికలు సమీపిస్తున్నందున బిల్లులు వస్తాయో? లేదోనన్న ఆందోళనలో పనులు చేపట్టేందుకు వెనుకాడుతున్నారు.

సాధారణ నిధులూ సచివాలయాల అద్దెకు..

గ్రామ సచివాలయాల నిర్వహణ వ్యయ భారం కూడా కొన్ని చోట్ల గ్రామ పంచాయతీలపై పడుతోంది. సచివాలయ వ్యవస్థ ప్రారంభమైన తర్వాత పంచాయతీ భవనాలు లేని చోట్ల అద్దె భవనాల్లో గ్రామ సచివాలయాలను ఏర్పాటుచేశారు. వాటి అద్దె చెల్లించేందుకు సచివాలయంలో అవకాశం లేకపోవడంతో అప్పట్లో పంచాయతీల సాధారణ నిధుల నుంచి ఖర్చు చేయాలని, తర్వాత జమచేస్తామని అప్పట్లో అధికారులు పేర్కొన్నారు. అయితే వాటి గురించి ఇప్పుడు మరచిపోయారు. గ్రామ పంచాయతీలకొచ్చే అరకొర సాధారణ నిధులతో గ్రామ సచివాలయాల అద్దె చెల్లిస్తున్నారు. సాధారణంగా చిన్న పంచాయతీలకు జనరల్ ఫండ్స్ పెద్దగా రావు. అలాంటి పంచాయతీల్లో గ్రామ సచివాలయాల అద్దె కూడా చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. సాధారణంగా ఒక పంచాయతీకి తలసరి గ్రాంట్, పాపులేషన్ గ్రాంట్ కింద జనాభా ఆధారంగా జనరల్ ఫండ్స్ విడుదలవుతాయి. ఇక ఆ పంచాయతీకి ఇతర సహజ వనరుల నుంచి వచ్చే ఆదాయం ఏదైనా ఉంటే అది జనరల్ ఫండ్స్ ఖాతాలో జమవుతుంది. గ్రామ పంచాయతీల్లో ఉన్న గనులు, చేపల చెరువులు, స్టాంప్ డ్యూటీ తదితర ఆదాయ వనరులున్న పంచాయతీల పరిస్థితి కొంచెం పర్వాలేదు. అలాంటి ఆదాయ వనరులు లేని పంచాయతీలకొచ్చే అరకొర నిధులను కూడా సచివాలయ నిర్వహణ పేరుతో వాడేసుకుంటున్నారని సర్పంచులు ఆరోపిస్తున్నారు. ఇటు కేంద్రం నుంచి వచ్చిన నిధులివ్వకపోవడమే కాకుండా పంచాయతీల ఆదాయాలకు కూడా గండికొడుతున్నారని వాపోతున్నారు.



కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద టోల్ ధరల పట్టికలో ధరలు సరిచేస్తున్న జీఎమ్మార్ సిబ్బంది

'టోలు' వాయింపు

- హైదరాబాద్-విజయవాడ ఎన్‌హెచ్-65పై పెరిగిన వాహన టోల్ ఫీ
- కొత్త ధరలు ఆదివారం అర్ధరాత్రి నుంచి అమల్లోకి

కేతేపల్లి, మార్చి 31: మీరు తరచుగా హైదరాబాద్-విజయవాడ (65వ నంబరు జాతీయ రహదారి) రూట్‌లో ప్రయాణిస్తారా? అయితే పెరిగిన టోల్ ఫీజులు చెల్లించడానికి సిద్ధంగా ఉండండి. ఈ రహదారిలో జీఎమ్మార్ ఏర్పాటు చేసిన టోల్‌ప్లాజాల్లో చార్జీలు కొన్నిచోట్ల యథాతథంగా ఉండగా.. మరికొన్న చోట్ల రూ.5 నుంచి గరిష్ఠంగా రూ.40 మేర పెరిగాయి. కొత్త ధరలు ఆదివారం అర్ధరాత్రి నుంచి అమల్లోకి వచ్చాయి. హైదరాబాద్ నుంచి విజయవాడ నడుమ 181.5 కిలోమీటర్ల మేర రెండు లేన్లుగా ఉన్న ఈ రహదారి పనులను దాదాపు రూ.2 వేల కోట్ల వ్యయంతో పన్నెండున్నర సంవత్సరాల క్రితం జీఎంఆర్ సంస్థ నిర్వహించింది. విస్తరణ పనులకు అయిన వ్యయాన్ని రాబట్టుకునేందుకు రహదారిపై చౌటుప్పల్ మండలం పంతంగి, కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్, ఏపీ రాష్ట్రం కృష్ణా జిల్లాలోని చిల్లకల్లు వద్ద మూడు టోల్‌ప్లాజాలను ఏర్పాటు చేసింది. 2012 డిసెంబరు 20 నుంచి టోల్ చార్జీల వసూలును ప్రారంభించింది. జాతీయ రహదారి విస్తరణ పనుల విభాగం నిబంధనల మేరకు వార్షిక సవరణల పేరిట ఏటా టోల్ చార్జీలను సవరించి పెంచుకునే వీలుంది. ఈ మేరకు పెంచిన టోల్ ట్యాక్సును జీఎమ్మార్ యంత్రాంగం ఆదివారం అర్ధరాత్రి (ఏప్రిల్ 1) నుంచి అమల్లోకి తెచ్చింది. అలాగే టోల్‌ప్లాజాకు 20 కిలోమీటర్ల పరిధిలోని గ్రామాలకు చెందిన స్థానిక వాహనాల నెలసరి పాస్ చార్జీలను రూ.330 నుంచి రూ.340కి పెంచింది.

ఎంత పెరిగిందంటే..
ఎన్‌హెచ్65పై ఒకవైపు ప్రయాణానికి పెరిగిన చార్జీలు..

వాహనం రకం	పాతరేటు	కొత్తరేటు
కారు, జీపు, వ్యాన్, లైట్ మోటార్ వాహనాలు	325	335
లైట్ వాణిజ్య, లైట్ గూడ్స్ లేదా మినీ బస్సు	515	525
బస్సు లేక ట్రక్కు,(రెండు యాక్సిల్స్)	1065	1100
3 నుంచి 6 యాక్సిల్స్ వాహనాలు	1655	1695
7 అంతకు మించి యాక్సిల్స్ ఉండే అతి భారీ వాహనాలు)	2060	2115

అమెరికాలో రోడ్డు ప్రమాదం

- కొణకంచికి చెందిన చిన్నారి మృతి
- తల్లి కోమాలోకి, తండ్రీకొడుకులకు గాయాలు



నరేష్, గీతాంజలి (ఫైల్)




మృతిచెందిన చిన్నారి హానిక

పెనుగంచిప్రోలు (ఎన్టీఆర్ జిల్లా), మార్చి 31: అమెరికాలోని పోర్ట్‌ల్యాండ్ నగరంలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు మండలం కొణకంచి గ్రామానికి చెందిన కమతం నరేష్, గీతాంజలి దంపతుల కుమార్తె హానిక (6) మృతిచెందింది. నరేష్, గీతాంజలి పదేళ్లుగా పోర్ట్‌ల్యాండ్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసుకుంటూ అక్కడే స్థిరపడ్డారు. ఆదివారం గీతాంజలి పుట్టినరోజు కావడంతో భర్త, కూతురు, కుమారుడితో కలిసి సొంతకారులో ఓ దేవాలయానికి వెళ్లారు. తిరిగి వస్తుండగా కారు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో హానిక అక్కడికక్కడే మృతిచెందింది. గీతాంజలి కోమాలోకి వెళ్లింది. తండ్రీ కొడుకులకు స్వల్పగాయాలు కావడంతో సమీపంలోని లెగసీ ఆసుపత్రిలో చేర్పించారు. విషయం తెలియడంతో కొణకంచి విషాదఛాయలు అలముకున్నాయి.

బాబుతోనే భవిష్యత్తు బాగు!

- ఏపీకి డ్రైవర్‌బాబు అంటూ 'ఎక్స్'లో ట్రెండింగ్



అమరావతి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు.. 'ఏపీకి డ్రైవర్ బాబు' అంటూ ఆదివారం దేశవ్యాప్తంగా 'ఎక్స్'లో రెండో స్థానంలో ట్రెండింగ్ అయ్యింది. బాబుతోనే యువతకు ఉద్యోగాలు, బాబుతోనే యువత భవిష్యత్తు, బాబుతోనే రాష్ట్ర భవిష్యత్ బాగుపడుతుంది. జగన్మోహన్‌రెడ్డి వల్ల అతలాకుతలమైన రాష్ట్రాన్ని కేవలం బాబు మాత్రమే గాడిలో పెట్టగలరు.. అంటూ వేల సంఖ్యలో నెటిజన్లు ట్వీట్లు చేస్తున్నారు.

గవర్నర్లు రాజ్యాంగం మేరకు నడుచుకోవాలి



జస్టిస్ నాగరత్న

- వారికి ఇలా చెప్పాల్సి రావటం ఇబ్బందికరమే.. కానీ, ఆ సమయం వచ్చింది
- పంజాబ్, మహారాష్ట్రల్లో గవర్నర్ల చర్యలు వారి పరిధికి మించినవి
- అందుకే వారి నిర్ణయాలపై కోర్టుల్లో కేసులు నమోదవుతున్నాయి
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నాగరత్న వ్యాఖ్య
- నోట్లరద్దుతో నల్లధనం తెల్లధనంగా మారిందన్న జడ్జి
- అందుకే తీర్పులో ఆ నిర్ణయాన్ని వ్యతిరేకించానని వెల్లడి
- నల్సార్ వర్సిటీ సదస్సులో కీలక ప్రసంగం

హైదరాబాద్, మార్చి 31: గవర్నర్లు రాజ్యాంగం ప్రకారం పని చేయాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీ నాగరత్న పేర్కొన్నారు. గవర్నర్లకు ఏం చేయాలి? ఏం చేయొద్దు? అని చెప్పటం ఇబ్బందికరమైన విషయమని, అయినప్పటికీ, వారికి ఆ సూచన చేయాల్సిన సమయం వచ్చిందన్నారు. అసెంబ్లీ ఆమోదించిన బిల్లులపై గవర్నర్లు ఎటువంటి నిర్ణయం తీసుకోకుండా వాటిని పెండింగులో పెడుతున్న దృష్టాంతాల నేపథ్యంలో జస్టిస్ నాగరత్న ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు పంజాబ్ గవర్నర్‌కు ఆ రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య నడిచిన కేసును ఉదహరించారు. శనివారం నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లాలో నిర్వహించిన 'కోర్టులు-రాజ్యాంగం' ఐదవ సదస్సులో జస్టిస్ నాగరత్న కీలక ప్రసంగం చేశారు. మహారాష్ట్రలో ఉద్ధవ్ ఠాక్రే ప్రభుత్వం సంక్షోభాన్ని ఎదుర్కొన్న సందర్భంగా ఆ రాష్ట్ర గవర్నర్ వ్యవహరించిన తీరును ప్రస్తావించారు. మహారాష్ట్ర అసెంబ్లీలో విశ్వాసపరీక్షకు గవర్నర్ నాడు ఆదేశించాల్సిన పరిస్థితులు లేవని, ఇది కూడా గవర్నర్లు తమ పరిధి దాటి వ్యవహరించిన ఘట్టాలకు ఒక నిదర్శనమన్నారు. 'ఇది ఆరోగ్యకర పరిణామం కాదు. గవర్నర్ల చర్యలను సవాల్ చేస్తూ కోర్టుల్లో కేసులు నమోదవుతున్నాయి' అని పేర్కొన్నారు. గవర్నర్ పోస్టు కీలకమైన రాజ్యాంగబద్ధ పదవి అని, గవర్నర్లు రాజ్యాంగం ప్రకారం విధులు నిర్వహించాలని జస్టిస్ నాగరత్న పిలుపునిచ్చారు. దీనివల్ల గవర్నర్లకు వ్యతిరేకంగా కోర్టుల్లో నమోదయ్యే కేసులు తగ్గుతాయని చెప్పారు. తమిళనాడు మంత్రివర్గంలోకి డీఎంకే నేత కే పొన్ముడిని తిరిగి తీసుకోవటానికి ఆ రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి నిరాకరించటంపై సుప్రీంకోర్టు ఇటీవల ఆగ్రహం వ్యక్తం చేయటం, దీంతో గవర్నర్ ఆమోదం తెలపటం తెలిసిన విషయమే. ఈ నేపథ్యంలోనే జస్టిస్ నాగరత్న ఈ అంశంపై మాట్లాడారు. మరో వైపు, 2016లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటించిన నోట్లరద్దుపైనా న్యాయమూర్తి స్పందించారు. నల్లధనాన్ని అరికట్టే లక్ష్యంతో రూ.500, రూ.1000 నోట్లను రద్దు చేశామని ప్రకటించినప్పటికీ, నల్లధనం తెల్లధనంగా మారేందుకు ఈ నిర్ణయం దోహదపడిందని.. 98 శాతం నోట్లు బ్యాంకుల్లోకి వచ్చాయని గుర్తు చేశారు. అందుకే ఈ అంశంపై తీర్పు ఇచ్చినప్పుడు నోట్లరద్దు నిర్ణయాన్ని తాను వ్యతిరేకించానని తెలిపారు. కేంద్రం నోట్లరద్దు నిర్ణయాన్ని సుప్రీంకోర్టు ఐదుగురు సభ్యుల ధర్మాసనంలోని నలుగురు న్యాయమూర్తులు సమర్థించగా, ఒకే ఒక్క న్యాయమూర్తి (జస్టిస్ నాగరత్న) వ్యతిరేకించారు. దీనిపై తాజాగా స్పందిస్తూ.. 'నోట్లరద్దు నిర్ణయం తీసుకోవటానికి ముందు నిర్దేశిత నిబంధనలను అనుసరిస్తూ ఎటువంటి ప్రక్రియను పాటించలేదు. ఎంత గోప్యతతో, హడావిడిగా ఆ నిర్ణయం తీసుకున్నారంటే నాటి కేంద్ర ఆర్థికమంత్రికి కూడా దాని గురించి తెలియదని కొందరన్నారు. రాత్రికి ప్రకటించారు. పొద్దున అమల్లోకి ఇచ్చింది. నిజంగానే మన దేశంలో కాగితపు కరెన్సీ బదులు ప్లాస్టిక్ కరెన్సీ తీసుకురావాలనుకుంటే నోట్లరద్దు అందుకు ఉపయోగపడజాలదు' అని జస్టిస్ నాగరత్న స్పష్టం చేశారు. ఈ సదస్సులో నేపాల్, పాకిస్థాన్ సుప్రీంకోర్టు న్యాయమూర్తులతోపాటు తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, నల్సార్ చాన్స్‌లర్ జస్టిస్ ఎస్ రవీంద్ర భట్ తదితరులు పాల్గొన్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసు.. లొంగు'బాట'లో ప్రభాకర్‌రావు?

- అమెరికా నుంచి తిరుగు ప్రయాణం!
- ఆయన అప్రూవర్‌గా మారుతారా?
- కొనసాగుతున్న.. భుజంగరావు, తిరుపతన్న విచారణ



బంజారాహిల్స్ ఠాణా నుంచి బయటకు వస్తున్న శ్రీధర్‌రావు

హైదరాబాద్ సిటీ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్(ఎస్ఐబీ) కేంద్రంగా సాగిన ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో కీలక పాత్రధారిగా భావిస్తున్న టి.ప్రభాకర్‌రావు పోలీసుల ఎదుట లొంగిపోనున్నారా? ఇప్పటి వరకు అరెస్టయిన పోలీసు అధికారులు.. దర్యాప్తులో "ప్రభాకర్‌రావు చెప్పినట్లు చేశాం" అంటూ వాంగ్మూలం ఇవ్వడంతో.. అన్ని వేళ్లు ఎస్ఐబీ మాజీ చీఫ్ వైపే చూపుతున్నాయా? దాంతో.. ప్రభాకర్‌రావు అమెరికా నుంచి తిరుగు ప్రయాణమయ్యారా? ఈ ప్రశ్నలకు ప్రస్తుత పరిస్థితులు అవుననే సమాధానం చెబుతున్నాయి. ప్రభాకర్‌రావు ఇటీవల ఓ దర్యాప్తు అధికారికి అమెరికా నుంచి ఫోన్ చేసి, "ఇప్పుడు ప్రభుత్వం చెబుతున్నట్లు మీరు ఎలా చేస్తున్నారో.. గత ప్రభుత్వం చెప్పింది మేం చేశాం" అని వ్యాఖ్యానించారనే విషయం తెలిసిందే..! అయితే.. "మీరు ఏం చెప్పాలనుకున్నా.. హైదరాబాద్‌కు వచ్చి చెప్పండి. లేదంటే తెలంగాణ పోలీసు అధికారిక ఈ-మెయిల్‌కు వివరాలు పంపండి" అని సదరు దర్యాప్తు అధికారి చెప్పగానే ప్రభాకర్‌రావు ఫోన్ కట్‌చేశారు. నిజానికి తాను అమెరికాలో క్యాన్సర్ చికిత్సకు వచ్చానని, రెండు-మూడు నెలల తర్వాత తిరిగి హైదరాబాద్‌కు వస్తానని చెప్పిన ప్రభాకర్‌రావు.. ఇప్పుడు ఆగమేఘాల మీద దర్యాప్తు అధికారుల ఎదుట హాజరయ్యేందుకు సిద్ధపడ్డట్లు తెలిసింది. టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ(ఓఎస్డీ) రాధాకిషన్‌రావు మాదిరిగానే.. నేరుగా పశ్చిమ మండలం డీసీపీ ఎదుట ప్రభాకర్‌రావు లొంగిపోనున్నట్లు సమాచారం. ఉన్నపళంగా తన మనసును మార్చుకుని, హైదరాబాద్ వస్తుండడం వెనక ఓ కీలక వ్యక్తి మధ్యవర్తిత్వం నెరిపినట్లు పశ్చిమ మండలం పోలీసులు చర్చించుకుంటున్నారు. పోలీసు శాఖలో ఉండేదంతా మనవాళ్లేనని, మీకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా చూసుకుంటామని భరోసా ఇవ్వడంతో.. ప్రభాకర్‌రావు హైదరాబాద్ వచ్చేందుకు అంగీకరించినట్లు తెలుస్తోంది. ఫోన్‌ట్యాపింగ్ సూత్రధారులకు శిక్ష పడాలంటే.. పాత్రధారులైన నిందితుల్లో ఎవరైనా అప్రూవర్‌గా మారితే తప్ప అది సాధ్యం కాదని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అయితే ప్రభాకర్‌రావు, లేదంటే ప్రణీత్‌రావు సిద్ధమైతే.. వారిని అప్రూవర్‌గా పరిగణనలోకి తీసుకునే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

మూడోరోజు ముగిసిన విచారణ..

మాజీ అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్నలను మూడోరోజు కస్టడీలో భాగంగా పంజాగుట్ట పోలీసులు ఆదివారం విచారించారు. ఈ సందర్భంగా కీలక ఆధారాలను సేకరించినట్లు తెలిసింది. వీరిద్దరూ ఎస్ఐబీ, ఇంటెలిజెన్స్‌లో పనిచేసినప్పుడు ఎంతమంది ఫోన్లను ట్యాప్ చేశారు? ఎంతమందిని వేధించారు? ఎవరి మెప్పుకోసం ఈ చర్యలకు పాల్పడ్డారు? అనే అంశాలపై ప్రశ్నించినట్లు సమాచారం. వీరి కస్టడీకి మరో రెండ్రోజుల గడువే ఉండడంతో.. ఆలోగా రాధాకిషన్‌రావు కస్టడీకి కూడా లైన్ క్లియర్ అయితే.. ముగ్గురినీ కలిపి విచారించే అవకాశాలున్నాయి. భుజంగరావు, తిరుపతన్న విచారణ సందర్భంగా పలువురు రాజకీయ నాయకుల పేర్లు బయటకు వచ్చినట్లు తెలిసింది. దీంతో ఆయా నేతలకు నోటీసులు జారీ చేసి, విచారణకు పిలిపించాలని దర్యాప్తు అధికారులు నిర్ణయించినట్లు సమాచారం. ఆదివారం కూడా పలువురికి శ్రీముఖాలు అందాయని, వారు సోమవారం నుంచి విచారణకు హాజరయ్యే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

ఠాణాకు సంధ్య కన్వెన్షన్ ఎండీ

సంధ్య కన్వెన్షన్ ఎండీ శ్రీధర్‌రావు ఆదివారం బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. తన ఫోన్ ట్యాప్ చేసి వేధింపులకు గురిచేశారంటూ ఇటీవల ఆయన అడ్వొకేట్ పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఆదివారం ఆయన బంజారాహిల్స్ స్టేషన్‌కు వచ్చి, విచారణాధికారులకు పలు ఆధారాలు సమర్పించినట్లు తెలుస్తోంది. భుజంగరావు తన ఫోన్‌ను ట్యాప్ చేసి, అనేక ఇబ్బందులకు గురిచేశారని చెప్పినట్లు సమాచారం. భుజంగరావు తన కార్యాలయానికి పిలిపించి, బెదిరించారని, అక్రమంగా కేసులు పెట్టించారని వివరించినట్లు తెలిసింది. అందుకు ఆధారాలను దర్యాప్తు అధికారులకు సమర్పించినట్లు తెలుస్తోంది.

కావాలంటే ఇప్పుడే రెండో పెళ్లి చేసుకోండి

- ఎన్నికల తర్వాత అంటే అరెస్టే
- ముస్లిం ఎంపీని ఉద్దేశించి అసోం సీఎం వ్యాఖ్య

గువాహటి, మార్చి 31: లోక్‌సభ ఎన్నికల తరువాత అస్సాంలో ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ) అమల్లోకి వస్తుందని, అందువల్ల కావాలంటే ఇప్పుడే రెండో పెళ్లి చేసుకోవాలని ఆ రాష్ట్రంలోని దుబ్రి నియోజకవర్గం ఎంపీని ఉద్దేశించి ముఖ్యమంత్రి హిమాంత బిశ్వశర్మ అనడం చర్చకు దారితీసింది. ప్రస్తుత చట్టాల ప్రకారం ముస్లింలు రెండో పెళ్లి చేసుకోవడం తప్పేమీ కాదు. యూసీసీ అమల్లోకి వస్తే మాత్రం దాన్ని నేరంగా పరిగణించి అరెస్టు చేస్తారు. రాష్ట్రంలో యూసీసీని అమలు చేస్తామని చెబుతూ దుబ్రీ ఎంపీ బద్రుద్దీన్ అజ్మల్‌ను ఉద్దేశించి సీఎం ఈ వ్యాఖ్య చేశారు. అజ్మల్ మాట్లాడుతూ "ప్రత్యర్థి అయిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రకిబుయ్ హుస్సేన్ నన్ను ముసలోడని అంటున్నారు. కానీ నాకు మళ్లీ పెళ్లి చేసుకునే శక్తి ఉంది. సీఎం వద్దని చెప్పినా కూడా నేను రెండో పెళ్లి చేసుకోగలను" అని అన్నారు. శనివారం ఓ బహిరంగ సభలో పాల్గొన్న బిశ్వశర్మ స్పందించారు. "కావాలనుకుంటే అజ్మల్ ఇప్పుడే పెళ్లి చేసుకోవచ్చు. ఎన్నికల తరువాత యూసీసీ అమల్లోకి వస్తుంది. అప్పుడు చేసుకుంటే అరెస్టవుతారు. ఆయన పెళ్లికి ఆహ్వానిస్తే తప్పకుండా వెళ్తాం. ఎందుకంటే ప్రస్తుతం అదేమీ చట్టవిరుద్ధం కాదు. నాకు తెలిసినంతవరకు ఆయనకు ఒక్క భార్య మాత్రమే ఉంది. రెండుమూడు పెళ్లిళ్లు చేసుకోవచ్చు. ఎన్నికల తరువాత మాత్రం బహుభార్యాత్వాన్ని నిలిపివేయాలి. చట్టం ముసాయిదా సిద్ధమయింది" అని అన్నారు.

నా భర్తను చంపిన వారికి రూ.50 వేలు!

- వాట్సాప్ స్టేటస్‌లోనే ప్రకటించిన భార్య

న్యూఢిల్లీ, మార్చి 31: ఆలుమగలన్న తర్వాత గొడవలు సహజం.. ఒకవేళ విభేదాలు పెరిగితే పెద్దల ముందు పంచాయితీ పెట్టి సమస్యలు పరిష్కరించుకుంటారు.. కాదనుకుంటే కోర్టుకెక్కి విడిపోతారు.. అయితే గొడవల నేపథ్యంలోనే ఓ మహిళ మాత్రం తన భర్తను చంపిన వారికి రూ.50 వేలు నజరానా ఇస్తానంటూ ప్రకటించింది. ఏకంగా ఆమె వాట్సాప్ స్టేటస్‌లోనే ఈ విషయాన్ని పోస్టు చేసింది. అది చూసి కంగుతిన్న భర్త పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇది కాస్త వెలుగులోకి వచ్చింది. ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రా జిల్లా బాహ్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. తన భార్య స్నేహితుల్లో ఒకరు తనను బెదిరించాడని కూడా భర్త తన ఫిర్యాదులో తెలిపాడు. '2022 జూలైలో మధ్యప్రదేశ్‌లోని భింద్ గ్రామానికి చెందిన మహిళను పెళ్లి చేసుకున్నాను. 5 నెలల పాటు సంతోషంగానే సాగిన మా కాపురంలో విభేదాలు తలెత్తాయి. దీంతో అదే ఏడాది డిసెంబరులో తన పుట్టింటికి వెళ్లిపోయి అక్కడే ఉంటోంది. ఆ తర్వాత నాపై పోలీసులకు ఫిర్యాదు చేసి భరణం కావాలంటూ దావా కూడా వేసింది. 2023 డిసెంబర్‌లో భింద్ నుంచి వస్తుండగా నా భార్య తల్లిదండ్రులు నన్ను చంపుతామని కూడా బెదిరించారు' అని అతడు పేర్కొన్నాడు. అయితే తన భార్యకు ఆమె పొరుగింట్లో అద్దెకు ఉండే వ్యక్తితో వివాహేతర సంబంధముందని.. తమ పెళ్లి అయినప్పటి నుంచి జరుగుతున్న అన్ని గొడవలకు కారణమదేనని ఫిర్యాదులో భర్త ఆరోపించినట్లు తెలిసింది. భర్త ఫిర్యాదుతో సదరు మహిళపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.